# మహాత్ముణ్ణి చూసిన క్షణాలు

## గాంధీ ఒరిస్సా పర్యటనల జ్ఞాపకాల సంకలనం




సంకలనం

జతీంద్ర కె నాయక్

అనువాదం

వాడ్రేవు చినవీరభద్రుడు

# మహాత్ముణ్ణి

# చూసిన క్షణాలు

గాంధీ ఒరిస్సా పర్యటనల జ్ఞాపకాల సంకలనం

రామచంద్రగుహ ముందుమాటతో

సంకలనం

**జతీంద్ర కె నాయక్**

అనువాదం

**వాడ్రేవు చినవీరభద్రుడు**

# Mahatmunni Chuusina Kshanalu

A Collection of Memoirs of Gandhi's Visits to Odisha

Telugu translation of

## Meeting The Mahatma

Gandhi's Visits to Orissa

Edited by

Jatindra K Nayak

First published in India in 2006 by
Rupantar: A Center for Translation,
L.D.Institute Campus, N6/470, IRC Village, Nayapalli,
Bhubaneshwar- 751 015, Orissa
www. rupantar.net

Telugu translation, October, 2026

Translated into Telugu

Cover design, composing and lay-out and e-book released by
Vadrevu Ch Veerabhadrudu IAS (Retd.,)
First floor, 56, Navodaya Colony
Gudimalkapur, Mehdipatnam
Hyderabad, Telangana State, 500 028.
www.chinaveerabhadrudu.in
chinaveera@gmail.com
+91 94909 57129

Cover page image: Detail from Gandhi Smiling.jpg
Image on page 4: Detail from Gandhi first visit to Odisha.jpg
Courtesy: wikimediacommons

అప్పుడు వచ్చారు గాంధీ. ఒళ్లు విరుచుకుని దీర్ఘంగా శ్వాస తీసుకునేలా చేసిన స్వచ్ఛమైన వాయు తరంగంలా, చీకట్లను చీల్చి మన కళ్లమీది పొరల్ని తొలగించిన కాంతిపుంజంలా, ఎన్నో విషయాల్నీ, అన్నింటికంటే మిన్నగా మనుషుల ఆలోచనా సరళినీ తల్లకిందులు చేసిన పెనుతుఫానులా ఆయన వచ్చారు. ఆయన పైనుండి ఊడిపడలేదు. భారతదేశ కోట్లాది ప్రజానీకంలో నుంచే ఆయన ఉద్భవించినట్టు కనిపించారు— వారి భాషనే మాట్లాడుతూ, వారి వైపూ, వారి దుర్భర పరిస్థితుల వైపూ అందరి దృష్టినీ నిరంతరం మళ్లిస్తూ నిలిచారు.

**జవహర్‌లాల్ నెహ్రూ**, ది డిస్కవరీ ఆఫ్ ఇండియా

ఆయనని నేనొక 'మహోన్నత వ్యక్తి' అన్నాను. బహుశా మొత్తం ఈ శతాబ్దానికే ఆయన అత్యంత మహానుభావుడు కావచ్చు. అప్పుడప్పుడు లెనిన్‌ని కూడా ఆయనతో పోలుస్తుంటారు; కానీ లెనిన్ రాజ్యం కేవలం ఈ భౌతిక లోకానికే పరిమితమైంది, దానితో ఈ ప్రపంచం ఏం చేయబో నుందో మనకింకా తెలియదు. గాంధీ రాజ్యం అలాంటిది కాదు. ఆయన కూడా సంఘటనల్ని శాసించి, రాజకీయాల్ని ప్రభావితం చేసినప్పటికీ, ఆయన మూలాలు కాలాతీతమైనవి. అక్కడి నుంచే ఆయన శక్తి పుంజుకున్నారు. స్వయంగా ఒక మతాన్ని స్థాపించినా, స్థాపించకపోయినా, ఆయన మతప్రవక్తల సరసన నిలిచే వ్యక్తి. కళ ఆయన మాధ్యమం కానప్పటికీ, ఆయన గొప్ప కళాకారుల వరుసలో నిలిచే వ్యక్తి. అస్తవ్యస్తత గానీ, యాంత్రికత గానీ లేని ఒక ఔన్నత్యాన్ని జీవితంలో అన్వేషించిన వారూ; సంతోషమంటే స్వార్థపూరిత యాజమాన్య భావన కాదనీ, విజయమంటే ప్రాపంచికమైన గెలుపు కాదనీ గ్రహించినవారూ; ప్రేమను ప్రగాఢంగా విశ్వసించినవారూ అయిన స్త్రీపురుషులందరి పక్షానా ఆయన నిలుస్తారు.

**ఇ. ఎమ్. ఫారెస్టర్**, ఎ ట్రిబ్యూట్ టు గాంధీ



# విషయసూచిక


| | | |
|---|---|---|
| రామచంద్ర గుహ | ముందుమాట | 7 |
| జతీంద్ర కె. నాయక్ | పరిచయం | 10 |
| రమాదేవి | గాంధీజీతో ముఖాముఖి | 13 |
| నారాయణ సామంత | మహాత్ముని సందేశం | 17 |
| శ్రీధర్ దాస్ | టికెట్టు లేకుండా రైలు ప్రయాణం | 22 |
| వాంఛానిధి పట్నాయక్ | అర్ధరాత్రి సాహసం | 23 |
| హరిచరణ్ గిరి | గాంధీకి ఒక కానుక | 26 |
| ఉదయ్‌నాథ్ శారంగి | దోసెడు ఇసుక | 27 |
| చింతామణి మిశ్రా | మహాత్మా గాంధీ ఒక అనాగరికుడు | 32 |
| శైలబాలా దాస్ | గాంధీతో వాదన | 34 |
| సరళా దేవి | నా ఆరాధ్య దైవం | 38 |
| ఫ్రీడా హౌస్‌వర్త్ | గాంధీ రేఖాచిత్రం | 41 |
| వాంఛానిధి పట్నాయక్ | గాంధీకి నారింజ పండ్లు | 64 |
| గోవింద చంద్ర మిశ్రా | గాంధీ పంపిన సందేశం | 67 |
| మీరాబెన్ | కాలినడకన గాందీ | 71 |
| ఆర్తబంధు మొహంతి | మామిడి తోపులో సభ | 74 |
| మన్మోహన్ చౌధురి | గాంధీజీ పాదయాత్ర | 76 |

| | | |
|---|---|---|
| కృష్ణచంద్ర కర్ | దొరికిన వెండి రూపాయి | 83 |
| వినోద్ కానుంగో | గాంధీ పాదయాత్ర | 90 |
| వినోద్ కానుంగో | జీవితానికొక పాఠం | 101 |
| వసంతకుమార్ శతపథి | గాంధీ దర్శనం | 106 |
| అనుసాయా పాఠక్ | హిందీ ఉపాధ్యాయుడు గాంధీని కలవడం | 113 |
| అన్నపూర్ణా మహారాణా | తొలిచూపులోనే ప్రేమ | 118 |
| కాశీనాథ్ నాయక్ | మహాత్ముని దర్శనం | 125 |
| నీలమణి రౌత్రాయి | గాంధీజీ ఆశీస్సులు | 128 |
| బంకా బిహారీ దాస్ | గాంధీ స్మృతులు | 130 |
| సురేంద్ర మొహంతి | గాంధీజీకి జై | 133 |

## రామచంద్ర గుహ

# ముందుమాట

**మోహన్‌దాస్** కరమ్‌చంద్ గాంధీ పుట్టుకతో గుజరాతీ బనియా అయినప్పటికీ, ఆయన ఆకర్షణ కులాల్నీ, భాషల్నీ, మతాల్నీ, లింగభేదాల్నీ దాటి విస్తరించింది. ఆయన మహిళల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొన్న మహనీయుడు; ముస్లిములతో మైత్రి కోసం చేతులు చాచిన హిందువు; నిమ్న కులాల హక్కుల కోసం అలుపు లేకుండా పోరాడిన సవర్ణుడు. అన్నింటికీ మించి– తమిళులూ, మలయాళీలు, ఆంధ్రులూ, కన్నడిగులూ, మహారాష్ట్రులూ, హిందీవాళ్లూ, పంజాబీలూ, బెంగాలీలూ, అస్సామీలు, అలాగే వారెవరికీ తీసిపోని విధంగా ఒరియా ప్రజలు కూడా అమితంగా ఆరాధించిన ఒక గుజరాతీ.

1920, 1930 దశకాల్లో గాంధీ ఒరిస్సాలో పర్యటించినప్పుడు అక్కడి వివిధ వర్గాల ప్రజల స్మృతుల్ని ఈ పుస్తకం మన ముందుకు తెస్తున్నది. ఈ జ్ఞాపకాల్లో ఎక్కువ భాగం ఒరియా మాట్లాడే వాళ్ళు రాసుకున్నవే వాటితో పాటు, ఆయన ఆ ప్రాంతాలు సందర్శించినప్పుడు ఆయన వెంట ఉన్న ఇద్దరు ఐరోపా మహిళలు రాసుకున్న అనుభవ కథనాలు కూడా ఇందులో ఉన్నాయి.

ఈ సంకలనం చదువుతున్నప్పుడు, విభిన్న సామాజిక వర్గాల్లో గాంధీ సంపాదించుకున్న గౌరవాదరణలూ, భక్తిప్రపత్తులూ నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. ఒక విద్యార్థి బృందం మహాత్ముణ్ణి ఒక్కసారేనా చూడాలని, బస్సు ప్రయాణానికి డబ్బులు లేకపోతే, తమ మిత్రుడి బంగారు గొలుసు తాకట్టుపెట్టింది. అదే భాగ్యం కోసం మరికొంతమంది మైళ్లకు మైళ్లు కాలినడకనే నడుచుకుంటూపోయారు. గాంధీకి క్షవరం చేయడానికి వచ్చిన ఒక మహిళ, మానవరూపంలో ఉన్న ఆ దివ్యపురుషుని ముందు

సరైన రీతిలో కనిపించాలన్న తపనతో, అరువు తెచ్చుకున్న నగలు ధరించి మరీ హాజరయ్యింది.

నన్ను కదిలించిన రెండో విషయం— అస్పృశ్యతా నివారణ పట్ల గాంధీ చూపిన తిరుగులేని నిబద్ధత. హిందూ ధర్మానికే ఒక మచ్చగా ఆయన భావించిన ఆ సాంఘిక దురాచారానికి వ్యతిరేకంగా ఆయన ఒరిస్సాలో ఎక్కడికి వెళ్లినా రాజీలేని గళంతో తన అభిప్రాయాలు ప్రకటిస్తూ వచ్చారు. నిమ్న కులాలవారితో కలిసి భోజనం చేయమనీ, వారి పిల్లల చదువులకు తోడ్పడమనీ, తమ ఆలయాల్లోకి వారిని అనుమతించమనీ ఆయన తన సభలకు హాజరైన అగ్రవర్ణ హిందువులకు పదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు.

గాంధీని చూడటానికి ప్రజలు మైళ్లకు మైళ్ళు నడిస్తే, వారితో మాట్లాడటానికి గాంధీ కూడా మైళ్లకి మైళ్ళు నడిచారు. వీలైనంత ఎక్కువమంది ఒరియా ప్రజల్ని చేరుకోవాలన్న తపనతో ఆయన కాలినడకన ఎలా సాగారో, అది కూడా గడ్డు దారుల్లో ఎలా నడిచారో ఈ పుస్తకం వివరిస్తున్నది. ఆయన అపార శక్తిమంతుడు; ఆ బక్కపలచని శరీరం వెనుక ఉన్న దేహదారుఢ్యం అందరి అంచనాల్నీ తల్లకిందులు చేసేది. కష్టనష్టాలు ఓర్చుకోడానికి ఆయన చూపించిన సంసిద్ధతనీ, ఆ నిరాడంబర జీవితాన్నీ— ప్రస్తుత కాలంలో భారత ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటూ వారి తరఫున మాట్లాడేవారి జీవనశైలితో పోలిస్తే, ఆ వైరుధ్యం స్పష్టంగా తెలుస్తూనే ఉంది .

అలాగే, తన సభలకు వచ్చిన వారందరినీ గాంధీ పూర్తిగా తన ఆలోచనల వైపు తిప్పుకోలేకపోయారన్న యథార్థం కూడా నన్ను ఆలోచనలో పడవేసింది. ఆ సభలకు హాజరైన వాళ్ళల్లో చాలామంది కేవలం ఆయన దర్శనం కోసమే వచ్చారు; ఆయన వినిపించిన సామాజిక సందేశంమీద వారికి ఏమాత్రం ఆసక్తి లేదు. మరి కొందరైతే దాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు కూడా. అందుకే అప్పటి సనాతన హిందువులు దళితులతో కలవడానికి ససేమిరా ఒప్పుకోలేదు, తమ బడుల్లోంచీ గుళ్లల్లోంచీ వారిని వెలివేశారు.

ఆధునిక కాలంలో జీవించి సంచరించిన అత్యంత ఆసక్తికరమైన, అత్యంత ప్రభావశీలుడైన ఒక భారతీయుడి అంతరంగాన్ని లోతుగా అర్థం చేసుకోడానికి ఈ అద్భుత సంకలనం గొప్ప అంతర్దృష్టిని అందిస్తుంది. అందుకని ఈ పుస్తకం చదవమని

పాఠకులకి సంతోషంగా సిఫార్సు చేస్తున్నాను. అంతేకాక, భారతదేశంలో ఇతర ప్రాంతాల పరిశోధకులు కూడా తమతమ రాష్ట్రాల్లో, స్త్రీపురుషులు రాసిన గాంధీ స్మృతుల్ని సేకరించి, సంకలనం చేసి, అనువదించడానికి ఈ పుస్తకం ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. ●

## జతీంద్ర కె. నాయక్

# పరిచయం

1921 నుండి 1946 మధ్యకాలంలో మహాత్మా గాంధీ ఒరిస్సాలో ఏడుసార్లు పర్యటించారు. తన ప్రసిద్ధ హరిజన పాదయాత్రను ప్రారంభించ డానికి ఆయన ఎంచుకున్నది కూడా ఒరిస్సా గడ్డనే. ఈ పర్యటనల్నీ, ఒరిస్సా ప్రజలమీద అవి చూపిన విద్యుత్ప్రభావాన్నీ చరిత్రకారులూ, పరిశోధకులూ, జీవిత చరిత్రకారులూ, స్వయంగా స్వాతంత్ర్య సమరయోధులూ ఎంతో విపులంగా రాసిపెట్టారు. వీటిలో వినోద్ కానుంగో రాసిన 'బాపూజింక ఉత్కళరే పాదయాత్రా' (1950), పావక్ కానుంగో గ్రంథం 'ఒరిస్సా అండ్ గాంధీ' (1999) ముఖ్యంగా పేర్కోదగ్గవి. వీటిలో రెండోది అప్పటి పత్రికా నివేదికల్నీ, ఛాయాచిత్రాల్నీ, కవితల్నీ, వ్యక్తిగత స్మృతి వృత్తాంతాల్నీ— గాంధీజీ ఏడు పర్యటనలకు సంబంధించిన ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తూ, గాంధేయ ప్రతిఘటన వైపు లోకం మొత్తం ఎలా మేల్కొందో పాఠకులకు కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది.

అయితే ఈ ప్రస్తుత సంకలనం దృష్టి మరింత నిర్దిష్టం, మరింత పరిమితం. గాంధీ ఒరిస్సా పర్యటనలతో ముడిపడిన వ్యక్తిగత జ్ఞాపకాలకే ఈ సంకలనం పరిమితమైంది. వీటిలో ఎక్కువ భాగం కేవలం గాంధీని ఒక్కసారి దర్శించుకుని, తమ జీవితాల్లోని ఆ మధుర క్షణాన్ని పదిలపరుచుకోవాలని వచ్చిన సామాన్యులు రాసినవే. మరికొన్ని మహాత్ముడు ఒరిస్సాలో బస చేసినప్పుడు ఆయనతో కలిసి పనిచేసే, సంభాషించే అవకాశం దక్కించుకున్న వ్యక్తులు రాసినవి. గాంధీజీకి అత్యంత సన్నిహితురాలైన మీరాబెహెన్ స్మృతులతో పాటు, ఒరియాకు చెందిన ఒక ఇంజనీర్ని వివాహం చేసుకున్న ఒక స్విస్–జర్మన్ మహిళ ఫ్రీడా హౌస్‌వర్త్ రాసిన వృత్తాంతం

కూడా ఇందులో ఉన్నాయి. వీటన్నింటినీ కలిపి చూసినప్పుడు— మానవ చరిత్రలోనే అత్యంత విలక్షణమైన, సమ్మోహనకరమైన ఒక మహనీయుని రూపాన్ని సామాన్య స్త్రీపురుషులు ఎలా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారో, అలాగే ఆయన కూడా వారి జీవితాలను ఎలా స్పృశించారో మనకు స్పష్టమవుతుంది. అధికారిక పత్రాలూ, పాండిత్య పరిశోధనలూ, పాత్రికేయ కథనాలూ ఏమాత్రం చూపించలేని ఆ యాత్రల తాలూకు నాటకీయతనూ, ఉద్వేగాన్నీ, అలసటతో కూడిన విసుగునూ కూడా ఈ జ్ఞాపకాలు ఎంతో సహజంగా పునర్నిర్మిస్తాయి. వీటికి ఇంతటి ప్రత్యేక విలువా, ప్రాముఖ్యతా సమకూరడానికి కారణం అదే. బ్రిటిష్ సామ్రాజ్యపు సంకెళ్ల నుంచి భారతదేశం ఎలా విముక్తమైందో చూపే ఒక మహత్తర చారిత్రక పరిణామాన్ని విభిన్న కోణాల నుండి అర్థం చేసుకోడానికి కూడా ఈ కథనాలు తోడ్పడతాయి.

ఈ సంకలనంలోని అధికభాగం రచనలు రెండు ప్రధాన పర్యటనల చుట్టూనే తిరుగుతాయి: మొదటిది 1921లో గాంధీ ఒరిస్సాకు వచ్చినప్పటిది కాగా, రెండోది 1934లో ఆయన చేపట్టిన పాదయాత్ర. 1921లో గాంధీ చేసిన మొదటి పర్యటన ఒరిస్సా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనే ఒక నాటకీయ మలుపు. అది ఒక నాటి తరాన్ని సహాయ నిరాకరణోద్యమం వైపు నడిపించి, వారి జీవిత గమనాన్ని శాశ్వతంగా మార్చివేసింది. ప్రజాబాహుళ్యంలో గాంధీని ఒక దైవాంశసంభూతుడిగా, ఒక విముక్తి ప్రదాతగా నిలబెట్టింది. గాంధీ భారీ బహిరంగ సభ నిర్వహించిన కాట్జూరి నదీతీరం నుంచి ప్రజలు ఆరాధనాభావంతో దోసిళ్లకొద్దీ ఇసుక తమ ఇళ్లకు తీసుకెళ్లారు.

అయితే 1934 నాటి పాదయాత్రకు సంబంధించిన కథనాలకి వచ్చేటప్పటికి ఈ దృశ్యం మారుతుంది. అప్పటికి ఆయన పట్ల ప్రజల ప్రతిస్పందన ఎంతో సంక్లిష్టం గానూ, పరస్పర విరుద్ధంగానూ మారుతూ, ఒక్కోసారి బహిరంగ వ్యతిరేకతగా కూడా రూపుదాల్చింది. తను తలకెత్తుకున్న కార్యం ఎంత గురుతరమైందో, తను సంస్కరించాలని తపిస్తున్న ఆ సమాజంలో, మార్పు పట్ల ప్రగాఢ వ్యతిరేకత ఎంతగా పాతుకుపోయి ఉందో చూసి ఎవరికైనా సంభ్రమం కలుగుతుంది. అస్పృశ్యులుగా చూడబడుతున్న వారి మధ్య కూడా మళ్లీ రకరకాల అస్పృశ్యతా భేదాలు ఆచరణలో ఉన్నాయని తెలిసి మహాత్ముడు తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది సరిగ్గా ఈ ఒరిస్సా గడ్డమీదనే! నిరుపేదలనూ, సర్వస్వం కోల్పోయినవారినీ చేరుకోవడానికీ, చివరకు తనని తీవ్రంగా వ్యతిరేకించే

వారితో సైతం సంభాషించడానికీ గాంధీ రూపొందించుకున్న ప్రభావశీల రాజకీయ భాషాశైలి కూడా ఇక్కడ మనకు పరిచయమవుతుంది.

బ్రిటిష్ పాలకుల ఆగ్రహాన్ని సైతం లెక్కచేయకుండా ఆయన్ను చూడటానికి తరలివచ్చిన వేలాది మంది ప్రజలకూ, గాంధీకీ మధ్య జరిగిన ఆ సంభాషణల్లో మాటల పాత్ర చాలా తక్కువనిపించే సందర్భాలూ ఉన్నాయి. కేవలం మహాత్ముని ఒక్క చూపు దర్శనంతోనే సంపూర్ణ తృప్తిని పొందిన ఎందరో మనుషుల ఉదంతాలు ఈ సంకలనంలో కనిపిస్తాయి. వారి అనుభవం దాదాపు ఒక ఆధ్యాత్మిక పారవశ్యం లాంటిది. అయినప్పటికీ ఒరిస్సా పర్యటనల్లో గాంధీకి ఎల్లప్పుడూ గుడ్డి ఆరాధన మాత్రమే దక్కలేదు. ఆయన సామాజిక దృక్పథం మీదా రాజకీయ ఆదర్శాల మీదా తమకున్న సంపూర్ణ అపనమ్మకాన్ని బాహాటంగా ప్రకటిస్తూ నిరసనకారులు ఆయనకు నల్ల జెండాలు చూపించిన సందర్భాలూ ఉన్నాయి. సంకుచిత మనస్తత్వం గల వలస పాలనా యంత్రాంగం కల్పించిన ఆటంకాలను కూడా ఆయన ఎదుర్కోవలసి వచ్చింది. వీటన్నింటి మధ్యనే ఆయన నిధులు సేకరించారు, ఒక హిందీ మాస్టారుకు జీతం అందేలా చూశారు, ఆచరణాత్మక సమస్యల్ని పరిష్కరించారు, జమాఖర్చుల లెక్కల పుస్తకాలు నిశితంగా పరిశీలించారు, అలాగే పిల్లల్తో ఆడుకోడానికీ, పరిహాసాలు ఆడటానికీ కూడా సమయం కేటాయించుకోగలిగారు.

ఈ సంకలనంలోని వివిధ వ్యాసాలు గాంధీ బహుముఖ వ్యక్తిత్వపు విభిన్న కోణాలను ఆవిష్కరించడమే కాకుండా, ఆయన్ను చూసినవాళ్ళ, ఆయన మాటలు విన్నవాళ్ళ, ఆయనతో ప్రత్యక్ష సంబంధం ఏర్పరచుకున్న వాళ్ళ మనస్సుల్లో ఆయన ఎంతటి ప్రగాఢ ముద్ర వేశారో స్పష్టం చేస్తాయి. వాళ్ళు మహాత్ముణ్ణి చూసిన క్షణాల వృత్తాంతాలు భారత స్వాతంత్ర్య పోరాటపు ఆత్మీయ చరిత్రకు మనల్ని మరింత దగ్గర చేస్తాయి. ●

## రమాదేవి

# గాంధీజీతో ముఖాముఖి

**తన** రాజీనామా సమర్పించిన మూడు నాలుగు రోజుల తర్వాత గోపబాబు స్వరాజ్య ఆశ్రమానికి వెళ్లడం మొదలుపెట్టారు. గాంధీజీ కటక్ వస్తున్నారన్న వార్త అప్పటికే అంతటా తెలిసిపోయింది. కార్యకర్తల్లోనూ, వాలంటీర్లలోనూ సరికొత్త ఉత్సాహోద్రేకాలు వెల్లువెత్తాయి. ఉద్యమంలో చేరేందుకు ఆశ్రమానికి కొత్తవారు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వారి బాగోగులు డాక్టర్ అటల్ బిహారీ ఆచార్య (అటల్ దా) చూసుకునేవారు. అటల్ దా మృదుభాషి, కానీ నిలువెల్లా విప్లవకారుడు.

కలకత్తాలో వైద్య విద్య చదువుతున్న రోజుల్లో ఆయనకి సాయుధ విప్లవోద్యమంతో సంబంధాలుండేవి. ఆయన బస చేసిన విద్యార్థుల వసతిగృహం గది గోడలమీద ఒక కాళీమాత పటం ఉండేది. అటల్ దా కాళీ భక్తుడని అందరూ భావించేవారు. ఒకరోజు ఆయనమీద అనుమానంతో పోలీసులు ఆ గది సోదా చేశారు. గది మొత్తం క్షుణ్ణంగా వెతికారు కానీ, భక్తిభావం వల్ల ఆ కాళీమాత పటం మాత్రం ముట్టుకోలేదు. అటల్ దా ఆ పటం వెనకాలే తన తుపాకీ దాచిపెట్టారు.

అటల్ దా విప్లవమార్గం వదిలిపెట్టి సహాయ నిరాకరణోద్యమంలో చేరాక అందులో ఎంతో క్రియాశీలకంగా మారారు. ఆ రోజుల్లో కాంగ్రెస్ నిర్వహించే బహిరంగ సభలకు వెళ్లడానికి గానీ, ప్రదర్శనలలో పాల్గోడానికి గానీ ఎవరూ పట్టించుకోని, సాహసించని కాలమొకటి ఉండేది.

అటువంటి సందర్భాల్లో జాతీయ త్రివర్ణ పతాకం పైకెత్తి పట్టుకుని అటల్ దా తానొక్కరే ఆ పట్టణ వీథుల్లో గంభీరంగా నడుచుకుంటూ పోయేవారు. కాట్జూరి నదీ

తీరానికి వెళ్ళి అక్కడి ఇసుక తిన్నెలమీద ఆ జెండా పాతేవారు. వినేవాళ్ళు ఎవరున్నా లేకపోయినా తాను చెప్పదలుచుకున్నది ఎలుగెత్తి ప్రసంగిస్తూ ఉండేవారు.

హోలీ పండుగ మొదలయ్యే మార్చిలో డోలా పున్నమి నాడు గాంధీజీ కటక్ చేరుకున్నారు. ఆ రోజు ప్రతి ఒక్కరి ఆనందోత్సాహాలకీ పటాపగ్గాలు లేకుండాపోయాయి. చెయ్యవలసిన పనులు ఎన్నో ఉండటంతో, క్షణం ఆగి ఊపిరి పీల్చుకునే తీరిక కూడా ఎవరికీ లేకపోయింది. ఆ రోజు మధ్యాహ్నం రెండింటికి 'బినోద్ బిహారీ' అనే చోట సభ జరగవలసి ఉంది. నేను ఆ సభకు వెళ్ళకుండా ఉండనని మా అత్తగారు ముందే గ్రహించారు. అందుకే నన్ను ఇంటిపనులు త్వరగా ముగించుకొమ్మని చెప్పి, నేను సభకు వెళ్లి వచ్చేదాకా, పిల్లల్ని తానే చూసుకుంటానని చెప్పారు. సాయంత్రం నదీ తీరాన బహిరంగ సభ జరగవలసి ఉంది. ఉపన్యాసాలు వినడానికి నేను ఆ కరకట్టమీద ఎక్కడో ఒకచోట కూర్చుంటానని కూడా ఆమె ఊహించారు. అందుకే వంటగదిలో సాయంత్రానికి మరే పనీ మిగలకుండా మొత్తం పనులన్నీ వెంటనే పూర్తిచేసుకొమ్మని చెప్పారు.

అపరాహ్ణం ముగిసే సమయానికి నేను బినోద్ బిహారీ చేరుకున్నాను. పూజా సెలవుల్లో దుర్గాదేవి విగ్రహాన్ని పూజించే ఆ హాల్లో దుమ్ము దులిపి, శుభ్రం చేసి, సభికులు కూర్చోడానికి నేలమీద తివాసీలు పరిచారు. సభ ప్రారంభించే ముందు ఒక గీతం ఆలపిస్తే బాగుంటుంది అనిపించింది నాకు. సరిగ్గా అదే వేళకి ప్రొఫెసర్ మోహినీ మోహన్ సేనాపతి గారి భార్య హిరణ్మయీదేవి అక్కడికి వచ్చారు. ఆమె నాకు మంచి స్నేహితురాలు. నేను గీతాలాపన గురించి ప్రస్తావించగానే ఆమె తనే పాడటానికి ముందుకొచ్చారు. కానీ ఆమెకు హార్మోనియం కావలసి వచ్చింది. సమయం ఎక్కువ లేదు. అక్కడే ఆ ప్రాంగణంలోనే ఉంటున్న హైమవతీ దేవి వెంటనే ఒక హార్మోనియం తెప్పించారు. గాంధీజీ వచ్చే సమయం దగ్గరపడుతున్న కొద్దీ, సభికులు మరింత నిశ్శబ్దంగా, గంభీరంగా మారారు. అప్పటికే సుమారు నలభై మంది స్త్రీలం మేమక్కడికి చేరుకున్నాం.

కొద్దిసేపటికే బయట నినాదాలు వినిపించాయి; కస్తూర్బా, దేవదాస్ గాంధీలతో కలిసి గాంధీజీ హాల్లో అడుగుపెట్టారు. వారితో పాటు మరికొంతమంది కూడా ఉన్నారు. గాంధీజీ చిన్న ప్రసంగం చేశారు. ఆభరణాలు ధరించడం మానుకొమ్మనీ,

అందుకు బదులు వాటిని తనకు విరాళంగా ఇమ్మనీ ఆయన మహిళల్ని కోరారు. కొందరు నగదు విరాళాలు కూడా ఇచ్చారు. సత్యభామపూర్‌లో, ఆ పాతబడిన రాట్నంమీద, వడికిన నూలు కండె ఒకటి నాతో పాటు తెచ్చుకున్నాను. ఒకవేళ గాంధీజీ స్వయంగా వచ్చి అడిగినా సరే, ఏ ఆభరణాలూ ఇవ్వొద్దని మా అత్తగారు నన్ను ముందే హెచ్చరించారు. ఎప్పటిలాగే నేను ఆమె మాట వినకతప్పలేదు. అందుకని నా నగలేవీ ఇవ్వలేదు. ఆ నూలు కండె మాత్రం ఆయన చేతుల్లో పెట్టాను. అప్పుడు ఆయన నా వైపు చూశారు. ఆ చూపు నాలో ఏదో తెలియని అనుభూతి కలిగించింది. దాన్ని నేనిప్పటికీ మర్చిపోలేకుండా ఉన్నాను.

అలా ఆ రోజు నాకు గాంధీజీ దర్శనం లభించింది. మా అత్తగారికి కూడా ఆయన్ను చూడాలని బలంగా ఉన్నప్పటికీ, తన కోరిక మనసులోనే దాచుకున్నారు. సాయంత్రం బహిరంగ సభ జరిగే సమయానికి నాతో పాటు బామీదీదీని పంపడానికి బదులు, తనే స్వయంగా నాతో కలిసి నది ఒడ్డుకి వచ్చారు. ఆ రోజుల్లో మైకులూ, లౌడ్‌స్పీకర్లూ ఉండేవి కావు, కాబట్టి మాకు ఆ ప్రసంగాలు ఏమీ వినిపించలేదు. గాంధీజీ, కస్తూర్బాల దర్శనం చేసుకోవాలన్న కోరిక అయితే తీరింది.

ఏప్రిల్ 6 నుండి 13 దాకా ఆ వారం రోజులూ 'జాతీయ వారోత్సవం'గా పాటించవలసి ఉంది. అందులో భాగంగా, మొదటి రోజూ, చివరి రోజూ ఉపవాస ముండి, సాయంకాలం పూట తేలికపాటి ఆహారం మాత్రమే తీసుకోవాలి. దుకాణాలు, కార్యాలయాలూ అన్నీ మూసేసి ఆ రోజు హర్తాళ్ పాటించాలి. ఇలాంటి విషయాలు ఇంతకు ముందెన్నడూ ఎవరూ వినలేదు. ఇవన్నీ సరికొత్త ఆలోచనలు. కార్యకర్తలు పట్టణమంతా తిరిగి దుకాణాలు మూసేవలసిందిగా దుకాణాదారుల్ని ఒప్పించారు. హర్తాళ్ ఘనవిజయం సాధించింది.

గోపబాబూ, నేనూ ఉపవాసం ఉన్నాం. మా అత్తగారు అయోమయంలో పడ్డారు. మేము ఉపవాసం ఉంటున్నాం, కానీ ఉపవాసదినాల్లో పాటించవలసిన సంప్రదాయ పద్ధతులు మాత్రం మేం పట్టించుకోడం లేదు. సాయంత్రంపూట రోజూ తినే మామూలు ఆహారమే తీసుకున్నాం. మతపరంగా ఎలాంటి ఆచారాలూ పాటించలేదు. పూజా పునస్కారాలూ, నైవేద్యాలూ లేకుండా, ఉపవాసవేళ ముగియగానే నేరుగా భోజనానికి కూర్చోవడం మా అత్తగారికి ఎంత ఆశ్చర్యం కలిగించిందో, నాకు అంత ఆనందం

కలిగించింది. వండిన ఉప్పుడు బియ్యం తగలడం వల్ల పొరపాటున ఆహారం మైలపడి పోతుందేమోనన్న ఆందోళనతో తక్కినవాళ్ళు నిరంతరం భయపడవలసిన అవసరం లేకపోయింది. మా ఉపవాసం వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ కలగడం లేదన్న భావన నాలో ప్రశాంతత నింపింది. ఆ రోజు వీలైనంత సమయం నేను నూలు వడకడానికే కేటాయించాను. రాట్నంగాని దూదిగాని ఏమంత బాగాలేవు. నాక్కూడా పెద్దగా చెప్పుకోదగ్గ నైపుణ్యమూ లేదు. దాంతో నేను వడికిన నూలు కూడా తక్కువ మొత్తంలోనే వచ్చింది. ●

(**రమాదేవి చౌధురి** (1899-1985) ప్రసిద్ధ స్వాతంత్ర్యసమరయోధురాలు. సంఘ సేవకులు. ఆమె రాసుకున్న ఆత్మకథ 'జీవన పథే' 1984 లో గ్రంథ మందిర్ ద్వారా వెలువడింది. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన మన్మోహన్ చౌధురీ రచయిత్రి కుమారుడు. స్వాతంత్ర్య సమరయోధుడూ, ప్రముఖ గాంధేయవాదీ, స్వయంగా విశిష్ట రచయిత కూడా.)

## నారాయణ వీరవర సామంత

# మహాత్ముని సందేశం

**డోలా** పున్నమి వేళ వాలంటీర్ల సందడితో వెన్నెల కాంతుల్లో కాట్జూరి నదీ తీరం ప్రాణం పోసుకుంది. మరుసటి రోజు ఉదయం మహాత్మాజీ ఎక్స్‌ప్రెస్ రైలులో రానుండటంతో నగరమంతా ఒకటే కోలాహలంగా మారింది. సాయంత్రం మేమంతా స్వరాజ్య ఆశ్రమానికి వెళ్లి అక్కడ సమావేశమయ్యాం. అర్ధరాత్రి దాటాక జాదుమణి మంగరాజ్ గారి నాయకత్వంలో ఆశ్రమం నుండి ఒక ఊరేగింపు బయలుదేరింది. హిందువులూ, ముస్లింలూ దాదాపు ఐదు వందల మంది వాలంటీర్లు స్టేషన్ వైపు నెమ్మదిగా కవాతు చేసుకుంటూ సాగారు. 'వందేమాతరం', 'అల్లాహు అక్బర్', 'మహాత్మాజీకి జై' అంటూ నినదిస్తూ, వెన్నెల స్నానంలో తడిసి ముద్దవుతూ ఆ సైన్యం రాత్రివేళ అక్కడికి చేరుకున్నారు.

రైల్వే స్టేషన్‌లో క్రమశిక్షణ కాపాడటానికి ఎవరి స్థానాల్లో వారు నిలబడ్డారు. సుమారు నాలుగు గంటల ప్రాంతంలో జనం అదుపు తప్పుతున్నారని అర్థమైంది. కళ్లారా చూస్తే తప్ప ఆ అపార జనసందోహం ఎంతటిదో ఎవరూ ఊహించలేరు. భవనాల పై అంతస్థులూ, చెట్ల కొమ్మలూ, రోడ్లూ— స్టేషన్‌కీ రాణీహాట్ వంతెనకీ మధ్యనున్న ప్రతి ఒక్క చోటూ జనంతో కిక్కిరిసిపోయింది. అంత మంది అక్కడ సృష్టించిన ఆ గందరగోళాన్ని ఐదు వందల మంది వాలంటీర్లు మాత్రం ఎలా అదుపు చేయగలరు? అంతటి మహా జనసముద్రం ముందు వాళ్ళే మాత్రం సరిపోరనిపించింది. ఏదో ఒక ప్రమాదం సంభవించడం తప్పదనీ, దానికోసం మౌనంగా ఎదురుచూస్తూ నిలబడిపోక తప్పదనే అనుకున్నారంతా. ఏదో ఒక ముప్పు ముంచెత్తడం ఖాయమనిపించింది.

'మహాత్మాజీకి జై' అనే నినాదాలతో ప్రతిధ్వనిస్తున్న స్టేషన్‌లోకి ఎక్స్ ప్రెస్ రైలు వచ్చి ఆగింది. మూడో తరగతి బోగీ నుండి భారతదేశపు మహోన్నత ఆత్మ, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ క్రిందికి దిగారు. ఒక టోపీ, ఒక మామూలు కుర్తా— అంతే ఆయన వేషధారణ. ఉద్రేకంతో ఉన్న ఆ జనసందోహం ఎప్పుడో ప్రమాదం హద్దులు దాటిపోయింది. ఏ క్షణంలోనైనా ఏదో ఒక భయంకర కల్లోలం అక్కడున్నవాళ్ళందర్నీ ముంచెత్తుతుందనిపించింది. వాలంటీర్లూ, పోలీసులూ, రైల్వే అధికారులూ ఏర్పాటు చేసిన వ్యవస్థ మొత్తం అప్పటికే చెల్లాచెదురైపోయింది.

కానీ ఆ మహానుభావుడు చిరునవ్వుతో ప్రజలకు నమస్కరిస్తూ ప్లాట్‌ఫారమ్ దాటి రాగానే, ఆ జనసమూహమంతటిమీదా దానంతట అదే ఒక క్రమశిక్షణ ఆవరించింది. మహాత్ముని తేజస్సుకి మంత్రముగ్ధులై, జనం బొమ్మల్లా నిశ్చేష్టులై నిలబడిపోయారు. జనం ప్రదర్శించిన ఈ ఆత్మనిగ్రహమే మన జాతీయ స్వభావం ఎటువంటిదో తెలియజేసింది. ఒరిస్సా ప్రజలు చూపిన ఈ ఆత్మనిగ్రహ సామర్థ్యమే తమకీ, మహాత్మా గాంధీకీ మధ్య ఒక భావోద్వేగ బంధంగా ఎప్పటికీ ప్రత్యేకంగా నిలుపుకోడానికి దోహదపడింది.

ఆ రోజు మొట్టమొదటి సభ, ఆ మధ్యాహ్నం వేళ కదమ్‌రసూల్ ప్రాంగణంలో, ముస్లిం సోదరుల మధ్య జరిగింది. ఖిలాఫత్ ఉద్యమకారులపట్ల బ్రిటిష్ ప్రభుత్వం ప్రవర్తించిన అనాగరిక వైఖరిని ఖండిస్తూ చేసిన జాతీయ తీర్మానాలూ, స్వాతంత్ర్య పోరాటంలో హిందూ-ముస్లిం ఐక్యత ప్రాధాన్యత లాంటి అంశాలు అక్కడ హాజరైన ముస్లింలతో కూలంకషంగా చర్చించారు.

కాంగ్రెస్ పట్ల ఒరిస్సా ముస్లింల హృదయాల్లో డాక్టర్ ఎక్రమ్ రసూల్ మేల్కొల్పిన భక్తిభావం, స్వాతంత్ర్య సమరపు చివరి పోరాటం ముగిసేదాకా కూడా వారిని ఉత్తేజ పరుస్తూనే ఉంది. అందుకనే ఆ తర్వాత కాలంలో, సరిహద్దు ప్రాంతాల్లో, ముఖ్యంగా పొరుగున ఉన్న బెంగాల్ రాష్ట్రంలో చెలరేగిన రక్తపాత ఘర్షణల ప్రభావం ఒరిస్సామీద ఏమాత్రం పడలేదు.

ఈ చిరస్మరణీయ దినాన కాట్జూరి నది ఒడ్డున ఇసుక తిన్నెలమీద ఒక భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో బ్రిటిష్ వారికి భారతదేశం అందించిన సహకారానికి బదులుగా దేశానికి పంజాబ్‌లో నెత్తురూ,

క్రూరత్వమే బహుమానాలుగా లభించాయి.దాంతో స్వాతంత్ర్యం సాధించడానికి భారతదేశానికి సహాయ నిరాకరణ తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ఈ అంశంమీద గాంధీజీ చేసిన ప్రసంగం అందరి మనసుల్నీ కదిలించింది. విద్యాసంస్థల్ని వదిలిపెట్టి బయటకు రావాలని ఆయన విద్యార్థుల్ని కోరినప్పుడు, కటక్ బ్రహ్మసమాజ సభ్యుల్లో ఒకరైన లాల్ మోహన్ ఛటర్జీ, 'తాను స్వయంగా పాశ్చాత్య విద్యని అభ్యసించి, ఆ విద్యవల్ల తానొక గొప్ప నాయకుడిగా రూపొందిన గాంధీజీ ఇప్పుడు ఆ విద్య వల్ల ఉపయోగం లేదని ఎలా చెప్పగలరు?' అని ప్రశ్నించారు.

ఆయన తన ప్రశ్న ముగించారో లేదో గాంధీజీ, 'బుద్ధభగవానుడూ, చైతన్య మహాప్రభువూ, శంకరాచార్యుల వంటి మహనీయులకి ఈ పాశ్చాత్య విద్యతో పరిచయమే లేదు. వారితో పోలిస్తే నేనెక్కడ? అసలు ఆ పాశ్చాత్య విద్యా సంపర్కమే లేకపోయి ఉంటే నేను మరింత ఉన్నతుడిగా మారి ఉండేవాణ్ణి అని అనుకుంటున్నాను' అని జవాబిచ్చారు. ఆ సభకు విద్యావంతులు కూడా పెద్ద ఎత్తున హాజరై ఉన్నారు. వారు గాంధీజీ చెప్పిన ఆ మాటలతో చాలా సంతృప్తి చెందారు.

ఆ రాత్రి స్వరాజ్య ఆశ్రమ ప్రాంగణంలో అక్కడి కార్యకర్తల కోసం మరో సమావేశం జరిగింది. ఆయుధాల బలం కంటే తమ నాగరికతా బలంతోనే బ్రిటిష్ వాళ్ళు భారతదేశాన్ని ఆక్రమించుకోగలిగారు అనే అభిప్రాయం అక్కడ వ్యక్తమైంది. మనకి కూడా అంతటి ఉన్నతమైన నాగరికత లేకుండా మనం వాళ్ళని ఎలా జయించ గలుగుతాం అన్న ప్రశ్న బలంగా వినబడింది.

కానీ గాంధీజీ చెప్పిందేమంటే, 'పాశ్చాత్య నాగరికత తన మనుగడ కోసం తక్కిన జాతుల్ని దోచుకుంటుంది. కాబట్టి దాన్ని మనం ఎన్నటికీ మనకి ఆదర్శంగా స్వీకరించలేం. బ్రిటిష్ వాళ్ళు చాలా చిన్న జాతి. వాళ్ళు తమ నాగరికతను కాపాడు కోవాలంటే భారతదేశం లాంటి పెద్ద మార్కెట్‌ని తమ అధీనంలో ఉంచుకోక తప్పదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మనం స్వయంసమృద్ధి సాధించుకోగలిగితే, బ్రిటిష్ వాళ్ళు అప్పటికి బాగా బలహీనపడతారు. భారతదేశం లాంటి భారీ దేశం కూడా అలాంటి నాగరికతనే అనుకరిస్తే, మన మార్కెట్ అవసరాలకు యావత్ ప్రపంచం కూడా చాలదన్న విషయంలో సందేహం లేదు. కాబట్టి, బ్రిటిష్ పాలన కంటే బ్రిటిష్ నాగరికతనే మనకు మరింత హానికరం' అని అన్నారు.

కార్యకర్తలు అడిగిన ప్రశ్నలకు తన ప్రసంగంలోనే సమాధానాలు ఉన్నాయని చెబుతూ, చరఖాలు మనల్ని స్వయంసమృద్ధ నాగరికతగా ఎలా మారుస్తాయో గాంధీజీ ఎంతో నమ్మకంగా వివరించారు. విలాసవంతమైన పాశ్చాత్యవస్తువ్యామోహంలో పడకుండా భారతీయుల్ని నిలవరించడానికి చరఖాల వినియోగం ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు.

స్వరాజ్య ఆశ్రమంలో చరఖాల తయారీ మొదలయ్యింది. దూది ఏకే పద్ధతిలో సబర్మతి ఆశ్రమంలో శిక్షణ పొందిన దస్పల్లా నివాసి గోవింద్ మిశ్రా (ఆ తర్వాత ఆయన పార్లమెంటు సభ్యుడయ్యారు) నుండి ఆశ్రమ కార్యకర్తలు శిక్షణ తీసుకున్నారు. గాంధీజీ ఒరిస్సా నుంచి వెళ్ళాక నేను కూడా రాట్నం తిప్పాలని ఆ రోజే గట్టిగా అనుకున్నాను.

తర్వాతి సభ పూరీలో బడదండ దగ్గర జరిగింది. 1920 నాటి వరదలకు బ్రహ్మగిరి ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ప్రభుత్వం దాన్ని ఆధికారికంగా కరవు ప్రాంతంగా ప్రకటించకపోయినా, ఈ ప్రాంతం అప్పటికే తీవ్రంగా అతలాకుతలమై ఉంది. బడదండ దగ్గర నాగ్‌పూర్ తీర్మానం గురించి వివరిస్తూ, కాంగ్రెస్‌లో చేరి తిలక్ స్వరాజ్య నిధికి విరాళాలు ఇవ్వాలని భారత పౌరులకు గాంధీజీ పిలుపునిచ్చారు.

కరవు కోరల్లో చిక్కుకుని, చిక్కిశల్యమై, అర్ధనగ్నంగా ఉన్న వందలాది, వేలాది మంది ప్రజలు ముందుకు వచ్చి, తాము తమ ఒంటిమీద చుట్టుకున్న చిరుగుల కొంగుల్లో ముడేసుకున్న అరకాసునో, అణానో ఎంతో ప్రేమతో సమర్పించారు. ఆ దృశ్యం చూసి గాంధీజీ ఎంతగానో చలించిపోయారు. బ్రహ్మగిరి పేదలకు ప్రతినిధిగా తాను తన జీవితాంతం వారి మాదిరిగానే కొల్లాయి మాత్రమే ధరిస్తానని అక్కడే ప్రతిజ్ఞ చేశారు.

భారతదేశ భవిష్యత్తు గ్రామాల్లోనే ఉంది కాబట్టి, వాలంటీర్లు పట్టణాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని గాంధీజీ ఆదేశించారు. దోపిడీ, అత్యాచారాల్లాంటి సామాజిక అన్యాయాలమీద పోరాటంలో గ్రామీణ ప్రజల్ని నిర్భయులుగా తీర్చి దిద్దడానికి ప్రతి స్వరాజ్య కార్యకర్తా కృషి చేయాలని ఆయన చెప్పారు. అప్పటికే అటువంటి ప్రతిజ్ఞ తీసుకున్నవారు నిస్సందేహంగా తమ కార్యశీలతను ఋజువు చేసుకున్నారు.

గాంధీజీ పర్యటన ముగిసిన తర్వాత నేను కుజాంగ్ కార్యక్షేత్రంగా నా పని మొదలుపెట్టాను. అక్కడే మా నాన్నగారి ఎస్టేటు ఉండేది. ఆరు నెలల పాటు కాంగ్రెస్‌తో కలిసి పనిచేసినప్పుడు నా స్వభావంలో ఒక మార్పు వచ్చినప్పటికీ, అది పైపై మార్పే. అక్కడి అమాయక ప్రజల మధ్య పల్లెటూళ్లలో పనిచేయడం ద్వారా మాత్రమే నా అంతరంగం లోంచీ నన్ను నేను మార్చుకునే అవకాశం నాకు లభించింది.●

(**నారాయణ వీరవర సామంత** (1900-1999): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. రాజకీయ నాయకుడు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన ప్రియంవదా పాల్ భువనేశ్వర్‌లో సిలికాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆంగ్ల అధ్యాపకురాలు. అనువాదకురాలు. చిత్రకారిణి కూడా.)

## శ్రీధర్ దాస్

# టిక్కెట్టు లేకుండా రైలు ప్రయాణం

**అవి** 1921 నాటి డోలా పండుగ సెలవుల రోజులు. నేను ఇంట్లోనే ఉన్నాను. ఆ సమయంలో మహాత్మా గాంధీ ఒరిస్సా పర్యటనకు వస్తున్నారన్న వార్త విన్నాను. సాఖీగోపాల్‌లో ఒక సభ జరగబోతోందనీ, ఆ సభలో మహాత్మా గాంధీ ప్రసంగిస్తారనీ తెలిసింది. అప్పటికే మా కళ్లల్లో మహాత్మా గాంధీ ఒక దేవుడి స్థానం సంపాదించు కున్నారు. ఇక ఆయన్ను స్వయంగా కళ్లారా చూసి, ఆయన మాటలు వినాలన్న కోరిక ఎవరైనా ఎలా ఆపుకోగలరు? అందుకని సుమారు ముప్పై ఐదు మైళ్లు కాలినడకన పోయి సాక్షిగోపాల్ చేరుకున్నాను. సభ జరిగింది. మహాత్ముడు ప్రసంగించేది హిందీలో కదా; నాకేమీ అర్థం కాదేమోనని భయపడ్డాను. కానీ ఆయన మాట్లాడిన హిందీ అర్థం చేసుకోడం నాకేమాత్రం కష్టమనిపించలేదు.

అదీకాక, ఆయన ప్రసంగాన్ని గోపబంధు అక్కడికక్కడే ఒరియాలోకి అనువదించి చెప్పారు. సత్యవాది నుండి మహాత్మాజీ పూరీ బయల్దేరారు. ఆ రోజు సాఖీగోపాల్ స్టేషన్ జనంతో కిక్కిరిసిపోయింది. నేను కూడా అదే రైల్లో పూరీ బయలుదేరాను. ఆ రోజు తక్కిన వందలాది మంది ప్రయాణికుల్లాగే, నాది కూడా టిక్కెట్టు లేని రైలు ప్రయాణమే. ●

(**శ్రీధర్ దాస్** (1901-1988): ప్రముఖ విద్యావేత్త, పేరొందిన నిఘంటుకర్త, అనువాదకుడు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన మేరీ మొహంతి పూరీలో ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలు.)

## వాంఛానిధి పట్నాయక్

# అర్ధరాత్రి సాహసం

**సహాయ** నిరాకరణ సందేశం వ్యాప్తి చేయడానికి మహాత్మా గాంధీ దేశమంతటా పర్యటించారు. మా హైస్కూలు పరీక్షలు 1921 మార్చి 31 నుండి ప్రారంభం కావలసి ఉంది. మద్రాసు వెళ్లే మార్గంలో మహాత్మా గాంధీ మార్చి 19న బరంపురం మీదుగా వెళ్లవలసి ఉంది. నేనూ, మృత్యుంజయుడూ మహాత్మా గాంధీని దర్శించుకోవాలని నిశ్చయించుకున్నాం. అయితే, ఆయన్ను చూసి, పరీక్ష జరిగే రోజు నాటికి మళ్లీ వెనక్కి తిరిగి రాగలమా లేదా అన్న దిగులు మమ్మల్ని పట్టుకుంది. మాతో పాటు రావాలని చాలామంది విద్యార్థులే ఆశపడ్డారు. కానీ వెళ్లవద్దని మాత్రం ప్రతి ఒక్కరూ మమ్మల్ని వారించారు.

అర్ధరాత్రి వేళ, చదువుకు కాస్త విరామం ఇద్దామని అనుకున్నాం. బయటకు వచ్చి చూస్తే, పక్క మెస్సులో విద్యార్థులు చాలామంది గాంధీజీని చూడటానికి బరంపురం వెళ్లడానికి సిద్ధపడుతున్నారు. ఇంక మేమేం చేయగలం? ఆ రోజుల్లో రసూల్‌కొండ నుంచి బరంపురానికి రోజూ ఒకే ఒక బస్సు. అది ఆ రోజే వెళ్లి, ఆ రోజే తిరిగొచ్చేది. పొద్దున్నే బయల్దేరే ఆ బస్సుకి కనీసం ముప్ఫయి మంది ప్రయాణికులు దొరికితేనే మామూలు సమయం కంటే కాస్త ముందే బయలుదేరేది. మాలో అసహనం పెరిగి పోయింది. కానీ బస్సు చార్జీలు ఎలా సర్దుబాటు చేసుకోవడం? మా క్లాస్‌మేట్ రఘునాథ్ సాహు అక్కడే కూర్చుని ఉన్నాడు. వాడి మెడలో ఒక బంగారు గొలుసు ఉంది. మా చూపు దానిమీద పడగానే, ఆ గొలుసు ఇవ్వమని అడిగాం. వాడు దాన్ని తన మెడలోంచి తీసి ఇచ్చేశాడు. గొలుసైతే చేతికి వచ్చింది సరే, కానీ అర్ధరాత్రి పూట, దానికి బదులుగా డబ్బులెవరిస్తారు? గొలుసు చేతబట్టుకుని బజారుకు వెళ్లాం.

ఒక హోటలు యజమాని తలుపు సగం తీసి ఉంచి, ముందు గుమ్మం దగ్గర కూర్చుని ఆ రోజు సంపాదన లెక్కపెట్టుకుంటున్నాడు. మేం ఆ గొలుసు అతడి దగ్గర కుదువబెట్టి పదిహేను రూపాయలు అప్పు తీసుకున్నాం. రఘునాథూ, మృత్యుంజయుడూ, నేనూ బరంపురం బయల్దేరాం.

మా బాబాయి దుర్గా మాధవ్ పట్నాయక్ అప్పట్లో ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్నారు. ఎంతో జంకుతూ ఆయన దగ్గరకు వెళ్లి, మా ప్రయాణం సంగతి చెప్పాం. కానీ మమ్మల్ని ఆయన ఎందుకు ఆపుతారు? నిజానికి ఆయనకి కూడా మాతో రావాలనే ఉంది, కానీ ఆయన దగ్గర చాలినంత డబ్బు లేదు. బెలగుంతకు చెందిన పట్టం సూరపాత్ర ఆయనకి కొంత డబ్బు సర్దారు.

తెల్లవారుజాము నాలుగు గంటల ప్రాంతంలో మేం బరంపురం రైల్వే స్టేషన్ చేరుకున్నాం. కాసేపటికే రైలు ప్లాట్‌ఫారమ్‌మీదికి వచ్చింది. గాంధీజీకి స్వాగతం పలకడానికి అపార జనసందోహం గుమిగూడింది. ఆ జనం తాకిడికి గాంధీజీ మోటారుకారు అంగుళం కూడా ముందుకు కదలలేకపోయింది. వాహనం ఫుట్‌రెస్ట్ మీద నిలబడి సబ్ కలెక్టర్ దీనబంధు పాల్ ప్రజల్ని అదుపు చేయడానికి ప్రయత్నించారు. కానీ ఆయన మాట ఎవరూ పట్టించుకోలేదు. చివరకు గాంధీజీ స్వయంగా లేచి నిలబడి, వాహనాన్ని ముందుకు పోనివ్వమని ప్రజలకు సైగ చేశాకనే జనం దారిచ్చారు. అప్పుడు సబ్ కలెక్టర్ ఊపిరి పీల్చుకున్నారు. అడ్వకేట్ మధుసూదన్ పాణిగ్రాహి నివాసమైన 'మధుమందిర్'లో మహాత్మాజీ బస చేశారు. గాంధీజీని ఒక్కసారైనా దర్శించుకుందామని ఆ న్యాయవాది ఇంటి ముందు ఎంతోమంది ప్రజలు గుమిగూడారు. గాంధీజీ ఆ ఇంటి మొదటి అంతస్తు వరండాలో నిలబడి అందరికీ చేతులెత్తి నమస్కరించారు.

సాయంత్రం నాలుగు గంటలకి బరకాస్ మైదానంలో పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. కొన్ని బల్లలు ఒకదానిమీదకి ఒకటి చేర్చి ఎత్తయిన వేదిక అమర్చారు, మహాత్మా గాంధీ దానిమీద కూర్చున్నారు. ఆయన పక్కనే ఒరిస్సా మహానాయకుడు పండిట్ గోపబంధు దాస్ కూర్చున్నారు. సభ మొదలైంది. ఆ రోజుల్లో లౌడ్‌స్పీకర్లు ఉండేవి కావు. మహాత్మా గాంధీ సన్నని స్వరం చాలామందికి వినిపించలేదు. అప్పుడప్పుడూ జనం మధ్య చెలరేగే గుసగుసలూ, సందడీ ప్రసంగానికి అంతరాయం కలిగించేవి. పండిట్ గోపబంధు దాస్ లేచి నిలబడి, గంభీరస్వరంతో మాట్లాడి

జనాన్ని శాంతింపజేసేవారు. ఆ రోజుల్లో గాంధీజీ అచ్చమైన గుజరాతీ వేషధారణలో— ధోవతీ, కుర్తా, తలపాగా ధరించేవారు. భుజంమీద చిన్న గుడ్డ పేలిక ఉండేది. మరో వైపు గోపబంధు బాబు పెద్ద నల్లని గడ్డంతో, ధోవతీ, కుర్తా వేసుకున్నారు. నేనాయన్ను చూడటం అదే మొదటిసారి.

సభ ముగిశాక అందరూ వెళ్లిపోయారు. ఇక ఆ రాత్రికి రాత్రే మళ్ళా వెనక్కి వెళ్ళడమెలా, మర్నాడు ఉదయమే పరీక్షకి హాజరు కావడమెలా అన్న చింత మమ్మల్ని చుట్టుముట్టింది. బస్సు బయలుదేరడానికి కనీసం ముప్ఫయి మంది ప్రయాణికుల్ని సమకూర్చడం మా పనైంది. మరుసటి రోజు షౌకత్ అలీ, మహమ్మద్ అలీ, లాలా లజపత్ రాయ్ బరంపురం రాబోతున్నారు. వాళ్ళని కూడా చూడాలని మా సహ విద్యార్థులకి మనసులో ఉన్నప్పటికీ, వాళ్లు కూడా మాతో పాటే వెనక్కి రాక తప్పలేదు. తెల్లవారుజాముకల్లా మేం రసూల్‌కొండ చేరుకున్నాం. మేం మంచాలమీద ఒరిగి మూడు నాలుగు గంటలు కూడా గడవకముందే మా స్నేహితులు వచ్చి మమ్మల్ని నిద్రలేపారు. మేము బరంపురం వెళ్లి వచ్చిన విషయం వాళ్లకెలా తెలిసిందో మరి! భోజనం ముగించుకుని, ఉదయం పదింటికల్లా పరీక్ష హాలుకి చేరుకున్నాం. కళ్ళనిండా ఒకటే నిద్ర ముంచుకొస్తోంది. ఆ రోజుల్లో మా పరీక్షలు వరుసగా మూడు రోజుల పాటు, రోజుకు రెండు పూటలా జరిగేవి. అప్పటివరకు జరిగిన ప్రతి పరీక్షలోనూ, ప్రతి తరగతిలోనూ నేనే మొదటి స్థానంలో నిలిచేవాణ్ణి. కానీ ఇప్పుడు చూడబోతే ముందసలు పరీక్ష పాసవుతానా అని సందేహం కలిగింది. ఏమైతేనేం, ప్రస్తుతానికైతే ఆ బెంగ పక్క పెట్టేశాను. ●

(**వాంఛానిధి పట్నాయక్** (1901-1988) కవి, సంఘసేవకుడు. ఆయన రాసుకున్న ఆత్మకథ 'మో కథ' 1988లో భువనేశ్వర్‌లోని పూజ్యపూజా ఒరిస్సా వారు ప్రచురించారు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన ప్రజ్ఞా పారమితా పాణిగ్రాహి భువనేశ్వర్‌లో ఉత్కళ విశ్వ విద్యాలయం, దూరవిద్య విభాగంలో అధ్యాపకురాలు.)

# హరిచరణ్ గిరి

# గాంధీకి ఒక కానుక

**పండిట్** గోపబంధు ఆహ్వానం మేరకు మహాత్మా గాంధీ ఒరిస్సా పర్యటనకు మొదటిసారి వచ్చారు. కటక్‌లోని బారాబటి కోట ఎదురుగా ఉన్న మైదానంలో సభ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే కాంగ్రెస్ వారు ఆ సభ జరపకుండా అడ్డుకోడానికి పోలీసులు కటక్‌లో 144 సెక్షన్ విధించారు. దాంతో ఒరిస్సా నాయకులు తీవ్రమైన ఆందోళనకు లోనయ్యారు. కానీ పండిట్ గోపబంధు ఒక ఉపాయం ఆలోచించి, 144 సెక్షన్ పరిధిలోకి రాని కాట్జూరి నది ఒడ్డున ఇసుక తిన్నెలమీద సభ ఏర్పాటు చేశారు. ఒక్క గంట వ్యవధిలోనే సభకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయిపోయాయి. నిర్ణీత సమయానికి, అంటే మధ్యాహ్నం నాలుగు గంటలకే సభ మొదలైంది. ఆరుబయట, ఆకాశం కింద ఇసుక తిన్నెలమీద వేలాది మంది ప్రజలు వచ్చి చేరారు.

గాంధీ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగిస్తుండగా, పోలీసులు ఎవరో ఒకరి చేత ఆ సభ మధ్యలోకి చిరిగిన చేట ఒకటి విసిరేయించారు. 'ఇది గాంధీకిచ్చిన బహుమతి' అని ఎవరో గట్టిగా అరిచారు. సభ ముగిశాక, ఆ చేటను వేలం వేయాలని గోపబంధు సూచించారు. వేలంలో పాల్గొనాల్సిందిగా ప్రజల్ని ఆహ్వానించారు. ఒక పెద్దమనిషి వెంటనే ఆ వేలంపాటలో అందరికంటే ఎక్కువ పాడి, ఇరవై రూపాయలు చెల్లించి మరీ ఆ చేట పట్టుకెళ్లిపోయారు. ●

(**హరిచరణ్ గిరి** (1903-1995) ఆత్మకథ 'మో జీవనకహాణీ' 1983లో పిపిలిలో రచయితనే స్వయంగా ప్రచురించుకున్నారు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన జతీంద్ర కె. నాయక్ భువనేశ్వర్‌లో ఉత్కళ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల ఆచార్యులు. ఆయన ఈ పుస్తకానికి సంపాదకులు కూడా.)

## ఉదయ్‌నాథ్ శారంగి

# దోసెడు ఇసుక

**ఈ** రోజుల్లో ఒరియాలో ప్రముఖ దినపత్రికగా వెలుగొందుతున్న 'ది సమాజ్', ఆ కాలంలో వారపత్రికగా వచ్చేది. నేను సబ్ రిజిస్ట్రార్ గారి నివాసానికి వెళ్లినప్పుడు ఆ వారపత్రిక నా కంటపడింది. అందులో ఇంగ్లీషులోనూ, ఒరియాలోనూ పెద్ద అక్షరాల్తో ప్రచురించిన వార్త ఒకటి కనిపించింది: 'మహాత్మా గాంధీ ఒరిస్సా పర్యటనకు రానున్నారు; మార్చి 23 నాటికి కటక్ చేరుకుంటారు'.

ఆ సమయంలో దుర్గాచరణ్ మహాపాత్ర అనే జమీందారు ఇంటి ఎదురుగా ఉన్న విశాలమైన మైదానంలో 'డోలా మేళన్' ఉత్సవం జరుగుతోంది. అక్కడ విపరీతమైన జనం గుమిగూడారు. నేనక్కడికి వెళ్ళినప్పుడు నాకు మహాత్మా గాంధీ ఒరిస్సా పర్యటన వివరాలున్న కరపత్రమొకటి దొరికింది. అందులో గాంధీగారు మార్చి 23న రావలసి ఉంది.

ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నేను మర్నాడు పొద్దున్నే కటక్ బయల్దేరాను. అంతా ఒక క్షణికావేశంలో జరిగిపోయింది. ఇంటి నుండి కటక్ ఎంత దూరమో, ఎప్పుడు బయలుదేరాలో, కటక్ చేరుకున్నాక ఎక్కడ ఉండాలో నాకేమాత్రం తెలియదు. నా దగ్గరున్న డబ్బైతే కేవలం మూడు అణాలు మాత్రమే.

ఆ మూడణాల్నీ దృష్టిలో పెట్టుకుని, కటక్ దాకా కాలినడకనే పోదామనుకున్నాను. సుమారు పదిహేను మైళ్లు నడిచాక, దారిన ఉన్న ఒక చిన్న పల్లెటూరి బజారు 'బవడే' చేరుకున్నాను. అక్కడ కాసిన్ని పేలాలూ, మరమరాలూ తిన్నాను. అవన్నీ నమలడం నావల్ల కాక సగం పక్కనే ఉన్న కాలువలోకి విసిరేసి, దోసిలి పట్టి అందులో నీళ్లు తాగాను. కాలువకు నేను సమర్పించిన ఆ పేలాలకి బదులుగానే ఈ

నీళ్లు నాకు దక్కాయేమో అని క్షణకాలం అనిపించింది. ఇంకా సాయంత్రం కాకముందే కటక్ రైల్వే స్టేషన్ చేరుకున్నాను.

కటక్ నాకు కొత్త ప్రదేశం. ఎటు వెళ్లాలో ఏమీ పాలుపోలేదు. స్వరాజ్య ఆశ్రమం ఎక్కడుందో, అక్కడికి ఎలా వెళ్ళాలో నాకు తెలియదు. పోనీ ఎవరినైనా అడుగుదామన్నా ఎంతో సిగ్గనిపించింది.

అయితే, నా ముందే ఒక ఐదారుగురు నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది. వాళ్ళు మాట్లాడుకుంటున్న మాటల్ని బట్టి వాళ్ళు ఆ ఆశ్రమానికే వెళ్తున్నారని తెలిసింది. కేవలం మహాత్మా గాంధీని దర్శించుకోవాలనే వాళ్లంతా సాలీపూర్ నుండి గుంపుగా వచ్చారు. నేను ఒక్కడినే కావడంతో వాళ్లతో కలిసిపోయాను.

మేము మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఆశ్రమం చేరుకున్నాం. అప్పటికే ఆ ప్రదేశమంతా ఒక మహా జనసముద్రంలా మారింది. వందలాది మంది లోపలి వరండాలో భోజనాలు చేస్తున్నారు. ఆ సమయంలో చూడటానికి చక్కగా కనిపిస్తున్న ఒక యువకుడు లోపలి నుండి బయటకు వచ్చి నన్ను లోపలికి పిలిచాడు.

తర్వాత ఆయనతో కాస్త చనువు పెరిగాక ఆయన పేరు సుదర్శన్ ప్రహరాజ్ అని తెలిసింది. స్వాతంత్ర్య పోరాటం కోసం ఆయన చదువు వదిలిపెట్టేశారు. అప్పట్లో ఆయన కటక్‌లో చదువుకుంటూ ఉండేవారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలమీద ఆయనకు మంచి అవగాహన ఉంది. అంతటి తెలివైన, ఉత్తమ యువకుడు నాకు మార్గదర్శిగా దొరికినందుకు నాకెంతో సంతోషం కలిగింది.

అర్ధరాత్రి దాటాక ఆశ్రమంలో ఉన్నవారంతా రైల్వే స్టేషన్ వైపు నడవడం మొదలుపెట్టారు. నేనూ వాళ్లతో కలిశాను. అక్కడికి చేరుకున్నాక చూస్తే స్టేషన్ జనంతో విపరీతంగా కిక్కిరిసిపోయింది. ప్లాట్‌ఫారమ్‌మీద అడుగుపెట్టడం అసాధ్యమైపోయింది. వందలాది మందితో పాటు నేను కూడా రోడ్డు పక్కన నిలబడక తప్పలేదు. వాళ్లతో గొంతు కలిపి నేనూ ఆకాశం దద్దరిల్లేలా 'మహాత్మా గాంధీకి జై' అంటూ నినదించడం మొదలుపెట్టాను.

ఆ పగలంతా ఎలా గడిచిపోయిందో నేనిప్పటికీ చెప్పలేను. సాయంత్రం కాట్జూరి నది ఒడ్డున ఇసుక తిన్నెలమీద ఒక బహిరంగ సభ జరిగింది. అక్కడికి అపార జన సందోహం తరలివచ్చింది. నది ఒడ్డున కట్ట మీంచి అటూ ఇటూ చూస్తే, ఇరువైపులా

ఉన్న ఆ జనాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఆ జనసంద్రం సుదూర దిగంతాల దాకా విస్తరించి ఉన్నట్టు అనిపించింది. నేను సుదర్శన్‌తో కలిసి వేదికకి దగ్గరగా అనువైన చోటు చూసుకుని కూర్చుని, మహాత్మా గాంధీ రాక కోసం ఎదురుచూశాను.

ఎట్టకేలకు కస్తూర్బాతో కలిసి గాంధీజీ వచ్చారు. పండిట్ గోపబంధూ, భాగీరథీ మహాపాత్రా ముందు నడుస్తూ దారి తీశారు. వారితో పాటు మరికొందరు కూడా ఉన్నారు.

ఒక్కసారిగా ఆకాశం మార్మోగేలా 'గాంధీజీకి జై' అనే నినాదం మిన్నంటింది. భక్తిభావంతో ఉప్పొంగిపోతున్న ఆ జనసమూహం పలికిన కంఠస్వరమది. గాంధీజీ వేదికమీద కూర్చున్నారు. ఆయనకు ఎడమవైపున వేసిన కుర్చీలో కస్తూర్బా ఆసీనులయ్యారు. ఆ రోజుల్లో కటక్‌లో మైకుల సంగతే ఎవరికీ తెలియదు.

ముందుగా పండిట్ గోపబంధు గాంధీజీకీ, కస్తూర్బాకీ స్వాగతం పలికారు. ఆయన స్వరం గంభీరంగా, ప్రతిధ్వనించేలా సాగింది. ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయినప్పటికీ, అంతటా ప్రశాంతమైన నిశ్శబ్దం అలుముకుంది. ప్రతి ఒక్కరూ కదలకుండా, శ్రద్ధగా పండిట్ గోపబంధు ఉపన్యాసం వింటున్నారు; అది చాలా దూరం దాకా స్పష్టంగా వినిపించింది.

నాకు గుర్తున్నంతవరకు పండిట్ గోపబంధు ఇలా అన్నారు: 'ఉత్కళభూమి పవిత్రమైన నేల, దైవానికి ప్రీతిపాత్రమైన చోటు. భరతమాత ముద్దుబిడ్డలందరూ ఈ గడ్డను దర్శించారు. ఇప్పుడు మహాత్మా గాంధీ రాకతో ఈ ప్రదేశం మరింత పవిత్రమైంది. మూడు వందల ఏళ్ల క్రితం సరిగ్గా ఇదే డోలా పూర్ణిమ పవిత్ర దినాన శ్రీ చైతన్య మహాప్రభువు ఇక్కడే ఈ నదిని దాటారు. నేడు ఈ వర్తమాన యుగపు దైవావతారమైన మరో పుణ్యపురుషుడు తన పాదస్పర్శతో ఈ నేలను పునీతం చేశారు. ఇది మన అదృష్టం, భాగ్యవిశేషం'.

దేశపరిస్థితులూ, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలూ, ఉద్యమం విజయవంతం కావడానికి అనుసరించవలసిన కార్యాచరణను వివరిస్తూ గాంధీజీ హిందీలో సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఆయన ఉపన్యాసం నాకు పెద్దగా కొరుకుడుపడలేదు. అయినా సరే, ఆయన చెప్పిన ప్రతి మాటా నాకు అర్థమైనట్టే మిగతావాళ్లతో పాటు నేనూ చప్పట్లు కొట్టాను. ప్రసంగం ముగిశాక, సభలోని ఒక యువకుడు లేచి, 'మీరేమో మమ్మల్ని చదువులు

వదిలేయమంటున్నారు. మీరూ, మీలాంటి మిగతా నాయకులూ ఇంగ్లీషు చదువుకున్నారు కదా. మాకు ఇంగ్లీషు పరిజ్ఞానం లేకుండా దేశసేవ ఎలా చేయగలం?' అని గాంధీజీని అడిగాడు.

గాంధీజీ బదులిస్తూ, 'ఇప్పుడే కదా గోపబంధు బాబు శ్రీ చైతన్యుల గురించి చెప్పారు. ఆయనేమైనా ఇంగ్లీషు చదువుకున్నారా? చైనా నాయకుడు చియాంగ్ కైషేక్‌కు ఇంగ్లీషు రాదు, మరి ఆ దేశ వ్యవహారాలను ఆయన ఎలా నడిపిస్తున్నారు?' అన్నారు.

ఆ ప్రశ్న అడిగిన యువకుడు ఎవరో కాదు, మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిశోరీ చరణ్ కానుంగో గారి తమ్ముడేననీ, ఆయన పేరు నృసింహ చరణ్ కానుంగో అనీ నాకు ఆ తర్వాత తెలిసింది. బహిరంగ సభలో మహాత్మా గాంధీని అలా నిలదీసి ప్రశ్నించే ధైర్యం ఆ రోజుల్లో చాలా అరుదు. అంతటి సాహసం చూపినందుకు చాలా మంది ఆ యువకుణ్ణి మెచ్చుకుంటే, కొందరు మాత్రం ఆయన ప్రవర్తనను తప్పుపట్టారు.

గాంధీజీని శ్రీమహావిష్ణువు పదవ అవతారంగా ప్రజలు భావించేవారు. పదకొండవ అవతారమైన కల్కి ఎప్పుడో సుదూర భవిష్యత్తులో రావలసి ఉంది. ఈ నమ్మకానికి ఒక కథ కూడా ప్రాచుర్యంలో ఉండేది:

శ్రీకృష్ణుడు జన్మించిన ద్వారకా ప్రాంతమే గాంధీజీ జన్మస్థలం కూడా. రావణ సంహారమే రామావతారపు ముఖ్య లక్ష్యం; కంసుని వధించడమే శ్రీ కృష్ణావతారపు ప్రధాన ధ్యేయం. ఇప్పుడు కూడా సమాజంలో మోసం, అవినీతి లాంటి దుర్గుణాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ విదేశీ ప్రభుత్వాన్ని తుదముట్టించడానికి రక్షకుడి రూపంలో భగవంతుడే గాంధీజీగా అవతరించాడన్నది ఆ కథ సారాంశం. దీనికి తోడు, ఒరిస్సా కమిషనర్ గ్రూనింగ్‌ను కొద్ది రోజుల క్రితమే పండిట్ గోపబంధు ఓడించడం కూడా ఈ విశ్వాసానికి ఊతమిచ్చిన సంఘటనగా మారింది.

గాంధీజీ ఏదో ఒక రోజు విదేశీ పాలకుల్ని తరిమికొడతారన్న నమ్మకం మాలో కూడా బలపడటంతో, నేనూ సుదర్శనూ ఆ నదీతీరం నుంచి దోసిళ్ళతో ఇసుక తెచ్చి ఆశ్రమం ముందు చల్లాం. గాంధీజీ, కస్తూర్బాలు నడిచిన ఆ పవిత్రమైన ఇసుకను ఒక పెన్నిధిలా మేమెంతో కాలం పాటు దాచుకున్నాం. ●

(**ఉదయనాథ్ శారంగి** (1905-1999) ప్రసిద్ధ పాత్రికేయులు. ఆయన ఆత్మకథ 'గాంధీ మహారాజంక శిష్య' ని 1984లో ఒరిస్సా బుక్ స్టోర్ వారు ప్రచురించారు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన ప్రశాంత కె. రథ్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు.)

## చింతామణి మిశ్రా

# మహాత్మా గాంధీ ఒక అనాగరికుడు

**నేను** సత్యవాది పాఠశాలలో చేరిన కొద్ది రోజులకే ఇదంతా జరిగింది. మహాత్మా గాంధీ సత్యవాది వస్తున్నారన్న వార్త వినగానే మా బాబాయి దగ్గరకు పరుగుతీశాను. గాంధీ గొప్పతనం గురించీ, సహాయ నిరాకరణోద్యమ ప్రాధాన్యత గురించీ ఆయనకు పూసగుచ్చినట్టు చెప్పి, ఆయన చేత ఖద్దరు కట్టించి, ఆయన్ని కూడా గట్టి కాంగ్రెస్ వాదిగా మార్చేయాలని నా ప్రణాళిక. నాతో పాటు సత్యవాదికి వచ్చి గాంధీ ప్రసంగం వినవలసిందిగా ఆయన్ని అడిగాను. నాతో పాటు రావడానికి ఆయన చాలా ఉత్సాహం చూపించారు. పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ఆ సభకు ఆయనా, నేనూ వెళ్లాం. మా ఊళ్లో ముస్లింలు కూడా చాలామంది ఉండేవారు కాబట్టి, మాకు ఒరియా కలిసిన హిందీతో సులభంగానే అర్థమయ్యేది.

సభ సాగుతోంది; ఇంతలో మహాత్మా గాంధీ మధ్యాహ్న భోజన సమయం రానే వచ్చింది. ఆయన అనుచరుల్లో ఒకరు కాస్త ఆహారం తెచ్చి మహాత్మా గాంధీ ముందు పెట్టారు. గిన్నెలో ఒక చెంచా ఉంది; గాంధీజీ ఆ గిన్నె చేతుల్లోకి తీసుకుని గబగబా తినడం మొదలుపెట్టారు. అందరూ రెప్పవాల్చకుండా ఆయన వైపే చూస్తున్నారు. ఆ గిన్నెలో ఉన్న అపురూపమైన ఆహారం ఏమై ఉంటుందా అని నేనూ ఒకటే ఆలోచిస్తున్నాను.

సరిగ్గా అదే సమయంలో మా బాబాయి, 'ఎంత మోటుమనిషి!' అంటూ విసుగ్గా గట్టిగా అనేసి, సభలోంచి లేచి కోపంగా వెళ్లిపోయారు. నేను కూడా లేచి ఆయన వెనుకే వెళ్లి, ఆయన పక్కన మౌనంగా నిలబడ్డాను. 'ఒరే పిచ్చివాడా! ఈ మనిషి సంగతి ఏమీ తెలుసుకోకుండానే నన్ను ఇక్కడిదాకా తీసుకువచ్చావు. రైలు ఛార్జీల

కింద యాభై పైసలు దండగ చేశావు. ఈయన్నేనా నువ్వు మహాత్ముడనేది? సభ మధ్యలో కూర్చుని అలా తింటాడా ఎవరైనా! వేలాది మంది జనం చూస్తుండగా ఎలా తినబుద్ధవుతుంది? ఇలాంటివాళ్లు అనాగరికులు, నువ్వేమో ఈయన్ని మహాత్ముడంటావు!' అని మండిపడ్డారు.

సమయపాలన విషయంలో గాంధీజీ చాలా ఖచ్చితంగా ఉంటారనీ, వేళ తప్పకుండా సమయానికే ఆహారం తీసుకుంటారనీ బాబాయికి నచ్చజెప్పడానికి ప్రయత్నించాను. కానీ లాభం లేకపోయింది!

మరుసటి రోజు ఉదయం మేము ఊరికి బయలుదేరే ముందు, మా బాబాయితో మాట్లాడవలసిందిగా హరిబాబునూ, రాంబాబునూ బతిమిలాడాను. హరిబాబు అసలు ఆ విషయం ఎత్తకముందే, 'ఐదు వేల మంది ఎదురుగా కూర్చుని నువ్వు తినగలవా? తూర్పు దేశాల వాళ్లందరూ ఇంతగా దిగజారిపోయారా? ఇది భోజనం సమయమని అందరూ అంటున్నారు; ఈ కుర్రాడూ, వీడి స్నేహితులూ అదే మాట చెబుతున్నారు. కాస్త ఇంగితజ్ఞానం ఉన్నవాడెవడైనా నిన్న ఆ పెద్ద మనిషి చేసిన పని చేస్తాడా?' అంటూ బాబాయి ఎదురు ప్రశ్నించారు. హరిబాబూ, రాంబాబూ ఒకరితో ఒకరు మాట్లాడుకున్న దాన్నిబట్టి చూస్తే, వాళ్ళిద్దరూ కూడా గాంధీని సమర్థించడం మానేసి బాబాయి ఆరోపణల్నే అంగీకరించినట్టు నాకు అర్థమైంది. ●

(**చింతామణి మిశ్రా** (1906-1980) 'ఉత్కళ ప్రసంగ', 'ఒరిస్సా రివ్యూ' పత్రికల వ్యవస్థాపక సంపాదకుడు. స్వాతంత్ర్యానంతరం ఒరిస్సా ప్రభుత్వ సమాచార, పౌరసంబంధాల శాఖకు మొదటి కార్యదర్శిగా వ్యవహరించారు. నవజీవన్ సాహిత్య పత్రిక సంపాదకులు కూడా. ఈ భాగం ఆయన ఆత్మకథ 'అర్ధశతాబ్దిర అనుభూతి' (మొదటి సంపుటం) నుంచి తీసుకున్నది. దాన్ని కటక్‌లో నవజీవన్ పుస్తకాలయ వారు 1983 లో ప్రచురించారు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన అక్తర్ జె. ఖాన్ భువనేశ్వర్‌లో ఉత్కళ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల అధ్యాపకులు.)

## శైలబాలా దాస్

# గాంధీతో వాదన

1927 శీతాకాలంలో నేను పాట్నా నుండి కటక్ వచ్చాను. దివంగతులైన మా నాన్నగారు మధుసూదన్ దాస్ గారి ఇల్లు వేలంపాటకు రావలసి ఉంది. ఆయన చేపట్టిన రకరకాల పారిశ్రామిక ప్రయత్నాల వల్ల పూర్తిగా దెబ్బతినిపోయారు. తనకు సహాయం చేసేవారెవరూ లేకపోవడంతో అప్పులపాలయ్యారు; పర్లాకిమిడి మహారాజా గారికి బాకీలు తీర్చడం కోసమే ఆ ఇళ్ళు వేలం వేయాల్సిన పరిస్థితి వచ్చింది.

సరిగ్గా అదే సమయంలో మహాత్మా గాంధీకీ ఆయన సిబ్బందికీ మా ఇంట్లోనే బస కల్పించాల్సిందిగా కోరుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు మా నాన్నగారి దగ్గరకు వచ్చారు. మా నాన్నగారి ఆర్థిక ఇబ్బందుల గురించి వారికి తెలిసినప్పటికీ, ఆయన భుజాలమీద ఒక కొత్త బాధ్యత మోపడానికి వారేమాత్రం సంకోచించలేదు. దేశం కోసం తనను తాను సమర్పించుకుంటూ, తన చివరి పైసా కూడా పరోపకారానికే ఖర్చు చేసే స్వభావం మా నాన్నగారిది. కానీ ఆయన చేసిన ఆ సేవలు గుర్తించడానికి కాంగ్రెసు నాయకులు ఎప్పుడూ ఏమీ చేసింది లేదు. అయినా సరే, గాంధీజీకి అతిథి మర్యాదలు చేయడానికి మా నాన్నగారు సంతోషంగా ఒప్పుకున్నారు.

తన పారిశ్రామికాభివృద్ధికి సహాయం కోరడం కోసం మా నాన్నగారు 1924లో అహ్మదాబాద్ వెళ్లి మహాత్మాజీని కలిశారు. ఆయనకేదో చేస్తానని మహాత్మాజీ మాటిచ్చారు గానీ, ఏమీ చేయలేకపోయారు. ఆయన గనుక అప్పుడే మా నాన్నగారికి సాయపడి ఉంటే మా నాన్నగారు అలాంటి నిస్సహాయ స్థితికి చేరుకుని ఉండేవారు కాదు. గాంధీజీ మా ఇంట్లో అతిథిగా ఉన్నప్పుడు, ఆయనకు చేదోడువాదోడుగా ఉంటూ అన్ని చోట్లకూ ఆయన వెంట వెళ్ల వలసిందిగా మా నాన్నగారు నన్ను పురమాయించారు.

నేను కూడా సంతోషంగానే వెళ్లాను. పట్టణంలోని మహిళల్ని ఉద్దేశించి గాంధీజీ ప్రసంగించేలా ఏర్పాట్లు చేశారు. కటక్ టౌన్‌హాల్లో జరిగిన ఆ సభకు ఆయనతో కలిసి నేను కూడా వెళ్లాను. ఆ రోజుల్లో కటక్‌లో కాంగ్రెస్ భావాలున్న మహిళలు పెద్దగా లేరు. ప్రస్తుత జాతీయ ప్రభుత్వ హయాంలో ఉన్నట్టుగా వారు ఆర్థికంగా బలంగా ఉన్నవారూ కారు. చాలా తక్కువ మంది స్త్రీలే ఆ సభకు వచ్చారు. గాంధీజీ ఒక బల్లమీద కూర్చుని సుమారు పదిహేను నిమిషాల పాటు వారితో మాట్లాడారు. దర్శనం కోసం వచ్చిన ఆ మహిళలు ఆయన ముందు నమస్కారాలు సమర్పించారు. మొత్తం చందా అరవై రూపాయల దాకా పోగయ్యింది. కటక్ మహిళలు ఇచ్చిన ఆ స్వల్ప మొత్తాన్ని చూసి ఆయన నిరాశ చెందారు. అక్కడ ఉన్న స్త్రీలలో ఎక్కువమంది పేదలేననీ, తమ స్తోమతకు తగ్గట్టు వాళ్లు చేయగలిగినదంతా చేశారనీ తెలిసినప్పటికీ, ఆయనకి ఆ సంగతి చెప్పబోయి నన్ను నేను నిగ్రహించుకున్నాను.

ఆ రాత్రి మా నాన్నగారూ, మహాత్మాజీ, ఆయన కార్యదర్శి, మరికొందరూ మా డ్రాయింగ్ రూములో తివాసీ మీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. నేనూ అక్కడే ఉన్నాను. మహాత్మాజీ నా వైపు తిరిగి, 'నేను ప్రత్యేకంగా మీ ఇంట్లోనే అతిథిగా ఉండటానికి కటక్ వచ్చింది నీ దగ్గర ఒక సహాయం కోరడానికే' అన్నారు. మేమంతా ఆశ్చర్యపోయాం. అప్పుడు నేను, 'నా వల్ల అయ్యేదైతే మీరు కోరిన పని తప్పకుండా చేస్తాను' అన్నాను. దానికి ఆయన, 'పాట్నాలోనూ, కలకత్తాలోనూ, చివరకు ఇక్కడి కటక్‌లోనూ నిన్ను ఎరిగిన వాళ్లంతా నాకు సహాయం చేయగల సమర్థురాలివి నువ్వేనని చెప్పారు; అందుకే నీ సహాయం కోరుతున్నాను' అన్నారు. నేను బదులిస్తూ, 'నా సామర్థ్యంమీద మీకున్న నమ్మకం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను; కానీ ఆ పని స్వభావం ఏమిటో, దాన్ని చేసే శక్తి నాకుందో లేదో తెలుసుకోకుండా మీకు మాట ఇవ్వలేకపోతున్నందుకు నన్ను క్షమించండి' అన్నాను. కానీ ఆయన పట్టువదలక, 'నా కోసం ఆ పని నువ్వు తప్పక చేయగలవన్న నమ్మకం నాకుంద'ని అన్నారు. 'నువ్వు చరఖా చేతబట్టి, ఒరిస్సా మహిళలందరికీ దాన్ని పరిచయం చేయాలని నేను కోరుకుంటున్నాను' అన్నారాయన.

నేను దాన్ని విజయవంతం చేయలేననీ, కాబట్టి నన్ను క్షమించమనీ చేతులు జోడించి వేడుకున్నాను. 'అందరూ నువ్వు చేయగలవని చెబుతుంటే, నువ్వెందుకు విజయవంతం చేయలేవు?' అని ఆయన అడిగారు. దానికి నేను, 'నా నిండు మనసునూ

ఆత్మనూ పెట్టి పనిచేస్తే తప్ప నేను ఏ పనీ విజయవంతం చేయలేను' అని సమాధానమిచ్చాను. 'నీకు చరఖామీద నమ్మకం లేదా?' అని ఆయన అడిగారు. 'లేదు, చరఖా ఏనాడూ భారతదేశానికి విముక్తి కలిగించలేదు, ఇక్కడి ఆర్థిక సమస్యల్ని పరిష్కరించనూ లేదు. కానీ అది వ్యవసాయదారులకు మేలు చేస్తుంది. వాళ్లు తమ పొలాల్లో పత్తి పండించుకుని, తమకు కావలసిన ధోవతులూ, చీరలూ, తువ్వాళ్లూ తామే నేసుకుంటారు. కానీ మధ్యతరగతివాళ్ళూ, ధనిక వర్గాలూ దీన్ని ఎప్పటికీ చేపట్టవు' అన్నాను.

అప్పుడు ఆయన నన్ను మళ్లీ ప్రశ్నిస్తూ, 'నీకు చరఖామీద నమ్మకమే లేనప్పుడు, నువ్వెందుకు ఖద్దరు చీర కట్టుకున్నావు?' అన్నారు. దానికి నేను, 'మీరు మా గౌరవనీయులైన అతిథి. మీ కళ్లకు నచ్చని, మీకు ఏహ్యాభావం కలిగించే ఏదో ఒక చీర కట్టుకుని మీ ఎదుట నిలబడటం నాకు ఇష్టం లేదు' అని బదులిచ్చాను. 'అంటే నేను మీ ఇల్లు విడిచి వెళ్లగానే నువ్వు ఖద్దరు వదిలేస్తావని అనుకోవచ్చా?' అని ఆయన అడిగారు. 'అవును' అన్నాను. ఆయన ఒకటి రెండు నిమిషాలు మౌనంగా ఉండిపోయారు. నా ధైర్యం చూసి అక్కడున్న వారంతా విస్తుపోయారు.

అప్పుడు గాంధీజీ మళ్లీ, 'సరే, ఇప్పుడు నేను నిన్నింకో ఉపకారం అడుగుతాను, చేస్తావా?' అన్నారు. దానికి నేను, 'అదేమిటో తెలుసుకోకుండా చేస్తానో లేదో చెప్పడం కష్టం. అసలు చేయాలన్న ఉద్దేశమే లేని పని చేస్తానని చెప్పి మిమ్మల్ని నేను మోసం చేయలేను' అన్నాను.

అప్పుడు ఆయన చేతులు చాచి, 'నీ చీరలన్నీ నాకిచ్చెయ్యి' అన్నారు. నేను, 'నన్ను క్షమించండి, మిమ్మల్ని మళ్లీ కాదంటున్నందుకు చింతిస్తున్నాను. ఎందుకంటే మీరు నా చీరలన్నీ తగలబెడతారని నాకు తెలుసు. నా చీరలతో హోలీ పండగ చేయడం నాకెంతమాత్రం ఇష్టం లేదు. ఆ చీరలేమీ నన్ను బాధపెట్టడం లేదు. అదీకాక, దుబారా చేయకపోతే లేమి ఉండదన్నదే నా జీవిత విధానం' అన్నాను.

దానికి ఆయన, 'నేను బతికి ఉన్నంత కాలం ప్రతి ఏటా నీకు డజను మేలైన బెజవాడ చీరలు పంపిస్తాను' అన్నారు. 'నన్ను క్షమించండి, మీ ప్రతిపాదన నన్ను ప్రలోభపరచడం లేదు. విదేశీ వస్తువులు వాడకూడదని మీరంత పట్టుదలగా ఉన్నప్పుడు మోటారు కార్లూ, మందులూ, చేతి గడియారాలూ ఎందుకు వాడుతున్నారు?

మీరు కూడా వాటిని వదిలిపెట్టాలి కదా; కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మనం అలా చేయలేం' అన్నాను.

నా సమాధానాలు గాంధీజీకి నచ్చలేదు. 'ప్రాచీన భారతదేశంలో అతిథికి ఆతిథ్యమిచ్చే యజమానులూ, ఇల్లాలూ ఏదైనా ఇచ్చేవారు; నువ్వు మాత్రం నాకు నీ చీరలు ఇవ్వలేకపోతున్నావు' అన్నారాయన. దానికి నేను, 'మనం ప్రాచీన భారతదేశంలో లేము, బ్రిటిష్ పాలన కింద మన ఆలోచనలు మారాయి, వాటికి తగినట్టే మనం అలవాటుపడ్డాం. ఎన్నో వస్తువులకి అలవాటుపడిపోయాం కాబట్టి వాటిని వదులు కోవడం కష్టం. ఇకముందు కొత్తగా విదేశీ వస్తువులేవీ కొనవద్దని మీరు కోరితే మాత్రం తప్పకుండా మాట ఇస్తాను' అన్నాను.

నా వ్యాఖ్యలను గాంధీజీ మెచ్చుకోలేదు. ఆయన మా నాన్నగారి వైపు తిరిగి, 'మీ అమ్మాయి నాతో ఎలా మాట్లాడిందో విన్నారా?' అన్నారు. ఆ తర్వాత నా వైపు చూసి, 'నువ్వు కాంగ్రెస్‌లో సభ్యురాలివి కావాలని నేను కోరుకుంటున్నాను' అన్నారు. 'కాంగ్రెస్ నాయకులమీదా, కాంగ్రెస్ విధానాలమీదా నాకు ఎప్పుడు నమ్మకం కుదురుతుందో అప్పుడు సంతోషంగా కాంగ్రెస్ మహిళగా మారతాను. ఆ సంగతి మీకు తెలియజేసి సబర్మతిలో మీ ఆశ్రమానికే నేరుగా వస్తాను' అన్నాను. నా నిర్మొహమాటపు మాటలకు నన్ను క్షమించమని వేడుకున్నాను. నేనెప్పుడు వచ్చినా తన ఆశ్రమం తలుపులు తెరిచే ఉంటాయని చెప్తూ మర్నాటి సాయంత్రం ఆయన మా ఇంటి నుంచి బయలుదేరారు. కానీ కానీ ఆయన ఆశ్రమంలో ఆయనకు అతిథిగా ఉండే భాగ్యమూ గౌరవమూ నాకెప్పటికీ దక్కలేదు. ●

(**శైలబాలా దాస్** (1875-1968) ఒరిస్సాలో స్త్రీ విద్య వ్యాప్తికి విశేష కృషి చేశారు.)

## సరళా దేవి

# నా ఆరాధ్య దైవం

**వివిధ** సందర్భాల్లో గాంధీజీని కలిసే అదృష్టం నాకు దక్కింది. ఎన్నో కాంగ్రెస్ మహాసభల్లో ఆయన దర్శనం చేసుకున్నాను. ఒరిస్సా పర్యటనలో ఆయన మొదటిసారి కటక్ నగరానికే వచ్చారు. అప్పటి నుండి నేను ఆయన అనుచరురాలినై, ఆయన ఆశయాల కోసం నా జీవితాన్ని పూర్తిగా అంకితం చేశాను. ఆయన స్ఫూర్తితో పరాయి పాలన సంకెళ్ల నుండి భరతమాతను విముక్తం చేయడానికి ఇల్లు విడిచి బయటకు వచ్చాను. ఆయన త్యాగనిరతి నా చుట్టూ ఉన్న పరిసరాల్నీ, నా లౌకిక జీవితపు కట్టుబాట్లనూ పూర్తిగా మరిచిపోయేలా చేసింది.

గాంధీజీ నా జీవితానికొక కొత్త అర్థాన్నిచ్చారు. నాలో ఒక కొత్త లోకపు జ్వాలనూ, సరికొత్త విప్లవోత్సాహాన్నీ రగిల్చారు.

ధనికులూ, బలవంతులూ, సామాన్యులూ— ఇలా అన్ని వర్గాల ప్రజలూ కాట్జూరి నదీ తీరాన గాంధీజీ బస చేసిన చిన్న కుటీరం వైపు పోటెత్తారు. ప్రజలందరికీ ఆయన దర్శనం చేసుకోవాలనే తపన ఎంతగా ఉందో స్పష్టంగా కనిపించింది. వచ్చినవాళ్ళెవరూ వట్టి చేతుల్తో రాలేదు. పూలూ, పండ్లూ కానుకలుగా తెచ్చారు. ఎంతటి మహా జనసందోహం తరలివచ్చినా ఆ చిన్నకుటీరం ఏనాడూ కిక్కిరిసిపోయినట్టు కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. గాంధీజీ ఆదేశం మేరకు ఆ వస్తువుల్ని పేదలకూ, అనాథలకూ నేనే పంచిపెట్టాను. పాత చిరుగుల బట్టలతో స్త్రీలూ, పిల్లలూ గుంపులు గుంపులుగా వచ్చారు.

తలుపు ముంగిట వేచి ఉన్న ఆ ఉద్విగ్న జనసమూహం తనవైపు అడుగు తీసి అడుగు వేయకపోయినా, కాసేపు విశ్రాంతి తీసుకుంటానని గాంధీజీ వారికి సైగ

చేశారు. ద్వారం దగ్గర పహరా కాసే బాధ్యత నాకు అప్పగించారు. జన ప్రవాహం మా త్రం ఆగకుండా సాగుతూనే ఉంది. అప్పుడప్పుడూ నేను లోపలికి వెళ్లి అంతకంతకూ పెరుగుతున్న జనం గురించి గాంధీజీకి వివరిస్తూ వచ్చాను. 'నన్ను కాస్త ప్రశాంతంగా ఉండనివ్వవు కదా!' అన్నారు గాంధీజీ సగం నవ్వుతూ, పరిహాసంగా. 'నేనేం చేయగలను మహాత్మా, నా చేతుల్లో ఏమీ లేదు' అన్నాను నేను. 'వాతావరణం బాగోలేకపోయినా జనం వెనకడుగు వేయడం లేదు. మీ ఆరోగ్యం గురించీ, మీ అలసట గురించీ వాళ్లకు ధ్యాస లేదు. నేను ఎంత ప్రాధేయపడినా వాళ్లు కదలడం లేదు. అందరూ ఆ మామిడిచెట్టు కిందే గుమిగూడారు!' అన్నాను.

గాంధీజీ బయటకు వచ్చి ప్రజలకు దర్శనమిచ్చారు. నా వైపు తిరిగి, 'ఎన్నిసార్లని నేను కూర్చున్న చోటినుంచి బయటకి లాక్కొస్తావు? అది సరే గానీ, హరిజన నిధి సేకరణ ఎంతవరకు వచ్చిందో చెప్పు?' అని అడిగారు. దానికి నేను, 'మహాత్మాజీ, సాయంత్రం నాలుగు గంటలకు మీరు నగరానికి వెళ్లాల్సి ఉంది కదా. టౌన్ హాల్లో మహిళా సభ ఏర్పాటు చేశాను. ఇప్పటికే స్త్రీలంతా అక్కడికి వచ్చి చేరుకుని ఉంటారు. మీ పిలుపు మేరకు అక్కడ ఉన్నవాళ్లు తమకు తోచినదంతా మీ చేతుల్లో పెడతారన్న విషయంలో నాకు ఎలాంటి సందేహమూ లేదు' అని బదులిచ్చాను.

చీకటి పడేలోపే గాంధీజీ కటక్ నగరం చేరుకున్నారు. శ్రీరామచంద్ర భవన్‌లో ఆయన ఉపన్యాసం గురించి నేను అంతకుముందే ప్రకటన అతికించాను. కాంగ్రెస్ వాలంటీర్లతో కలిసి మహాత్ముడు అక్కడికి వచ్చారు. అప్పటికి ఆ వాలంటీర్లలో ఎవరూ 'నేతలు'గా మారలేదు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలూ లేవు, ఏ గొడవలూ లేవు! పనులన్నీ ప్రశాంతంగా, సాఫీగా సాగిపోయాయి. మహాత్మాజీ తన రాక వెనుక ఉన్న ఉద్దేశాన్ని మాకు వివరించారు. హరిజనుల దుర్భరపరిస్థితుల్ని ఎత్తిచూపుతూ, మహిళల పాత్ర ఎంతటిదో నొక్కి చెప్పారు. హరిజనుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని సూచించారు.

గాంధీజీ హిందీ ప్రసంగాన్ని నేను ఇంగ్లీషులోకి అనువదించి, 'హరిజన నిధి' కోసం ధనరూపంలోనూ, ఆభరణాల రూపంలోనూ ఉదారంగా విరాళాలు ఇవ్వ వలసిందిగా అక్కడి మహిళలకు విజ్ఞప్తి చేశాను. అక్కడ ఉన్న స్థితిమంతుల కుటుంబాలకు చెందిన స్త్రీలలో ఎక్కువమంది నగదు ఇచ్చారు. చేతిలో డబ్బు లేని వాళ్లు ఒంటిమీద ఉన్న నగలన్నీ తీసి, అక్కడ పరిచిన తెల్లటి దుప్పటిమీద కుమ్మరించారు. అలా

దాదాపు అరవై నుండి డెబ్బై తులాల బంగారం మేరకు నగలు పోగయ్యాయి. దానికి తోడు, దాదాపు వెయ్యి రూపాయల నగదు కూడా చకచకా వసూలైంది. స్వచ్ఛ హృదయులైన ఆ జాగృత స్త్రీమూర్తుల నుండి అందిన కానుకలు చూసి మహాత్మాజీ ఎంతో సంతోషించారు.

సభ ముగిసింది. ఉదయం నుండి సాయంత్రం ఆరు గంటల దాకా నేను ఆయన వెంటే ఉన్నాను. ప్రజలు అక్కడ తనకి నివేదన చేసిన పండ్లు తాను తినకుండా, ఆయన పిల్లలకే పంచిపెడుతుండటం చూసి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. గాంధీజీ ఆరగిస్తారని గంపలకొద్దీ పండ్లు తెచ్చినవాళ్లు మాత్రం కాస్త నిరాశ చెందారు; ఎందుకంటే ఆయనకు బదులుగా ఆ పండ్లన్నీ ఎక్కడెక్కడి నుంచో వచ్చిన మహిళలకూ, పిల్లలకూ, పేదలకూ, అనాథలకూ చేరాయి.

అంతకుముందు ఒక సందర్భంలో కస్తూర్బా, దేవదాస్‌లతో కలిసి వచ్చినప్పుడు గాంధీజీ స్వరాజ్య ఆశ్రమంలో బస చేశారు. ఆ తర్వాత అన్నదారాయ్ గారింటికీ, అక్కడి నుండి నవబాబు ఇంటికీ మారారు. ఆయా స్థలాలన్నింటికీ నేను కూడా వెళ్లాను. ●

(**సరళా దేవి** (1904-1986) ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. రచయిత్రి. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన సచ్చిదానంద మొహంతి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం లో ఆంగ్ల ఆచార్యులు.)

# ఫ్రీడా హౌస్‌వర్త్

# గాంధీ రేఖాచిత్రం

**ఆ** సంవత్సరం వరదలతోనూ, కరవుతోనూ అల్లాడుతున్న ఒరిస్సా ప్రాంతంలో గాంధీ పర్యటిస్తున్నారు. కలకత్తా వెళ్లిన నా భర్త తన పర్యటన ముగించుకుని తిరిగి రావడం కోసం నేను ఎదురుచూస్తున్నాను. నేను నా భర్తతో కలిసి మొదటిసారిగా ఆయన స్వస్థలాన్నీ, అక్కడున్న తోటల్నీ చూడాలని ఆశపడుతున్న వేళ అది.

సరిగ్గా ఆ సమయంలోనే, నా అదృష్టం కొద్దీ, గాంధీజీ కటక్ రావలసి ఉంది. కటక్ లోకల్ కాంగ్రెస్ బోర్డుకి చెందిన ఏడుగురు సభ్యుల్లో నలుగురు నాకు చాలా బాగా పరిచయం. గాంధీ ఉపన్యాసానికి సంబంధించిన ఏర్పాట్లూ, నిధులూ, స్వాగత సత్కారాలూ, వసతిసౌకర్యాల్లాంటి విషయాలు చర్చించే సమావేశానికి నన్ను కూడా తీసుకెళ్ళడానికి వారిలో ఒకరిని ఒప్పించాను.

అటువంటి పర్యటనల్లో, తెర వెనుక జరిగే సన్నాహాల్ని తొంగిచూడాలనీ, అసలు గాంధీ పర్యటన వెనుక ఏమేమి ఇమిడి ఉంటాయో తెలుసుకోవాలనీ నాకు ఆసక్తిగా ఉంది. కానీ నా ముఖ్య ఉద్దేశం మాత్రం గాంధీజీని ఒక రేఖాచిత్రం గీయడానికి తగిన అవకాశం దక్కించుకోవడమే.

ఆ కాంగ్రెస్ సభ్యులకు మాత్రం కళ గురించి ఎలాంటి అవగాహనా లేదు. వాళ్ళు రసజ్ఞత ఏ కోశానా లేనివాళ్ళు. కష్టపడి గీసిన ఒక రేఖాచిత్రం కన్నా, ఒక ఫోటోగ్రాఫు వాళ్ళకి ఎక్కువ తృప్తినిస్తుంది. చాలా తక్కువ ఖర్చులో వస్తుంది కాబట్టి వాళ్ళ దృష్టిలో ఫోటోనే గొప్పగా అనిపిస్తుంది. అయినా సరే, వాళ్ళు నా పట్ల ఎంతో స్నేహపూర్వకంగా ఉంటూ, నేను కోరిన సాయం చేయడానికి సిద్ధపడ్డారు.

గాంధీజీ బస చేయబోయే ఇంట్లోనే ఆ కమిటీ సమావేశమైంది. ఆ రోజు గురించి అప్పటి నా డైరీలో ఇలా రాసుకున్నట్టుగా ఉంది:

**కటక్, ఒరిస్సా, 16 డిసెంబర్ 1927**

వరండాలో నేలమీద చారల జంపఖానా పరిచి ఉంది; కేవలం అడుగు ఎత్తున్న ఒక పొడవాటి బల్ల చుట్టూ, మసక లాంతరు వెలుగులో కమిటీ సభ్యులు పద్మాసనాలు వేసుకు కూర్చున్నారు. నేనూ నేలమీదే కూర్చున్నాను.

ఔను, మహాత్మాజీ వచ్చే వేళకు అన్నీ సకాలంలో సిద్ధమవుతాయి. గోడలకు సున్నాలు వేశారు, ఇళ్ళదగ్గరా, తోటల్లోంచీ చెత్తాచెదారం తొలగించారు. చిల్లరమల్లర సామగ్రి కొన్నారు. రాత్రికి రాత్రి కలకత్తా నుంచి యాభై రూపాయల విలువైన పండ్లూ కూరగాయలూ తెప్పించడానికి ఆర్డరిచ్చారు. ఆ విషయాలు వింటుంటే నాకు ఆశ్చర్యం వేసింది. గాంధీజీ అవసరాలు చాలా పరిమితమని కదా చెప్తారు!

గాంధీజీతో పాటు మరొక ఆరుగురిదాకా రావొచ్చని వారు ఊహిస్తున్నారు. మీరాబెహెన్ (ఇంగ్లీష్ రియర్ అడ్మిరల్ కుమార్తె అయిన మిస్ స్లేడ్, ప్రస్తుతం గాంధీజీ శిష్యురాలు) కోసం ప్రత్యేకంగా ఒక గది కేటాయించాలని అనుకున్నారు.

ఆ సభ్యుల్లో ఒకరైన ఒక న్యాయవాది, గాంధీజీకి రైలు దగ్గర స్వాగతం పలికే కమిటీలో నన్నూ ఒకరిగా ఉండమని సూచించారు. నేను సున్నితంగా తిరస్కరించడంతో ఆ ప్రస్తావన అంతటితో ఆగింది.

మధ్యాహ్నం రెండున్నర గంటలకు గాంధీజీ కటక్ స్టేషన్ చేరుకున్నప్పుడు, నిశ్శబ్దంతోనే ఆయనకు స్వాగతం పలకాల్సి ఉంది. ఎందుకంటే ఆయన ప్రతి వారం చేపట్టబోయే కఠిన మౌనవ్రతం ఆ రోజు మధ్యాహ్నం సరిగ్గా ఒంటిగంటకు మొదలు అవుతుంది. ఆయన చుట్టూ ఉన్నవారు స్వాగత కమిటీతో మాట్లాడతారు కానీ, స్వయంగా గాంధీజీతో ఎవరూ మాట్లాడకూడదనీ, ఆయన కూడా బదులివ్వరనీ మాకు చెప్పారు. ఎంతటి అపూర్వమైన స్వాగతం! భారతదేశంలో తప్ప మరెక్కడైనా ఇలాంటి ఆహ్వానాన్ని ఊహించగలమా?

గాంధీ రాకముందే నేను ఈ ఇంటికి చేరుకోవాలనీ, ఆయన కూర్చుని నా చిత్రలేఖనానికి తగిన భంగిమలో కూర్చునే ఏర్పాటు కోసం నేరుగా మిస్ స్లేడ్‌తోనే

మాట్లాడి ఒప్పించాలనీ నిర్ణయించారు. కానీ అదెలా సాధ్యం? గాంధీజీ చిత్రకారుల కోసం ప్రత్యేకంగా 'పోజు' ఇచ్చే మనిషి కాదు. అలాంటి వాటికి ఆయన దగ్గర సమయమూ లేదు, ఆసక్తీ లేదు. ఒక ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు నాకు గుర్తున్నాయి:

'వ్యక్తిగతంగా నాకు చిత్రలేఖనం లాంటి కళలతో పనేమీ లేదు. నక్షత్రాలతో నిండిన ఆకాశాన్ని చూస్తేనే నాకు కావలసినంత తృప్తి కలుగుతుంది. మీకు తెలిసే ఉంటుంది, ఐరోపాలో ఏడాది పొడుగునా ఎక్కువ కాలం ఆనందించడానికి నక్షత్రాల ఆకాశం ఉండదు కాబట్టి, బహుశా వాళ్ళకి తమను తాము సంతృప్తిపరుచుకోడానికి చిత్రలేఖనంతో అవసరం పడిందేమో! నా ఆశ్రమాన్ని నేను వర్ణ చిత్రాలతో అలంక-రించాలని అనుకోను. చిత్రలేఖనాలమీద నాకు ప్రత్యేకమైన శ్రద్ధ కూడా లేదు, వాటిని తెచ్చుకుని గోడలమీద తగిలించుకొమ్మని తక్కినవాళ్ళకి చెప్పను కూడా. నా ఆశ్రమంలో ఉన్న గోడల్ని బొమ్మలతో అలంకరించడం నాకు ఇష్టం ఉండదు, నేనెప్పుడూ ఆ గోడల హద్దులు దాటి బయటనే ఉండాలని కోరుకుంటాను— గోడలు నన్ను బంధిస్తున్నట్టూ, నా స్వేచ్ఛను హరిస్తున్నట్టూ, నన్ను ప్రకృతికి దూరం చేస్తున్నట్టూ అనిపిస్తుంది'.

మరో సందర్భంలో ఆయన ఇలా అన్నట్టు కూడా విన్నాను: 'మీరు నా సత్యాగ్రహ ఆశ్రమానికి వెళితే గోడలన్నీ వట్టిగా, బోసిపోయి కనిపిస్తాయి. నా మిత్రులు దీనిని ఆక్షేపిస్తుంటారు. గోడలమీద చిత్రాలు లేవన్న మాట నిజమే. కానీ అందుకు కారణం, గోడలు మనకు ఆశ్రయం ఇవ్వడానికే తప్ప, కళకు వ్యతిరేకం కావడం వల్ల కాదు. విసుగు లేకుండా నక్షత్ర ఖచిత గగనవితానాన్ని నేను ఎల్లప్పటికీ చూస్తూనే ఉండి పోవట్లేదా? మనసుకి కలిగించే పరవశంలో తారాతోరణాల ఆకాశాన్ని మించిన చిత్ర లేఖనం మరొకటి ఉంటుందని నేనెన్నటికీ ఊహించలేను. అది నన్ను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతుంది. అనిర్వచనీయమైన పారవశ్యంలోకి నెడుతూంటుంది. భగవంతుని అద్భుత కళాసృష్టితో పోలిస్తే, మనిషి చేసే పని కేవలం మెరిసే తాటాకు చప్పుడు లాంటిది కాదా?'

ఇలాంటి నిరుత్సాహకర అభిప్రాయాలు మహాత్మాజీకి ఉన్నాయని తెలుసు కాబట్టి చిత్రలేఖనానికి అనుమతి దొరుకుతుందని పెద్దగా నమ్మకం కలగడం లేదు, అయినా ఏదో విధంగా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నాను. ఒకవేళ ప్రయత్నించడానికి

నాకు అనుమతి దక్కినా, తన కలం ద్వారా అంతర్మథనం చెందుతూ, యువ భారతీయులతో అనితరసాధ్యం గానూ, సూటిగానూ, నిశితంగా, స్వదేశీ శైలిలో వాదిస్తూ, విన్నవిస్తూ ఉండే ఆ సాధుపురుషుని రూపాన్ని నిజంగా నేనొక రేఖాచిత్రంలోకి కుదించగలనా?

**డిసెంబర్ 18**

మధ్యాహ్నం రెండు గంటలు. ఎంతసేపు ఎదురుచూసినా రాని పనివాడి కోసమూ, గుర్రబ్బండి కోసమూ చూసి చూసి విసుగొచ్చి, నా చిత్రలేఖన సామగ్రి చేతబట్టుకుని, ఆ ఎర్రటి దుమ్ములో, డిసెంబర్ దినాల వెచ్చని ఎండలో మహాత్మాజీ బస చేయబోయే ఇంటి వైపు నడిచాను. గతంలో చీకట్లో ఒకే ఒక్కసారి ఆ ఇల్లు చూశాను. ప్రధాన రహదారి నుండి చీలే ఒక సన్నటి సందు. ఖద్దరు బట్టలు కట్టి, గుండెలమీద మెరిసే రంగురంగుల ఖద్దరు నక్షత్రాల బ్యాడ్జీలు ధరించిన ఉత్సాహవంతులైన యువకులు సైకిళ్లమీదా, కాలి నడకనా నన్ను దాటుకుంటూ వెళ్తున్నారు; ఎవరినీ దారి అడగాల్సిన పని లేకపోయింది.

ఇంటి ముఖద్వారం దగ్గర జనసమూహం వేచి ఉంది. వారిని బయటే నిలువరించడానికి గేటు దగ్గర ఖద్దరు వాలంటీర్లు కాపలా కాస్తున్నారు. నేను లోపలికి అడుగుపెట్టాను, అందరి కళ్లల్లోనూ ప్రశ్నార్థకమైన చూపులు— గాంధీజీని చూడటానికి ఒక తెల్లజాతి స్త్రీ రావడమా? అదీ ఒక మేమ్ సాహెబ్ తన వస్తువులు తన చేతుల్తో తనే స్వయంగా మోసుకురావడమా! రెండు వింతలూ ఒక్కచోటే !

వరండాలో కొందరు యువ వాలంటీర్లు విశ్రాంతిగా కూర్చుని ఉన్నారు. వారు నన్ను చూసి వెంటనే లోపలికి తీసుకెళ్లారు. గాంధీకి ఆతిథ్యం ఇస్తున్న ఇంటి యజమాని నన్ను స్వాగతించి ఒక గదిలోకి తీసుకువెళ్ళారు. ఆ గది చూడబోతే యూరోపియన్ శైలికి మరీ అధ్వాన్నమైన అనుకరణలాగా ఉంది.

'సి.ఆర్.దాసు గారి సోదరి ఇక్కడే ఉన్నారు; మీరు ఆమెను కలవాలనుకుంటున్నారా? ఆమె గాంధీజీకి సేవ చేయడానికి వచ్చారు' అన్నారు. (1922లో రక్తపాతం జరుగుతుందన్న భయంతో గాంధీ చలించిపోయి ఉద్యమనావ చుక్కాని వదిలేసినప్పుడు, జాతీయ నౌకను నడిపించిన గొప్ప బెంగాలీ స్వరాజ్య నాయకుడే సి.ఆర్.దాస్).

ఎంతో సంతోషంతో ఆ ఇంటి యజమాని వెంటే లోపలి ప్రాంగణంలోకి అడుగుపెట్టాను. స్త్రీలకీ సేవకులకీ మాత్రమే ప్రవేశముండే ఆ అంతఃపుర ప్రాంగణంలో, కలకత్తా నుండి రాత్రింబవళ్లు ప్రయాణించి మరీ వచ్చిన ఆ మహిళ ఒక్కరే కూర్చుని ఉన్నారు. ఇంటి యజమాని కుటుంబానికి చెందిన స్త్రీలు ఆ ఇంటినుంచీ, ఆ తోటనుంచీ పూర్తిగా తప్పుకున్నారు, ఒక్క స్థానిక మహిళ కూడా అక్కడ లేదు. ఊర్మిళాదేవి చుట్టూ అరడజను మంది ఉత్సాహవంతులైన మగవాళ్ళు నిలబడి ఉన్నారు. కానీ ఏ పనీ చేతగాని నిస్సహాయులు. వాళ్ళు ఆమె ఏమి చెప్తే అది మాత్రమే చేస్తూ ఆమె అడిగిన వస్తువులు తెచ్చి అందిస్తున్నారు. అంగవస్త్రమూ, జంధ్యమూ మాత్రమే ధరించిన ఒక బ్రాహ్మణ వంటవాడు వంటగది లోపలికీ బయటకీ తిరుగుతున్నాడు.

ఊర్మిళాదేవి తాటాకు చాపమీద కూర్చుని ఉన్నారు. నడి వయసు మహిళ. విధవా వస్త్రాలు ధరించి ఉన్నారు. కత్తిపీటమీద కూచుని తన కాలి వేళ్లతో అదిమిపెట్టి కూరగాయలు తరుగుతున్నారు. నేనూ కూడా పక్కన నేలమీద కూర్చున్నాను, మా మధ్య సంభాషణ మొదలైంది. ఆమె కలకత్తా నుంచి రాత్రంతా ప్రయాణించి పొద్దున్నే ఐదింటికి ఊళ్ళో దిగి స్నేహితుల ఇంట్లో బస చేశారు.

'ఆయన్ను దర్శించుకుని, సేవ చేద్దామని వచ్చాను. తక్కిన భక్తులు పూరీకో, వారణాసికో, రామేశ్వరానికో వెళతారు. నేను మాత్రం ఏడాదికి ఒక్కసారైనా మహాత్మాజీని కలవడానికి వెళతాను. నా వార్షిక తీర్థయాత్ర అదే!' అన్నారు.

నేను నాదగ్గరుండే చిన్న చాకుతో బంగాళాదుంపల తొక్క తీయడం మొదలు పెట్టాను. ఆమె ఆ దుంపల్ని తన కత్తిపీట మీద కాగితంలా పలుచగా తరుగుతూ పోయారు. నేను ఎంత ప్రయత్నించినా కూడా— వేగంలో పశ్చిమ దేశంమీద తూర్పు దేశానిదే పైచేయి అయింది!

నేను నవ్వుతూ ఈ దేశానికి మొదటిసారి వచ్చినప్పటి నా అనుభవాలు చెప్పుకొచ్చాను. పశ్చిమ దేశాల అతితెలివితో నేను వంటింటినిండా బల్లలు నింపడానికి ప్రయత్నించింది చెప్పాను. కానీ, నా పాశ్చాత్య ఆవిష్కరణలేవీ భారతదేశపు సరళమైన సాంప్రదాయిక పనిముట్ల సామర్థ్యానికి సరితూగవని ఎలా గ్రహించానో కూడా చెప్పుకొచ్చాను. ఇంట్లోనూ, వంటింట్లోనూ పనిచేసే సేవకుల్ని ఇబ్బంది పెట్టడానికి తప్ప నా సంస్కరణలు మరెందుకు పనికి రాకుండా పోయాయని చెప్పాను. ఇద్దరం నవ్వుకున్నాం.

తాను కూడా రైలు దగ్గరకు వెళ్లి మహాత్మాజీకి స్వాగతం పలకాలని ఊర్మిళాదేవి ఎంతో అనుకున్నారు. ఆయన బస చెయ్యబోయే ఇల్లు దారిలోనే ఉండటంతో ఒక్కసారి చూసి వెళ్దామని ఇక్కడికి వచ్చారు. 'తీరా చూస్తే ఇక్కడ పనులేవీ మొదలుపెట్టనేలేదు, ఏదీ సిద్ధంగా లేదు' అని చెప్తూ, చుట్టూ ఉన్న అసమర్థులైన మగవాళ్ల వైపు జాలిగా చూస్తూ, 'ఈ మగవాళ్లు స్నానాలకు వేణ్ణీళ్ళు పెట్టాలని కూడా ఆలోచించలేదు, వంట పనులైతే అస్సలు మొదలుపెట్టలేదు' అన్నారామె.

'ఏ ఒక్క స్థానిక మహిళ కూడా పనులు చక్కబెట్టడానికి ముందుకు రాకపోవడం సిగ్గుచేటు' అన్నాన్నేను ఆవేశంగా. 'కలకత్తా నుండి వచ్చిన మీరు ఇక్కడి పరదా పద్ధతిలోని మూర్ఖత్వం, కఠినత్వం ఊహించను కూడా ఊహించలేరు!'

అందుకు ఊర్మిళా దేవి, 'బాధాకరమైన విషయమేమిటంటే, గాంధీజీ ఆయన బృందమూ పొద్దున్న తొమ్మిదింటికే బాలేశ్వర్ నుంచి బయలుదేరారు; బయలుదేరే ముందు వాళ్లేమీ తిని ఉండరు. అందుకని నేనేం చేయగలను? స్టేషన్‌కు వెళ్లడం మానుకుని, మీరే చూస్తున్నారు కదా, నేరుగా పనిలో కూర్చుండిపోయాను' అన్నారు.

స్థానిక పరిస్థితుల గురించీ, నా గురించీ ఊర్మిళాదేవి ఆరా తీశారు. గాంధీని ఒక రేఖాచిత్రం గీయాలని చాలా గట్టిగా అనుకుంటున్నానని ఆమెతో చెప్పాను.

'ఓహ్, మీరు గీస్తే చాలా బాగుంటుంది! ఇప్పటిదాకా ఎవరూ కూడా ఆయనదొక మంచి బొమ్మ గియ్యనే లేదు. కానీ దేశమంతా ఆయన అధ్వాన్నమైన బొమ్మలతో నిండిపోయింది' అన్నారామె. అయితే మా పక్కనే నిలబడి ఉన్న ఇంటి యజమాని అభ్యంతరం వ్యక్తం చేస్తూ: 'గాంధీ మౌనవ్రతంలో ఉంటారు కదా— ఆయన దగ్గరకు ఎలా వెళ్లగలం?' అన్నారు.

'దానికేముంది, ఫరవాలేదు' అంటూ ఊర్మిళ కల్పించుకున్నారు. 'మనం ఆయనతో మాట్లాడవచ్చు, ఆయనేమీ పట్టించుకోరు. కాకపోతే ఆయన మాట్లాడరు, అంతే. ఆయన ఎంతో అద్భుతమైన మనిషి, ఎలాంటి పరిస్థితుల్లోనూ మౌనాన్ని వీడరు. చివరకు నవ్వినా సరే శబ్దం లేకుండా నిశ్శబ్దంగానే నవ్వుతారు!' అన్నారు.

కూరగాయలు తరగడం పూర్తయింది. తరిగిన కూరగాయల ముక్కల్ని గంపల్లోకి ఎత్తి వంటగదిలోకి తీసుకెళ్లారు. నేను నవ్వుతూ, 'ఒక సైన్యానికి సరిపోయేంత తిండిలా ఉంది, గాంధీజీ అవసరాలు చాలా పరిమితమని విన్నానే!' అన్నాను.

'ఆయన అవసరాలు పరిమితమే, మీరాబాయి అవసరాలూ అంతే! ఆమె దాదాపు మరో మహాత్మాజీయే! వాళ్ళిద్దరూ పాలూ, పండ్లమీదే జీవిస్తారు. కానీ వాలంటీర్లకు భోజనం కావాలి కదా; ఆయన చుట్టూ ఎప్పుడూ ఎంతోమంది ఉంటారు, ఎందరో ఆశ్రితులుంటారు' అన్నారామె.

ఊర్మిళా దేవీ, నేనూ లేచి గాంధీ కోసం సిద్ధం చేసిన గది వైపు నడిచాం. వరండా స్తంభాలకు అప్పుడే వేసిన తారు తాలూకు తాజా నలుపు అనుమానాస్పదంగా కనిపిస్తోంది. పై భాగానికి దట్టమైన కాషాయ రంగూ, పైకప్పుకీ లోపలి భాగాలకీ మిరుమిట్లు గొలిపే తెలుపు రంగూ వేశారు. నేను నవ్వుతూ ఆమెకు అది చూపించాను.

'ఈ ఇంటిని ఎలాంటి భూకంపం ముంచెత్తిందో చూశారా? అంతా సరికొత్త రంగుల్తో పరిశుభ్రంగా మెరిసిపోతోంది. ప్రజలు సాధారణంగా తమ ఇళ్ళెలా ఉన్నాయో పట్టించుకోరు; మరకలు పడ్డ గోడల్నీ, పోగైన చెత్తాచెదారాన్నీ, పూలమొక్కలు లేని ముంగిళ్లనూ గమనించరు. నాకెంతో బాధ కలిగించే విషయాల్లో ఇదొకటి. గొంతు చించుకుని చెప్పి చూశాను, లాభం లేకపోయింది. ఇదంతా వాళ్ల కళ్లకు కనిపించాలంటే ఒక మహాత్మాజీ రాక తప్పదు. అదీ కేవలం ఒక్క రోజు కోసమే! ఈ ఒక్క సందర్భం కోసం మగవాళ్లు ఎక్కడెక్కడి నుంచో ఖద్దరు బట్టలు తవ్వి తీయడం, కొనడం, అప్పు తెచ్చుకోవడం మీరు చూడాలి. సాధారణంగా అసలు ఖద్దరే కట్టని వాళ్ళు కూడా ఈ రోజు వీటిని కడుతున్నారు. అలా ఖద్దరు ధరించడం ద్వారా మహాత్మాజీని గౌరవిస్తున్నామని వారి భావన. కానీ ఆయనలాంటి వ్యక్తి ఇలాంటి ఒక్క రోజు ఆడంబరం కంటే, వారి హృదయాల్లో నిజాయితీ, చిత్తశుద్ధీ నిరంతరం చూడాలను కుంటారని నాకు అనిపిస్తోంది' అన్నాను.

'అసలు వాళ్లు ఖద్దరు ధరించకపోవడమే మంచిదని గాంధీజీ భావిస్తారని నేను ఘంటాపథంగా చెప్పగలను' అన్నారు ఊర్మిళాదేవి ఆత్రుతగా. ఒక రాజకీయ నాయకుడు అన్న మాటల్ని గాంధీజీనే స్వయంగా నవ్వుతూ ఉటంకించిన విషయం నాకు గుర్తొచ్చింది: 'ఆంగ్లేయులకు కోపం తెప్పించడానికి కౌన్సిళ్లకూ సభలకూ ఖద్దరు కట్టుకుని వెళ్లడం, మీకు కోపం తెప్పించడానికి మీ దగ్గరకు మిల్లు బట్టలు కట్టుకుని రావడం కంటే నాకు ఆనందాన్నిచ్చేది మరొకటి లేదు' అని ఆ నాయకుడు గాంధీతో అన్నాడట! ఇక్కడి చాలామంది ప్రజల వైఖరి కంటే ఆ వైఖరినే ఎంతో నయం!

గాంధీజీ కోసం భారతీయ సంప్రదాయ పద్ధతిలో ఆ గది సిద్ధం చేశారు: నేలమీద మందపాటి తివాచీలు, మధ్యలో పరిచిన స్వచ్ఛమైన తెల్లటి దుప్పటిమీద కొన్ని గుండ్రటి గట్టి దిండ్లు తప్ప మరేమీ లేవు.

ఇంటి యజమాని ముందుకొచ్చి, కంగారుగా ఊర్మిళాదేవి వైపు కింద నేలవైపు చూపించారు. దిండ్ల గలేబులు ఖద్దరే, దుప్పటీ ఖద్దరే, పైన పరిచిన తివాచీ కూడా ఖద్దరే. 'కానీ అన్నింటికంటే కింద పరిచిన ఈ తివాచీ మాత్రం విదేశీది!' అన్నారాయన.

'గాంధీజీ ఇలాంటివి పట్టించుకోరు! ఆయనకు ఆడంబరాలూ, అదనపు ప్రయాసా అక్కర్లేదు' అన్నారు ఊర్మిళాదేవి. యజమాని ఊపిరి పీల్చుకుని పక్కకు వెళ్లారు.

ఏదైనా ఎమర్జన్సీ కోసమా అన్నట్టు గదిలో ఒకే ఒక్క కుర్చీ ఉంది. ఊర్మిళా దేవి నాతో 'మీరు వచ్చి ఈ కుర్చీలో కూర్చోండి. ఆయన కోసం ఇక్కడే ఎదురుచూద్దాం' అన్నారు.

నేను బూట్లు విడిచిపెట్టి, ఆమె పక్కనే నేలమీద కూర్చున్నాను. మా సంభాషణ సాగుతూనే ఉంది. ఆమెకు గాంధీజీ గురించి చాలా తెలుసు. ఆ కొద్దిసేపటి పరిచయంలోనే ఆమె సి.ఆర్.దాస్ సోదరి అనే పరిచయం దాటి నాకెంతో చేరువయ్యారు. నిజాయితీపరురాలు, ఆకర్షణీయురాలు. ఎంతో సమర్థురాలైన స్త్రీ. ఆమెతో స్నేహం చెయ్యాలనిపించింది నాకు.

మోటారు శబ్దం వినిపించింది. గాంధీజీ మెట్లు ఎక్కుతుండగా చూడటానికి మేము సరిగ్గా సమయానికే వరండాలోకి వచ్చాం. కాస్త పొట్టిగా, సన్నగా, బక్కపలచగా ఉన్న మనిషి. బక్కచిక్కిన కాళ్లు బయటకు కనిపించేలా తెల్లటి ఖద్దరు అంగవస్త్రం కట్టారు. భుజంమీద ఒక నూలు వస్త్రమూ, దాంతో పాటు ఒక ఉన్ని శాలువా కప్పుకున్నారు. చేతిలో ఒక నల్లటి పెట్టె పట్టుకున్నారు.

గాంధీజీ రూపం వికారంగా ఉంది. గుండు గీయించుకుని చిన్న పిలకతో మొరటుగా ఉన్న తల, ముందుకు పొడుచుకొచ్చిన ఎరుపు-నీలం రంగు పెదవి, ఊడిపోయిన పళ్ల సందులు, దాదాపు లంబకోణంలో పొడుచుకు వచ్చిన పెద్ద చెవులు. కానీ ఆయన చిరునవ్వు చూడగానే మాత్రం ఆయన నాకెంతో అందంగా కనిపించారు— ఎంతటి దయార్ద్రభరితమైన, విశాలమైన, మధురమైన చిరునవ్వు!

చుట్టూ ఉన్న జనం నుండి ఆయన వైపు వెల్లువెత్తుతున్న భక్తిప్రపత్తుల తరంగాన్నీ, ఆయన్నుండి పెల్లుబుకుతున్న అపారమైన తేజస్సునూ, కరుణామృత ధారనూ నేను అనుభవపూర్వకంగా గ్రహించగలిగాను.

తోటలోనూ, వరండా మొత్తం జనంతో నిండిపోయాయి; వాళ్లంతా మౌనంగా దగ్గరకు వచ్చి, వంగి, ఆయన పాదధూళి తాకారు.

ఆయన మా వైపు చూసి ఊర్మిళాదేవిని గుర్తుపట్టారు. ఎంతో ఆత్మీయమైన చిరునవ్వుతోనూ, కళ్లలోని వెలుగుతోనూ ఆమెను నిశ్శబ్దంగానే పలకరించారు. నన్ను ఆయనకు పరిచయం చేశారు. తెల్ల ముఖానికి తగ్గట్టు ఏదో ఒక ఇంగ్లీషు పేరుంటుందని అనుకున్నారేమో, ఆయన కళ్లల్లో ప్రశ్నార్థక భావం కనిపించింది. ఆయనకు మళ్లీ నా పేరుచెప్పారు: 'శ్రీమతి సారంగధర్ దాస్'. ముఖంలో మరో మనోహరమైన చిరునవ్వు మెరిసింది. నేరుగా నా కళ్లల్లోకి చూస్తూ ఒక ఆప్యాయమైన చూపు చూశారు.

ఆయన వెనకనే మేమూ గదిలోకి వెళ్లాం. నేను ఊర్మిళతో గుసగుసగా: 'మీరాబెహెన్ రాలేదా?' అని అడిగాను. 'ఆమె రెండో మోటారులో వస్తున్నారు' అన్నారామె.

అందరిలోనూ ఎంతో ఉత్సాహం ఉంది, కానీ నిశ్శబ్దంగా, అణచిపెట్టిన వెలుగుతో కూడిన ఒక భక్తిభావం అది. వారి సామాన్లు గదిలోకి చేర్చడానికి పదుల సంఖ్యలో చేతులు ముందుకు చాచాయి; మామూలు రోజుల్లో మామూలు సమయాల్లో చిన్నపాటి సూటుకేసు కూడా బంట్రోతు చేత మోయించే చేతులవి!

గదిలోకి రాగానే మహాత్మాజీ వెంటనే నేలమీద కూర్చున్నారు, ఆయన పక్కనే ఊర్మిళాదేవి కూర్చున్నారు. తన పక్కనే కూర్చోమని ఆమె నాకు సైగ చేశారు. ఆమె ఎలాంటి సంకోచం లేకుండా ఆ నిశ్శబ్దాన్ని ఛేదించి, ఆయనతో ఎంతో చనువుగా, ఆత్రుతగా మాట్లాడుతూ కలకత్తా మిత్రుల గురించీ, వారి కార్యకలాపం గురించీ చెప్పడం మొదలుపెట్టారు. గాంధీజీ వింటూ చిరునవ్వుల్తోనూ, తల పంకిస్తూనూ మౌనంగానే సమాధానమిస్తూ వచ్చారు.

ప్రజలు వస్తున్నారు, ఆయన పాదాలు తాకి నమస్కరిస్తున్నారు, రెండు నిమిషాలు మౌనంగా ఉండి ఇతరులకు దారి ఇస్తున్నారు. ప్రతి ఒక్కరి ముఖంలోనూ భక్తీ, ఆరాధనా, ఆనందమూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నిమిషం తిరక్కుండానే గాంధీజీ అప్పటిదాకా తను చేతుల్లోనే పట్టుకుని వున్న ఆ విచిత్రమైన నల్లటి పెట్టెను నిశ్శబ్దంగా తెరిచారు; లోపల ఇత్తడి, ఉక్కు లోహాల తతళ కనిపించింది. ఆ సన్నటి చేతులు కంపిస్తూనే ఆ పెట్టెలోంచి అటూ ఇటూ ఏదో లాగాయి. ఒక చెక్క మీట పైకి లేచింది, కొన్ని ఉక్కు కడ్డీలు విచ్చుకున్నాయి. నా కళ్ల ముందే ఒక రాట్నం ప్రత్యక్షమైంది.

ఆ పెట్టెకున్న సొరుగులోంచి గాంధీజీ ఒక కండెనీ, ఆకుపచ్చని ఖద్దరు చుట్టనీ బయటకు తీశారు. దాన్ని ఒళ్లో పెట్టుకున్నారు; అందులో, మృదువైన, అప్పటికే దూది ఏకిన సన్నటి ఏకులున్నాయి. మరో నిమిషంలో, ఆయన చేతుల్తో సన్నని నూలు వడుకుతుండగా ఆ రాట్నం చేసే మృదువైన ఝుంకార నాదం ఆ నిశ్శబ్దాన్ని నింపేసింది.

సమయం ఒక్క నిమిషం కూడా వృథా కాలేదు, ఎలాంటి పటాటోపమూ లేదు. అత్యంత సహజత్వం. ఒక కొత్త నగరంలో, ఒక అపరిచిత గృహంలో, అప్పటిదాకా అలసట పెట్టిన రైలు ప్రయాణం నుంచి అక్కడికి చేరుకున్న రెండు నిమిషాల వ్యవధిలోనే గాంధీ నిశ్శబ్దంగా తన పనిలో మునిగిపోయారు; తన ప్రగాఢ విశ్వాసాన్ని ఆచరణలో చూపించడం మొదలుపెట్టారు.

అంతటి ఏకాగ్రతా, అంతటి అచంచల సంకల్పమూ ఉన్న వ్యక్తి, తలచుకుంటే తన చేతి రాట్నం తిప్పినంత సులభంగా అశేష జనసందోహాన్ని తన వైపు తిప్పుకో గలగడంలో ఆశ్చర్యమేముంది! కొత్తదనం, పరాయితనం, జనసందోహం—ఆయనకివేవీ పట్టలేదు, అసలు ఆయన దృష్టిలో వాటికి ఉనికే లేదు. యావత్ విశ్వాన్నీ ఆయన తన చేతిలో ఇముడ్చుకున్నారు!

అప్పుడు ఆ గదిలోకి ఒక పొడవాటి యూరోపియన్ మహిళ అడుగుపెట్టారు; ఆమె పూర్వకాలపు భారతీయ శైలిలో, గాంధీజీలాగా నిరాడంబరమైన తెల్లటి ఖద్దరు వస్త్రాలు ధరించి ఉన్నారు. ఆమె ఒక రవికె వేసుకున్నారు; అది రొమ్ము భాగాన్ని మాత్రమే కప్పి, వెనుక వీపు భాగం మొత్తం దారాలతో ముడివేసి ఉంది; నడుము భాగం ఖాళీగా కనిపిస్తోంది, పైట చెంగు కదిలినప్పుడల్లా నగ్నమైన వీపు కనిపిస్తోంది. పైట చెంగు అంటే ఒక ఆరు గజాల చీర; దాన్ని లంగా మాదిరిగానూ, పైట మాదిరి గానూ కలిపి కట్టుకున్నారు. ఆమె స్వదేశపు మహిళలుగాని ఆ వస్త్రధారణ చూస్తే భయంతో నోరువెళ్ళబెడతారు. కాని ఆమె ఎలాంటి బిడియం లేకుండా ఎంతో హుందాగా

నడుచుకుంటూ వచ్చారు. ఆమె ఎవరని పక్కవారిని అడగవలసిన పనే లేదు; ఆమెనే మీరాబెహెన్.

నేను మళ్లీ ఆమె వైపు చూశాను. సాంద్రమైన ఆకృతితో ఆమె వదనం దాదాపు ఒక పురుషుడి ముఖంలా ఉంది; ఒక వితంతువులానో, సన్యాసినిలానో ఆమె జుట్టు పూర్తిగా గుండు చేయించుకోవడంతో ఆ ముఖ కవళికలు మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. దట్టమైన నల్లటి కనుబొమ్మలూ, తీక్షణంగా వంపు తిరిగిన ముక్కు, మేధాసంపన్నమైన నుదురు, మొరటైన చర్మం— ఆమె గాంధీతో మెల్లగా ఏదో మాట్లాడి మళ్లీ బయటకు వెళ్లిపోయారు. నేను కూడా ఆమె వెనుకే వెళ్లాను.

'మిస్ స్లేడ్, నేను ప్రత్యేకంగా మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను. మొన్న రాత్రి కమిటీ వాళ్లు నన్ను మీతో మాట్లాడమన్నారు. నేను గాంధీని ఒక రేఖాచిత్రం గియ్యాలను కుంటున్నాను' అన్నాను.

'అదెంతమాత్రం కుదరని పని' అని ఏమాత్రం తడుముకోకుండా సూటిగా జవాబొచ్చింది.

'ఆయనైతే అస్సలు ఒప్పుకోరు. ఆయనకు ఇలాంటివంటే ఇష్టముండదు, పైగా అనారోగ్యంతోనూ, తీవ్రమైన అలసటతోనూ ఉన్నారు. ఇలాంటప్పుడు ఆయన కూర్చుని తమకి పోజు ఇవ్వాలని ఎవరూ ఆశించకూడదు' అన్నారామె.

'నిజమే, ఆయన కూర్చుని పోజు ఇవ్వాలని నేనూ ఆశించడం లేదు, ఆయన తన పనిలో తాను కూర్చుని ఉండగానే నా వంతు బొమ్మ నేను గీసుకుంటాను' అన్నాను.

'లేదు, మనం ఆయన్ని ఏ విధంగానూ ఇబ్బంది పెట్టకూడదు. ఒకవేళ రేపేమన్నా వీలవుతుందనిపిస్తే ఈ రోజు పొద్దుపోయాక ఆయన్నే అడిగి, మీకు కబురు పంపుతాను' అన్నారామె.

ఎందుకో ఆమెలో కనిపించిన ఆ ఇంగ్లిషు వాళ్ళ ముక్కుసూటిదనమూ, 'మీలాంటి వాళ్ళు మా రాజుగారి కేసి చూడకూడదు' అన్నట్టున్న ఆ ముఖ కవళికలూ నాకు నచ్చలేదు. కానీ అక్కడి నుండి వెళ్లిపోకుండా, తిరిగి గదిలోకి వచ్చి ఊర్మిళాదేవి పక్కనే కూర్చున్నాను. అదను చూసుకుని, మీరాబెహెన్ విధించిన ఆఖరి హెచ్చరిక గురించి ఆమె చెవిలో గుసగుసగా చెప్పాను.

'నువ్వాగు, వెళ్లొద్దు!' అంటూ ఆమె మళ్లీ గాంధీజీ వైపు తిరిగారు. కాసేపటి తర్వాత ఆమె ఆయనతో కబుర్లు చెబుతున్నట్టుగా: 'మిసెస్ దాస్ మీ బొమ్మ గీయాలను కుంటున్నారు; ఆమె చిత్రకారిణి. మీ చిత్రం ఒకటి ఉంటే చాలా బాగుంటుంది' అన్నారు.

గాంధీ మా ఇద్దరి వైపూ చూసి, నవ్వి తలూపారు. నేను ఆ అవకాశం అంది పుచ్చుకున్నాను. 'మహాత్మాజీ, ఈ ఒక్క అవకాశం కోసమే నేనెన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాను. గీసుకోవచ్చా?' అన్నాను.

మరో చిరునవ్వు, మరోసారి తల ఊపు. నేనప్పటికే నా చిత్రకళా సామగ్రి ఒక చిన్న బల్ల మీద సర్దిపెట్టుకుని ఉన్నాను. ఆయన అంగీకారం ఇవ్వగానే ఆ బల్ల అంచులకి వీపు ఆనిస్తూ నేలమీద కూచుని మెరుపువేగంతో చార్‌కోల్‌తో డ్రాయింగు గియ్యడం మొదలుపెట్టాను. కాసేపటికి మీరాబెహెన్ లోపలికి వచ్చి, నేను అప్పటికే పని మొదలుపెట్టి ఉండటం చూసి విపరీతంగా ఆశ్చర్యపోయారు.

'ఓహో, అప్పుడే మొదలుపెట్టేశారా! కాని మీ పనికి అనుమతి తీసుకున్నారనే అనుకుంటున్నాను!' అన్నారు.

'అనుమతి లేకుండా నేనెందుకు గీస్తాను?' అన్నాను నేను కాస్త చిరాగ్గా, గొంతు తగ్గించినా కాస్త గట్టిగానే నొక్కి చెబుతూ, ఒకింత గర్వం నాలోనే అనుభవిస్తూ. కానీ గాంధీ సన్నిధి నాకు నా అల్పత్వం గుర్తుచేసి వెంటనే సిగ్గుపడేలా చేసింది. నిజానికి మీరా బెహెన్ ప్రయత్నాలు కూడా గాంధీజీని శ్రమపెట్టకూడదనీ, ఇబ్బంది పెట్ట కూడదనే కదా.

ఈలోపు ఇద్దరు పిల్లలు లోపలికి వచ్చారు. బహుశా ఇంటి యజమాని పిల్లలై ఉంటారు. వాళ్లు గాంధీ పాదాల దగ్గర నేలమీద నుదురు ఆనించి నమస్కరించి, నిశ్శబ్దంగా నా కుడిపక్క కూర్చున్నారు. పెద్ద కళ్లతో, నోరెళ్లబెట్టి, అమితాసక్తితో నా చిత్రలేఖనం గమనించడం మొదలుపెట్టారు.

ఊర్మిళ బయటకు వెళ్లారు. ఒకరిద్దరు వచ్చి వెళ్లారు. ఒక యువకుడు కనురెప్ప వాల్చకుండా గాంధీ వైపే చూస్తూ నిశ్చలంగా కూర్చున్నాడు. వాతావరణమంతా ప్రశాంతత ఆవరించింది. రాట్నం ఆగకుండా తిరుగుతోంది, కాగితంమీద నా చార్ కోల్ పెన్సిలు సన్నటి శబ్దంతో కదులుతోంది, పిల్లలు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

గాంధీ తనలో తాను లీనమై కూర్చున్నారు. ఆయన తల కాస్త పక్కకు తిప్పడంతో నేను ఆయన ముఖం గియ్యలేకపోయాను. కానీ ఆ నిశ్శబ్దాన్ని ఏ విధంగానూ భంగ పరచడానికి నాకు మనసొప్పలేదు. ఆయన దేహాకృతినీ, ఆ రాట్నాన్నీ గియ్యడంతోనే సరిపెట్టుకున్నాను. దాదాపు ఇరవై నిమిషాల పాటు మా చుట్టూ సంపూర్ణ నిశ్శబ్దం రాజ్యమేలింది. ఆలోచించడానికి కూడా తీరిక లేనంతగా నేను పనిలో మునిగి పోయాను. కానీ ప్రతి ఒక్క గీతనీ అన్వేషిస్తున్న కొద్దీ ఆ గదిలోనూ, నా అంతరంగం లోనూ ఒక నిశ్శబ్దమూ, పారవశ్యమూ ఆవరించాయి. ఎంతటి హృద్యమైన, మహోన్నత మైన సరళత్వం!

మళ్లీ జనం రావడం మొదలైంది. నా వెనుక ఉన్న కిటికీలోంచి కొందరు మగవాళ్లు నిశ్శబ్దంగా చూస్తున్నారు. మరికొందరు తలుపు దగ్గర గుమిగూడి నాకు వెలుతురు రాకుండా అడ్డుపడ్డారు. గాంధీజీ ధ్యానానికి భంగం కలగకూడదన్న ఉద్దేశంతో చాలా నెమ్మదిగా గొంతు తగ్గించి, కాస్త పక్కకు జరగమని వారిని వేడు కున్నాను. వాళ్లు పక్కకు తప్పుకున్నారు. నేనేదో తనతోనే మాట్లాడుతున్నానని అనుకుని గాంధీ నెమ్మదిగా తల ఎత్తి నా వైపు ప్రశ్నార్థకంగా చూశారు. నేను కాదన్నట్టుగా తల ఊపాను; మళ్లీ మా నిశ్శబ్ద కార్యకలాపం మొదలైంది.

ఆ రాతిభవనంలో చలిగా ఉంది. ఆయన తన ఉన్ని శాలువా భుజాలమీదికి లాక్కున్నారు. ఆయన ముఖం ఒక్కటీ తప్ప మిగతా భాగమంతా గీసేశాను. ఒక ఉత్తరాల కట్ట తెచ్చి గాంధీజీ ముందు పెట్టారు. మీరాబెహెన్ అంతకుముందే పరిశీలించిన మరికొన్ని ఉత్తరాలు కూడా తీసుకొచ్చారు. ఆమె ఆయన పక్కన కొద్దిగా పాలూ, ద్రాక్షపళ్ళూ ఉంచారు. ఆయన ఆ ఉత్తరాలు చూసుకుంటుండగా, మీరాబెహెన్ వచ్చి నా భుజం మీదుగా చిత్రంలోకి చూశారు.

'అన్నింటికంటే కష్టమైన, ముఖ్యమైన భాగాన్ని వాయిదా వేస్తున్నట్టున్నారు!' అన్నారామె.

'ఔను, గాంధీజీ మళ్లీ నూలు వడకడం మొదలుపెట్టినప్పుడు ఆయన ముఖాన్ని గీస్తాను. ఆయన తన భంగిమ పూర్తిగా మార్చేశారు' అన్నాను కాస్త పొడిగా.

'ఏదేమైనా, మీకు అనుమతి దొరికినందుకు నాకు సంతోషంగా ఉంది' అన్నారామె.

నేను ఆమె కళ్లల్లోకి చూశాను; ఆమెలో పూర్తి స్నేహభావం కనిపించింది. ఆమె కొనసాగిస్తూ, 'ఆయనదొక మంచి చిత్రం వస్తే బాగుంటుంది. ఇప్పటివరకు అలాంటిదేదీ రాలేదు' అన్నారు. నేను నా పని కొనసాగించాను. సరిగ్గా ఈ రోజు పొద్దున్నే నేను కొన్ని మొఘల్ చిత్రాలు చూశాను. వాటి ప్రభావం నామీద పడుతోందా? వీలైనన్ని తక్కువ గీతలతో, నీడలు లేకుండా గీయడానికి అన్వేషిస్తున్నాను.

ఇద్దరు ముగ్గురు వ్యక్తులు లోపలికి వచ్చారు. మీరాబెహెన్ ఒక వైద్యుణ్ణి వెంట బెట్టుకుని వచ్చారు. గాంధీజీ తన చెయ్యి ముందుకు చాచారు, ఆ వైద్యుడు ఆయన రక్తపోటు పరీక్షించారు. సమాలోచనలు జరిగాయి. ఆయన ఏమాత్రం శ్రమకి లోనవ కూడదనీ, తను కటక్ వచ్చింది ముఖ్యంగా బహిరంగ సభలో మాట్లాడటం కోసం కాబట్టి, ఆ పక్కనే ఉన్న అలకా ఆశ్రమ సందర్శన మాత్రం విరమించుకోవాలని తేల్చారు.

గాంధీజీ స్నానం చేసి విశ్రాంతి తీసుకోవడం కోసం మేమంతా ఒకటి రెండు గంటల పాటు ఆ గది ఖాళీ చేసి బయటకు వచ్చాం. వరండా నేలమీద ఊర్మిళాదేవీ, దేశాయ్, కొందరు వాలంటీర్లూ, నేనూ పద్మాసనాలు వేసుకు కూర్చున్నాం. పళ్లాల మాదిరిగా పరిచిన తాజా అరటి ఆకుల్లో భోజనం చేశాం. మధ్యాహ్నం తర్వాత మళ్లీ చిత్రలేఖనం మొదలుపెట్టాను.

మీరాబాయి మళ్లీ వచ్చారు. 'రూపు బాగా వస్తోంది!' అని ఉద్గారించారు.

ప్రశంసల్నీ, ప్రోత్సాహాన్నీ నేనెంతగా ఇష్టపడతానో! అవి తెలివైనవిగానీ, మొద్దుగానే ఉండనీ— ఒకింత పొగడ్త లభిస్తే చాలు నా మనస్సు వికసిస్తుంది! ఈసారి నాకు మరీ సంతోషం వేసింది; ఎందుకంటే మీరాబాయికి గాంధీజీతో ఎంతో సాన్నిహిత్యం ఉంది, ఆమె మెచ్చుకుందంటే ఒక కఠినమైన న్యాయమూర్తి ఆమోదం లభించినట్టే. గాంధీజీ మాటిమాటికీ భంగిమ మార్చేస్తుంటే, తల తిప్పుతుంటే, డజన్ల కొద్దీ కళ్లు నా పనిమీదే దృష్టి పెట్టి నేను గీసే ప్రతి ఒక్క గీతనీ గమనిస్తుంటే— బొమ్మ గీయడం ఏమంత సులభం కాదు. పైగా నేనిప్పటిదాకా వేసిన చిత్రాలన్నింటిలోనూ ఇది నాకు చాలా ఆసక్తికరమైంది కాబట్టి, ఇది అద్భుతంగా రావాలని నేను మరీ మరీ కోరు కున్నాను.

గదిలో వెలుతురు తగ్గుతోంది, గాంధీజీ మళ్లీ రాట్నం తిప్పడం మొదలుపెట్టారు. నా పని దాదాపు పూర్తయింది, కానీ మళ్లీ ఆ ముఖాన్ని సరిదిద్దేంత ఓపిక మిగల్లేదు.

ఒళ్లంతా నొప్పులు పుడుతున్నాయి; గంటల తరబడి నేలమీద నిటారుగా కూర్చోవడం వల్ల ముఖ్యంగా నా కాళ్లు మొద్దుబారిపోయాయి.

మళ్లీ జనం వచ్చారు. మీరాబెహెన్ నా చిత్రాన్ని నిశితంగా పరిశీలించారు. 'ఆయన రూపం చాలా చక్కగా పట్టుకున్నారు' అన్నారామె.

ఊర్మిళాదేవి ఆనందంతో, 'అద్భుతం, ఎంత బాగుందో! ఆ బొమ్మనిప్పుడే పట్టుకు పోవాలనిపిస్తోంది!' అన్నారు.

'నిజంగా మీకంతగా నచ్చిందా? నాకు చాలా సంతోషంగా ఉంది. మహాత్మాజీ నుండి ప్రసరించిన స్ఫూర్తినే నాకీ సాయం చేసిందని భావిస్తున్నాను!' అన్నాను.

గుమ్మం దగ్గరనుంచీ, కిటికీల్లోంచీ జనం ఆ బొమ్మ చూడటానికి ఎగబడ్డారు. వరండాలోంచి హిందీలోనూ, ఇంగ్లీషులోనూ ప్రశంసా వాక్యాలు నా చెవిన పడు తున్నాయి. నా మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. అది కేవలం పొగడ్తల వల్ల వచ్చిన తృప్తి మాత్రమే కాదు; అంతకుమించిన అపారమైన సంతృప్తి! తాము ఆరాధించే నాయకుడి రూపాన్ని నేను నిజంగానే ఆవిష్కరించానని ఆ ప్రజలు అనుకోవడం నాకు గొప్ప విషయంగా తోచింది. కళ గురించి వాళ్లకు ఏమీ తెలియదని నేను సరి పెట్టుకోవచ్చు; కానీ నాకేం తెలుసు? ఎవరికేం తెలుసు? అసలు కళ అంటే ఏమిటి?

పారిస్‌లో ఉండే కళా విమర్శకుల సంగతి పక్కన పెడితే, ప్రస్తుతానికి ఈ ప్రజలను మెప్పించానన్న సంతృప్తి నాకు చాలు!

నేను గాంధీజీ వైపు తిరిగాను. 'రేపు రావచ్చా?' అని అడిగాను.

ఆయన సరేనంటూ తలూపారు. మరుసటి రోజు దాకా రాట్నం పెట్టిన చోటు చెరిగిపోకుండా ఉండటానికి, ఊడ్చేవాళ్లు దాన్ని కదిలించకుండా ఉండటానికి సూదీ దారమూ అడిగి తీసుకుని, తివాచీమీద ఆ రాట్నం ఉన్న గుర్తు దగ్గర ఒక కుట్టు వేశాను.

ఊర్మిళా దేవి నా చిత్రం గురించి గాంధీజీతో ఏదో అన్నారు. నేను ఆయన వైపు చూస్తూ: 'ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన కల ఇది, దీన్ని పూర్తిగా ముగించాలని ఉంది' అంటూ నా కృతజ్ఞతలు తెలిపాను. ఆయన నన్ను ఉడికిస్తున్నట్టుగా ఒక నవ్వు నవ్వి, ఒక పెన్సిలు తీసుకున్నారు. నా చేతికిచ్చిన కాగితం ముక్కమీద ఆయన ఇలా రాశారు:

'మరి నాకేం ఇస్తావు?'

ఆయన ఉద్దేశం అర్థం కాక అయోమయంగా మొదట ఆయన వైపూ, తర్వాత మీరాబెహెన్ వైపూ చూశాను. ఆ చిత్రపు నకలు ఏమైనా కావాలని అడుగుతున్నారా అనుకున్నాను. కానీ మౌనంగా ఉండిపోయాను. మీరాబెహెన్ ఆ కాగితం చదివి నవ్వారు: 'మీ ఏళ్ల నాటి కోరిక తీరింది. ఆయన మీ అభ్యర్థన అంగీకరించారు. బదులుగా మీరేం ఇస్తారు?' అన్నారు.

'ఓహ్, ఏదైనా ఇస్తాను, ఏమైనా సరే ఇస్తాను' అన్నాను నేను ఆవేశంలో, మాటల ప్రవాహంలో. ఆయన నన్ను కించిత్ చమత్కార పూరితమైన, దయార్ద్రమైన చూపుల్తో చూశారు; ఆ చూపుల ముందు నేనొక తెలివితక్కువ పసిపిల్లలా అనిపించాను. మీరాబెహెన్ వెంటనే హెచ్చరిస్తున్నట్టుగా: 'ఆయన కోరుకునేది ఏమిటో మీకు తెలుసుగా— నూలు వడకడం!' అన్నారు.

ఎంత నిర్లక్ష్యమైన మాటల ప్రవాహం నాది! ఏనాడూ చేయలేని, చేయబోని వాగ్దానం చేసేశాను! తానొక ఒకవేళ మౌనవ్రతంలో లేకపోయినా సరే, ఇలాంటి తొందరపాటు వాగ్దానాలు నెరవేర్చమని గాంధీ పట్టుబట్టరని నాకు తెలుసు, అంతటి వివేకి ఆయన.

విచిత్రంగా, ఒక మంచి చిత్రం గీశాననే సంతోషంలోనే ఉన్నప్పటికీ, ఆయన స్థాయి నుండి నేను కిందకు దిగజారిపోయినట్టు అనిపించింది! ఏదో సంజాయిషీ ఇచ్చుకోవాలనీ, వివరించాలనీ అనిపించింది, కానీ మౌనంగానే ఉండిపోయాను. నా వెర్రి వాగ్దానం గురించిన మాటలతో ఆయన ప్రశాంత మౌనానికి ఎందుకు అంతరాయం కలిగించడం?

చేతులు జోడించి నుదుటికి ఆనించి ప్రణామం చేసి, వంగి వీడ్కోలు తీసుకున్నాను.

రేపు పొద్దున్న తొమ్మిదింటికి మళ్లీ రావాలి.

వరండాలో నా చిత్రలేఖనం చూడటానికి జనం వేచి ఉన్నారు. మరిన్ని ప్రశంసలు. గాంధీజీ ప్రయాణించిన మోటారు కారులోనే నన్ను ఎక్కించి సాగనంపారు; నా ఇతర సామగ్రితో ఒక వాలంటీరు నా వెంటే ఉన్నాడు, ఇంటికి తీసుకెళ్లి భద్రపరిచేదాకా అమూల్యమైన ఆ చార్ కోల్ డ్రాయింగు చెరిగిపోకుండా నా చేతుల్లోనే పెట్టుకున్నాను.

చివరి వీడ్కోలు పలుకులు నా చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి: 'ఇప్పటివరకు ఏ కళాకారుడూ గీయని విధంగా ఆయన రూపం అద్భుతంగా గీశారు!'

వెన్నమీగడలు మెక్కిన పిల్లిలా మురిసిపోతూ, నాలో నేనే నవ్వుకుంటూ, ఏదో తెలియని ఉద్వేగంతో ఆ సంధ్యకాంతిలో ఇంటికి ప్రయాణమయ్యాను.

నా డైరీ విశేషాలు ఇంతటితో ముగిశాయి. కానీ ఆ రోజు కేవలం ఆనందోత్సాహాల తోనే ముగిసిపోలేదు. గాంధీ పర్యటన వెనుక ఉన్న ఒక హాస్యాస్పదమైన చీకటి కోణాన్ని కూడా నేను చూడవలసి వచ్చింది. నా మిత్రుడి ఇంట్లో భోజనం ముగిశాక ఒక అనధికారిక సమావేశం జరిగింది. అక్కడ తీవ్రమైన ఆందోళన నెలకొనింది. వసూలైన నిధులు ఖర్చులకి ఏమాత్రం సరిపోవడం లేదు!

గాంధీ బృందానికి అయ్యే సమస్త ఖర్చులూ, చివరకు తర్వాతి మజిలీ అయిన మద్రాసు (వెయ్యి మైళ్లకు పైగా దూరం) వెళ్లే రైలు చార్జీలతో సహా అంతా ఆ పట్టణమే భరించవలసి ఉంటుందట! శాసనసభలో ఒక రాజకీయ పార్టీకి విప్‌గా ఉన్న నా మరో మిత్రుడి ముఖం మరీ చిన్నబోయింది. ఆయనది గాంధీకి మద్దతు ఇచ్చే పార్టీ కాదు. చిత్తశుద్ధి కంటే కూడా గొప్పల కోసమే అందరికంటే ఎక్కువగా నూరు రూపాయలు చందా ఇస్తానని హామీ ఇచ్చారు. తీరా చూస్తే గాంధీ సొంత అనుచరుల్లోని అత్యంత ధనవంతులు కూడా పదిరూపాయలకు మించి ఇవ్వలేదని తెలిసి ఆయనకు తీవ్రమైన ఏహ్యాభావం కలిగింది!

వెంటనే కొంతమంది వసూలుదారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. మరుసటి రోజు ఉదయం పట్టణమంతా తిరిగి పరిచయస్తుల ఇళ్లకు వెళ్లి వెండి రూపాయలు రాకపోతే కనీసం రాగి పైసలైనా సేకరించాలని నిర్ణయించారు! గాంధీజీ పట్ల ఎంతో భక్తిభావం ప్రకటించే ఈ మేధావులైన పురుషులు, గాంధీజీ యోగక్షేమాలు చూడటానికి మహిళల్ని రానివ్వలేదు గానీ, చందాలు వసూలు చేయడానికి మాత్రం కొందరు స్త్రీలను పంపించారు!

మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో నేను గాంధీజీ వద్దకు వెళ్లాను. ఆయన ఇంకా మౌనవ్రతంలోనే ఉన్నారు; చుట్టూ ఫైళ్లూ, పుస్తకాలూ, కాగితాలూ చెల్లాచెదురుగా పడి ఉండగా తన 'యంగ్ ఇండియా' పత్రిక కోసం శ్రద్ధగా రాసుకుంటున్నారు. ఉదయపు ప్రార్థనల కోసం సిద్ధం చేసిన బంతిపూల

మాలా, జపమాలా కూడా అక్కడే ఉన్నాయి. నేను నిశ్శబ్దంగా కూర్చుని ఆయన వాటర్‌కలర్ చిత్రం గీయడం మొదలుపెట్టాను.

కాసేపటి తర్వాత ఆయన పాలు, పండ్లు మాత్రమే తీసుకున్నారు. ఆ తర్వాత ఉత్తరాలు చూశారు, సందేశాలు స్వీకరించారు, ఇతరులు చెప్పిన సమాచారం విన్నారు; కానీ కేవలం సైగలతోనో, కాగితం ముక్కలమీద రాస్తో మాత్రమే బదులిస్తూ వచ్చారు.

నిన్నటిలాగే ఒక డాక్టర్ వచ్చి రక్తపోటు పరీక్షించారు. 200! ఒక్కసారిగా కలకలం! బిగ్గరగానూ గుసగుసగానూ తీవ్ర చర్చలు. ఆ పరికరం సరైనదేనా? దాన్ని చివరిసారిగా ఎప్పుడు వాడారు? యాభై వేల జనాభా ఉన్న ఈ పట్టణంలో ఉన్నది ఇదొక్కటే పరికరమా? లేదు, ఫలానా ఫలానా డాక్టర దగ్గర కూడా ఉండొచ్చు! హడావుడిగా మరో డాక్టర్ని పిలిపించారు, ఆ తర్వాత ఇంకొకరు వచ్చారు. పరిచారకుల్లో గాంధీజీ ఆరోగ్యం పట్ల నిజమైన ఆందోళన కనిపిస్తోంది.

నిశ్శబ్దంగా ఉన్న గాంధీజీ మాత్రం వారి ఆందోళన నిండిన చూపులకు ప్రశాంత మందహాసాల్తోనే బదులిస్తున్నారు. సాయంత్రం జరగవలసిన భారీ బహిరంగ సభ రద్దు చేయాలని వారు అనుకున్నారు. (కానీ చివరికి ఆ సభ జరిగింది; గాంధీ అక్కడ ఒక బల్లమీద వేసిన కుర్చీలో కూర్చుని అపార జనసందోహానికి దర్శనమిచ్చారు, మాట్లాడేంత ఓపిక లేకపోవడంతో ఆయన తరఫున మరొకరు ప్రసంగించారు.)

ఆ తర్వాత గాంధీజీ, నేనూ మళ్లీ ఆ నిశ్శబ్ద మందిరంలో కూర్చున్నాం; ఆయన రాట్నం చేసే ఝుంకారమూ, నా పెన్సిల్ చేసే శబ్దమూ తప్ప మరేమీ వినిపించడం లేదు. హఠాత్తుగా తలుపు ముందర ఏదో బలంగా ఊడుస్తున్న శబ్దం వినిపించింది. తీరా చూస్తే, ఒక ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తి చేతిలో చీపురు పట్టుకుని, ఎవరైనా చూస్తున్నారా అని పక్కచూపులు చూస్తూ ఎంతో శ్రద్ధగా వరండా నేల ఊడుస్తున్నాడు. తనను తాను ఒక విశ్వసనీయ శిష్యుడిగా బాహాటంగా ప్రదర్శించుకుంటున్న ఆ ఉన్నత కులస్తుడిని గాంధీజీ చిన్న చిరునవ్వుతో గమనించారు! సూత్రాల్ని ఉల్లంఘించేవాళ్లని తప్ప మిగతా అన్నింటినీ చూస్తూ, గమనిస్తూ క్షమించే వ్యక్తి గాంధీ. కానీ అంతగా క్షమించలేని ఈ విషయాన్ని నేను ఆ తర్వాత ఒక స్నేహితుడితో పంచుకున్నాను. 'పైపై మాటలూ, కపట సంస్కరణలూ!' అన్నాన్నేను.

'అబ్బే, అదేం కాదు' అంటూ నవ్వుతూ నా హిందూ మిత్రుడు అన్నాడు 'మీరనుకుంటున్నట్టు ఆ వ్యక్తి జీవితంలో మొదటిసారీ చివరిసారీ చీపురు పట్టడం

లేదు. పనివాళ్లను పెట్టుకోలేనంత పిసినారి వాడు. గాంధీ దృష్టిలో మంచి మార్కులు కొట్టేయడానికీ, జేబుకు డబ్బు మిగలడానికీ పనికొచ్చే ఇలాంటి సంస్కరణలు కొనసాగించడానికి మాత్రం అతడు తప్పకుండా సంతోషిస్తాడు!'

కపటత్వం కూడా గాంధీ ఆధ్యాత్మిక ఆదేశాలకు తలొగ్గుతోందన్నమాట!

మధ్యాహ్నం సరిగ్గా ఒంటిగంటకు, పక్కనే ఉన్న గడియారం ఒకసారి చూసుకుని గాంధీ మాట్లాడటం మొదలుపెట్టారు. గాంధీ వ్యక్తిత్వానికే ప్రతీకగా నిలిచిన సుదీర్ఘమైన ఆ మౌనాన్ని— ఆ ప్రశాంతతనీ ఏకాంతాన్నీ— హఠాత్తుగా ఛేదించడం నాలో ఒక వింత ప్రభావం చూపించింది. కానీ ఆయన స్వరం వినిపించగానే, ఆయనలోని ఎంతో ఆప్యాయమైన మానవీయ గుణాలు సరికొత్తగా ఆవిష్కృతమయ్యాయి.

ఆయన మొదట చేసిన పనుల్లో ఒకటి— కాస్త హాస్యమూ నిశ్చింతా మేళవించిన చూపుల్తో ఒక టెలిగ్రామ్ డిక్టేట్ చేయడం. ఎంతోమంది సమక్షంలోనే అది జరిగింది కాబట్టి, నాకు గుర్తున్నంతవరకు దాన్నిక్కడ రాయడం నమ్మకద్రోహం కాదని భావిస్తున్నాను. తన భార్యకు పంపిన ఆ సందేశంలో, తాను దత్తత తీసుకున్న అంటరాని పిల్ల శాంతిని ప్రేమగా ప్రస్తావిస్తూ, పర్యటన ప్రణాళికలు తెలియజేస్తూ, చివరగా తన ఆరోగ్యం గురించి ఇలా రాశారు: 'తాజా రీడింగ్ 160, అంతకుముందు రీడింగులు 170 మరియు 200. ఏది కావాలో మీరే ఎంచుకోండి. ముగ్గురు డాక్టర్లు, మూడు పరికరాలు, మూడు రీడింగులు— మీరే నిర్ణయించుకోండి. నేనెప్పటిలాగే ఉత్సాహంగా ఉన్నాను. ప్రేమతో.'

మిగిలిన సమయంలో నా మనసు సగం చిత్రలేఖనం మీదా, సగం ఆయన్ను కలవడానికి వస్తున్న సందర్శకులతో ఆయన జరుపుతున్న చర్చల మీదా ఉంది. తనను విమర్శిస్తున్నప్పుడూ, ఉచిత సలహాలు ఇస్తున్నప్పుడూ కూడా ఆ చర్చల్లో ఆయన సమతుల్యమైన వివేకమూ, సహనమూ, స్పష్టతా ఒక్క క్షణం కూడా లోపించలేదు.

నాకు గుర్తున్న వాటిలో ఒక చర్చ ప్రత్యేకంగా గుర్తుంది. గాంధీ ఒక నిర్దిష్ట ఆలయాన్ని సందర్శిస్తారా అన్నది ప్రశ్న. దానికి సమాధానంగా ఆయన ఇటీవల తనకు ఎదురైన ఒక అనుభవాన్ని (బాలేశ్వర్‌లో అనుకుంటా) ప్రస్తావించారు. ఎప్పటిలాగే సనాతనవాదులతో మాట్లాడుతూ వివక్షల్ని పక్కనపెట్టమనీ, నిజమైన హిందూమతం ఎవరినీ దూరం పెట్టదనీ ఆయన వాదించారు. కానీ ఆయన ఆ స్థానిక ఆలయానికి

వెళ్లలేదు. చివరకు ఆ ఆలయ పూజారుల బృందం వచ్చి, ఆలయాన్ని దర్శించి ఆశీర్వదించవలసిందిగా వేడుకుంది. తన వెంట తన మిత్రులైన మీరాబెహెన్ (మిస్ స్లేడ్), రెవరెండ్ ఆండ్రూస్‌లను రానిస్తారా అని గాంధీ అడిగారు. కుదరదు, వారు విదేశీయులు కదా అన్నారు పూజారులు.

'వారు నా సోదరీ సోదరులు; వారిని లోపలికి అనుమతించకపోతే నేను కూడా రాను' అన్నది గాంధీ ఇచ్చిన అంతిమ సమాధానం.

ఎట్టకేలకు నా చిత్రం పూర్తయింది. అది అందరి చేతులూ మారి గాంధీ చేతికి చేరింది. ఆయన దాన్ని చూశారు; కాస్త బిడియపడ్డారని నాకు అనిపించింది (ఆయన ఎన్నడూ అద్దం చూసుకోరు, ఆయనలో స్వాతిశయం ఏ కోశానా లేదు.) తర్వాత నా వైపు తిరిగి, 'నన్ను ఇన్ని గుడ్డల్తో ఎందుకు కప్పేసావు?' అనడిగారు.

'గాంధీజీ, ఆ శాలువా మీరప్పుడు వేసుకునే ఉన్నారు!' అన్నాను. (ఉదయం వేసుకున్న ఆ వెచ్చని దుస్తులు ఆయనప్పటికే తీసేశారు). పక్కనే ఉన్న మీరాబెన్ వైపు ఆయన అనుమానంగా చూశారు, ఆమె నా మాట నిజమని ధ్రువీకరించారు.

చలిగా, అనారోగ్యంగా ఉన్నప్పుడు అదనపు దుస్తులు కప్పుకున్నారన్న సంగతి కూడా ఆయనకు సరిగ్గా గుర్తులేదని నాకనిపించింది; అనుకోకుండా కప్పుకున్న ఆ వస్త్రాలు చిత్రంలో చాలా ఆడంబరంగా ఉన్నాయని ఆయన భావించారు. కానీ దాని గురించి మరింత చర్చించే ఆసక్తి మటుకు ఆయనకు లేకపోయింది.

దానికి బదులుగా, ఆయన కాసేపు నాతో మాట్లాడారు; నా వివాహం గురించీ, ఒరిస్సా అటవీ ప్రాంతాల్లో నా భర్త చేస్తున్న శాస్త్రీయ వ్యవసాయ ప్రయోగాల గురించీ తెలుసుకోడానికి ఎక్కువ ఆసక్తి చూపించారు. వాటిగురించి ఎన్నో నిశితమైన ప్రశ్నలడిగారు. ఆ తర్వాత ఆయన కోసం నేను 'ఏదైనా' చేస్తానన్న నా వాగ్దానం సరదాగా గుర్తుచేశారు; వెంటనే నూలు వడకడం గురించి మా మధ్య సుదీర్ఘ చర్చ మొదలైంది.

నేను నూలు వడుకుతానా అనడిగారు. బొమ్మ గీయడానికి విరామం దొరికిన సమయాల్లో ఏకుల్తోనూ, కదురుతోనూ నేను కాలక్షేపం చేశానని ఆయనకెవరో చెప్పారు. దేశాయ్ నాకు నేర్పడానికి ప్రయత్నించారు కానీ నేనో మొద్దుని.

'లేదు గాంధీజీ, ఒక సిద్ధాంతంగా నేను దీన్ని నమ్మడం లేదు కాబట్టి నూలు వడకలేను' అన్నాను. 'కానీ అన్ని జాతులకూ, అన్ని దేశాలకూ స్వేచ్ఛ ఉండాలన్న ప్రాథమిక భావననైతే నువ్వు నమ్ముతావు కదా' అన్నారు. అలాంటప్పుడు, కనీసం ఒక ప్రతీకగానైనా పూర్తిగా ఖద్దరు బట్టలే వాడవచ్చు కదా అని అడిగారు.

'లేదు, ఆ వాగ్దానం కూడా నేను చేయలేను, ఎందుకంటే విదేశీ వస్త్రాలపట్ల వివక్ష చూపడానికి నా దగ్గర కారణమేమీ లేదు. అయితే రాజకీయ కారణాల వల్ల కాకపోయినా, అందమైన అద్దకం నమూనాలు నా కళాదృష్టిని ఆకట్టుకున్నందున నేను చాలావరకు ఖద్దరే వాడుతున్నాను' అన్నాను.

గాంధీ కళ్లల్లో క్షణకాలం వేదనా, నిరాశా మెరిశాయి; ఆయన దృష్టిలో చేనేతకు ప్రగాఢమైన ఆర్థిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది; ఎవరైనా దాన్ని కేవలం కళాత్మక దృష్టితో మాత్రమే చూడటం ఆయనకు పైపై వ్యవహారంగా, బాధ్యతారాహిత్యంగా అనిపించి ఉండవచ్చు. ప్రగాఢ విశ్వాసాలూ, ధైర్యమూ లోపించడం గురించీ— భారతదేశంలో అలాంటి స్ఫూర్తి కరువవుతోందని విచారిస్తూనూ ఆయన మాట్లాడారు.

మా చర్చ ఒక విధమైన విషాదంతో ముగిసింది; నాలో ఒక విచిత్రమైన అసంతృప్తి మిగిలింది. మేధాపరంగా ఆయన ఆర్థిక ప్రణాళిక నన్ను ఆకట్టుకోలేక పోయింది. కానీ ఆధ్యాత్మికంగా ఆయన నాకంటే ఎన్నో లోకాల ఎత్తులో ఉన్నారని పించింది. సముద్రపు అలలు కొండ అంచుల్ని తాకి ముందుకు సాగిపోయినట్టు, నేనూ ఈ భౌతిక పురోగతి ప్రపంచమూ ఆయనను దాటి వెళ్లిపోతున్నామనిపించింది. సూర్యకాంతిలో అలలు ఒక్క క్షణం మెరిసి శాశ్వతంగా అంతరించిపోతాయి, కానీ ఆ కొండ మాత్రం ఎప్పటికీ నిశ్చలంగా, ప్రశాంతంగా నిలిచే ఉంటుంది.

ఆ రోజు సాయంత్రం చీకటి పడ్డాక, తలుపులు గట్టిగా మూసిన బండ్లు కొన్ని గాంధీ బస చేసిన పెద్ద ప్రాంగణంలోకి వచ్చాయి; బోయీలు లయబద్ధంగా పాటలు పాడుతూ పరదాలు కట్టిన పల్లకీల్ని లోపలికి మోసుకొచ్చారు; ఆ వాహనాల్లోంచి స్త్రీలు దిగారు. తలలు వంచి, ముసుగులు బిగించి, కాళ్ల కడియాలూ చేతి గాజులూ సవ్వడి చేస్తుండగా బయటి గదుల్లో ఉన్న మగవాళ్ల గుంపును దాటుకుంటూ మెట్లెక్కి మీదకు వెళ్లిపోయారు. ఎంతోమంది మగవాళ్లు గుమిగూడిన ఒక ఇంటికి ఇలా ముసుగులు ధరించి రావడం కూడా వారికి ఒక పెద్ద సాహసమే, ఒక నూతన విప్లవమే. ఆ క్షణంలో వారి గుండెలు ఎంతో సంకోచంతో కొట్టుకున్నాయి.

కానీ ఆ మహానుభావుడి దర్శనం కోసమూ, ఆయన దివ్య స్వరాన్ని వినడం కోసమూ మాత్రమే కటక్‌కు చెందిన ఆ మహిళలు పరదా సంప్రదాయపు కఠోరమైన కట్టుబాట్లు తెంచుకుని వచ్చారు. వందమందికి పైగా స్త్రీలు ఆ డాబామీద సమావేశ మయ్యారు. ఆ వెన్నెల వెలుగులో తమ ముఖాలమీది ముసుగులు తొలగించి,వారు ఆ మహాత్ముని అమృతవాక్కులు ఎంతో ఏకాగ్రతతో విన్నారు— ఒక పరాయి మగవాడి ముందు తమ ముఖాన్ని చూపించడం వారిలో చాలామందికి జీవితంలో అదే మొదటిసారి! మహాత్మాజీ ప్రభావం అలాంటిది; శతాబ్దాలుగా మూతపడి ఉన్న తలుపుల్ని ఆయన తెరిపిస్తారు. ఒక తండ్రిలా మందలిస్తూ, ప్రోత్సహిస్తూ, హితవు పలుకుతూ ఆయన వారితో మాట్లాడారు. పాత సంప్రదాయాల్నీ, కట్టుబాట్లనీ, స్తబ్ధతనీ విదిలించి పారెయ్యమనీ, తమ నాలుగు గోడల ఇళ్ల కంటే ఉన్నతమైన గృహం కోసం— భరతమాత కోసం— ఆలోచించమనీ, అనుభూతి చెందమనీ, పనిచేయమనీ వేడుకున్నారు.

తన్మయత్వంతో కూర్చున్న ఈ మహిళల్లో ఎక్కువమంది ఆ రాత్రి గడిచిన తర్వాత, మళ్లీ భయపడుతూ తమ అంతఃపురపు సురక్షితమైన చీకటి గదుల్లోకి జారు కుంటారని నాకు బాగా తెలుసు; కానీ ఆ రాత్రి వారి హృదయాల్లో మీటిన కొత్త తంత్రులు మాత్రం ఇక ఎన్నటికీ మూగబోవు. గాంధీ వాక్కుకున్న మహిమ అలాంటిది.

మేమంతా లేచాం, నేను మరోసారి మహాత్మాజీకి వీడ్కోలు పలికాను. ఏదో ఒక రోజు తన ఆశ్రమానికి రమ్మని ఆయన నన్ను మళ్లీ ఆహ్వానించారు. నేను కృతజ్ఞతలు తెలిపాను, కానీ ఆయన సాన్నిహిత్యం కలిగించిన తీవ్ర స్పృహ వల్ల కాబోలు— అది మాత్రం ఎన్నటికీ జరిగే పనికాదనీ, ఆ మహోన్నత ఆత్మతో నా బంధం అక్కడితో ముగిసిందనీ నా అంతరంగంలో బలంగా అనిపించింది.

కానీ వెన్నెల కురుస్తున్న ఆ డాబామీద ఉన్న ముసుగుల స్త్రీల విషయంలో మాత్రం అది నిజం కాదు. వారిలో చాలామంది నాకు పరిచయస్తులే, కొందరైతే సన్నిహితులు కూడా. నా ఏడేళ్ల పరిచయంలో, వారిలో కొందరు సంప్రదాయాలను ఛేదించడానికి వేసిన అడుగులు, మా పాశ్చాత్య స్త్రీలు తమ సొంత సమాజంమీద చూపించ వలసిన ధైర్యం కంటే ఎంతో గొప్పవి. నేను దగ్గరున్నా, దూరమున్నా నా ప్రేమానురాగాలు ఎల్లప్పుడూ వారితోనే ఉంటాయి.

ఈ సంఘటన చూశాక,అసహనంతో ఉండే పాశ్చాత్య ప్రపంచానికి, సంప్రదాయ బద్ధమైన ఒక ప్రాచ్య మహిళ ముసుగు తొలగించి బయటకు రావడమంటే ఎంతటి

సాహసమో తెలియజెప్పాలని నాకు మరోసారి అనిపించింది. మన పాశ్చాత్యుల్లో ఒకరు వేశ్యావాటికలోకి వెళ్లి, యావత్ ప్రపంచానికి వినబడేలా 'నేను కూడా ఈ స్త్రీలతో సమానమే!' అని ప్రకటించడం ఎంత తీవ్రమైన విషయమో అదంత తీవ్రమైన విషయం!

ఓలివ్ ష్రైనర్ తన అద్భుత స్వప్న వృత్తాంతంలో వర్ణించినట్టు— స్వచ్ఛందంగా మరకలంటిన వస్త్రాలు ధరించి, సమాజం వెలివేసిన తన సోదరిని ఆసరాగా పట్టుకుని భగవంతుని సింహాసనం వైపు సాగే స్త్రీ తాలూకు ధైర్యాన్నీ, ఏకత్వ భావననూ అక్షరాల్లో చిత్రించడం ఒక ఎత్తు; సూర్యుడు కూడా తన ముఖాన్ని చూడలేదన్న మాటే తమకు గొప్ప గర్వకారణమని నమ్ముతూ, తమ తండ్రీ, సోదరుడూ, భర్త తప్ప పరాయి పురుషులెదుట ముఖం చూపేవాళ్లు కేవలం వేశ్యలు మాత్రమేనని నమ్ముతుండే ఒక సంప్రదాయ గృహస్థ మహిళ, వాటన్నింటినీ దాటుకుని బయటకు వచ్చే ధైర్యాన్ని కూడగట్టుకోవడం నిత్య జీవితంలో పూర్తిగా మరొక ఎత్తు!

ఈ అద్భుతాన్ని గాంధీజీ సుసాధ్యం చేస్తున్నారు. స్త్రీల హక్కుల గురించో, స్వేచ్ఛ గురించో, వ్యక్తిగత ఎంపికల గురించో ఉపన్యసించడం ద్వారా కాదు— శతాబ్దాలుగా సేవనూ త్యాగాన్నీ మాత్రమే సౌందర్యంగా నమ్ముకున్న భారతీయ స్త్రీత్వానికి అలాంటి స్వార్థపూరిత భావనలు నచ్చవు. భరతమాత దాస్య విముక్తి అనే మహోన్నత, నిస్వార్థ పరమలక్ష్యాన్ని వారి ముందుంచడం ద్వారానే ఆయన ఈ మహత్కార్యం సాధిస్తున్నారు. ●

(**ఫ్రీడా హౌస్‌వర్త్** (1886-1974) చిత్రకారిణి, రచయిత్రి, ఇలస్ట్రేటర్. స్విట్జర్లాండ్‌లో జన్మించిన ఈమె, బర్కిలీలో భారతీయ విద్యార్థి సారంగధర దాస్‌ను కలిసి వివాహం చేసుకుని ఒరిస్సా వచ్చారు. ఆమె రచనల్లో 'ఎ మ్యారేజ్ టు ఇండియా', 'లీప్‌హోమ్ అండ్ జెంటిల్‌బ్రాన్', 'ఇన్‌టు ది సన్' ముఖ్యమైనవి.)

## వాంఛానిధి పట్నాయక్

# గాంధీకి నారింజ పండ్లు

1927 చివరి రోజుల్లో మహాత్మా గాంధీ ఖద్దరు ప్రచారం కోసం ఒరిస్సా వచ్చారు. అప్పటి ఒరిస్సా ఖాదీ బోర్డు ఛైర్మన్ నిరంజన్ పట్నాయక్ ఆయన్ను ఆహ్వానించారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఆయనే స్వయంగా చూసుకున్నారు. ఒరిస్సాలో 'గాంధీ సమాచార్' పేరిట మొట్టమొదటి దినపత్రికని కూడా ఆయనే నడిపేవారు. మా ఊరు గోబరాలో గాంధీజీని సత్కరించాలని నేననుకున్నాను. నేనేమో ప్రభుత్వ ఉద్యోగిని. కాబట్టి స్వయంగా ఏ పనీ చేయలేని పరిస్థితి. నా సహాధ్యాయి, గంగాపూర్ ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ కాశీనాథ్ పాల్‌ను పట్టుకున్నాను. కొందరు సభ్యులతో ఒక కమిటీ వేసి, దానికి 'అభ్యర్థనా సమితి' అని పేరు పెట్టాం. కాశీనాథ్ బాబు దానికి అధ్యక్షుడయ్యారు. మేమిద్దరం విరాళాల సేకరణ కోసం పల్లెటూళ్లు తిరగడం మొదలుపెట్టాం. మా సొంత రాట్నాలమీద వడికిన నూలుతో చిన్న చిన్న వస్త్రాలూ, మహాత్మా గాంధీకి బహూకరించడానికి ఒక శాలువా నేయించాం.

1927 డిసెంబర్ 6న గాంధీజీ అస్కా, రసూల్‌కొండలు సందర్శించవలసి ఉంది. దారిలో గోబరా దగ్గర ఆగడం ఆయన పర్యటన ప్రణాళికలో లేదు. కానీ మేం అంతకుముందే ఒక భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లూ చేసేశాం. కాళీయంబా నదీ తీరానికీ, బడికీ మధ్యనున్న స్థలంతో పాటు, అటు బాసుదేవ్‌పూర్, ఇటు గోబరా గ్రామాల పొలిమేరలు కూడా జనంతో కిక్కిరిసిపోయాయి. నాలుగు రోడ్ల కూడలిమీద ఒక వేదిక నిర్మించాం. ఆ ప్రయోజనం కోసమే ప్రత్యేకంగా కేటాయించిన చోట కొందరు పల్లెటూరి మహిళలు నూలు వడకడంలో మునిగిపోయారు. 'మీరు గాంధీజీకి ఎంత మొత్తం సమర్పించగలరు?' అని నిరంజన్ బాబు మమ్మల్ని ఎప్పుడూ అడుగు

తుండేవారు. చివరి నిమిషం దాకా మేం చందాలు వసూలు చేస్తూనే ఉండటంతో, ఎంత మొత్తం సమర్పించగలమో ఖచ్చితంగా ఆయనకు చెప్పలేకపోయాం.

గోబరాలో ఆగడం గాంధీజీ ప్రణాళికలో లేదు. గాంధీజీ కారు రాకముందే ఒకటి రెండు కార్లు మా ఊరి మీదుగా వెళ్లిపోయాయి. గాంధీజీ ఆ కారుల్లో గాని ఉన్నారేమోనన్న భ్రమతో జనం నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు. తీరా గాంధీజీ కారు వచ్చేసరికి, జనం తమ ఉత్సాహాన్ని కోల్పోయారు. అంతకుముందు వెళ్లిన కార్లలాగే ఇదీ వెళ్లిపోతుందేమోననుకుని ఎవరూ జయజయధ్వానాలు చేయలేదు. పైగా అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. గాంధీజీ కారు వచ్చి ఆగగానే, మేమంతా పూలమాల వేయడానికి ఆయన దగ్గరకు వెళ్లాం. 'గోబరానా? ఇక్కడ ఆగడం నా పర్యటనలో లేదే?' అంటూ ఆయన ఆశ్చర్యపోయారు. ఆయన ప్రశ్నకు అభ్యర్థనా సమితి అధ్యక్షులు శ్రీ కాశీనాథ్ పాల్ విన్నవించుకుంటూ, 'లేదు బాబూ, మీరు ఇక్కడ తప్పక దిగాలి. ఇది పల్లె ప్రజల సభ; పట్టణాల్లో ఇలాంటి సభికులు మీకు దొరకరు' అన్నారు. 'ఓహో, నన్ను బలవంతంగా ఆపుతున్నారన్నమాట' అంటూ గాంధీజీ కారు దిగి నడుచుకుంటూ వేదిక మీదికి వచ్చారు. ఆయనకు పూలమాల వేసి, కొన్ని నూలు వస్త్రాలూ, మూడు వందల రూపాయల నగదూ సమర్పించారు. నేను అంతకుముందే అచ్చువేయించిన సన్మానపత్రాన్ని తర్వాత వేలం వేశారు. ఆయనకు సమర్పించిన కానుకల్లో కొన్ని నారింజ పండ్లు కూడా ఉన్నాయి. గాంధీజీ వాటిని చేతుల్లోకి తీసుకుని, 'చిన్న పిల్లలకి, చిన్న పిల్లలకి ఇవ్వండి' అన్నారు. అప్పుడు అయిదారునిమిషాల పాటు సభనుద్దేశించి మాట్లాడారు.

సాధారణంగా ప్రతి సభలోనూ గాంధీజీ ప్రసంగాన్ని రాజకృష్ణ బోస్ అనువదించే వారు. కానీ ఆయన కారు రావడం కాస్త ఆలస్యమైంది. దాంతో నిరంజన్ బాబు గాంధీజీ ఉపన్యాసాన్ని అనువదించడం మొదలుపెట్టారు. సరిగ్గా అదే సమయానికి రాజకృష్ణ బాబు వచ్చారు. ఆయన్ను చూడగానే గాంధీజీ, 'ఓహో! నా అనువాదకుడు వచ్చేశాడు' అన్నారు. వెంటనే రాజకృష్ణ బాబు మిగిలిన ప్రసంగం అనువదించడం మొదలుపెట్టారు. బ్రిటన్‌కు చెందిన మిస్ స్లేడ్ అనే మహిళ ఒకామె గాంధీజీ ఆశ్రమంలో ఉంటుండేవారు. గాంధీజీ ఆమె పేరు 'మీరా' అని మార్చారు. కాంగ్రెస్ నాయకులు ఆమెను 'మీరా బెహెన్' అని పిలిచేవారు. ఆమె కూడా గాంధీజీ వెంటే ఉన్నారు. ఆమెను ప్రతి ఒక్కరూ ఆశ్చర్యంతోనూ, ఆరాధనాభావంతోనూ చూశారు.

ప్రజల నుండి విరాళాలు సేకరించే క్రమంలో మేం మందర గ్రామానికి చెందిన నారాయణ్ పండా దగ్గరకు వెళ్లాం. ఆయన కాశీనాథ్ పాల్‌కు స్వయానా తాతగారు. 'ఏరా! గాంధీ పండ్లు తింటాడనుకుంటా కదా? మా తోటలో కాసిన తాజా పండ్లు ఆయనకిస్తాను' అన్నారు. ఆయన లేచి వెళ్లి ఒక కాశీమద్ది పండు తెచ్చి, మాకో ముక్క తినడానికిచ్చారు. 'ఇంత రుచికరమైన కాశీమద్ది పండు గాంధీ తన జీవితంలో ఎప్పుడైనా తినుంటాడా?' అన్నారు. ఆ పండ్లు నిజంగానే చాలా రుచిగా ఉన్నాయి. ఆయన విరాళమేమీ ఇవ్వలేదు. ఆయన దగ్గరనుంచి కేవలం ఐదారు కాశీమద్ది పండ్లతోటే మేం సరిపెట్టుకోవలసి వచ్చింది.

గాంధీజీ రావడానికి ఇంకాస్త సమయం ఉంది. ఏయే దాతలు ఎంతెంత ఇచ్చారో, మొత్తం ఎంత డబ్బు పోగయిందో సభలో అందరికీ వెల్లడించమనీ, చివరగా మందర గ్రామానికి చెందిన నారాయణ్ పండా మాత్రం ఏమీ ఇవ్వలేదన్న విషయం కూడా చెప్పమనీ కాశీనాథ్‌తో అన్నాం. నేను ఆ మాట అన్న వెంటనే పండా ఐదు రూపాయలు తీసి విరాళంగా ఇచ్చారు. గాంధీజీ మా దగ్గర వీడ్కోలు తీసుకున్నాక, ఆయన్ను సాగనంపడానికి రోడ్డు దాకా వెళ్లాం. ఆ సమయంలో పండా జనం మధ్య లోంచి గబుక్కున ముందుకు దూకి, ఆ నారింజ పండ్లు జేబుల్లో కుక్కుకుని వేగంగా జారుకోబోయారు. ఆయన చేస్తున్న పని గమనించి మేం అడ్డుకున్నాం. వీటిని చిన్న పిల్లలకే ఇవ్వాలని గాంధీజీ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశాం. అప్పుడాయన దగ్గరున్న నారింజ పండ్లు బలవంతంగా గుంజుకుని పిల్లలకి పంచిపెట్టాం. ●

(**వాంఛానిధి పట్నాయక్** (1901-1988) కవి, సంఘసేవకుడు. ఆయన రాసుకున్న ఆత్మకథ 'మో కథ' 1988లో భువనేశ్వర్‌లోని పూజ్యపూజా ఒరిస్సా వారు ప్రచురించారు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన ప్రజ్ఞా పారమితా పాణిగ్రాహి భువనేశ్వర్‌లోని ఉత్కళ విశ్వవిద్యా-లయం, దూరవిద్య విభాగంలో అధ్యాపకురాలు.)

# గోవింద చంద్ర మిశ్రా

# గాంధీ పంపిన సందేశం

**ఆ** ఏడాది మహాత్మా గాంధీ ఒరిస్సాకు రావలసి ఉంది. ఆయన చేతుల మీదుగానే ఆశ్రమానికి శంకుస్థాపన చేయించాలనుకున్నాను. నవంబర్ 15 నుంచి నెల రోజుల పాటు ఆయన ఒరిస్సాలోనే ఉంటారని అనుకున్నారు. కానీ ఆయనకు వేరే అత్యవసరమైన పనులు ఉండటంతో అది వీలవ లేదు. డిసెంబరులో మాత్రమే రాగలననీ, ఒరిస్సాలో ఇరవై రోజులకు మించి గడపలేననీ ఆయన రాశారు.

అఖిల భారత చరఖా సంఘానికి మద్దతుగా గాంధీజీ పర్యటిస్తున్నారు. బాబు నిరంజన్ పట్నాయక్ ఈ చరఖా సంఘం ఒరిస్సా విభాగానికి ఏజెంట్‌గా ఉండేవారు. ఖద్దరు గురించీ, చరఖా గురించీ ప్రచారం చెయ్యడం కోసమే మహాత్ముడు ఒరిస్సా వస్తున్నారు. ఆ వ్యవహారాలు అక్కడ స్థానికంగా చూసుకుంటున్న నిరంజన్ బాబునే గాంధీజీ స్థానిక పర్యటన కార్యక్రమం రూపొందిస్తున్నారు.

నిజానికి గాంధీజీ ఒరిస్సా పర్యటనకు పూనుకోడానికి ముఖ్య కారణం నేనే. అయినా సరే, కనీసం నాకు మాట మాత్రమైనా చెప్పకుండా నిరంజన్ బాబు గాంధీజీ పర్యటన వివరాలు తయారుచేశారు. ఆయన రూపొందించిన ప్రణాళికలో మా ఆశ్రమాన్ని సందర్శించే ప్రస్తావననే లేదు.

ఈ సంగతి తెలిశాక నాకు చాలా బాధ కలిగింది, పట్టరాని కోపం కూడా వచ్చింది. అయినప్పటికీ మహాత్మా గాంధీ చేతుల మీదుగా ఆశ్రమ భవనం శంకుస్థాపన చేయించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేసుకుంటూ పోయాను. కట్టబోయే భవనానికి బ్లూప్రింట్ సిద్ధం చేశాం. రకరకాల సామగ్రి పోగుచేశాం.

ఆంధ్రప్రదేశ్ నుండి మహాత్మా గాంధీ ఒరిస్సా చేరుకున్నారు. ఆయన ఒరిస్సా గడ్డమీద అడుగుపెట్టగానే నేను వెళ్లి కలవాల్సి ఉంది. కానీ నేను కావాలనే వెళ్లలేదు. ఒరిస్సాలో అడుగుపెట్టిన వెంటనే మహాత్మాజీ మొదట నా కోసమే చూశారు, నా సంగతే వాకబు చేశారు. ఈ విషయం కూడా ఎవరూ నాకు చెప్పలేదు. బాణ్‌పూర్ నుండి బోల్‌గఢ్ దాకా మహాత్మాజీ మోటారు కారులో ప్రయాణించారు. బోల్‌గఢ్ వెళ్లే దారిలో ఖుర్దా వద్ద ఆయన కాసేపు ఆగారు.

నేను అక్కడికి వెళ్లి ఆయన్ను కలిశాను. నన్ను చూడగానే మహాత్మాజీ ఒక్కసారిగా, 'ఎక్కడున్నావు ఇన్నాళ్లూ? నీ కోసమే వెతుకుతున్నాను' అన్నారు.

ఆ మాట వినగానే నా నోట మాట రాలేదు. మారు మాట్లాడకుండా కారెక్కేసి బోల్‌గఢ్ వెళ్లిపోయాను. మహాత్మాజీ బోల్‌గఢ్‌లో మూడు రోజులు బస చేశారు. అక్కడి నుండి మహదేవ్ దేశాయ్, కాకా కాలేల్కర్‌లతో పాటు మేం కొంతమందిమి నయాగఢ్ విహారానికి వెళ్లాం. నయాగఢ్‌లోని ఇటామతి గ్రామాన్ని చూడగానే కాకా సాహెబ్, మహదేవ్ భాయ్ పట్టరాని ఆనందంతో పొంగిపోయారు. ఒరిస్సా పల్లెటూరి జీవనంలోని సరళత గురించీ, అందం గురించీ అక్కడ చాలాసేపు చర్చ నడిచింది.

ఒరియా సంస్కృతినీ, అక్కడి జీవన విధానాన్నీ దగ్గరగా తెలుసుకోవడానికి వాళ్లు ఇటామతిలో ఒకటి రెండు ఇళ్లల్లోకి వెళ్లి అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వేకువజామునే కళ్లాపి చల్లి, ఆ గృహిణులు ఇళ్ళు పేడతో అలికి శుభ్రం చేసుకున్న తీరు చూశారు. పశువుల పాకలు శుభ్రం చేసి, బూడిద చల్లి ఉంచారు. ఇత్తడి పాత్రలు తోమి, తళతళలాడేలా మెరుగుపెట్టి ఒక పద్ధతి ప్రకారం వరుసగా సర్ది ఉన్నాయి. ముంగిట్లో తులసికోట ఎంతో కళకళలాడుతూ కనిపించింది.

కాకా సాహెబ్ ఒక్కసారిగా పరవశించిపోతూ, 'ఈ మనుషులూ, వీళ్ల ఇళ్లూ ఎంత అందంగా, ఎంత నిష్కల్మషంగా ఉన్నాయో కదా!' అన్నారు.

కానీ ఆ అందమూ, ఆ అమాయకత్వమూ కేవలం పైపై ముసుగు మాత్రమే. వాటిలో జీవం లేదు. అంతా నిర్జీవంగా ఉంది. విచక్షణారహితమైన అణచివేత పాలన కింద గ్రామీణజీవితపు జీవధార ఇంకిపోయింది. ప్రజలు ఎంతగా భయపడి పోయి ఉన్నారంటే, వాళ్ల శరీరాల్లో ప్రాణమున్న ఛాయలే కనిపించడం లేదు. ఇటామతిలో అలాంటి దృశ్యాలు ఎన్నో చూశాం. ఎన్నో విషయాలు చర్చించాం.

నేను కూడా స్థానిక జమీందారీ సంస్థానాల ప్రాంతాల నుంచి వచ్చినవాణ్ణి కావడంతో ఆ సంభాషణ నాకు చాలా దగ్గరగా తోచింది. ఆ చర్చలనుంచి ఎంతో గ్రహించాను. చివరికి మేము ఇటామతి నుండి వెనక్కి వచ్చేశాం. బోల్‌గఢ్ నుండి సత్యవాదీ, పూరీల మీదుగా మహాత్మాజీ బాలేశ్వర్ ప్రయాణమయ్యారు. మహాత్ముడి చేతుల మీదుగా నా ఆశ్రమానికి శంకుస్థాపన జరగాలని కోరుకుంటున్నట్టు విన్నవించు కున్నాను. ఆ కార్యక్రమం ఏర్పాట్లు చూసుకోవడానికి నేను తిరిగి ఆశ్రమానికి వచ్చేశాను.

బాలేశ్వర్ నుండి మహాత్మాజీ కటక్ తిరిగి వచ్చారు. ఆయన ఆరోగ్యం ఏమంత బాగాలేదు. తీరిక లేకుండా నిరంతరం పనిచేయించడం వల్ల కటక్‌లోనే ఆయన అనారోగ్యం పాలయ్యారు. కటక్‌లో మహాత్మాజీ గోపాల్‌చంద్ర ప్రహరాజ్ గారి ఇంట్లో బస చేశారు. ప్రహరాజ్ గారి ఇంట్లో మహాత్మాజీ బస ఏర్పాటు చేయడం వెనుక నా పాత్ర ఉంది. ప్రహరాజ్ ఖద్దరు కట్టి, ఒక కాంగ్రెస్ కార్యకర్తగా మారారు. ఆయన కాంగ్రెస్‌లో ఒక క్రియాశీలక కార్యకర్తగా ఎదగాలని నేను కోరుకున్నాను. ఆ కోరిక నెరవేరడానికే ఆయన ఇంట్లో మహాత్మాజీ బసకు ఏర్పాట్లు చేశాను.

మహాత్మాజీ అక్కడున్న సమయంలోనే, మా ఆశ్రమానికి వచ్చి, శంకుస్థాపన చేసే విషయం మళ్లీ ప్రస్తావనకు వచ్చింది. మహాత్మాజీ నా అభ్యర్థన మన్నించారు. కానీ వైద్యుల సలహా మేరకు ఆయన కటక్‌లోనే విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించారు. కటక్ జిల్లా పర్యటన కోసం కేటాయించిన మూడు నాలుగు రోజుల సమయాన్నీ మహాత్మాజీ కటక్‌లో ఆరోగ్యం కుదుటపరుచుకోవడానికే వెచ్చించారు. అయితే, నాతో పాటు ఆశ్రమానికి వచ్చి శంకుస్థాపన చేయడానికి తాను సిద్ధమేనని ఆయన నాతో చెప్పారు. కానీ ఆ నిర్ణయం తీసుకునే బాధ్యత మహాత్మాజీ నా మీదే మోపారు.

నేను పెద్ద ధర్మసంకటంలో పడ్డాను. మహాత్మాజీ వచ్చి ఆశ్రమానికి శంకుస్థాపన చేస్తారన్న నమ్మకంతో ఘనంగా ఏర్పాట్లన్నీ చేసుకున్నాను. ఆయన అక్కడికి రాకపోవడం నేను ఊహించలేను. కానీ ఇప్పుడు ఆయన్ని అక్కడికి తీసుకువెళ్ళాలా లేదా తేల్చుకో వలసిన బాధ్యత నా మీదే పడింది. గాంధీజీని అక్కడికి తీసుకెళ్లి, సభను ప్రశాంతంగా ముగించడం అసాధ్యమైన పని. ఆ జనసందోహం నుండీ, ఆ తోపులాట నుండీ ఆయనెలా బయటపడగలరు? ఆయన నా మాట కాదనలేక వచ్చినా, తీరాచేసి ఆయన ఆరోగ్యం మరింత విషమిస్తేనో? యావద్దేశం నా మీద మండిపడుతుంది, నన్నే నిందిస్తుంది.

ఇవన్నీ ఆలోచించాక, మహాత్మాజీని నాతో పాటు ఆశ్రమానికి తీసుకువెళ్లే ధైర్యం నాకు చాలలేదు. ఆయన రాకపోయినా నేనేమీ అనుకోనని ఆయనకు చెప్పేసాను. మహాత్మాజీ తాను స్వయంగా ఆశ్రమానికి రాలేకపోయినా, ఆ కార్యక్రమానికి హాజరు కావాలసిందిగా మీరా బెహెన్, మహదేవ్ దేశాయ్, కాకా కాలేల్కర్‌లను పంపించారు. ఆయన స్వదస్తూరీతో ఒక సందేశం కూడా రాసి నాకు పంపించారు. కట్టబోతున్న భవనం బ్లూప్రింట్‌మీద ఆయన 'నా తరఫున మీరా బెహెన్ ఈ భవనానికి శంకుస్థాపన చేస్తారు; అది నేనే స్వయంగా శంకుస్థాపన చేసినదానితో సమానం' అని రాశారు. ●

(**గోవింద చంద్ర మిశ్రా** (1890-1967) రాసుకున్న ఆత్మకథ 'జాతీయ జీవనర ఆత్మవికాస్' (1940) లోనిది ఈ భాగం. కటక్‌లో ఆర్య ప్రకాశని ప్రచురించిన 'గోవిందచంద్ర రచన సమగ్ర'లో ఆ ఆత్మకథ లభ్యమవుతున్నది. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన సుజిత్ మహాపాత్ర విమర్శకుడు, అనువాదకుడు. బకుల్ ఫౌండేషన్ సభ్యకార్యదర్శి.)

## మీరాబెన్

# కాలినడకన గాంధీ

**మేం** ఎప్పటిలాగే సాయంత్రం అయిదున్నరకి విడిది నుంచి బయలుదేరాం. అప్పటికి సమయం దాదాపు రాత్రి ఏడున్నర కావస్తోంది. చీకట్లు ముసిరాయి. మేం గమ్యస్థానానికి చేరువవుతుండగా, కొందరు మనుషులు లాంతర్లతో ఎదురొచ్చి, చివరి మైలు దూరం దారంతా మాకు తోడుగా నడిచారు. దారిన సాగుతున్న కొద్దీ పాదయాత్రికుల సంఖ్య క్రమంగా పెరుగుతూ పోయి, అప్పటికి వందల సంఖ్యకు చేరింది.

చెట్ల సందుల్లోంచి మెరుస్తున్న దీపాల వెలుగులు చూసి సభాస్థలి దగ్గర్లోనే ఉందని తెలిసింది. రోడ్డుమీద నిలబడిన ఒక పెద్ద జనసమూహం మేం ఎటుపక్క తిరగాలో చూపించింది.

ఆ రాత్రి సభ నిర్వహించడం కోసం ఒక తాటితోపు ఎంపిక చేశారు. ఒక పొట్టి బల్ల మీద తెల్లటి గుడ్డ పరిచి వేదికగా మార్చారు. అక్కడక్కడా చెట్ల మధ్య దీపాలు వేలాడదీశారు. చుట్టూ పొడవాటి సన్నటి తాటిచెట్లు తలపైకెత్తి నిటారుగా నిలబడి ఉన్నాయి. తాటిమట్టలు ఆకాశం వైపు నక్షత్రాల్ని చూస్తూ విప్పారి ఉన్నాయి. దగ్గరి నుంచీ దూరం నుంచీ తరలివచ్చిన వందలాది మంది గ్రామస్థులు కింద ఇసుక నేలమీద కూర్చున్నారు.

తాటాకుల్లోంచి పిల్లగాలులు చేసే సన్నటి సవ్వడి తప్ప, కొద్ది నిమిషాల్లోనే అంతటా సంపూర్ణ నిశ్శబ్దం ఆవరించింది. ఆ వాతావరణంలో ప్రార్థన మొదలైంది. ప్రార్థన ముగిశాక, ఆ ప్రశాంత పవిత్ర వాతావరణంలో గాంధీజీ తన సందేశాన్ని వినిపించారు:

'లెండి. మేల్కోండి. మీ పూర్వీకుల నుంచీ వారసత్వంగా వచ్చి, మీలో పాతుకు పోయిన ఆ పాపాన్ని గుర్తించండి. హిందూ ధర్మాన్ని సంస్కరించుకోండి, లేకపోతే మనం నశించిపోతాం' అన్నారు.

సాయంకాలపు నడక సాగుతోంది. దారంతా గాంధీజీ రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూ గ్రామస్థులు వరుసల్లో నిలబడి ఉన్నారు. అక్కడొక పెద్ద జనసందోహం రోడ్డంతా పరుచుకుని ఉంది. నెరిసిన తెల్లటి జుట్టూ, వృద్ధాప్యంతో మసకబారిన చూపులూ ఉన్న ఒక వృద్ధురాలు హఠాత్తుగా జనం మధ్య ఇటూ అటూ పరుగులు తీస్తోంది. 'ఆయనెక్కడున్నాడు? ఎక్కడున్నాడు? నేను ఆయన్ను చూడాలి' అంటోంది. ఆ ఆందోళనలో ఆమె ఆయన్ను దాటి వెళ్లిపోబోతుండగా, ఆమె తపనను గమనించిన గాంధీజీ ఆగి, ఆమెను దగ్గరకు పిలిచారు. ఆ పిలుపు విని ఆమె ఆత్రుతగా ఆయన వైపు వచ్చి, తన వృద్ధ నేత్రాల్తో ఆయన్ని నిదానించి చూసింది. గాంధీజీ నవ్వుతూ ఆమె గడ్డం కింద చేయి పెట్టి, 'ఏమ్మా, ఇప్పుడు నన్ను సరిగ్గా చూడగలుగుతున్నావా?' అనడిగారు. ఆమె ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి; ఆమె ఆయన గళం చుట్టూ చేతులు వేసి, ఆయన గుండెమీద తల వాల్చి పరవశంలో మునిగిపోయింది. ఆయన నెమ్మదిగా ఆమె చేతుల్ని విడిపించారు; కలవరింతలో నడుస్తున్న మనిషిలా ఆమె మళ్లీ జనం మధ్యకు జారుకుంది, కానీ ఆ వెలుగు మాత్రం ఆ వృద్ధ ముఖాన్ని ప్రకాశింపజేస్తూనే ఉండిపోయింది.

'నేను క్షవరానికి సిద్ధంగా ఉన్నాను' అన్నారు గాంధీ. వెంటనే క్షవరం సామగ్రితో ఒక చిన్న పల్లెటూరి మహిళను లోపలికి తీసుకువచ్చారు.

'అరే! చాలా బాగుందే, నువ్వేనా క్షవరం చేయబోయేది?' అని ఆయన నవ్వుతూ అడిగారు.

ఆమె చిరునవ్వుతో సమాధానమిచ్చి, ఎంతో నైపుణ్యంతో కత్తి నూరడం మొదలు పెట్టింది. ఆమె ఆయన గడ్డాన్నీ తలనూ పూర్తిగా ఆయన మెచ్చేలా నున్నగా క్షవరం చేసింది.

ఆ పని జరుగుతుండగా గాంధీజీ కళ్లు ఆమె ఒంటిమీద ఉన్న ఆభరణాలమీద పడ్డాయి. ఆమె నిరుపేద మహిళనే అయినప్పటికీ, కొన్ని లక్క గాజుల్తో పాటు ఒక జత పెద్ద వెండి కడియాలూ, ముక్కుకి బంగారు ముక్కుపుడకా ధరించి ఉంది.

'ఏమిటీ పనికిమాలిన వస్తువులు?' అని అన్నారాయన. 'వీటివల్ల నీ అందమేమీ ఇనుమడించడం లేదు. ఇవి నిజానికి వికారంగా ఉండటమే కాదు, మురిగ్గా కూడా తయారవుతాయి' అని అన్నారు.

ఆ పేదరాలు ముఖం చిన్నబోయింది. 'ఈ పవిత్రమైన సందర్భం కోసం నేనివి ప్రత్యేకంగా ఎరువు తెచ్చుకున్నానండి!' అంది ఆమె ఆవేదనగా.

'మంచి నగల్లేకుండా మీ ఎదుట ఎలా నిలబడగలను!' అనడిగింది.

గాంధీజీ ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆమె విన్నది, తియ్యగా నవ్వింది, అంతే. అక్కడి నుండి వెళ్లి, ఆ బృందంలో మరో ఇద్దరికి కూడా క్షవరం చేసి, తనకి ముట్టిన కూలీ డబ్బులు మొత్తం తెచ్చి గాంధీజీ ముందే సమర్పించి మౌనంగా వెళ్ళి పోయింది. ●

(**మీరాబెన్** (1892-1982) మేడ్లిన్ స్లేడ్ ఒక బ్రిటిష్ మహిళ. మహాత్మాగాంధీ సాన్నిహిత్యంలో ఉంటూ పనిచేసేందుకు ఇంగ్లాండ్ వదిలిపెట్టి వచ్చారు. గాంధేయ సిద్ధాంతాల వ్యాప్తికీ, భారత స్వాతంత్ర్యపోరాటానికీ తన జీవితాన్ని అంకితం చేశారు. ఆమె రాసుకున్న ఈ జ్ఞాపకం డి.జి. టెండూల్కర్ రాసిన 'మహాత్మా' గ్రంథంలోది.)

# ఆర్తబంధు మొహంతి

# మామిడి తోపులో సభ

**రామచంద్రపూర్** పాఠశాలలో పనిచేస్తున్న రోజుల్లో అక్కడ నేను వినాయక చవితి పూజలు ప్రారంభించాను. వేణుధర్ బెహూరియాగారూ, ఆదిత్య బల్‌గారూ, కృష్ణచంద్ర కర్‌గారూ తదితరులు ఆ పూజలు జరపడంలో నాకు తోడ్పడ్డారు. ఆ పూజలో పాల్గోడానికి హరిజనుల్ని కూడా ఆహ్వానించాను. నూలు వడికే కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశాను. ఇది చూసి పాఠశాల సెక్రటరీ చిర్రుబుర్రులాడారు.

1934 మే 31న మహాత్మా గాంధీ హరిజనుల్తో కలిసి బారీ చేరుకున్నారు. ఆయన ఖర్చుల కోసం గోపబంధు బాబూ, నేనూ కలిసి విరాళాల ద్వారా నూట ఎనిమిది రూపాయలు సమకూర్చాం. బామన్ బాబుగారి ఇంటి ముంగిట్లో గాంధీ బసకు ఏర్పాట్లు చేశారు. చౌధురి పూర్ణచంద్ర మహాపాత్ర గాంధీజీకీ ఆయన బృందానికీ అయ్యే భోజన వసతి ఖర్చులన్నీ భరించారు.

ఉదయం ఆరు గంటలకు బగ్గా మైదానంలో సభ జరిగింది. అంత వేకువజామునే రావడం చాలామందికి వీలుపడకపోవడంతో ఆ సభకు హాజరు పలుచగా ఉంది. అందుకని సహస్పూర్ వెళ్లే దారిన అతీరా దగ్గర మామిడితోపులో మరో సభ ఏర్పాటు చేశారు. అస్పృశ్యతా నివారణ ఆవశ్యకతమీద గాంధీజీ ప్రసంగించారు. ఆ సందర్భంగా హరిజనులు ఒక మేళా నిర్వహించారు. గాంధీజీ ఉపన్యాస స్ఫూర్తితో గోవర్ధన్ పూహాన్ అనే వ్యక్తి ఒక హరిజనుడి చేతి నుంచి మంచినీళ్లు తీసుకుని తాగారు. మా ప్రాంతంలో అలా చేసిన మొట్టమొదటి వ్యక్తి ఆయనే.

గాంధీజీని కలవడానికి బారీకి చెందిన ఎందరో ప్రముఖులు బామన్ బాబు గారి ముంగిట్లోకి వచ్చారు. బామన్ బాబూ, ఆయన కుమారుడు నవబాబూ

అస్పృశ్యతమీద గాంధీ ఆలోచనల్ని సిద్ధాంతపరంగా అంగీకరించారు కానీ, కొద్దిమంది సనాతన బ్రాహ్మణుల అభ్యంతరాలకు భయపడి వాటిని ఆచరణలో పెట్టడానికి సాహసించలేకపోయారు. దీనికి స్పందిస్తూ— బ్రిటిష్ ప్రభుత్వపు తూటాలనెదుర్కొనే ధైర్యం చూపిన ప్రజలు, బ్రాహ్మణుల్ని చూసి మాత్రం ఇంకా జడుసుకుంటున్నారని గాంధీజీ చమత్కరించారు. ఆ తర్వాత ఆలయాల్లోకి హరిజనులను అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. 'నేను భద్రక్ చేరుకునేలోపే ఈ విషయంలో నాకు గట్టి హామీ దక్కేలా చూడండి' అన్నారు గాంధీజీ. ●

(**ఆర్తబంధు మొహంతి** (1905-1989) పాఠశాల ఉపాధ్యాయుడూ, సంఘసేవకుడూ. ఆయన అసంపూర్ణ ఆత్మకథ, కటక్‌లో గ్రామసేవక్ సమవాయ ప్రెస్ లిమిటెడ్ ప్రచురించిన 'ఆర్తబంధు స్మరణే'లో 1990లో వెలువడింది. ప్రియంవదా పాల్ గారే ఈ భాగాన్ని కూడా ఇంగ్లీషులోకి అనువదించారు.)

# మన్మోహన్ చౌధురి

# గాంధీజీ పాదయాత్ర

1934 మే నెలలో గాంధీజీ తాను చేపట్టిన హరిజనోద్ధరణ కార్యక్రమం కోసం ఒరిస్సాలో పర్యటించవలసి ఉంది. సురేంద్రనాథ్ పట్నాయకూ, నేనూ సత్యభామపూర్ లోని మా మేనమామ ఇంట్లో ఉంటున్నాం. గాంధీజీకి సమర్పించడానికి విరాళాలు సేకరించాలన్న ఉద్దేశంతో మేమిద్దరం కలిసి చుట్టుపక్కల గ్రామాలన్నీ తిరిగాం. మావయ్యగారి ఇంట్లో మాకు భోజనాలు చాలా ఘనంగా పెట్టేవారు. కొద్దిమంది నుండి విరాళాలు అందాయి. కాని మాకు రకరకాల అనుభవాలు కూడా ఎదురయ్యాయి.

ఘంటిముండ గ్రామంలో ఒక సంపన్న వడ్డీ వ్యాపారి ఉన్నాడని తెలిసి ఒకసారి అక్కడికి వెళ్లాం. తీరా అక్కడికి వెళ్లి చూసేసరికి, ఒక ముసలాయన వరండామీద మోకాళ్లమీద కూర్చుని డబ్బు లెక్కపెట్టుకుంటున్నాడు. ఒంటిమీద మాసిపోయిన చిరుగుల గుడ్డా, తలమీద పిలకా ఉన్నాయి. ఆయన ముందు ఎన్నో కరెన్సీ నోట్ల కట్టలు పడి ఉన్నాయి. గాంధీ ఆశయాల ఔన్నత్యాన్ని ఆయనకు నచ్చజెప్పడానికి మేం చాలా ప్రయాసపడ్డాం. ఆ వృద్ధుడు నాణాలు లెక్కించడం ఆపకుండానే మా మాటలన్నీ విన్నాడు. చివరకు, 'సరే! చాలా మంచిది' అన్నాడు. ఆయన ముందు పడి ఉన్న నాణాల కుప్పలోంచి కనీసం ఒక్క నాణమైనా తీసి ఇస్తాడని మేమిద్దరం ఆశపడ్డాం. కానీ ఆ ముసలాయన నడుముకు కట్టుకున్న చిన్న సంచీలోంచి రెండు పైసలు తీసి, 'సరే, తీసుకోండి' అని మా ముందు పెట్టడంతో మా ఆశలన్నీ అడుగంటిపోయాయి. ఆ నాణాలు తీసుకోవడానికి నిరాకరించి మేమక్కడినుంచి వచ్చేశాం.

అయితే మిగతా చోట్ల మాకు మంచి స్పందననే లభించింది. ఎన్నో ప్రాంతాల్లో ప్రజలు మాకు ఎంతో ఆప్యాయంగా భోజనాలు పెట్టారు. సత్యభామపూర్‌లో

ఉన్నప్పుడే మాకు ఒరిస్సా ముద్దుబిడ్డ మధుసూదన్ దాస్ పరమపదించారన్న వార్త అందింది.

జమీందారులు ప్రజల్ని ఎంత క్రూరంగా దోపిడీ చేసేవారో కూడా మాకు అక్కడే మొదటిసారి ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చింది. లేఖన్‌పూర్ గ్రామంలో ఒక జమీందారు ఇంట్లో మేం అతిథులుగా బస చేశాం. ఆయన స్వాతంత్ర్యోద్యమ సమర్థకుడు. మా గది ఎదురుగానే ఆయన కచేరీ ఉంది. అక్కడ చాలామంది గుమి గూడారు. హఠాత్తుగా పెద్ద చప్పుడు వినిపించి తలెత్తి చూశాను; ఆ జమీందారు బంట్రోతునో లేక మరెవరో ఒక వ్యక్తిని చెప్పుతో కొడుతున్నారు. నేను దిగ్భ్రాంతి చెంది అలాగే చూస్తూ ఉండిపోయాను. ఆ అమానుష చర్యను ఎదిరించి నిరసించలేక పోయినందుకు ఆ తర్వాత ఎంతో పశ్చాత్తాపపడ్డాను.

ఆ రోజుల్లోనే విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనలు నన్ను ప్రభావితం చేయడం మొదలుపెట్టాయి. ప్రపంచంలోని వివిధ దేశాల ప్రజలంతా ఒకే మానవ జాతికి చెందినవారనీ, అందువల్ల దేశాల సంకుచిత సరిహద్దుల్ని తిరస్కరించి అందరూ ఏకం కావాలనీ ఏవేవో ఆలోచనలు నా అంతరంగంలో అల్లుకునేవి. పారిశ్రామిక కార్మిక వర్గంమీద కూడా నాకొక భావుకతతో కూడిన భావన ఉండేది. పల్లెటూళ్లలో తిరుగుతున్నప్పుడు కలకత్తా జనపనార మిల్లుల్లోనో లేక మరెక్కడైనా పనిచేసే కార్మికు లెవరైనా ఎదురుపడితే, వాళ్ళతో మాట్లాడాలని ఆరాటపడేవాణ్ణి. పద్మపూర్‌లో ఉన్నప్పుడు, ఆ గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు దక్షిణ అమెరికాలో బ్రెజిల్‌లో స్థిరపడ్డాయని తెలిసింది. ఒరిస్సాలోని మారుమూల పల్లెలకి సుదూర దక్షిణ అమెరికాతో ఉన్న ఆ సంబంధం నన్ను ఎంతగానో పులకింపజేసింది. ఈ విధంగా నెమ్మదిగా ప్రపంచమంతా ఒక్కటవుతుందని నేననుకున్నాను.

గాంధీజీ వచ్చే రోజు దగ్గరపడటంతో మేం కటక్ తిరిగి వచ్చాం. దాదాపు మూడువందల రూపాయల దాకా విరాళాలు సేకరించగలిగాం. సంబల్‌పూర్ మీదుగా గాంధీజీ అనుగుల్ చేరుకున్నారు. గాంధీకి స్వాగతం పలికే విషయంలో ఎలాంటి సహాయమూ చేయవద్దని అక్కడి డిప్యూటీ కమిషనర్ ప్రజలను బెదిరించారు. అయినప్పటికీ గిరిజాభూషణ్ దత్తా ఒక్కరే డేరాలు వేయించి గాంధీ బసకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేశారు. గ్రామీణప్రాంతాల నుండి ఎంతోమంది ప్రజలు గాంధీని చూడటానికి తరలివచ్చారు.

గిరిజాబాబు అనుగుల్‌లో ఒక కాంట్రాక్టరు. స్వేచ్ఛాభిలాషీ, ధైర్యవంతుడూనూ. ఆ తర్వాతి కాలంలో సంస్థానాధీశులకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ఆ తర్వాత అనుగుల్‌లోని ఆయన స్థలంలోనే మా పిన్ని ఒక ఆశ్రమం నిర్మించారు.

సాయంత్రం వేళ గాంధీజీ తాల్చేర్ రైల్లో కటక్ మీదుగా పూరీకి ప్రయాణ మయ్యారు. సంస్థాన ప్రాంతాల వైపు రావాలన్నది ఆయన ఆలోచన. మెరుపువేగంతో ఏడు రోజుల పాటు సాగే అది. రోజూ వాహనంలో ప్రయాణిస్తూ రెండు మూడు చోట్ల సభలు నిర్వహించవలసి ఉంది. కానీ మరుసటి రోజే మాకో వర్తమానం అందింది: గాంధీజీ పూరీ నుంచి కాలినడకనే పాదయాత్ర ప్రారంభిస్తారనీ, మోటారు కారు ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారనీ తెలిసింది. గాంధీ మీద దాడిచేసి ఆయన్ను కొట్టడానికి పూరీ ఆలయ పూజారులు కుట్ర పన్నారన్న సమాచారం అందడంతో, పూరీ స్థానిక నాయకులు ఆయనకు పోలీసు రక్షణ ఏర్పాటు చేయించారు. అది గాంధీజీకి ఏమాత్రం నచ్చలేదు. తనమీద దాడిచేసి తనని కొట్టాలనుకునే వారికి మరింత వెసులుబాటు కల్పించడానికే ఆయన పాదయాత్ర చెయ్యడానికి నిశ్చయించు కున్నారని విన్నాం.

మరోవైపు ఆయన వెళ్లవలసిన ప్రాంతాల ప్రజలూ, నిర్వాహకులూ తీవ్ర ఆందోళనలో పడ్డారు. ఎంతోమంది వెళ్లి ఆయనతో వాదించారు. కానీ గాంధీజీ తన పట్టు వీడలేదు. పూరీ నుండి కటక్ దాకా ఏడు రోజుల పాదయాత్ర ఖరారైంది. రెండో రోజు సాక్షిగోపాల్ దగ్గర నేను ఆయన్ని ఆ పాదయాత్రలో కలిశాను. గాంధీజీ ప్రసంగాల వివరాలు రాసుకోవడమూ, ఫోటోలు తీయడమూ నా పని.

మహాకవి రవీంద్రనాథ్ టాగోర్ సోదరుడు ద్విజేంద్రనాథ్ ఠాగూర్ బెంగాలీలో ఒక కొత్త షార్ట్‌హ్యాండ్ పద్ధతి కనిపెట్టి, దానిమీద ఒక పుస్తకం కూడా ప్రచురించారు. మా పిన్ని దగ్గర ఆ పుస్తకం ప్రతి ఒకటి ఉండేది. అది నా నా కంటపడింది. నేనా పద్ధతి సాధన చేశాను. నిజానికి నాకు అందులో పూర్తి ప్రావీణ్యం రాలేదు, నా వేగం కూడా అంతంత మాత్రమే. కానీ గాంధీజీ ప్రసంగిస్తున్నప్పుడు ఆ హిందీ వాక్యాలకి వాక్యాలు ఒడియాలోకి అనువాదమవుతుండటంతో, వాటిని రాసుకోవడానికి నాకు బోలెడంత సమయం దొరికేది. నేను వాటిని రాసుకున్నాక మొదటి కొన్ని రోజులు గాంధీజీనే స్వయంగా వాటిని సరిదిద్దేవారు. ఆ తర్వాత ఇక సరిదిద్దాల్సిన అవసరం

లేదని భావించారు. నేను వాటిని కాకా కలేల్కర్‌కో మరెవరికో ఇచ్చి సరిచూపించు కునేవాణ్ణి.

ఈ పాదయాత్రలో ఉదయం రెండున్నర నుండి మూడు మైళ్ళూ, మధ్యాహ్నం అంతే దూరమూ నడిచేవారు. అలాగే సాయంత్రం ఐదు లేదా ఐదున్నర గంటల ప్రాంతంలో రాత్రి భోజనం ముగించుకుని మళ్లీ నడక మొదలుపెట్టేవాళ్లం. అందువల్ల రాత్రి బస చేసే చోట ఇక భోజనాల గురించిన బెంగ ఉండేది కాదు. అది వేసవి కాలం. అందరూ ఆరుబయటే నిద్రపోయేవారు. పగటిపూట ఆగే మజిలీల్లో కొబ్బరి లేదా తాటాకు మట్టలతో నీడల కోసం తాత్కాలిక పందిళ్లు అవసరమయ్యేవి. బయలు దేరడానికి ముందు తాత్కాలిక మరుగుదొడ్లూ, చెత్తకుండీలూ, మిగిలిపోయిన ఆహార పదార్థాల్ని సరిగ్గా తొలగించారా లేదా, పరిసరాలన్నీ శుభ్రంగా ఉన్నాయా లేదా అని గాంధీజీ స్వయంగా చూసుకునేవారు. తనతో నడుస్తున్న తోటి బాటసారుల యోగ క్షేమాలు వాకబు చేసేవారు. వంట ఏర్పాట్లు సైతం స్వయంగా పర్యవేక్షించేవారు.

ఒకసారి మా చెల్లెలు చునీ కాలికి మేకు గుచ్చుకుందని తెలిసి, స్వయంగా ఆయనే దాన్ని తీశారు. మరో సందర్భంలో, మిగిలిపోయిన అన్నం చద్దన్నం చేసుకుని తింటారని తెలిశాకనే ఆయన శాంతించారు. మజిలీల్లో ఆగినప్పుడు పాదయాత్రికులు హరిజనవాడలకు వెళ్లి, అక్కడి పరిస్థితుల గురించి గాంధీజీకి నివేదించేవారు. కొన్ని సార్లు చుట్టుపక్కల గ్రామాల నుంచి హరిజనుల్ని మధ్యాహ్న భోజనాలకు పిలిచేవారు.

గాంధీజీని కలవడానికి ఎందరో ప్రముఖులు వచ్చేవారు. విదేశాల నుంచి కూడా ముఖ్యమైన వ్యక్తులు వచ్చారు. ఆగ్నేయ ఆఫ్రికా నుండి వచ్చిన కుట్ బుటో అనే జర్మన్ యువకుడు మొదటి నుండి చివరి దాకా పాదయాత్రికులతోనే ఉన్నాడు. తనను తాను నాజీగా చెప్పుకునేవాడు. అతడు ఆ యాత్రలోని ప్రత్యేక ఆకర్షణల్లో ఒకడు. ఏకబిగిన పది పన్నెండు కొబ్బరిబొండాల నీళ్లు తాగేసేవాడు. పూరీలో సియులాచౌక్ వద్ద ఇద్దరు చెకోస్లోవేకియా యువకులు యాత్రలో కలిశారు. పూరీ నుండి కటక్ దాకా ఠక్కర్ బాపా పాదయాత్రలో పాల్గొన్నారు. హరిజన్ సేవక్ సంఘ్ డిప్యూటీ సెక్రటరీ ఎన్.ఆర్. మల్కానీ బైరీ నుండి భద్రక్ దాకా నడిచారు. సతీష్‌చంద్ర దాస్‌గుప్తా మొదట సియులాచౌక్ చేరుకున్నారు.

ఒరిస్సా పర్యటన తర్వాత బెంగాల్లో రెండు వారాలు గడపాలని గాంధీజీ అనుకున్నారు. దాంతో బెంగాలు తరఫున సతీష్ బాబు ఆ రెండు వారాలూ ఒరిస్సాలోనే

గడిపారు. కటక్ నుండి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి హాజరు కావడానికి గాంధీజీ పాట్నా వెళ్లారు. తన పాదయాత్ర రెండో విడత ప్రారంభించడానికి తిరిగి ఆయన బైరీ స్టేషన్‌కు వచ్చారు. పాదయాత్ర అసలు గమ్యస్థానం బాలేశ్వర్. కానీ యాత్రికులు జాజ్‌పూర్ చేరుకున్నాక వర్షాలు మొదలుకావడంతో భద్రక్ దగ్గరే యాత్ర ముగించవలసి వచ్చింది.

భారతదేశమంటే ఎంతో అభిమానం ఉన్న అగాథా హారిసన్ అనే ఆంగ్ల మహిళ రెండో విడత పాదయాత్రలో పాల్గొన్నారు. శాంతి పరిరక్షణ సంస్థ అయిన 'సర్వీస్ సివిల్ ఇంటర్నేషనల్' సభ్యుడు పియరీ సెరిసోల్, భూకంప బాధితులకి సహాయం చేయడానికి బీహార్ వచ్చారు. ఆయన కూడా గాంధీజీతో కొన్ని రోజులు గడిపారు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో అప్పట్లో మీనూ మసానీ ముఖ్య నాయకుడు. ఆయన కూడా వచ్చి రెండు మూడు రోజుల పాటు యాత్రలో పాల్గొని, గాంధీజీతో చర్చలు జరిపారు. ఘనశ్యామ్‌దాస్ బిర్లా కూడా వచ్చారు. యాత్ర మొత్తంలోనూ అన్నింటికంటే తీవ్రంగా అసౌకర్యంగా ఉండే ఇంటారిపొఖరికి ఆయన చేరుకున్నారు. అక్కడ గాంధీజీ ఒక చిన్న గుడిసెలో బస చేశారు. మిగతావారంతా అరటి తోటల్లోనే ఉన్నారు. అక్కడ బిర్లాజీకి చుక్క పాలు కూడా సంపాదించడం కష్టమైపోయింది.

ప్రతి మజిలీలోనూ గాంధీజీ అస్పృశ్యతకు వ్యతిరేకంగా ప్రజలతో మాట్లాడేవారు. రాజుదా ఆయన ప్రసంగాలు అనువదించేవారు. గాంధీజీ ఒక వాక్యం మాట్లాడటం, వెంటనే అది అనువాదం కావడం జరిగేది. ప్రసంగాలు మరీ సుదీర్ఘంగా ఉండేవి కావు. కొన్ని కీలకమైన అంశాల్నే ప్రతిఒక్కసారీ మళ్లీ మళ్లీ ప్రస్తావించేవారు. గాంధీజీని కలవడానికి సుదూర ప్రాంతాల నుండి జనం వచ్చేవారు. కొందరైతే వేళకాని వేళల్లో కూడా వచ్చేవారు. పగటిపూట ఆయన ఆరుబయటే కూర్చునేవారు కాబట్టి సమస్య ఉండేది కాదు. కానీ రాత్రివేళల్లో జనం తరచూ ఆయన పడక దగ్గరకి వెళ్లి మరీ లాంతర్ల వెలుతురూ టార్చిలైట్లూ ఆయన ముఖంమీద వేసి ఇబ్బంది పెట్టేవారు.

కొన్ని సంఘటనలు నా మనసులో మెదులుతున్నాయి. ఒక్కోసారి మేం మఠాల్లోనో గుళ్లల్లోనో బస చేసేవాళ్లం. ఒకచోట ఒక చెక్క కంచెకు ఐదారు మూరల దూరంలో గాంధీజీకి పడక ఏర్పాటు చేసారు. గాంధీజీ మంచంమీద కూర్చుని ఉన్నారు. మా నాన్నగారు అది చూసి, 'ఈ స్థలం అపరిశుభ్రంగా ఉంది, పాముపుట్రా తిరుగు తూండచ్చు. మంచం కాస్త ముందుకు జరుపుదాం' అన్నారు. గాంధీజీ నవ్వుతూ,

'గోపబాబూ, పాములే గనుక వస్తే, అవి ఇంకొంచెం ముందుకు రాలేవా?' అని బదులిచ్చారు. ఆ పడక అక్కడే ఉండిపోయింది.

మరో మధ్యాహ్నం వేళ, ఉక్కపోత భరించలేక గాంధీజీ మామిడి తోపులోకి వెళ్లి కూర్చున్నారు. అక్కడ చెట్లనిండా పురుగులున్నాయి. అవి జనాన్ని నిరంతరం వేధిస్తూనే ఉన్నాయి. ఎవరో ఆ విషయమై విసుక్కోగా, గాంధీజీ స్పందిస్తూ: 'వాటి తప్పేముంది? మనమే గనుక పురుగులమైతే, మనమూ అదే పనే చేస్తాం కదా' అన్నారు. లేఖన్‌పూర్ నుండి సత్యభామపూర్ చాలా దూరంలో ఉంది. సమయం దాటిపోతోంది. గోపీనాథ్‌పూర్ వంతెన దగ్గర్నుండి గాంధీజీ పరుగు మొదలుపెట్టారు. దాదాపు అరమైలు దూరం ఆయన పరుగెత్తారు. అందరూ రొప్పుతూ ఆయన వెనుకే పరుగుతీశారు.

జాజ్‌పూర్ చేరుకోడానికి ముందు, మేం బుధా నదీ తీరాన రాత్రి బస చేయాల్సి వచ్చింది. అక్కడ సాయంసంధ్యా ప్రార్థన ముగియగానే దట్టమైన నల్లటి మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు మొదలయ్యాయి. అక్కడొక చిన్న కొట్టు ఉంది. గాంధీజీ, ఏడెనిమిది మంది స్త్రీలూ అక్కడి ఒక చిన్న గదిలో తలదాచుకున్నారు. ఏడెనిమిది మూరల పొడవున్న రెండు కొబ్బరి మట్టల తడకలు కనిపించాయి. సుమారు ఇరవై రెండు మందిమి ఉన్న మేం వాటిమీద ఒక టార్పాలిన్ కప్పి, దాని కింద ఆశ్రయం పొందాం. ఇవన్నీ సర్దుకునే లోపే కుండపోత వర్షం మొదలైంది. రాత్రంతా వర్షం కురుస్తూనే ఉంది. మేమంతా రాత్రంతా అక్కడే ముడుచుకుని కూర్చుని కునుకుపాట్లు పడుతూ గడిపేశాం.

బాలేశ్వర్ జిల్లా తోడంగలో భారీగా వర్షం కురిసింది. భద్రక్ పదకొండు మైళ్ల దూరంలో ఉంది. తోడంగ నుండి భద్రక్‌లోని జీవరామ్‌జీ ఆశ్రమానికి ఎక్కడా ఆగకుండా నడిచి, అక్కడ రెండు రోజులు బస చేసి ఒరిస్సా పర్యటనను ముగించాలని నిశ్చయించుకున్నాం. ఉదయమే నడక మొదలుపెట్టి, దారిలో కాస్త విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నానికి భద్రక్ చేరుకున్నాం.

ఒకరోజు ఉదయం పాదయాత్రలో నడుస్తున్నప్పుడు, పట్టు కోసం గాంధీజీ నా భుజంమీద చేయి వేసి నడవడం మొదలుపెట్టారు. నేనేం చేస్తున్నాననీ, జీవితంలో ఏమవ్వాలనుకుంటున్నాననీ అడిగారు. ఖగోళశాస్త్రం చదవాలనుకుంటున్నానని

చెప్పాను. నూలు వడకడంలాంటి పనులు చేస్తూనే చదువును కొనసాగించవచ్చని ఆయన చెప్పారు. నేను అవునన్నట్టు తలూపాను. ఆ సంభాషణ అంతటితో ముగిసింది. నిజానికి ఆ సమయంలో ఏం చేయాలో ఏం చేయకూడదో నాకు స్పష్టమైన అవగాహన లేదు. ఒకవైపు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటున్నాను, ఆ పోరాటంలో భాగస్వామి గానే ఉండాలని నాకు తెలుసు. సోషలిజం ఆదర్శాల ప్రభావంతో నా మనస్సులో ఒక నూతన సమాజపు ఆశ రూపుదిద్దుకుంటోంది. మరోవైపు సైన్స్ ఛేదిస్తున్న రకరకాల రహస్యాలు తెలుసుకోవాలన్న జిజ్ఞాస కూడా నాలో ఉంది. కానీ నాది స్వతహాగా బిడియపడే స్వభావం కావడంతో ఈ విషయాలు ఎవరితోనూ బాహాటంగా చర్చించేవాణ్ణి కాదు. అలాంటప్పుడు చివరకు గాంధీజీతోనైనా వాటి గురించి మాట్లాడగలగడం ఎలాగు? ●

(**మన్మోహన్ చౌధురి** (1905-2003) ప్రముఖ భూదానోద్యమ కార్యకర్త, విశిష్ట చింతనశీలి, లబ్ధప్రతిష్ఠుడైన రచయిత. ఈయన ఆత్మకథ 'కస్తూరి మృగ సమ' మొదట్లో ఏకవింశ శతాబ్దిలో ధారావాహికగా ప్రచురితమైంది. ఆ తర్వాత 1995లో కహాణీ ప్రకాశని వారు దాన్ని పుస్తకంగా ప్రచురించారు. అందులోని ఈ భాగాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన భారతీ మహాపాత్ర పరిశోధక విద్యార్థిని.)

## కృష్ణచంద్ర కర్

# దొరికిన వెండి రూపాయి

1934 మే నెలలో మొదటిరోజులు. కటక్ వీథులన్నీ ఒకటే సందడిగా ఉన్నాయి. ఎవరి నోట విన్నా ఒకటే మాట: గాంధీజీ పూరీ నుంచి యాత్ర మొదలుపెట్టి, ఈ రోజుకి తెలంగాపెంథా చేరుకుంటారు. తెలంగాపెంథాలో పెద్ద మామిడితోపులో ఆయన ఆ రాత్రికి బస చెయ్యబోతున్నారు. మహాత్ముని పాదస్పర్శతో ఆ తోట ఒక పవిత్ర, చిరస్మరణీయ పుణ్యక్షేత్రంగా మారబోతోంది. కులమతాలూ వయోభేదాలూ మరచి, లక్షలాదిమంది ప్రజలు బారులు తీరి గాంధీజీ వెంటే నడిచారు.

కటక్ నగరమంతా సరికొత్తగా ప్రాణం పోసుకుంది. గుడిసెలూ, బంగ్లాలూ, చివరకు సందుగొందుల్లోని ధూళిరేణువుల్తో సహా నగరం అణువణువునా ఆనందమూ గర్వమూ నిండిన ఒక పులకింత కనిపించింది. మహాత్ముని దర్శనం చేసుకోవాలన్న ఆత్రుతతో వందలాది మంది తెలంగాపెంథా వెళ్లడానికి సిద్ధమయ్యారు. నది వైపు పోటెత్తుతున్న ఆ మానవ ప్రవాహంలోకి నేను కూడా దూకాను. మరికొద్ది నిమిషాల్లో నాలుగు గంటలు కావొస్తుంది. కాట్జూరి నది మీద కట్టిన కొత్త ఆనకట్ట ఒక కొస నుండి మరో కొస దాకా కదులుతున్న మనుషుల శిరస్సమూహంతో నిండిపోయి, దూరం నుంచి చూస్తే అదంతా రాముడి వానరసేన కట్టిన వారధిలాగా కనిపిస్తోంది. ఏ దిక్కున చూసినా జనం పారవశ్యంతో నేరుగా కాట్జూరి నదీ తీరం వైపే లంఘిస్తున్నారు; మొత్తం నగర జనాభా అంతా తెలంగాపెంథాలోకి వచ్చి వాలుతోందా అన్నట్టుగా ఉంది.

యావత్ ప్రపంచమూ ఆరాధించే ఆ 'దిగంబర ఫకీరు' తన అనుచరుల్తో కలిసి తెలంగాపెంథా మామిడి తోపుకు చేరుకున్నారు. మేం ఆయనకంటే ముందే అక్కడికి

చేరుకున్నాం. ఇటీవల వరదల వల్ల అతలాకుతలమైన ఆ ప్రాంతం ఇప్పుడు జన సందోహంతో కిక్కిరిసిపోయింది. సుదూర గ్రామాల నుంచీ జనం ప్రవాహంలా వస్తూనే ఉన్నారు. గాంధీజీ కోసం, ఆయన సహచరుల కోసం రాత్రి బసకి అక్కడ తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకున్నాక, వారంతా నేరుగా సభాస్థలానికి బయలుదేరారు.

గంభీర స్వరంతో గాంధీజీ సభికులనుద్దేశించి మాట్లాడటం మొదలుపెట్టారు. మహాత్ముని మాటలు సమ్మోహితులై వింటున్న ఆ జనసందోహంపైన ప్రశాంతనిశ్శబ్దం ఆవరించింది. పేదలపట్లా, ముఖ్యంగా దోపిడీకి గురవుతున్న నిమ్న కులాల హరిజనుల పట్లా గాంధీజీ అపారమైన సానుభూతి వ్యక్తం చేశారు. అందుకే అస్పృశ్యతా నివారణను అంతగా నొక్కి చెబుతూ,ఆయన, వారిని గౌరవించమనీ, తమ స్వంత రక్తసంబంధీకుల్లా ఆదరించమనీ దేశప్రజలకు పిలుపునిచ్చారు. అంటరానివారిని మనం మన సమాజంలో భాగంగా అంగీకరించనంత కాలం స్వరాజ్యానికి అర్థమే లేదని గాంధీజీ కుండబద్దలు కొట్టారు.

సూర్యుని చివరి కిరణాలు మాయమయ్యాయో లేదో, లెక్కలేనన్ని పెట్రోమాక్స్ దీపాలతో ఆ మామిడి తోపంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. రాత్రి చీకట్లు దొంగలా వెనక్కి తగ్గాయి. గాంధీజీ ప్రసంగం ముగియగానే, తమ సందేహాలను నివృత్తి చేసుకోడానికి సభికుల్లో కొందరు లేచి ప్రశ్నలు అడిగారు. వాటన్నింటికీ గాంధీజీ సంతృప్తికరమైన సమాధానాలిచ్చారు.

అప్పటి ఉత్కళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పండిట్ నీలకంఠ దాస్ హిందీలో అడిగిన ఒక్క ప్రశ్న మాత్రమే నాకు గుర్తుంది. ‘బాపూజీ, శాకాహార భోజనమే చేయాలని మీరెప్పుడూ చెప్తుంటారు కదా. మరి ఒరిస్సా ప్రజలు చేపలు తినడం సరైనదేనా?’ అని ఆయన అడిగారు. కరుణామూర్తి అయిన మహాత్మాజీ బదులిస్తూ: ‘ఒరిస్సా జనాభాలో సగానికి పైగా ప్రజలకు రోజుకు ఒక్క పూట కూడా కడుపునిండా తిండి దొరకడం లేదు. వారిలో చాలామంది ఆహారం కోసం పల్లెపల్లెకూ తిరుగుతున్నారు. రాష్ట్రమంతటా విస్తరించి ఉన్న అసంఖ్యాకమైన నదీజలాల్లోనూ, పిల్ల కాలువల్లోనూ, సరస్సుల్లోనూ, చెరువుల్లోనూ, సెలయేళ్లలోనూ చేపల రూపంలో ప్రకృతి వారికి అపారమైన సంపద ప్రసాదించింది. అది కాక సముద్రం కూడా

మత్స్యగర్భగా అలరారుతోంది. పేదరికంతో అల్లాడే ఒరిస్సా ప్రజలు వాటితో తమ ఆకలి తీర్చుకోవచ్చు. అందుకోసం వాళ్లు పైసా కూడా ఖర్చు చేయాల్సిన పనే లేదు. వాళ్లు చేయాల్సిందల్లా కాస్త శ్రమపడటమే' అన్నారు.

సభ ముగిశాక సహపంక్తిభోజనాలు నడిచాయిౘ హెచ్చుతగ్గుల తారతమ్యాలు లేకుండా వందలాది మంది అగ్రకులాలవారూ నిమ్నకులాలు ఒకే పంక్తిలో కూర్చుని భోజనం చేశారు. ఎంతటి హృద్యమైన దృశ్యమది! శంఖనాదాలతోనూ, హులహులి (మంగళ ధ్వనులు) తోనూ, 'మహాత్మా గాంధీకి జై', 'భరతమాతకు జై' అన్న నినాదాల తోనూ ఆ పరిసరాలన్నీ మార్మోగాయి. కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా గాంధీజీ ఇచ్చిన పిలుపుతో, వేదాలు విధించిన కట్టుబాట్లు సైతం పక్కన పెట్టి బ్రాహ్మణుడూ చండాలుడూ ఇద్దరూ ఆ పవిత్రస్థలంలో ఏకమయ్యారు. స్వయంగా గాంధీజీయే హరిజనుల మధ్య కూర్చుని భోజనం చేయడం భారత చరిత్రలోనే ఒక నవశకానికి నాంది పలికింది.

భోజనం ముగిశాక గాంధీజీ, ఆయన బృందమూ తమతమ గుడారాలకు వెళ్లి పోయారు. జనం ఇళ్లకు తిరుగుముఖం పట్టడంతో ఆ మహత్తర సమావేశం జరిగిన స్థలం నెమ్మదిగా బోసిపోవడం మొదలైంది. అర్ధరాత్రి వేళకు ఆ మామిడి తోటంతా ఖాళీ అయిపోయింది.

అక్కడే ఉండిపోయిన కొద్దిమంది, రాత్రి గడపడానికి, ఎవరికి తోచిన చెట్టు కింద వాళ్లు ఆశ్రయం వెతుక్కున్నారు. నేను కూడా విశ్రాంతి తీసుకోడానికి శుభ్రమైన స్థలం కోసం వెతికాను గానీ ఏదీ దొరకలేదు. చివరకు ఆరుబయట ఒక చిరిగిన కొబ్బరి మట్ట కనిపించడంతో, దానిమీద పడుకుని చల్లగాలి ఆస్వాదిస్తూ రాత్రంతా ప్రశాంతంగా గడిపేయవచ్చని అనుకున్నాను.

ఆ మట్టమీద కూర్చోగానే, ఇసుకలో మెరుస్తున్న ఏదో వస్తువు అంచు నా కంట పడింది. దాన్ని చేతుల్లోకి తీసుకుని చూస్తే, విక్టోరియా రాణి ముఖముద్ర ఉన్న వెండి రూపాయి నాణెం కనిపించింది. అది దొరికినందుకు మొదట అమితానందం కలిగినా, ఎక్కడ ఏ చిక్కుల్లో పడతానోనన్న భయంతో నా ఆనందం కాస్తా ఆవిరైపోయింది. ఇది ఎవరిది? దీన్నెవరు పోగొట్టుకున్నారు? వాళ్లెవరో నేనెలా కనుక్కోవడం? ఈ నాణేన్ని అసలు యజమానికి ఎలా చేర్చడం? ఆ మనిషి ఎంత కంగారుపడుతుంటాడో

కదా! ఇలాంటి ఆలోచనలు నా మనసును ముంచెత్తి నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇలాంటి స్థితిలో నిద్ర ఎలా పడుతుంది? కొబ్బరి మట్టమీద కూర్చుని ఆలోచనల్లో మునిగిపోయి ఉండగా, యువ కాంగ్రెస్ నాయకుడూ గొప్ప వక్తా అయిన రాజకృష్ణ బోస్ నా వైపు నడుచుకుంటూ వచ్చారు. తెల్లవారే సమయం కావస్తోంది. పల్లెటూరి కోడి కూత పెట్టి లోకాన్ని నిద్రలేపడానికి సిద్ధమవుతోంది.

భారత జాతీయ కాంగ్రెస్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ అనే ఇద్దరు గొప్ప నాయకులు ఎలాగైతే వెలుగులోకి వచ్చారో, ఒరిస్సా కాంగ్రెస్ పార్టీలో కూడా జాదుమణి మంగరాజ్, రాజకృష్ణ బోస్ అనే ఇద్దరు చైతన్యవంతమైన యువ నాయకులు తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. కటక్ వీధుల్లో నడుం బిగించి యోధుల మాదిరిగా గంభీరంగా నడిచే వారిద్దరి నడకా చూడముచ్చటైన దృశ్యం. నేను నా జీవిత ప్రస్థానం ప్రారంభించిన వాణిజ్య సంస్థలో రాజకృష్ణ బాబు వాటాలు కొనుగోలు చేశారు. మా పరిచయం అక్కడే మొదలై, ఈనాటికి మరింత సన్నిహితంగా మారింది.

నా ముఖ కవళికల్ని బట్టి, ఏదో కారణం చేత నేను తీవ్రమైన ఆందోళనలో ఉన్నానని ఆయన పసిగట్టారు; 'ఇంత రాత్రివేళ వరకూ మెలకువగా ఎందుకున్నావు? భయమేస్తోందా?' అని అడిగారు.

నేను: ఔను.

బోస్: ఈ స్థలం ఏకాంతంగా, నిర్మానుష్యంగా ఉందని భయపడుతున్నావా?

నేను: కాదు.

బోస్: మరి దేనికి నీ భయం?

నేను: ముంచుకొస్తున్న ఒక ప్రమాదానికి భయపడుతున్నాను.

బోస్: ఏమిటది?

నాకు వచ్చిపడ్డ ఆ ప్రమాదం గురించి ఆయనకి వివరంగా చెప్పాను. కంగారు పడాల్సిందేమీ లేదంటూ రాజకృష్ణ బాబు ఆ విషయాన్ని నవ్వి కొట్టిపారేశారు. నన్నంతగా వేధిస్తున్న ఆ విషయానికి ఆయన ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో నేను

ఆయన వైపు విస్తుపోయి చూశాను. కానీ ఆయన వివరాలన్నీ చెప్పగానే, నీళ్లు చల్లినప్పుడు మంట ఆరిపోయినట్టుగా నా భయాలన్నీ పటాపంచలయ్యాయి.

రాజకృష్ణ బాబు మాట్లాడుతూ, 'నేను నేరుగా మహాదేవ్ దేశాయ్ (గాంధీజీ కార్యదర్శి) గుడారం నుంచే వస్తున్నాను. అక్కణ్ణుంచి నుండి బయటకు రాగానే నువ్వు కనిపించడంతో ఇటొచ్చాను. అక్కడ మహాదేవ్ బాబు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. ఏ వస్తువు దొరికితే నీకింత బెంగ పట్టుకుందో, సరిగ్గా అదే వస్తువు పోయిందని ఆయన ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మహాదేవ్ బాబుకు ఇవాల్టి లెక్కలు తేలడం లేదు. లెక్కల్లో ఒక రూపాయి తేడా వచ్చింది. ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అది ఎక్కడ ఖర్చయిందో ఆయనకు గుర్తుకు రావడం లేదు. గాంధీజీ సభలో ఉన్నప్పుడు, మహాదేవ్ బాబు సరిగ్గా ఈ కొబ్బరి మట్టమీద కూర్చునే నగదు పెట్టె లెక్కలన్నీ చూశారు. నీకిక్కడ ఇసుకలో దొరికిన ఆ నాణెం మహాదేవ్ బాబు చేతిలోంచి జారిపడి ఇసుకలో కూరుకుపోయి ఉంటుంది. ఇప్పుడు నాతో పాటు ఆయన దగ్గరకొచ్చి వచ్చి దీన్ని ఆయన చేతుల్లో పెట్టావనుకో. దీంతో మీ ఇద్దరి తలనొప్పి ఒకేసారి తీరి పోతుంది' అన్నారు.

సమస్య పరిష్కారం కావడంతో నేను ఊపిరి పీల్చుకున్నాను. రాజకృష్ణ బాబు వేగవంతమైన నడకతో సమానంగా అడుగులు వేయడం నాకు చాలా కష్టమైంది. గమ్యస్థానానికి చేరుకుని చూస్తే, అక్కడ మహాదేవ్ బాబు లోతైన ధ్యానంలో మునిగిన మునిలాగా నిశ్చలంగా కూర్చుని ఉన్నారు. చేతుల్ని చెంపలకు ఆనించి ఆలోచనల్లో మునిగిపోయి ఉన్నారు. రాజకృష్ణ బాబు వెనుక నుండి నేను ముందుకు వచ్చి ఆయనకు నమస్కరించాను. మహాదేవ్ బాబు నా నమస్కారాన్ని స్వీకరించారు.

ఆయన చేతుల్లోంచి జారిపడ్డ ఆ సొత్తు ఆయన చేతిలో పెట్టాను. తన చేతిలో మెరుస్తున్న ఆ నాణెం  చూసి ఆయన విస్మయం చెంది, రాజకృష్ణ బాబు వైపు ప్రశ్నార్థకంగా చూశారు. నన్ను మహాదేవ్ బాబుకు పరిచయం చేస్తూ, నాకా నాణెం ఎలా దొరికిందో రాజకృష్ణ బాబు పూసగుచ్చినట్టు చెప్పారు. మహాదేవ్ బాబు నాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అంతటితో ఆగకుండా, ఉదయం కాలకృత్యాలూ ప్రార్థనా ముగిశాక నన్ను గాంధీజీకి పరిచయం చేస్తాననీ, ఆ వెండి రూపాయి దొరికిన కథను ఆయనకు స్వయంగా వివరిస్తాననీ పట్టుబట్టారు.

తెలంగాపెంథాలో జరిగిన ఈ సంఘటన గురించి తను నడిపే పత్రికలో ఒక వ్యాసం రాయవలసిందిగా గాంధీజీని కోరతానని కూడా అన్నారు. అది మన దేశ పౌరుల వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడుతుందని చెప్పారు.

మహాదేవ్ బాబు గుడారం నుండి బయటకు వచ్చాక రాజకృష్ణ బాబూ, నేనూ చెరొక వైపు వెళ్లాం— నేను నా పాత స్థలానికి చేరుకుని ఆ కొబ్బరి మట్టమీద నడుం వాల్చగా, రాజకృష్ణ బాబు తన బృందంలోని ఇతర సభ్యుల వద్దకు వెళ్లిపోయారు.

ఇక నాకు నిద్రపట్టే ప్రసక్తే లేదు. కళ్లు తెరిచిపెట్టుకుని, మహాత్ముణ్ణి ఎప్పుడెప్పుడు కలుస్తానా అన్న ఆత్రుతతో అటూ ఇటూ దొర్లుతూ గడిపేశాను. సరిగ్గా అదే సమయంలో తెల్లవారిందని సూచిస్తూ ఆశ్రమంలో గంట మోగింది. మహాత్మాజీ తెలంగాపెంథా విడిచిపెట్టి తన తర్వాతి యాత్రను ప్రారంభించవలసి ఉన్నందున, గాంధీజీతో సహా అందరూ తమ కాలకృత్యాలు ముగించుకోడానికి పడకలు వదిలి లేచారు.

ఆ గంట శబ్దం నన్ను ఉలిక్కిపడేలా చేసింది. తగినంత ధైర్యం కూడగట్టుకోడానికి కొద్దిసేపు ఆ మట్టమీదే కూర్చున్నాను. కానీ నాలో అసహనం నన్నెక్కువసేపు నిమ్మళంగా కూర్చోనివ్వలేదు; అది నన్ను నేరుగా మహాదేవ్ దేశాయ్ గుడారానికి నడిపించింది. ఆ సమయానికి గాంధీజీ ఉదయపు ప్రార్థన ముగిసే దశలో ఉంది. నాణెం గురించిన వివరాలు మహాదేవ్ బాబు అంతకుముందే గాంధీజీకి నివేదించారు. ఇప్పుడు ఆయన నన్ను గాంధీజీ ముందుకు తోడ్కొని వెళ్లారు.

గౌరవమూ భయమూ రెండూ ఒకేసారి మనసులో కలిగినప్పుడు, మనుషులు తమను తాము ఒక గడ్డిపోచతో సమానంగా భావించి నేలమీద సాష్టాంగపడతారు. జగద్గురువు మహాత్మా గాంధీ పాదాల ముందర నేను ప్రణమిల్లినప్పుడు, బురద నుండి వికసించిన ఒక కమలంలా నన్ను నేను ఎంతో అదృష్టవంతుడిగా భావించుకున్నాను. గాంధీజీ ఎంతో మృదువైన స్వరంతో ఇలా అన్నారు:

'నీ స్వచ్ఛమైన అంతరాత్మ గురించీ, ప్రశంసనీయమైన శీల సంపద గురించీ మహాదేవ్‌జీ చెప్పగా విని నేను ఎంతో ముగ్ధుడనయ్యాను. నీలాంటి వ్యక్తులు ఎక్కువైతే, మన దేశ నలుమూలలా యువత కోసం చైతన్య సంఘాలను ఏర్పాటు చేసి జాతీయ శీలాన్ని సంస్కరించవచ్చు. అదే గనుక జరిగితే, నేను కలలుగన్న భారతదేశం అతి త్వరలోనే సాకారమవుతుంది. రామరాజ్యం (యుటోపియా) అనేది దివ్యమైనదే

అయినప్పటికీ, అది ఆకాశం నుండి ఊడిపడదు; ఈ గడ్డమీదే అది ప్రభవించి వికసించాలి. భారతదేశ ప్రజలు— రాజుగానీ ప్రజలు గానీ, పాలకుడు గానీ పాలితుడు గానీ— సత్యవంతులూ, ధర్మాత్ములూ, నిజాయితీపరులూ అయినప్పుడే భారతదేశం ఒక ఆదర్శరాజ్యంగా రూపాంతరం చెందుతుంది' అన్నారు.

బాపూజీ పలుకులనే అమృతాన్ని గ్రోలి, ఆయన పాదాలు తాకి సెలవు తీసుకున్నాను. బయటకు వచ్చేసరికి, చీకటి పలుచటి తెరలు వేగంగా తప్పుకుంటూ ఉదయపు అరుణ కిరణాలకు చోటిస్తున్నాయి. మామిడి తోపు పందిరి కింద వందలాది మంది ప్రజలు గుమిగూడి, గాంధీజీ తర్వాతి యాత్రలో ఆయన వెంటే నడవడానికి సిద్ధంగా ఉన్నారు; దారిలో ఎదురయ్యే ఎలాంటి కష్టనష్టాలనూ ఏమాత్రం లెక్క చేయకుండా, ఈ నవ్య పుణ్యక్షేత్రం వైపు ఇంకా ఎందరో జనం బారులు తీరుతూనే ఉన్నారు. ●

(**కృష్ణచంద్ర కర్** (1906-1995) నిఘంటుకర్త, బాలసాహిత్య రచయిత. ఆయన ఆత్మకథ 'హజిలా దినర స్మృతి' కటక్‌లోని గ్రంథమందిర్ ద్వారా 1991లో వెలువడింది. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన ప్రియంవదా పాల్ భువనేశ్వర్‌లో సిలికాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆంగ్ల అధ్యాపకురాలు. అనువాదకురాలూ, చిత్రకారిణీ కూడా.)

# వినోద్ కానుంగో

# గాంధీ పాదయాత్ర

**మేం** పిపిలీ, సియులాచకల మీదుగా సాగి బాలకటి చేరుకున్నాం. అక్కడ జనం పెద్ద ఎత్తున గుమిగూడారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన పూజారులూ, కొందరు పలుకుబడిగల వ్యక్తులతో సహా వేలాది మంది ప్రజలు బాపూజీని పట్టణానికి రమ్మని ఒత్తిడి చేశారు. కానీ బాపూజీ తన ప్రణాళిక మార్చుకోడానికి ఒప్పుకోలేదు. మేం నది దాటే సమయానికి జనసందోహం మరింత పెరిగింది. కళ్లు కనిపించనంతగా ధూళి ఆకాశాన్ని కప్పేసింది. నది లోపల ఇసుకతిన్నెలమీద ఒక సభ జరిగింది. ఏడెనిమిది వేల మంది ఆ సభకు హాజరయ్యారు. బాలకటి కంచు, ఇత్తడి పాత్రలకు ప్రసిద్ధి. అలాంటి పాత్రలు కొన్ని బాపూజీకి కానుకగా సమర్పించారు.

సభికులు నిశ్శబ్దమయ్యాక బాపూజీ వారినుద్దేశించి 'మానవ అహంకారమే అస్పృశ్యతకు మూలకారణం. క్షయవ్యాధిలాగే అస్పృశ్యత కూడా మనుషుల్ని లోలోపలే తినేస్తుంది. మనం ఈ వ్యాధికి బలి కాకూడదు. ప్రపంచమంతా మన వైపే చూస్తోంది. ఈ పాపాన్ని మనం కడిగేసుకోకపోతే లోకం మనల్ని అసహ్యించుకుంటుంది' అని అన్నారు. ఆయనింకా ఇలా చెప్పారు:

'నాకు డబ్బక్కర్లేదు. ఒక పైసా గానీ, పైసాలో నాల్గవ వంతైనా చాలు. ఒరిస్సాలో ఒక పేదవాడు ఇచ్చిన పైసా ఒక రూపాయి కంటే ఎంతో విలువైంది.'

'ఎవరినీ అంటరానివారిగా చూసే పాపానికి అగ్రవర్ణ హిందువులు ఒడిగట్ట కూడదు. ఇతరుల ఏవగింపుకీ, నిరాదరణకీ గురైనవారిని భగవంతుడే రక్షిస్తాడని భగవద్గీతలోనూ, మహాభారతంలోనూ, అన్ని పవిత్ర గ్రంథాల్లోనూ చెప్పారు. పాండవులు ద్రౌపదిని నిస్సహాయంగా వదిలేసినప్పుడు, భగవంతుడే ఆమెను

ఆదుకున్నాడు. రాయిలా పడి ఉన్న అహల్యకు శ్రీరామచంద్రుడు ప్రాణం పోశాడు. తోటి మనుషులచేత తిరస్కారానికి గురైనవాడే దేవుడికి స్వంతమవుతాడు.'

మేం సత్యభామపూర్ చేరుకున్నాం. మాతో పాటు నడుస్తున్న మీరాబెన్‌కు అంత దూరం నడవడం అలవాటు లేదు. ఆమె కాళ్లు నొప్పులు పెట్టాయి. దాంతో ఆమె తన కాళ్లకు గుడ్డలు కట్టుకుని నడిచారు. ఒక తోపులో సభ ఏర్పాటు చేశారు. అక్కడ గ్రామస్థులతో బాపూజీ ఎన్నో విషయాలు చర్చించారు.

సత్యభామపూర్‌లో గాంధీజీ పేదరికం తాలూకు దారుణ దృశ్యాలు చూశారు. ప్రజలు తమకు తోచినదంతా హరిజన నిధికి విరాళంగా ఇచ్చారు. ఒక నిరుపేద తానూ ఏదో ఒకటి ఇవ్వాలని అనుకున్నాడు. మహాత్మునికి విరాళమిస్తే పుణ్యం వస్తుందనీ, తరించవచ్చనీ అతని భావన. కానీ అతడి దగ్గర ఇవ్వడానికి ఏమీ లేదు. ఒక జమీందారు దగ్గర ఒక పైసా అడుక్కుని తెచ్చి మహాత్ముడి చేతిలో పెట్టాడు. ఊరి పిల్లలంతా కలిసి పదమూడు రూపాయలు పోగుచేసి, హరిజన నిధికి అందించారు.

గాంధీజీని ఒక్కసారి దర్శించుకుందామని జనం రోజంతా వేచి చూస్తూనే ఉన్నారు. ఒకటే జనసందోహం గుమిగూడింది. సుదూర ప్రాంతాల నుంచీ మహిళలు ఎడ్లబళ్ళ మీద వచ్చారు. అక్కడ చేరిన వారంతా వృథాగా కాలం గడపడం గాంధీజీ గమనించారు. మధ్యాహ్నం వేళ నూలు వడకవలసిందిగా మహిళా కార్యకర్తలకు చెప్పారు. ప్రజల్ని దగ్గరకు పిలిచి వారితో 'చూడండి, మీరంతా ఊరికే కాలం వృథా చేస్తున్నారు. మన ప్రజలు ఎంత పేదరికంలో ఉన్నారంటే, మన మహిళా వాలంటీర్లు విరాళాల కోసం వెళ్లినప్పుడు వాళ్లు కేవలం ఒక పహులా, అంటే పైసాలో నాల్గోవంతు, మాత్రమే ఇస్తున్నారు. తమ దగ్గర ఇవ్వడానికి ఏమీ లేకపోవడం వల్లే అలా ఇస్తున్నారు. వాళ్లు అంత నికృష్ట దారిద్ర్యంలో ఉన్నారు. అలాంటప్పుడు మనం ఇలా ఖాళీగా కూర్చోవడం ఎలా సమర్థనీయం?' అనడిగారు.

సత్యభామపూర్‌లో ఒక పెద్ద హరిజనవాడ ఉంది. బాపూజీ ఎక్కడ మజిలీ చేసినా హరిజనుల్ని తమతో కలిసి భోజనానికి రావాల్సిందిగా ఆహ్వానించమని పురమాయించేవారు. ఆ ప్రకారమే భోయీలను ఆహ్వానించాం, తాము వస్తామని వాళ్లు మాటిచ్చారు. కానీ భోజన సమయానికి ఎవరూ రాలేదు. తమకు వడ్డించే భోజనాన్ని పానా, కందరా కులాలవాళ్లు ముట్టుకున్నారని తెలిసి వాళ్లు రాలేదని తేలింది.

బౌరీలు హరిజనులు అన్న మాట నిజమే, అగ్రవర్ణాలవాళ్లు వారిని తాకరు. అయినా సరే, పానాల కంటే కందరాల కంటే తాము ఉన్నతులమని వారి భావన. అంతటి తక్కువ కులాలవాళ్లు ముట్టుకున్న భోజనం తింటే తమ కులం పోతుందేమోనన్న భయం వారిది.

ఈ విషయం తెలుసుకున్న గాంధీజీ దిగ్భ్రాంతి చెందారు. కులం పోతుందన్న భయం ప్రజల్ని ఎంతగా పట్టిపీడిస్తోందంటే, ఎంతో ప్రేమా ఆప్యాయతలతో ఆహ్వానించినా సరే కలిసి భోజనం చేయడానికి కూడా రాలేకపోతున్నారు!

ఎండాకాలంలో మామిడి చెట్లకు 'ఆంబడాణి' అనే పురుగులు పడతాయి. గాంధీజీ ఒక మామిడి తోపులో విడిది చేశారు. మండుటెండ వేడిమికి తోడు ఆ పురుగుల బెడద కూడా చేరడంతో గాంధీజీకి ఏమాత్రం కుదురు లేకుండా పోయింది. దాంతో ఆయన ఒక మర్రిచెట్టు వద్దకు వచ్చి, దాని కింద కూర్చున్నారు.

కుష్టువ్యాధి సోకిన ఒక బౌరీ కులస్తుడు గాంధీజీ దగ్గరకు రావడానికి సాహసించలేకపోయాడు. కాస్త దూరం నుండే ఆందోళనగా చూస్తూ ఉండిపోయాడు. గాంధీజీ ఆయన్ను దగ్గరకు పిలిచి, రోగ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భింగార్‌పూర్ నుండి వైద్యుణ్ణి పిలిపించి, అతడికి మందులిప్పించారు. అతనికి అన్నంతో పాటు వస్త్రాలు కూడా ఇచ్చారు. అన్నమూ బట్టలూ కూడా ఇచ్చారు.

**ఆలయంలోకి హరిజనుల ప్రవేశం**

గాంధీజీ పాద యాత్ర గురించి 'ది సమాజ్' ప్రత్యేక విలేకరి ఒక సమగ్ర నివేదిక అందించారు. ముందు రోజు రాత్రే సుదూర ప్రాంతాల నుండి బలిఅంతాకి జనం వచ్చారు. కటక్ నుంచి ఎంతోమంది ప్రయాణమై వచ్చి, పాదయాత్రలో పాల్గోడానికి అక్కడ చేరారు. కటక్ ప్రజల తరఫున విద్యారత్న బాలుకేశ్వర్ ఆచార్య, లింగరాజ్ బాబు, సత్యనారాయణ్ బాబు పాదయాత్రికులకు అభినందనలు తెలపడానికి వచ్చారు.

పాదయాత్రలో ఎంతోమంది పాల్గోడంతో గాలంతా దుమ్ము ఆవరించింది. అందరి బట్టలమీదా దుమ్ము పొర పేరుకుపోయింది. ఆరుగురు వాలంటీర్ల సాయంతో మహతాబ్, గోపబాబులు దారి సుగమం చేయడానికి అందరికంటే ముందు పరుగు తీశారు. బాపూజీ కూడా ఒక చిన్నపిల్లవాడిలా పరిగెత్తడం మొదలుపెట్టారు. వందలాది మంది ప్రజలు 'హరిబోల్' అంటూ నినదిస్తూ రొప్పుతూ ఆయన వెంటే పరుగుతీశారు.

బలిఅంతాలో హరిజనులను ఆలయంలోకి అనుమతించే మహోత్సవం జరగాల్సి ఉంది. హరిజనులు అడుగుపెట్టడంకోసం ఆలయం తెరిచి ఉంచడానికి ఆలయ ధర్మకర్తలు అప్పటికే అంగీకరించారు. కానీ ఆ ఆలయాన్ని నిత్యం దర్శించుకునేందుకు అక్కడ హాజరైన భక్తుల అభిప్రాయం కూడా తెలుసుకోవాలని గాంధీజీ భావించారు. మొదట్లోనే ఆయనొక విషయాన్ని స్పష్టం చేశారు: 'ఈ ఆలోచనని సమర్థించే అగ్రవర్ణ హిందువులు మాత్రమే చేతులెత్తి తమ ఆమోదం తెలపండి, హరిజనులు చేతులెత్తవలసిన అవసరం లేదు' అన్నారు.

ఆ తర్వాత ఆయన, 'ఈ రోజు నుండి ఈ ఆలయం హరిజనుల ప్రవేశానికి తలుపులు తెరిచింది. నేనింకా మూలవిరాట్టుని చూడలేదు. ఆ విగ్రహం చాలా అందంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు ఆలయంలోకి ప్రవేశించి స్వామిని కళ్లారా దర్శించుకుంటాను' అని ప్రకటించారు.

'అనాదిగా మనం కాపాడుకుంటూ వస్తున్న ఆలయ భావనను ప్రజలకు వివరించాలి. గతంలో ఆలయమే మనకు సర్వస్వంగా ఉండేది. గుడిలోపల పాపం చేయాలన్న ఆలోచన కూడా మన మనసుల్లోకి వచ్చేది కాదు. మునులూ ఋషులూ అక్కడ ధ్యానం చేసేవారు; వాతావరణమంతా ఎంత పవిత్రతతో నిండి ఉండేదంటే, అక్కడున్నప్పుడు ఎలాంటి మన మనసుల్ని ఎలాంటి చెడు ఆలోచనలూ తాకేవి కావు. గుడికి అనుబంధంగా పాఠశాల ఉండేది. ఆలయ ప్రాంగణంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేవారు. అంతేకాకుండా తాము పండితులు కావాలనుకునే విద్యార్థులకి సంస్కృతం బోధించేవారు. సత్సంగం దొరికే పవిత్ర స్థలమది. ఆ మహానుభావులు ఎల్లప్పుడూ లోకకల్యాణాన్నే కాంక్షించేవారు. గుళ్లకు అనుబంధంగా ఉండే ధర్మశాలలు పేదల ఆకలి తీర్చేవి. ప్రతి శుభకార్యమూ ఆలయంతో ముడిపడి ఉండేది. ఈ ఆలయ నిర్వాహకులు కూడా వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకునే దీన్ని నడిపిస్తారని ఆశిస్తున్నాను. ఆలయం క్షీణిస్తే, ధర్మం కూడా క్షీణిస్తుంది. హిందూ ధర్మం క్షీణించిందన్న నిజాన్ని ఎవరు కాదనగలరు? పూజారులకి సంస్కృతం రాదు. స్వార్థంతో మనందరి కళ్ళూ మూసుకుపోయాయి. ఈ రోజుల్లో ఆలయాలకు అనుబంధంగా పాఠశాలలు కనిపించడం అరుదైపోయింది. గుడిలో అడుగుపెట్టినప్పుడు కలగవలసిన దివ్య భావనలు ఇప్పుడు మనసుల్లో మెదలడం లేదు. గుడి ఎంత బోసిపోయిందో, మన జీవితాలూ అంతే శూన్యంగా మారాయి.'

'ప్రతి ఒక్కరూ సాయంత్రం వేళ గానీ, పడుకునే ముందర గానీ భగవంతుణ్ణి ప్రార్థించాలి. పగటిపూట చేసిన పాపాలకు ఆయన్ని క్షమాపణ వేడుకోవాలి. పొద్దున్నే లేవగానే అంతరంగం ప్రక్షాళన చేసుకోవాలి. శరీరానికి ఆహారం ఎంత అవసరమో, ఆత్మకు భగవత్ ప్రార్థన అంత అవసరం. ఆ అనుభూతి నిజంగా అనిర్వచనీయమైంది.'

సత్యభామపూర్‌లో తాము భోజనానికి ఆహ్వానించినా కూడా హరిజనులు రాని సంఘటనని ఆయన గుర్తుచేశారు.

'నిజానికి వాళ్ళు అక్కడ భయపడ్డానికేమీ లేదు. మేమే స్వయంగా వండి వారికి వడ్డించేవాళ్లం. ఆ అమాయకులకు ఏం చేయాలో పాలుపోలేదు. వారిలో ఈనాటికీ అలాంటి వైఖరి ఉండటానికి మనమే బాధ్యులం. మానవాళిని హెచ్చుతగ్గులుగా విభజించడం నేర్పింది మనమే. ఎక్కడ తినాలో, ఎక్కడ తినకూడదో చెప్పే శాస్త్ర నియమాలు మన దగ్గరున్నాయి. అగ్రవర్ణాలవాళ్లు విదిలించిన ఎంగిలి మెతుకులు తినే హరిజనులు, స్వచ్ఛమైన మనస్సుతో పెట్టిన ఆహారం మాత్రం ముట్టుకోలేక పోతున్నారు. ఈ చీకటి లోంచి మనం బయటపడకపోతే, మనతో పాటు మన ధర్మం కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే నేను ఈ యాత్ర చేపట్టాను. నేను బతికి ఉన్నంత కాలం ఈ విషయం చెప్తూనే ఉంటాను' అన్నారు.

సభ ముగిశాక గాంధీజీ ఆలయంలోకి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అక్కడున్న వారందరికీ ప్రసాదం పంచారు.

**తూర్పూ పడమరా**

పాదయాత్రలో గాంధీజీ ఎక్కడ అనారోగ్యం పాలవుతారోనని మొదట్లో మేం భయపడ్డాం. ఆయనెప్పుడూ ఒక జనసంద్రం మధ్యనే ఉండేవారు. శరీరం నిండా దుమ్ము పేరుకు పోయేది. జనాల తాకిడి వల్ల కాస్త విరామం కూడా దొరక్క కొన్నిసార్లు ఆయన భోజనం కూడా మానేయవలసి వచ్చేది. నారింజ రసం తీసుకోవడం కూడా మానేశారు. ఇన్ని ఇబ్బందులున్నా ఆయన బరువు ఐదు పౌండ్లు పెరిగారు.

'ఈ యాత్రానుభవం ఎంతో అద్భుతమైంది' అన్నది ఆయన సొంత మాట.

యాత్రికులు తెలంగాపెంథా, కాజీపట్నా చేరుకునేసరికి ప్రజల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కటక్ నుండి వందలాది మంది ప్రజలు సైకిళ్లమీద అక్కడికి వచ్చారు. తమతో పాటే భోజనాలూ తెచ్చుకున్నారు. కటక్ మహిళలు కూడా వచ్చారు.

బాపూజీకి సమర్పించిన సన్మానపత్రంలో ఇలా రాసి ఉంది:

'ఇక్కడ అస్పృశ్యత ఆచరణలో ఉంది; హృదయమూ కఠినంగా మారింది.'

బాపూజీ ఆ వాక్యాన్ని ఉటంకిస్తూ ఇలా అన్నారు: 'ఇందులో ఆశ్చర్యపడవల సిందేమీ లేదు. కోట్లాదిమంది ప్రజల్ని జంతువుల్లా చూస్తూ మనం వారిని వెలివేశాం. వారిపట్ల అన్యాయంగా ప్రవర్తిస్తూ, వారిని సరిగ్గా చూడటం లేదు. ఇంతకంటే క్రూరత్వం మరొకటి ఉంటుందా? దీనివల్ల మన మధ్య ఐక్యత నశించి, కలహాలూ, విభేదాలూ పెరిగిపోతాయి. మానవ ప్రవర్తనలోనే అస్పృశ్యత అత్యంత క్రూరమైన రూపం. దానికి మతపరమైన ఆమోదం లభించింది కాబట్టే నేనీ మాట అంటున్నాను. ఒకప్పుడు ఇలాంటి మాటలు సభల్లో మాట్లాడటానికి కూడా వీలుండేది కాదు. భగవంతుడి దయవల్ల ఈ రోజు పల్లెల నుండి ఎంతోమంది ప్రజలు నా మాట వినడానికి ఇక్కడికి వచ్చారు. అస్పృశ్యతకు మత సమ్మతి లేదని వాళ్ళిప్పుడు గ్రహించారు; కానీ తరతరాలుగా కొనసాగుతున్న తమ అలవాట్లు మార్చుకోడానికి మాత్రం సిద్ధంగా లేరు. ఈ క్రూరత్వం మన జీవితాల్లోని అన్ని రంగాలమీదా తన ముద్ర వేసింది. నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను: మనం ఈ దురాచారం వదులుకోకపోతే, భగవంతుడు మనల్ని ఎన్నటికీ క్షమించడు, మనం నాశనమైపోతాం. ప్రతి ఊరిలోనూ హరిజన పిల్లలు బడికి వెళ్లడం నాకు తెలుసు. కానీ వారిని విడిగా దూరంగా కూర్చోబెడతారు. ఈ ఏర్పాటు చూసి ఏ ఉపాధ్యాయుడికీ సిగ్గనిపించదు, వాళ్ళ తల్లిదండ్రులకు కూడా లజ్జ కలగదు. దీనివల్ల విద్యార్థుల ముందు అత్యంత తప్పుడు ఆదర్శాలు నిలబెట్టిన వాళ్ళమవుతున్నాం. పిల్లలకు ఏం నేర్పిస్తున్నారు? తాము కలలో కూడా ఊహించని చెడు భావనలు వాళ్లకు బళ్ళల్లో నూరిపోస్తున్నారు. ఈ అసహ్యకరమైన ఆచారం సమసిపోయేదాకా నిశ్చింతగా నిద్రపోవద్దని నా సోదర సోదరీమణులందరికీ పిలుపు నిస్తున్నాను. హరిజనుల్లో కాస్త చైతన్యం వచ్చి ఉంటే, ఇతరులు తమపట్ల అస్పృశ్యత పాటించకుండా వాళ్లే అడ్డుకుని ఉండేవారు.'

'తూర్పు పడమరా వేర్వేరనీ, అవి ఎన్నటికీ కలవవనీ సన్మానపత్రంలో పేర్కొన్నారు. నేనే ఆ భావనకు ప్రచారకుడినని కూడా అన్నారు. అలాంటి పని నేనెంతమాత్రం చేయదలచుకోలేదు. ఇది నాకేమీ ప్రశంస కాదు. నిజంగా నేనలా చేసి ఉంటే, నన్ను తప్పుపట్టాల్సిందే. నేను అద్వైతాన్ని నమ్ముతాను. తూర్పు పడమరల మధ్య గానీ, ఉత్తరదక్షిణాల మధ్య గానీ నేనెలాంటి భేదాన్నీ గుర్తించను. ఎలా గుర్తించగలం?

హెచ్చుతగ్గుల అంతరాలను రూపుమాపాలనుకునే వ్యక్తి పశ్చిమ దేశాలకు శత్రువు ఎలా కాగలడు? నాకు చిన్నప్పటి నుంచీ కూడా అలాంటి దృష్టితో పరిచయమే లేదు; కలలో కూడా నేనలా ఆలోచించలేదు.'

'నేను ముందే చెప్పాను, ఇప్పుడు మళ్లీ చెబుతున్నాను: మనం పడమటి దేశాల్ని గుడ్డిగా అనుకరించాల్సిన పనిలేదు. పాశ్చాత్య నాగరికత ఇంద్రియ భోగాలకు ప్రాధాన్యతనిస్తే, ప్రాచ్య నాగరికత త్యాగాన్ని నొక్కి చెబుతుంది. ఈ ప్రపంచంలో అర్థవంతంగా జీవించాలంటే లౌకిక వాంఛల్ని త్యజించాలని ఉపనిషత్తులు ప్రబోధిస్తున్నాయి. అవి తూర్పు పడమరల మధ్య భేదాన్ని అంగీకరించవు. అది కేవలం దృక్పథాల మధ్య ఉన్న తేడా మాత్రమే. ఈ రోజు నేను మీకు చెప్పిన విషయంతోనూ, ఎప్పుడో 1908లో నేను చెప్పిన దానితోనూ పశ్చిమ దేశాలకు చెందిన వేలాది మంది ఏకీభవిస్తున్నారు. నాకు, మీగ్గాని చెప్పే హక్కు ఉంటే నేనిదే చెప్తాను: తూర్పు పడమరల మధ్య భేదాన్ని తుడిచిపెట్టండి. అస్పృశ్యతను రూపు మాపడమంటే హెచ్చుతగ్గుల అంతరాల్ని తుడిచిపెట్టడమే. మన హరిజన సోదరులు కేవలం ఒక నెపం మాత్రమే. ఈ మహాయజ్ఞంలో మిమ్మల్ని మీరు సమర్పించు కోవాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను.'

కాట్జూరి నదికి ఒకవైపు కాజీపట్నా, మరోవైపు కటక్ ఉన్నాయి. కటక్‌లో బస చేసే ఉద్దేశం గాంధీజీకి లేదు. ఆయన సభ ముగిశాక నేరుగా స్టేషన్‌కు వెళ్లిపోయేలా ఏర్పాట్లు జరిగాయి. అందుకే కటక్ ప్రజల తరఫున కాజీపట్నాలోనే ఆయనకు సన్మానం చేశారు.

జనం తాకిడి నుండి ఆయన్ను కాపాడటానికి ఒక వినూత్న ఉపాయం ఆలోచించారు. తెలంగాపెంథా నుండి కటక్ వెళ్లే దారంతా భజనలు చేసుకుంటూ సాగారు. దారిన జనం పూలవర్షం కురిపించారు. కటక్ నుండి వచ్చిన మహిళలు తమ ఆభరణాలు సమర్పించారు; ఆ వృద్ధుడు తానే స్వయంగా వాటిని వేలం వేయించారు.

కటక్ వెండి నగిషీ పని ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఆ కళాఖండాల్ని చూసి బాపూజీ ఎంతో మురిసిపోయారు. భికారీ బాబు కుటీర పరిశ్రమ తరఫున హరిహర్ మహాపాత్ర కొంత పట్టుదారాన్నీ, కొన్ని బొమ్మల్నీ, భారతదేశ పటాన్నీ బాపూజీకి బహూకరించారు.

సభ నుండి తిరిగి వస్తున్న మార్గంలో తమ కర్మాగారాన్ని సందర్శించవలసిందిగా ఆయన బాపూజీని ఆహ్వానించారు. వెళ్లడానికి బాపూజీ సంతోషంగా ఒప్పుకున్నారు. తోలు పరిశ్రమ గురించి తనకున్న సందేహాల్ని హరిబాబు నివృత్తి చేసుకోగోరారు. బాపూజీ హరిజనోద్యమం ప్రారంభించినప్పుడు ఆవు చర్మాల వ్యాపారాన్నీ, కోళ్ల పెంపకాన్నీ వ్యతిరేకిస్తున్నారని ఒక వదంతి వ్యాపించింది. ఫలితంగా వాటిమీదే ఆధారపడి జీవించే నిరుపేదలు నష్టపోయారు.

హరిబాబు ఈ విషయాన్ని గాంధీజీ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందిస్తూ, 'అలా ప్రచారం చేయడం తప్పు. తోలు వ్యాపారం కొనసాగించమనే నేను వారికి సలహా ఇస్తాను. కానీ కోళ్ల పెంపకం చేపట్టమని మాత్రం వారికి సలహా ఇవ్వను' అన్నారు.

కోళ్ల పెంపకం చేసేవారికి మంచి లాభాలు వస్తాయనీ, దానికి పెద్దగా పెట్టుబడి కూడా అవసరం లేదనీ ఆయనకు చెప్పారు. అయితే సంపర్కం లేకుండానే గుడ్లు ఉత్పత్తి చేయవచ్చనీ, ప్రాణం లేని అలాంటి గుడ్లు కూడా సాధారణ గుడ్లలాగే బలవర్ధకమైనవనీ చెప్పినప్పుడు బాపూజీకి నమ్మకం కుదరలేదు. 'అదే గనుక నిజమైతే, నాకేమీ అభ్యంతరం లేదు. కానీ వాళ్లు అలా చేయగలరా?' అనడిగారు బాపూజీ. శాంతినికేతన్‌లో ఆ పని సులభంగానే చేస్తున్నారని మాలతీ దేవి ఆయనతో చెప్తే, 'మంచిది, అలా చేయగలిగితే హరిజనులూ తక్కినవాళ్ళూ కూడా ఈ వ్యాపారం చేపట్టవచ్చు' అని అన్నారు.

గాంధీజీ హరిజన యాత్ర ప్రభావం విస్తృతంగా కనిపించడం మొదలయ్యాక, కొందరు సనాతన హిందువులకు గుబులు పట్టుకుంది. లాలానాథ్ అనే సనాతనవాది దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో గాంధీజీకి నల్ల జెండాలు చూపించాడు. అతడు కటక్ కూడా వచ్చాడు. కొంతమంది మనుషుల్నీ జెండాలనూ పోగుచేశాడు. కానీ కటక్‌లో నిరసన చేపడితే ప్రజలు తీవ్ర ఆగ్రహంతో తనమీద దాడి చేస్తారని అతడు గ్రహించాడు.

అందుకని గాంధీజీ ఆయన్ను నేరుగా కాజీపట్నాకు రమ్మనీ, అక్కడ అవసరమైతే అతడి రక్షణ కోసం ప్రత్యేక వాలంటీర్లను నియమిస్తామనీ, అతడి అభిప్రాయాల్ని చెప్పుకోడానికి తగిన అవకాశం ఇస్తామనీ సూచించారు. తనకు నల్ల జెండాలు చూపించాలనుకున్న వ్యక్తికి సైతం సహాయం చేయడం కేవలం సత్యారాధకుడికే సాధ్యమవుతుంది!

సాయంత్రం వేళ ఎంతో శ్రమతో అతణ్ణి కాజీపట్నాలోని కాట్జూరి ఇసుక తిన్నెలమీదకి తీసుకువచ్చారు. భారీ జనసందోహం గుమిగూడింది. ఆ రోజు యావత్ కటక్ నగరమూ కాట్జూరి ఇసుక తిన్నెలమీదకి వచ్చి వాలిందా అన్నట్టుగా ఉంది.

మాట్లాడటానికి అవకాశం ఇస్తామని లాలానాథ్‌కు గాంధీజీ అంతకుముందే హామీ ఇచ్చారు. సభను ఉద్దేశించి ప్రసంగించడానికి ముందు గాంధీజీ అతడి కోసం వెతికారు. అతడు ఎక్కడా కనిపించలేదు. గాంధీజీ కాసేపు ఆందోళన చెందారు. చేతుల్లో నల్ల జెండాలు పట్టుకున్న ఇరవై ఇరవై ఐదు మంది వ్యక్తులు నది కట్ట దిగి రావడం కనిపించింది.

గాంధీజీ మాట్లాడుతూ, 'కాశీ నుండి పండిట్ లాలానాథ్ ఆయన మిత్రులూ కటక్ వచ్చారు. వాళ్లు మనకు నల్ల జెండాలు చూపించడానికి ప్రయత్నించవచ్చు. అలా చేసినా సరే, వారిని నిందించకండి. వారి పట్ల వినయంతోనూ మర్యాదతోనూ ప్రవర్తించండి. వారికి నచ్చిన చోట వారిని కూర్చోనివ్వండి. వారిక్కడికే రావాలనుకుంటే రానివ్వండి' అన్నారు.

జనం విపరీతంగా ఉండటంతో లాలానాథ్ ఆయన అనుచరులూ ఆ తోపులాట దాటుకుని సభాస్థలికి రావడం అంత తేలిగ్గా కనిపించలేదు. వారిమీద ప్రజలు విరుచుకుపడకుండా కాపాడటానికి పోలీసులు రక్షణగా ఉన్నారు. అదంతా చూసి జనానికి చాలా చిరాగ్గా అనిపించినప్పటికీ మౌనంగానే ఉండిపోయారు.

సత్యనారాయణ్ బాబు వేదికమీద కూర్చున్నారు. లాలానాథ్‌నూ ఇతరులనూ వేదిక దగ్గరకి తీసుకు రాడానికి బాపూజీ ఆయన్ను పంపించారు. 'మనం ఆలయ ప్రాంగణంలోనే ప్రాణాలు విడుద్దాం' అనే పాట పాడుకుంటూ వారు సభ దగ్గరికి వచ్చారు. అక్కడికి చేరుకునేసరికి లాలానాథ్ చెమటలు కక్కుతున్నాడు. బాపూజీ తలవంచి చిరునవ్వుతో, 'నేను ఎవరి గురించైతే మీకు చెబుతున్నానో ఆ పండిట్ లాలానాథ్ వచ్చేశారు. ఆయన మాట్లాడనివ్వండి. ఆయన ప్రసంగం ముగిశాక నేను మీతో మాట్లాడతాను. నా మాటలు ఎంత శ్రద్ధగా విన్నారో, ఆయన మాటలనూ అంతే ఏకాగ్రతతో వినండి' అన్నారు.

లాలానాథ్ మాట్లాడటానికి లేచాడు. అంతటా నిశ్శబ్దం ఆవరించింది. నిమ్న కులాలవారి ఆలయ ప్రవేశాన్ని వ్యతిరేకించినందుకు జనం అతణ్ణి దుండగుడని

పిలిచారు. తన వాదన సమర్థించుకోడానికి అతడు శాస్త్ర ప్రమాణాలు ఉటంకించడానికి సిద్ధపడ్డాడు.

లాలానాథ్ మాటలు ఓపికగా విన్నందుకు బాపూజీ సభికులకు కృతజ్ఞతలు తెలిపారు. 'పండిట్ లాలానాథ్ మనతో రెండు విషయాలు పంచుకున్నారు. ఆయన్ను దుండగుడని అన్న వ్యక్తి తప్పు చేశాడు. ఒక సంస్కర్త ఆయన్ను అలా అని ఉంటే నేను చింతిస్తున్నాను. నన్ను ప్రభావితం చేయడానికీ, నా హృదయాన్ని మార్చడానికీ పండిట్ లాలానాథ్‌కూ ఆయన మిత్రులకూ పూర్తి హక్కు ఉంది. నా వంతుగా నేనూ వారి హృదయాల్ని మార్చడానికి ప్రయత్నిస్తాను. నా ప్రయత్నంలో నాకు సహకరించండి. నేను సనాతనులకు బాధ కలిగించానని ఆయన అన్నారు. కానీ నా దృష్టిలో నేనూ ఒక సనాతనుడినే. చర్చలకూ సంవాదాలకూ నేను వ్యతిరేకం కాదు; పైగా నేను దానికి అనుకూలం. వారితో చర్చించడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నాను. వాళ్లు గనుక నా హృదయాన్ని మార్చగలిగితే, నేను వారి వాదననే అంగీకరిస్తాను' అన్నారు.

'నన్ను రెండోసారి ఇక్కడికి ఆహ్వానించి ఒరిస్సా కాంగ్రెస్ కార్యకర్తలు ఒక గొప్ప బాధ్యతను భుజానికెత్తుకున్నారు. ఈ ఉద్యమం విజయవంతం కావడానికి కార్యకర్తలతో పాటు గ్రామస్థులు కూడా అంకితభావంతో పనిచేయాలి. హరిజనోద్యమం గురించి హిందువులకు సందేహాలుంటే, వినయపూర్వకంగా వారి సందేహాలను నివృత్తి చేయాలి' అన్నారు.

గాంధీజీకి ఒక విరాళాల బొత్తి సమర్పించారు. హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆయన ద్వారా సర్టిఫికెట్లు అందజేసిన తర్వాత సభ ముగిసింది.

శ్రీరామచంద్ర భవన్‌లో మహిళా సభ ఏర్పాటు చేశారు. సరళా దేవి స్వాగత పత్రం చదివాక బాపూజీ సభికులనుద్దేశించి మాట్లాడారు. ఆ తర్వాత ఆయన భికారీ బాబు కుటీర పరిశ్రమ సందర్శించడానికి వెళ్లారు. ఆయనకు అందులోని అన్ని విభాగాల్నీ చూపించడానికి చాలా సమయమే పట్టింది.

అప్పటికి బయట మళ్ళా ఐదారు వేల మంది జనం గుమిగూడారు. వారంతా గాంధీజీ వెంట స్టేషన్ దాకా వస్తే కటక్ నగరమంతా ఎర్రటి దుమ్ముతో నిండిపోతుందని భావించారు. దాంతో జనానికి తెలియకుండా గాంధీజీ మరో మార్గం గుండా వెళ్లారు.

ఒక చిన్న టార్చిలైటూ, ఒక లాంతరూ, కొద్దిమంది మనుషులు మాత్రమే ఆయన వెంట నడిచారు. జనం చెదిరిపోయారు. ఆ రాత్రి గాంధీజీ రైలెక్కి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి హాజరు కావడం కోసం పాట్నా బయలుదేరారు. ●

(**వినోద్ కానుంగో** (1912-1990) విజ్ఞానసర్వస్వకర్తగా సుప్రసిద్ధులు. బాలసాహిత్య రచయిత. ఆయన ఆత్మకథ 'పథ పచే పచే అపథువా' ని వసుంధరా ప్రకాశని వారు 1987లో ప్రచురించారు. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన జెహరా జబీన్ కటక్‌లో క్రైస్ట్ కాలేజీలో ఆంగ్ల అధ్యాపకురాలు.)

## వినోద్ కానుంగో

## జీవితానికొక పాఠం

**హరిజనోద్ధరణ** కోసం బాపూజీ 1934లో ఒరిస్సాలో పర్యటించారు. ఈ పర్యటనకు ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. భారతదేశంలో బ్రిటిష్ అధికారులు గాంధీజీని 'గడుసు మనిషి' అని వ్యవహరిస్తుండటం కొంతవరకు సరిపోయేదే అయినా, వాళ్ళే ఉద్దేశంతో అన్నారో దానికిది సరిగ్గా వ్యతిరేకార్థాన్ని సూచిస్తుంది. 1934 నాటికి ప్రజలు అలసిపోయి, నీరసించి ఉన్నారని గాంధీజీ చాలా బాగా గ్రహించారు. 1932 నాటి స్వాతంత్ర్య పోరాటం ఎటూ తేలకుండా పోయింది.

రాజకీయ ప్రచారాలూ, సభలూ మళ్లీ ఎన్నో అరెస్టులకే దారితీస్తాయి— చివరకు గాంధీజీనే స్వయంగా అరెస్టయ్యే అవకాశమూ ఉంది. గతంలో ఆయన ఎన్నోసార్లు జైలుకెళ్లారు. జైల్లో ఉన్నప్పుడు ఏదో ఒక నెపంతో నిరాహారదీక్ష చేయడం, దాంతో ప్రభుత్వం ఆయన్ను విడుదల చేయడం పరిపాటైంది. ఇలాంటి పిల్లి-ఎలుక ఆటలు ఆడటం గాంధీజీ ఉద్దేశం కాదు. ఆయనో కొత్త మార్గం కనుక్కోవలసి వచ్చింది. ప్రజలతో మళ్లీ సంబంధాలు పునరుద్ధరించుకోవలసి ఉంది. బహిరంగ సభలకు మరింతమంది ప్రజలు తరలివచ్చేలా ప్రోత్సహించడానికి ఒక మార్గం వెతకాలి. అందుకనే భారతదేశమంతటా పర్యటించి అస్పృశ్యతా నివారణ సందేశం వ్యాప్తి చేస్తానని ఆయన ప్రకటించారు. ఆయన చేపట్టింది రాజకీయ ఉద్యమం కాదు కాబట్టి, ప్రభుత్వానికి మనసులో ఇష్టం లేకపోయినా ఆయన్ను అడ్డుకోడానికి ఎలాంటి కారణమూ దొరకలేదు.

1934 మే నెలో ఆయన ఒరిస్సాకు రావలసి ఉంది. ఆ పర్యటనలో ఆయన మధ్యప్రదేశ్ నుంచి సంబల్‌పూర్ చేరుకుంటారు. సంబల్‌పూర్ నుండి అనుగుల్

మీదుగా మేరముండలి రైల్వే స్టేషన్‌కి కారులో వెళతారు. అక్కడి నుండి తాల్చేర్ రైలెక్కి పూరీ చేరుకుంటారు.

ఆ రోజుల్లో ఒరిస్సా నుండి వెలువడే ఏకైక దినపత్రిక 'ది సమాజ్'. లింగరాజ్ మిశ్రా దానికి సంపాదకుడు. రాధానాథ్ రథ్ కూడా ఆయనతో పాటే పనిచేసేవారు. ఆ పత్రికకి ఇలాంటి కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా రిపోర్టింగ్ చేసే విలేకరులెవరూ లేరు. గాంధీ ఎక్కడికి వెళితే అక్కడికి ఎవరో ఒకరు ఆయన వెంటే వెళ్లాలని ఆ ఇద్దరూ నిర్ణయించారు. ఆయన ప్రసంగాల్నీ, పర్యటన విశేషాల్నీ 'ది సమాజ్'లో విస్తృతంగా ప్రచురించాలి. కానీ అలాంటి వ్యక్తి ఎవరూ వాళ్లకు దొరకలేదు.

అందుకని వాళ్ళు నేనైతేనే ఆ పని చేయగలనని నన్నడిగారు. అంతకుముందే నేను కూడా గాంధీజీతో కలిసి ప్రయాణిస్తూ ఆయన్నుంచి నేర్చుకోవాలనుకున్నాను. నేను వాలంటీరుగా పనిచేస్తానంటే నిర్వాహకులు కూడా ఒప్పుకుంటారు. అందుకని వాళ్ళు నన్నడగ్గానే నేను ఆ ప్రతిపాదనకి ఒప్పుకున్నాను.

టెలిగ్రామ్ అధికార పత్రమూ, రిపోర్టర్ కార్డూ చేతబట్టుకుని అనుగుల్ బయలుదేరాను. అప్పటికే గాంధీజీ సంబల్‌పూర్ విడిచిపెట్టారు. అక్కడి నుండి ఆయన పూరీ రైల్లో వచ్చారు. పూరీలోనే ఆయన, 'నేనింక కారులోగానీ, రైళ్లల్లోగానీ ప్రయాణించను. హరిజనోద్ధరణ కోసం కాలినడకనే ముందుకు సాగుతాను' అని ప్రకటించారు. దీన్ని నేను 'మహా పాదయాత్ర' అన్నాను. ప్రతి రోజూ ఆయన కొంత దూరం నడిచి, ఒక బహిరంగ సభ నిర్వహించేవారు. మధ్యాహ్నం నాలుగు గంటల దాకా విశ్రాంతి తీసుకుని, మళ్లీ నడక మొదలుపెట్టేవారు. సాయంత్రం మరో సభ జరిగేది, ఆ రాత్రికి అక్కడే బస చేసేవారు.

పాదయాత్ర నిర్వహణ బాధ్యతల్ని ఠక్కర్ బాపా, అంటే, అమృత్‌లాల్ వి. ఠాకూర్‌కి అప్పగించారు. నాక్కూడా పని చాలా పెరిగింది. రోజూ ప్రసంగాలుండేవి. కార్యకర్తల మధ్య రెండు మూడు విడతలుగా చర్చలు సాగేవి. యాత్రలో జరిగే రకరకాల సంఘటనల్ని వివరంగా నివేదించాలని సంపాదకులు నాకు ప్రత్యేకంగా పురమాయించారు. యాత్ర మొత్తం బాధ్యతలన్నీ ఠక్కర్ బాపా పర్యవేక్షిస్తున్నప్పటికీ, గోపబంధు చౌధురీ, రమాదేవీ ఆయనకు చేదోడువాదోడుగా నిలిచారు. ఒరిస్సా నలుమూలల నుండీ వచ్చిన ప్రముఖ నాయకులూ, పేరుమోసిన కార్యకర్తలూ గాంధీజీతో కలిసి కొంత దూరం నడిచారు. నా అదృష్టం కొద్దీ నాకు మరో బాధ్యత

కూడా అప్పగించారు. గోపబంధు చౌధురి నాతో, 'బాపూజీ నడుస్తున్నప్పుడు ఆయన ముందే జనం విపరీతంగా గుమిగూడుతున్నారు. దీనివల్ల దుమ్ము లేవడమే కాకుండా, ఆయన నడకకు అడ్డంకిగా మారుతోంది. నువ్వు బాపూజీకి ముందు నడవడం మొదలు పెట్టు. నీకు అటూ ఇటూ ఇద్దరు వాలంటీర్లు సాయంగా ఉంటారు, దాంతో బాపూజీ నడిచేటప్పుడు ఆయనకి ముందు కొంత చోటు మిగులుతుంది. అలాగే రాత్రిపూట నువ్వు బాపూజీ బస దగ్గరే ఉండాలి. లేకపోతే ఆయన్ను చూడాలన్న ఆత్రుతతో జనం ఆయన్ను నిద్రపోనివ్వరు' అన్నారు.

బాపూజీ నడుస్తున్నప్పుడు తనకి ఇరుపక్కలా ఉన్న ఇద్దరి భుజాలమీద చేతులు వేసేవారు. వారితో ముఖ్యమైన విషయాలు చర్చిస్తుండేవారు. వాళ్లు వాలంటీర్లైతే, గ్రామాల పరిస్థితుల గురించి ఆరా తీసేవారు. పూరీ నుండి భద్రక్ దాకా సాగిన ఆ పాదయాత్ర నెలకు పైగా నడిచింది. వర్షాకాలం మొదలైంది, యాత్ర ముగిసింది. ఒకరోజు ఎం.ఆర్. మసానీ వచ్చారు. రెండు రోజుల తర్వాత ఘనశ్యామ్‌దాస్ బిర్లా వచ్చారు. గాంధీజీ వారితో ముఖ్యమైన చర్చలు జరిపారు. వాళ్లు హిందీలోనో, ఇంగ్లీషులోనో మాట్లాడినప్పుడు నాలుగైదు మాటలు వినాలని నేను చెవులు రిక్కించే వాణ్ణి. అయితే వారిద్దరితోనూ ఆయన గుజరాతీలోనే మాట్లాడారు.

ఈ సంఘటనలు చెబుతున్నప్పుడు నేనొక ముఖ్యమైన విషయం ప్రస్తావించాలి. ఇన్ని రోజుల పాటు బాపూ మాటలు వినగలగడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఉదయం సభ ముగిశాక ఆయన ప్రజా బృందాలను కలిసేవారు. ఆ సందర్భంగా ఆయన వారికిచ్చే ఆదేశాలు చాలా ముఖ్యమైనవిగా ఉండేవి. అలాంటప్పుడు చాలాసార్లు నేను అనువాదకుడిగా వ్యవహరించవలసి వచ్చింది. ప్రజలు రకరకాల ప్రశ్నలు వేసేవారు. బాపూజీ ఏమాత్రం సహనం కోల్పోకుండా వారి ప్రశ్నలకు సమాధాన మిచ్చేవారు. మధ్యాహ్నం పూట ఆయన ఒరిస్సా కార్యకర్తలతోనూ, బయటి నుండి వచ్చినవారితోనూ సమావేశమయ్యేవారు. ఆ చర్చలు చాలా ఆలోచనాత్మకంగా నడిచేవి. అలాంటప్పుడు నాక్కూడా కొన్ని ప్రశ్నలు అడిగే అవకాశం దక్కింది. మొత్తమ్మీద అదంతా ఒక శిక్షణా శిబిరంలో ఉన్నట్టే గడిచింది.

నేను ఎప్పటికప్పుడు పంపుతూ వచ్చిన నివేదికల్ని 'ది సమాజ్' యథాతథంగా అచ్చేసింది. రిపోర్టింగ్ కూడా నాకు బాగా పట్టుబడింది. పాదయాత్ర విశేషాలు పత్రికలో ఎలా వచ్చాయో తెలుసుకోడానికి ఠక్కర్ బాపా, లాలా అనంతరామ్ లాంటి

వాళ్లు 'ది సమాజ్' నివేదికల్ని అనువాదం చేయించుకుని చదువుతుండేవారు. నన్ను మెచ్చుకుంటూ ఉండేవారు.

బాపూజీ మరణించిన ఏడాది తర్వాత ఆ పాదయాత్ర గురించి నేనొక పుస్తకం ప్రచురించాను. ఆ చారిత్రక పాదయాత్ర సమగ్ర వివరాల్ని ఆ పుస్తకం అందిస్తుంది. దానికి మరికొన్ని వివరాలు జోడించి దానికి హిందీలోనూ, ఇంగ్లీష్ లోనూ కూడా అనువాదాలు తీసుకురావాలని నన్ను చాలామంది అడిగారు.

ఆ పాదయాత్ర సాగుతున్న సమయంలో బాపూజీ నన్నొకసారి గట్టిగా మందలించారు. ఆ కోపంలో కూడా నా పట్ల ఎంతో ప్రేమ కనిపించింది. అది కూడా ఆశీస్సులతో సమానమేనని అనిపించింది. పైగా వార్తల్ని రాయడంలో విచక్షణ ఎంత కీలకమో ఆ సంఘటన నాకు నేర్పింది.

ఆ రోజు బాపూజీ కేంద్రపడలో ధవనద్ ఇందుపూర్‌లో బస చేశారు. అస్పృశ్యత మీద కొందరు హిందూ పండితులతో కలిసి చర్చించాలని అంతకుముందే నిర్ణయించారు. అలాంటి సమావేశం జరపాలని గాంధీజీనే స్వయంగా అనుకున్నారు. సమాజంలోని ఒక వర్గాన్ని అంటరానివారిగా చూడటాన్ని ఆ పండితులు సమర్థించుకోబోయారు. అందుకోసం ఎక్కడెక్కడి గ్రంథాల్లోంచో ఏవేవో శ్లోకాలు ఉటంకించారు. ఒకానొక సందర్భంలో వాళ్లు 'పానోళ్లూ, హాడీలూ గొడ్డుమాంసం తింటారు. మేం వాళ్లను ఎలా తాకగలం?' అన్నారు.

దానికి బాపూజీ, 'కొందరు క్రైస్తవులూ ముస్లింలూ గొడ్డుమాంసం తినకపోయినా, వారి మతాల్లో వాళ్ళని నిషేధించలేదు కదా. మరి హిందువులు వాళ్లను ఎందుకు తాకుతారు? వాళ్ల సంగతి పక్కన పెట్టండి. నేనో సంగతి చెప్పనా? నాకు తెలిసిన పెద్ద హిందూ నాయకుడు ఒకాయన ఉన్నారు. ఆయన ఇంగ్లాండ్ వెళ్లినప్పుడు గొడ్డుమాంసం తింటారు. అంతమాత్రాన ఆయన్నెవారూ హిందూ సమాజం నుండి వెలెయ్యలేదు కదా అన్నారు. ఆయన ఆ మాట చెప్పడంతో పండితుల నోళ్లు మూతపడ్డాయి. ఆ చర్చ మరికొంతసేపు సాగింది.

నేను 'ది సమాజ్'కు పంపిన నివేదికలో ఆ నాయకుడి పేరు రాసేశాను. అది అలాగే అచ్చయిపోయేదే. కానీ అనుకోకుండా ఆ విషయం ఆ పత్రికా సంపాదకుడు పండిట్ లింగరాజ్ మిశ్రా దృష్టికి వచ్చింది. ఆయన ఆ పేరు కొట్టేసి, బ్రాకెట్లలో 'మా

విలేకరి ఒక ప్రముఖ హిందూ నాయకుడి పేరును ప్రస్తావించారు. ఆ పేరును ఇక్కడ వెల్లడించడం లేదు' అని రాశారు. కథ అంతటితో ముగిసిందని నేను భావించాను.

బారీ వెళ్లే మార్గంలో పండిట్ లింగరాజ్ బాపూజీని కలిశారు. మేం ముగ్గురం కలిసి కూర్చున్నప్పుడు ఈ ప్రస్తావన వచ్చింది. 'ఆ పేరు పత్రికలో వేశారా?' అని బాపూజీ అడిగారు. పండిట్‌జీ లేదని చెబుతూ, 'బాపూజీ, మీరా పేరు చెప్పలేదా? వినోద్ ఆ పేరు నాకే పంపాడు' అని వెంటనే అడిగేశారు. నా గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. బాపూజీ, 'ఔను, ఆ పేరు చెప్పింది నేనే. కానీ వినోద్, నువ్వు వెంటనే దాన్నలా పత్రికలకి పంపేయకూడదు. నేనా పేరు చెప్పిన మాటా నిజమే, దాన్ని రాయొద్దని నీతో అనని మాటా నిజమే. కానీ ఆ చర్చ బయటి లోకానికి తెలియాలా వద్దా అన్న ఇంగితం నీకుండాలి కదా. ఆయన పేరు బయటకు వెల్లడించవచ్చో లేదో నువ్వు నన్ను అడిగి తెలుసుకోవాల్సింది' అన్నారు.

ఆ విషయం అంతటితో ముగిసింది కానీ, నాకదొక పెద్ద పాఠం నేర్పింది. నేనెన్నో ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో ఉన్నాను. కానీ ఆ వృత్తిలో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో ఆ రోజే తెలుసుకున్నాను. నేనలాంటి తప్పు మళ్ళా ఎప్పుడూ చేయలేదు. గాంధీజీ మందలింపులోనే ఆయన ఆశీస్సులు కూడా మిళితమై ఉన్నాయని నేను మొదట్లోనే చెప్పింది అందుకే. ●

(**వినోద్ కానుంగో** (1912-1990) విజ్ఞానసర్వస్వకర్తగా సుప్రసిద్ధులు. బాలసాహిత్య రచయిత. ఆయన ఆత్మకథ 'పథ పచ పచే అపథువా'ని వసుంధరా ప్రకాశని వారు 1987లో ప్రచురించారు. ఈ వ్యాసాన్ని అనువదించిన జెహరా జబీన్ కటక్‌లో క్రైస్ట్ కాలేజీలో ఆంగ్ల అధ్యాపకురాలు.)

## వసంతకుమార్ శతపథి

# గాంధీ దర్శనం

**అది** 1934వ సంవత్సరం. కొద్ది రోజుల క్రితమే ఒక పెను భూకంపం బీహార్‌ను అతలాకుతలం చేసింది. 'మన సమాజం పాల్పడుతున్న అస్పృశ్యత అనే పాపం వల్లనే ఈ ప్రకృతి వైపరీత్యం సంభవించింది' అని గాంధీ చేసిన ప్రకటన సామాన్య ప్రజల్ని విస్మయంలో ముంచెత్తింది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా యావత్ భారతదేశమూ ఆ దురాచారాన్ని పాటిస్తున్నప్పుడు, భగవంతుడు ఒక్క బీహార్‌నే ఎందుకు ఎంచుకున్నట్టు? నిస్సందేహంగా అది సామాన్యుల అవగాహనకు మించిన గాంధేయ తత్త్వపు వింత ధోరణి. అయినప్పటికీ మహాత్ముని దర్శనం చేసుకోవాలన్న తపన ప్రజల్లో ఏమాత్రం తగ్గలేదు. ప్రత్యేక రాష్ట్రంగా ఇంకా రూపుదిద్దుకోని ఒరిస్సా ప్రజల్లో ఆ ఆరాటం మరీ ఎక్కువగా ఉండేది. మొదటి కారణం— ఒరిస్సా దారిద్ర్యం గాంధీ మనసును తీవ్రంగా కదిలించింది, ఆయనకు ఈ నేలమీద ఎంతో ప్రేముంది. మరో కారణం— మిగతా ప్రాంతాల వారితో పోలిస్తే, ఒరియా ప్రజలకు ఆయన్ను చూసే అవకాశం తరచూ దక్కేది కాదు.

విద్యాసంస్థల పాలన అంతా పాట్నా నుండే సాగేది కాబట్టి, భూకంపం కారణంగా పరీక్షలు ఫిబ్రవరి నుండి జూన్‌కి వాయిదా పడ్డాయి. అప్పటికి మే నెల నడుస్తోంది. కటక్ నాటి నడివేసవి ఎండల తీవ్రతకూ, ఉక్కపోతకూ మాడిపోతూ, ఆ కీలకమైన నెల ఎప్పుడొస్తుందా అని మాలో కొందరం ఎదురుచూస్తున్నాం.

సరిగ్గా అదే సమయంలో, పూరీ వెళ్లే మార్గంలో గాంధీ కటక్ మీదుగా వెళ్లనున్నారన్న వార్త దావానలంలా వ్యాపించింది. ఆయన అనుగుల్ నుండి తాల్చేర్‌దాకా రైల్లో ప్రయాణించి వస్తారు. ఆ రోజుల్లో కటక్‌లో ఢెంకనాల్, తాల్చేర్ పేర్లు తరచూ

వినిపించేవి. ఒరిస్సాలోని ఏకైక నగరమైన కటక్‌కు ఈ రెండు గ్రామీణ ప్రాంతాల నుండే నౌకర్లూ, కూలీలూ, రిక్షావాళ్లూ వచ్చేవారు; సరిగ్గా ఈ రోజుల్లో చాకళ్లూ, హోటలు నడిపేవాళ్లూ, రిక్షావాళ్లూ దక్షిణ ప్రాంతం నుండి వచ్చినట్టుగా! ఆ మహనీయుణ్ణి ఒక్కసారి కళ్లారా చూసేందుకు కటక్ ప్రజలకు ఇదొక అద్భుతమైన అవకాశం. మహాత్ముణ్ణి దర్శనం చేసుకోవాలన్న వారి ఉత్సాహం ఎప్పటిలాగే మిన్నంటింది. కానీ వారి కల నెరవేరడం అంత తేలికైన విషయమేమీ కాదు.

నా పరిస్థితి అయితే మరీ అధ్వానంగా ఉంది. ఐదేళ్ల క్రితం గాంధీ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించడానికి కుట్ర పన్నానన్న కారణంతో మా హైస్కూలు ప్రధానోపాధ్యాయులు నన్ను దండించారు. 'జన్మాష్టమి' అనే కవితలో నేను బ్రిటిషు పాలకుణ్ణి కంసుడిగా చిత్రీకరించాను. దాంతో ఆ కవిత అచ్చయిన చేతిరాత పత్రికని అధికారులు జప్తు చేశారు. విదేశీ వస్త్రాలు మోసుకెళ్తున్న ఎడ్లబండిని అడ్డుకోడానికి రోడ్డుమీద పడుకున్న కొందరు గాంధేయ సత్యాగ్రహుల్ని పోలీసులు నిర్దాక్షిణ్యంగా చితకబాదడం నా కళ్లారా చూశాను. ఆ బాధితుల్లో ఒకరికి మంచి నీళ్లు ఇచ్చి ఆదుకోబోయిన ఒక పాన్‌షాపు యజమానిని కూడా పోలీసులు విచక్షణా రహితంగా కొట్టారు. సూర్యుడస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపు వైభవం పట్టపగటి భానుడిలా వెలుగుతున్న రోజులవి. గాంధీ ఇటువైపు వస్తున్నారన్న సంగతి పాఠశాల యాజమాన్యానికి తెలియకుండా ఉంటుందా? బ్రిటిష్ సామ్రాజ్యానికే పెనుముప్పుగా మారిన ఆయన్ను చూడటానికి మేం చేసే ప్రయత్నాల్ని యాజమాన్యం చూసీచూడనట్టు వదిలేస్తే, అది వాళ్ల ఉద్యోగాలకే ఎసరుపెట్టదా? ఏదేమైనా, అధికారుల కళ్లుగప్పి వ్యవహరించడంలో స్కూల్లోగానీ కాలేజీలోగాని చదువుకునే విద్యార్థులకి అనాదిగా ఒక వింత ఆనందం ఉండేది. ఒక్కోసారి అలా చేసి వాళ్లు రాత్రికి రాత్రి సుప్రసిద్ధులై పోయేవారు.

రాత్రి దాదాపు ఎనిమిది గంటల సమయం కావస్తోంది. మూడే మూడు లాంతర్లు వెలుగుతున్న ఆ మసక ప్లాట్‌ఫారమ్‌మీద సుమారు రెండు వందల మంది దాకా గుమిగూడారు. మూడో గంట మోగగానే జనం నుండి పెద్ద జయజయధ్వానాలు మిన్నంటాయి. రైలు పొగలు కక్కుకుంటూ ప్లాట్‌ఫారమ్‌మీదికి రాగానే ఆ కేకలు మరింత పెరిగాయి. రైలు ఆగకముందే ఉత్సాహంతో ఉన్న ఆ జనం అటూ ఇటూ పరుగులు తీశారు. కాసేపటికే వాళ్లంతా ఆ మూడో తరగతి బోగీ చుట్టూ చేరారు.

'గాంధీజీకి జై' అనే ఉమ్మడి నినాదాల మధ్య ఒక కిటికీలోంచి గాంధీ ప్రశాంత ముఖం కనిపించింది. ఆ స్వాగతానికి ఏమాత్రం సంతోషించకపోగా, గాంధీజీ వారిని తీవ్రంగా మందలించారు: 'రాత్రివేళల్లో శబ్దాలు చేయడాన్ని శాస్త్రాలు నిషేధించాయి' అన్నారు. ప్లాట్‌ఫారమ్‌మీద ఒక్కసారిగా పిన్‌డ్రాప్ సైలెన్స్ ఆవరించింది. 'రాత్రి నిశ్శబ్దాన్ని భంగపరిచే హక్కు ఎవరికీ లేదు' అని ఆయన గట్టిగా చెప్పారు.

ఆ మసక వెలుతురులో ఆయన ముఖం స్పష్టంగా కనిపించకపోవడంతో, ఎవరో ఒకరు లాఠీ చివర లాంతరు కట్టి గాంధీ ముఖానికి దగ్గరగా ఎత్తిపట్టారు. ఆ కిరోసిన్ మంట నుంచి వచ్చే మసి గానీ, దుర్వాసన గానీ మహాత్ముణ్ణి ఏమాత్రం ఇబ్బంది పెట్టినట్టు కనిపించలేదు. ఆయన మాట్లాడుతూ—

'అస్పృశ్యతను రూపుమాపడానికి నేను పూరీ వెళుతున్నాను. తిరుగు ప్రయాణంలో మళ్లీ కటక్ మీదుగానే వెళతాను. నేను ప్రస్తుతం హరిజనుల కోసం నిధులు సేకరిస్తున్నాను. ఒరియా ప్రజలు చాలా పేదవారు. నేను వారి నుండి పెద్ద మొత్తాల్లో విరాళాలు ఆశించడం లేదు. వాళ్ళిచ్చేది చిన్న కాసుగానీ, అరకాసుగానీ, అది కూడా నాకు చాలా ఎక్కువనే' అని అన్నారు. అలా అంటూ ఆయన తన పొడవాటి చేతిని ముందుకు చాచారు. దాంతో ఆ జనంలో ఉత్సాహం ఎంతగా పెల్లుబికిందంటే, అతి కష్టమ్మీద నిలిపిన ఆ లాంతరు కాస్తా ఒక్కసారిగా కిందపడి పగిలిపోయింది. వాలంటీర్లు ఆ గాజు పెంకులు శుభ్రం చేశారు.

ప్రజలు ఎంతో ఉత్సాహంతో తమ దగ్గరున్న డబ్బంతా తీసి గాంధీజీ చేతిలో పెట్టడం నేను గమనించాను. అలా ఇస్తున్నప్పుడు, సాక్షాత్తూ దైవాన్నే తాకుతున్నట్టుగా ఆయన చేతిని ఆప్యాయంగా నిమిరారు. ఆ ఉత్సాహంలో వెనకబడిపోడం ఇష్టం లేక నేనూ ముందుకు దూకాను. కానీ తీరా చూస్తే నా జేబులు ఖాళీగా ఉన్నాయి. నా గుండె ఆగినంత పనైంది.

వెంటనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పక్కనే ఉన్న హాస్టల్ వైపు పరుగుతీశాను. దారిలో నా స్నేహితుడు ఎదురుపడటంతో, అతని దగ్గర కొన్ని నాణాలు అప్పు తీసుకుని మళ్లీ స్టేషన్ వైపు లంఘించాను. పరుగెడుతుండగా నా కుడికాలి బొటనవేలు ఒక రాయికి బలంగా గుద్దుకుంది. అయినా లెక్కచేయకుండా పరుగు కొనసాగించాను. స్టేషన్‌కు చేరుకుని చూసేసరికి, రైలు ఇంకా అక్కడే ఉండటం, గాంధీజీ చేయి ఇంకా చాచి ఉండటం చూసి నాకు ప్రాణం లేచివచ్చింది. సిగ్నల్ మాత్రం అప్పుడే ఆకుపచ్చగా

మారింది. రొప్పుతూనే ఆ అప్పు తెచ్చిన నాణాల్ని గాంధీజీ విశాలమైన చేతుల్లో పోసి, ఆయన పాదవాటి చేతిని నిమిరాను. ఎంతటి అనిర్వచనీయమైన పరవశం! గతంలో పూరీ జగన్నాథుని దర్శనమూ, స్పర్శా నాలో ఎలాంటి ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయో, ఇది కూడా సరిగ్గా అలాగే అనిపించింది.

మత్తు వీడని స్థితిలోనే హాస్టల్‌కు తిరిగి వచ్చి కాళ్లు కడుక్కున్నాను. అప్పుడే నా చూపులు రక్తం కారుతున్న పాదంమీద పడ్డాయి. బొటనవేలి నుండి రక్తం ధారగా కారుతోంది. ఒక్కసారిగా తీవ్రమైన నొప్పి నన్ను చుట్టుముట్టింది. అసలు గాయమై చాలా సమయమైంది కదా! మరింతసేపూ నాకా బాధ ఎందుకు తెలియలేదు? నాలో నేనే ఆశ్చర్యపోయాను. శరీరాన్ని నడిపించేది మనస్సేనని నాకు అప్పుడు బోధపడింది. ప్రేమ దైవసంబంధమైనదైనా, మానవసంబంధమైనదైనా— ప్రేమలో మునిగిన మనస్సు శరీరమిచ్చే ఆజ్ఞలకు ఎన్నడూ లొంగదు. ఒక ఉన్నత ఆశయం స్ఫూర్తినిచ్చినప్పుడు మనిషి శారీరక బాధల నుండి విముక్తుడవుతాడు.

నా గాయం మానిపోయింది కానీ, పగిలిన కాలిగోరు మాత్రం శాశ్వతమైన గుర్తుగా మిగిలిపోయింది. ఆ తర్వాతి జీవితంలో ఎవరైనా దాని గురించి అడిగినప్పుడల్లా నేనీ కథ మళ్లీ మళ్లీ చెప్పేవాణ్ణి; అలా ఆ కథ చెప్పిన ప్రతిసారీ నా ముఖంలో ఆనాటి దివ్యానుభూతి స్పష్టంగా ప్రతిఫలించేది.

దాదాపు వారం రోజులు గడిచాయి. మళ్లీ కటక్ వస్తానని గాంధీజీ మాట ఇచ్చారు. ఆయన కదలికల గురించి రకరకాల వార్తలు అందుతూనే ఉన్నాయి: గాంధీ అనుమతి తీసుకోకుండా కస్తూర్బా జగన్నాథుని దర్శనానికి వెళ్లడం వల్ల ఆ వృద్ధ దంపతుల మధ్య చిన్న మనస్పర్థ వచ్చిందట. దాంతో గాంధీజీ స్వయంగా దర్శనానికి వెళ్లడానికి నిరాకరించారు. పూరీ నుండి మొదలైన పాదయాత్ర వల్ల మీరాబెహెన్ పాదాలకు బొబ్బలెక్కాయి. అయినా సరే, ఆమె కట్టుకట్టిన కాళ్లతోనే నడక కొనసాగిస్తున్నారు. హిందూ మహాసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న పండిట్ లాలానాథ్ అనే ఒక సనాతనవాది గాంధీని నీడలా వెంటాడుతున్నాడన్న వార్త కూడా వచ్చింది.

అది మే 16వ తేదీ. గాంధీ కాజీపట్నా చేరుకున్నారు; అక్కడ ఒక బాలిక ఆయనకు ఒక జ్ఞాపికతో పాటు తన బంగారు గాజుల్ని కానుకగా సమర్పించింది. సూర్యాస్తమయ సమయానికి ఆయన కటక్ చేరుకుంటారనీ, రాగానే కాట్జూరి నదీ

ఇసుక తిన్నెలమీద జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారనీ తెలిసింది. నాకైతే ఇది గాంధీని మరోసారి దర్శించుకునే గొప్ప అవకాశం. నయం కాకపోగా నా కాలి బొటనవేలి గాయం చీముపట్టి ఉంది. అయినా సరే, మధ్యాహ్నం 4:30 గంటలకే నేను ఇసుక తిన్నెలకు చేరుకున్నాను. నదిలోని చల్లటి నీరు మండుటెండ వేడిమిని కాస్త తగ్గించింది.

సభ కోసం చేసిన ఏర్పాట్లు చాలా సాధారణంగా ఉన్నాయి. ఎలాగోలా ఒకటి రెండు బల్లలు అమర్చారు. స్త్రీలకూ పురుషులకూ వేర్వేరు స్థలాలు కేటాయిస్తూ పొడవాటి తాళ్లు కట్టారు. ఆ సమయానికి రెండు మూడు వందల మందికి మించి సభికులు లేరు. దగ్గరలోనే ఎండిపోయి, పలుచగా పారుతున్న కాట్జూరి నది; కాస్త దూరంలో నీలిరంగు నారాజ్ కొండ; మరీ అంత దూరం కాకుండా ఒక లంకమీద మెరుస్తున్న జిల్లేడు పూల గుత్తులు కనిపిస్తున్నాయి.

ఎండ తీక్షణత నెమ్మదిగా తగ్గసాగింది. అందరి చూపూ కాజీపట్నా వైపే ఉంది. హఠాత్తుగా దూరంగా ఒక చిన్న గుంపు కనిపించింది; తక్కువ ఎత్తున్న నదీ కట్ట దిగి, తాత్కాలిక కాలిబాట గుండా ఆ గుంపు నదీ గర్భంలోకి అడుగుపెట్టింది. వారు దగ్గరకు వస్తున్న కొద్దీ ఒక తాటాకు గొడుగు, దాని పక్కనే నిస్సందేహంగా గాంధీజీ అనదగ్గ ఆకారం వేగంగా అడుగులు వేస్తూ కనిపించాయి. ఎంత దూరం నుండైనా ఆయన్ను సులభంగా గుర్తుపట్టవచ్చు. పాదయాత్రలో ఆయన అడుగులు పసిపిల్లవాడి అడుగుల్లా చూడముచ్చటగానూ, లయబద్ధంగానూ పడేవి. దాదాపు పదిహేను నిమిషాల్లో ఆయన సభాస్థలికి చేరుకున్నారు. ఒక బల్లమీద పద్మాసనం వేసుకుని, ఒక చేతిని ఆనించి కూర్చున్న గాంధీ, సరిగ్గా మనం చిత్రపటాల్లో చూసినట్టే ఉన్నారు. 'ఏ ఒక్క మంచి పని ప్రారంభించాలన్నా ముందుగా భగవంతుని నామస్మరణ చేయాలి' అంటూ ఆయన మాట మొదలుపెట్టారు.

ఆయన ఆ మాట పలికారో లేదో, అంతవరకు నిర్జీవంగా ఉన్న ఆ వాతావరణ మంతా ఒక్కసారిగా విద్యుద్దీప్తమైపోయింది. అప్పటికే సూర్యుడు కిందికి దిగి నారాజ్ కొండ శిఖరాన్ని తాకుతున్నాడు. కాట్జూరి నది చల్లటి పవనాలు మెల్లగా వీయడం మొదలయ్యాయి. ఆ పిల్లగాలుల లయకు అనుగుణంగా, గాంధీ స్త్రీ సహజమైన సన్నని కంఠస్వరంతో భగవద్గీత రెండో అధ్యాయంలో ఆత్మ అమరత్వాన్నీ, ఆధ్యాత్మిక విజయాలనూ తెలిపే కొన్ని శ్లోకాలను పఠించారు. ఒక మునివాటిక చుట్టూ ఉండే

దివ్యకాంతి లాంటి పవిత్ర వాతావరణం ఒక్కసారిగా అక్కడ వెల్లివిరిసింది. ఇలాంటి పారవశ్యం జీవితంలో అనుభవానికి రావడం చాలా అరుదు. ప్రార్థన ముగిశాక, గాంధీ అస్పృశ్యత అంశంమీద క్లుప్తంగా మాట్లాడారు. ఆ అంశం కంటే కూడా ఆయన మాట్లాడిన తీరే అందరినీ కట్టిపడేసింది. ఆయన ప్రసంగం ముగియగానే, వాలంటీర్లు చేతుల్లో గుడ్డలు పట్టుకుని విరాళాల సేకరణ కోసం జనం మధ్య తిరిగారు. అంతటి కరవు రోజుల్లో కూడా అంత స్వల్ప వ్యవధిలో అంత పెద్ద మొత్తం పోగుపడటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆ రోజుల్లో గాంధీ కోసం ప్రజలు ఇవ్వనిదంటూ ఏదీ లేదు.

చివరగా గాంధీజీ మాట్లాడుతూ, 'ఇవాల్టి సభలో మాట్లాడటానికి పండిట్ లాలానాథ్ నా అనుమతి కోరారు. నేనాయనకు అనుమతి ఇచ్చాను. నా మాటలు ఎంత నిశ్శబ్దంగా విన్నారో, ఆయన మాటలనూ అంతే ప్రశాంతంగా వింటారని ఆశిస్తున్నాను. ఆయన ఏ క్షణంలోనైనా ఇక్కడికి చేరుకుంటారు' అన్నారు.

నిజంగానే కాసేపటికి దూరంగా బోడిగుండుతో ఉన్న సనాతనవాది పండిట్ లాలానాథ్ తన అనుచరులతో కలిసి రావడం కనిపించింది. వాళ్లు నడుస్తూ ఏదో సంకీర్తన చేస్తున్నారు. వారిలో కొందరు నల్ల జెండాలూ, నలుపు-తెలుపు బొట్లు పెట్టిన కుండలూ, కర్రలకు కట్టిన చీపురు కట్టలూ పట్టుకుని, కీర్తనల తాళానికి అనుగుణంగా నాట్యం చేస్తున్నారు. ఎంత విచిత్రమైన మతం! ఎంత కర్ణకఠోరమైన గోల! ఎంతటి విపరీతమైన ఆవేశం!

పండిట్‌జీ తన అనుచరులతో సభా స్థలానికి చేరుకున్నారో లేదో, జనం ఒక్కసారిగా వారిమీదికి ఆగ్రహంతో దూసుకెళ్లి, చేతికి ఏది దొరికితే వాటితో పాటు దోసిళ్లకొద్దీ ఇసుకను కూడా వాళ్ళ మీద ఎత్తిపోసారు. ఆ పైన క్షణాల వ్యవధిలో ఆ మట్టికుండలన్నీ పగలగొట్టి, ఆ గుంపుని పూర్తిగా చెదరగొట్టారు. చివరకు పండిట్ లాలానాథ్ కూడా ఎక్కడా కనిపించకుండా పోయారు.

గాంధీజీ ఎంతో కలత చెందారు. పండిట్‌జీని సగౌరవంగా వేదిక వద్దకు తీసుకురావలసిందిగా ఆయన వాలంటీర్లను ఆదేశించారు. స్వయంగా ఆయనే ముందుకొచ్చి పండిట్‌జీని తోడ్కొని వచ్చి కూర్చోబెట్టి, ఆయన కళ్లకూ ముఖానికీ అంటిన దుమ్ము తుడిచి శుభ్రం చేసి, ఆయన్ను కుదుటపరిచారు. ఆ తర్వాత సభికుల్ని ఉద్దేశించి, 'ముందే చెప్పినప్పటికీ మీరు మన అతిథిని అవమానించి తీవ్రమైన అపరాధం

చేశారు. కాబట్టి మీ తరఫున నేను భగవంతుణ్ణి క్షమాపణ కోరుతున్నాను' అన్నారు. నాకు బైబిల్ వాక్యం గుర్తొచ్చింది: 'ఓ తండ్రీ! వీరిని క్షమించు. వీరేమి చేస్తున్నారో వీరికి తెలియదు!'

అప్పుడు పండిట్ లాలానాథ్ చేతులెత్తి, కీచు గొంతుతో సనాతన ధర్మ గొప్పతనాన్ని కీర్తించడం మొదలుపెట్టారు. ఆంటోనీని మాట్లాడనిచ్చి బ్రూటస్ చేసిన తప్పిదమే గాంధీ కూడా చేశారని మేము అనుకున్నాం. కానీ పండిట్ లాలానాథ్ ఉపన్యాసం గానీ, ఆయన వాదనలు గానీ ఎవరి మనసునీ తాకలేదు. పైగా ఆయన తీవ్రవాద ధోరణి అందరికీ చిరాకు తెప్పించింది. సంధ్యాసమయ సభ ముగిసింది. గాంధీ, లాలానాథ్ ఇద్దరూ భుజం భుజం కలిపి కటక్ వైపు నడుచుకుంటూ వెళ్లడం చూసి మేం నిశ్చేష్టులమయ్యాం.

శత్రువును ప్రేమించాలనీ, ప్రత్యర్థి దృక్పథాన్ని గౌరవించాలనీ, ఇతరుల పాపానికి తానే ప్రాయశ్చిత్తం చేసుకోవాలనీ చెప్పే సిద్ధాంతాలూ సూత్రాలూ ఆచరణలో ఎలా ఉంటాయో మా కళ్లారా మేం చూశాం. ●

(**వసంత కుమార్ శతపథి** (1913-1994) ఒరిస్సాకు చెందిన ప్రముఖ కథారచయిత. ఆయన ఆత్మకథ 'మనేపడే' నుంచి ఈ భాగాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన సుమన్యు శతపథి ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల ఆచార్యులుగా పనిచేస్తున్నారు.)

## అనుసాయా ప్రసాద్ పాఠక్

# ఒక హిందీ ఉపాధ్యాయుడు గాంధీని కలవడం

1934లో బీహార్ భూకంపం కారణంగా ఖైదీలందరినీ విడుదల చేశారు. హరిజనోద్ధరణ కోసం గాంధీజీ ఒరిస్సా పర్యటనకు రానున్నారు. 'నేను ఆయన్ని తప్పక కలుస్తాను' అని నాకు నేనే బాస చేసుకున్నాను.

ఆయన రాక కోసం అమితాసక్తితో ఎదురుచూశాను. ఆయన అనుకున్న సమయానికే వచ్చి, నేరుగా పూరీ వెళ్లారు. అక్కడి నుంచే గాంధీజీ తన యాత్ర ప్రారంభిస్తారన్న వార్త నాకు తెలిసింది. ఆ నడకను 'హరిజన పాదయాత్ర' అని పిలిచారు. ఎప్పటికైనా నేనాయన్ని కలవగలనని నాకు నమ్మకం కుదిరింది. అందుకని ఒకరోజు అక్కడికి వెళ్లాను.

సాక్షిగోపాల్ చేరుకుని గాంధీజీ కార్యదర్శి మహాదేవ్ దేశాయ్‌ని కలిశాను. 'గాంధీజీని కలవాలనుకుంటున్నాను' అని ఆయనకి చెప్పాను.

దానికి మహాదేవ్ భాయ్, 'ఆయనకు చాలా పని ఉంది; నీ కోసం సమయం కేటాయించడం ఆయన వల్ల కాదు' అన్నారు.

ఆయన మాటలు నాకేమాత్రం నచ్చలేదు. 'గొప్పవాళ్ళని కలవడానికి మాత్రమే ఆయనకి టైముంటుంది, నాలాంటి సామాన్యుడి కోసం ఉండదు' అని నాలో నేనే అనుకున్నాను. అయినా సరే ఆయన్ను కలవాలనే వేచి ఉన్నాను. ఏ ప్రేరణ నన్ను ఆయన గది వైపు అడుగులు వేయించిందో నాకే తెలియదు. నేనేమీ ముందు ఆలోచించు కున్నదికాదు. మీరాబెహెన్ ఆయనకు భోజనం వడ్డిస్తుండటం కనిపించింది. గాంధీజీ గుమ్మంకేసి  చూశారు.

నేను రొప్పుతూనే, 'నేనిక్కడ హిందీ ప్రచారం కోసం పనిచేస్తున్నాను. మీతో కొన్ని సమస్యలు చర్చించాలి. దయచేసి నాక్కాస్త సమయం ఇవ్వండి' అన్నాను.

గాంధీజీ స్పందిస్తూ, 'నువ్విక్కడే ఉండు. రేపు యాత్ర మొదలయ్యాక దారిలో మాట్లాడుకుందాం' అన్నారు.

నేను తలవంచి ఆయనకు నమస్కరించి బయటకు వచ్చేశాను. ఈ సంభాషణ ముప్పై నలభై సెకన్లు మించి సాగి ఉండదు. మర్నాడు కలవమని గాంధీజీ నాతో చెప్పిన సంగతి నేనెవరికీ చెప్పకపోవడంతో, ఆ విషయం ఎవరికీ తెలియదు. నేనక్కడే ఉండిపోయాను, రాత్రి భోజనం కూడా దొరికింది. ఆ రోజు వంటల బాధ్యత రమాదేవి చూసుకుంటుండటంతో నా బసకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదు.

ఇచ్చిన మాట గాంధీజీకి గుర్తుంటుందా లేదా అన్న అనుమానం నన్ను వేధించింది. ఆయన గనుక మర్చిపోతే నా పని అలాగే ఉండిపోతుంది. నాలో నేనే ఇలా అనుకున్నాను: 'ఓ పాఠక్, కటక్ తిరిగి వెళ్లిపో. నువ్వో హిందీ మాస్టారువి. ఇంట్లోనేమో తినడానికి ఏమీ లేదు, తల్లేమో విందుకు పోతోందన్నట్టుంది నీ పరిస్థితి.' కబీర్ అన్నట్టుగా— 'చాహియే అమియా పర్ జురే న చాఛ' (తేనె కావాలని ఆశపడతాడు కానీ కనీసం మజ్జిగ కూడా దొరకదు). అక్కడే ఉండాలా లేక వెళ్లిపోవాలా అన్న మీమాంసతో ఆ రాత్రంతా గడిపేశాను. నాకు టైమిస్తానన్న తన వాగ్దానం గాంధీజీకి ఎలా గుర్తుచేయాలన్నదే నాకున్న ముఖ్య సమస్య.

ఉదయం అల్పాహారం ముగిశాక గాంధీజీ స్వయంగా గోపబాబుతో, 'ఒరిస్సాలో హిందీ ప్రచారం కోసం పనిచేస్తున్న ఆ వ్యక్తిని లోపలికి తీసుకురండి' అన్నారు.

ఆయన తీక్షణమైన జ్ఞాపకశక్తికి నేను నిశ్చేష్టుణ్ణయ్యాను. అంతటి పని ఒత్తిడిలోనూ ఆయన నా అభ్యర్థన గుర్తుంచుకోడానికి సమయం కేటాయించారంటే నమ్మలేకపోయాను. నేను ఆయన్ని కలవడానికి లోపలికి వెళ్లినప్పుడు బాబా రాఘవదాస్ ఆయనతో మాట్లాడుతూ కనిపించారు. 'బాపూజీ, హిందీ ప్రచారం కోసం మేం రేపు పూరీలో ఒక కమిటీ ఏర్పాటు చేయబోతున్నాం' అని బాబా రాఘవదాస్ అన్నారు.

'హిందీ ప్రచారానికి నేనొకరిని పంపుతాను' అన్నారు.

'సరేలే,' అంటూ గాంధీజీ నా వైపు తిరిగి, 'నువ్వు నాతో ఏం చెప్పాలనుకుంటున్నావు?' అని అడిగారు.

'నేను రెండేళ్లుగా ఇక్కడ హిందీ ప్రచారం చేస్తున్నాను. ఇప్పటికే ఒక కమిటీ కూడా ఏర్పాటయింది' అన్నాను. ఆ తర్వాత ఆ కమిటీలోని సభ్యుల పేర్లు చదివి వినిపించాను.

గాంధీజీ స్పందిస్తూ, 'బాబా రాఘవజీ, ఒరిస్సాకు చెందిన సభ్యులంతా ఆయన కమిటీలోనే ఉన్నారు. చేయాల్సిన పని కూడా అతనే చేస్తున్నాడు, కాబట్టి ఇంకో కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు. కమిటీలు ఎక్కువైతే కూడా ప్రయోజనం ఉండదు' అన్నారు. తర్వాత నా వైపు చూసి, 'సరే, నువ్వింకా చెప్పవలసింది ఏమైనా ఉందా?' అని అడిగారు.

దానికి నేను, 'నేను పనైతే చేస్తున్నాను కానీ, నా పొట్ట గడవడానికి ఎలాంటి ఏర్పాటూ జరగలేదు. ఇల్లిల్లూ తిరుగుతూ హిందీ చెప్పవలసి వస్తోంది, ఎదుటివాళ్ల ఇళ్లల్లోనే తిండి తినాల్సి వస్తోంది' అన్నాను.

గాంధీజీ నా వైపు శ్రద్ధగా చూస్తూ, 'ఇప్పటివరకు నీకేమీ ఏర్పాటు చేయకపోతే, నీకు ఆర్థిక సహాయం అందేలా నేనేదో ఒకటి చేస్తాను. నాతో పాటు భద్రక్ రా. బసంత్‌లాల్ మురార్ అక్కడ నన్ను కలవడానికి రానున్నారు. కొంత విరాళం ఇవ్వమని నేనాయన్ను అడుగుతాను. నీకు ఎంతైతే సరిపోతుంది?' అన్నారు.

'ఎంత ఇచ్చినా ఫరవాలేదు, ఇరవై రూపాయలో, ముప్పై రూపాయలో, లేక నలభై రూపాయలైనా సరే' అన్నాను. గాంధీజీ— 'నీకు డబ్బు అందేలా చూస్తాను, ఇంకేమైనా మాట్లాడాలా?' అన్నారు.

నేను విన్నవించుకుంటూ, 'ఈ సంవత్సరం ఆరుగురు విద్యార్థులు హిందీ సాహిత్య సమ్మేళన్ పరీక్షలకు హాజరయ్యారు. వారిలో ఐదుగురు ఉత్తీర్ణులయ్యారు. వారికి మీ చేతుల మీదుగానే బహుమతులూ సర్టిఫికెట్లూ ఇప్పించాలని ఉంది' అన్నాను.

గాంధీజీ— 'తప్పకుండా ఇస్తాను. ఈ పని కటక్‌లో పెట్టుకోవచ్చా?' అన్నారు.

'అలాగే బాబూ' అన్నాను. నా కళ్లు చెమర్చాయి. ఎంతటి ఘనకార్యం సాధించాను! దాన్ని తలచుకుంటేనే నా హృదయం ఆనందంతో నిండిపోయింది. ఆ క్షణంలో నాకెలా అనిపించిందో వర్ణించడానికి నా దగ్గర మాటలు చాలవు.

'కానీ మిమ్మల్ని భద్రక్‌లో ఎలా కలవడం? మీ చుట్టూ ఉన్నవాళ్లు నన్ను మీ దగ్గరకు రానివ్వరు కదా' అని అడిగాను.

గాంధీజీ చిరునవ్వుతో, 'బసంత్ లాల్ గారితో నేను కనిపించగానే నేరుగా నా దగ్గరకు వచ్చేయ్. నిన్ను ఆపొద్దని వాళ్లకు చెబుతాను' అని బదులిచ్చారు.

మేము వీడ్కోలు తీసుకునే సమయంలో గాంధీజీ నా వైపు ఒక ఆప్యాయమైన చూపు చూశారు. ఆ చూపును మాటల్లో వర్ణించడం నా వల్ల కాదు. కానీ ఆ క్షణపు జ్ఞాపకం నా మదిలో ఇప్పటికీ తాజాగా మెదులుతూనే ఉంది. ఆ చూపులో వ్యక్తమైన వాత్సల్యం నన్ను పరవశింపజేసింది. నా జీవితంలో ఇదే అత్యంత గొప్ప సాధన. నేను అడిగినవన్నీ నాకు దక్కాయి. ఇంక అడగడానికి నాకేమీ మిగల్లేదు. ఇంకేం చెప్పాలనుకున్నానో అవన్నీ పూర్తిగా మర్చిపోయాను, ఎందుకంటే నేనప్పటికే ఒక ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోయాను.

మాట ఇచ్చినట్టే గాంధీజీ కటక్ వచ్చారు. విద్యార్థులు ఆయన చేతుల మీదుగా పురస్కారాలూ ధ్రువపత్రాలూ అందుకున్నారు. కానీ హరిజనోద్ధరణ నిధి సేకరణ కోసం ఆయన ఆ పుస్తకాలన్నీ వేలం వేయడానికి పట్టుకెళ్లిపోయారు. ఆ వేలంపాట ద్వారా ఎంత మొత్తం వసూలైందో నాకు ఖచ్చితంగా గుర్తులేదు గానీ, ఆఖరి పాట బహుశా ఎనిమిది వందల రూపాయలు పలికింది.

నేను గాంధీజీ పాదయాత్రలో కలవలేదు కానీ, ఆయన్ను కలవవలసిన రోజున భద్రక్ చేరుకున్నాను. అది ఉదయపు వేళ. హరేకృష్ణ మహతాబ్ గారి ఇంటి ముందున్న మైదానంలో కొందరు జనం గుమిగూడి ఉన్నారు. గాంధీజీ పక్కనే బసంత్‌లాల్ మురార్ గారు కూర్చుని ఉండటం కనిపించింది. దాంతో నేను నేరుగా ఆయన వైపు నడిచాను. దారిలో నన్నెవరూ అడ్డుకోలేదు. నేను ఆయన దగ్గరకు చేరానో లేదో గాంధీజీ వెంటనే బసంత్‌లాల్ గారితో, 'ఈయన ఒరిస్సాలో హిందీ ప్రచారం చేస్తున్నాడు, కానీ ఆ పనికి ఎలాంటి పారితోషికమూ అందడం లేదు. ఆయనకి జీతం ఎంతోకొంత నేను ఏర్పాటు చేయాలా, లేక ఆ విషయం మీరే చూసుకుంటారా? నెలకు కనీసం ఇరవై రూపాయలు అడుగుతున్నాడు, దాన్ని ముప్ఫైకో నలభైకో పెంచవచ్చు. ఆయనకు నెలకు నలభై రూపాయలు ఇప్పించాలని నా అభిప్రాయం' అన్నారు.

'అలాగేనండి, మేమే ప్రతి నెలా మీకు నలభై రూపాయలు పంపుతాం' అన్నారు బసంత్‌లాల్ గారు. గాంధీజీ నా వైపు చూసి, 'సరే, నువ్వు వెళ్లి నీ పని కొనసాగించు, వివరాలు నాకు తెలియజేస్తూ ఉండు' అన్నారు.

ఇక నేనేమీ మాట్లాడాల్సిన అవసరం లేకపోయింది. గాంధీజీ నా కోరికలన్నీ తీర్చేశారు. నాకు నెలకు నలభై రూపాయలు రావడం మొదలయ్యాక, నా కోసం ఇరవై రూపాయలు ఉంచుకుని, మిగతా డబ్బు పూరీ పంపేవాణ్ణి; అక్కడొక కొత్త హిందీ ప్రచార కేంద్రాన్ని తెరవాలన్నది నా సంకల్పం. ●

(**అనుసాయా ప్రసాద్ పాఠక్** (1913-1970) రాష్ట్రభాషా ప్రచార సమితి ద్వారా ఒరిస్సాలో హిందీ ప్రచారం కోసం తన జీవితాన్ని ధారపోశారు. ప్రస్తుత భాగం ఆయన ఆత్మకథ 'మేరా ఉత్కళ్ ప్రవాస్' నుండి తీసుకున్నది. దీన్ని ఇంగ్లీషులోకి అనువదించిన ప్రియంవదా పాల్ భువనేశ్వర్‌లో సిలికాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆంగ్ల అధ్యాపకురాలు. అనువాదకురాలూ, చిత్రకారిణీ కూడా.)

## అన్నపూర్ణా మహారాణా

# తొలిచూపులోనే ప్రేమ

**గాంధీజీని** ప్రభుత్వం శత్రువుగా పరిగణిస్తున్నందున, ఆయన నిధికి విరాళాలు ఇవ్వడానికి చాలామంది భయపడేవారు. దానికి తోడు ఆయన అస్పృశ్యతను రూపుమాపే ప్రయత్నాల్లో ఉన్నారు. రోజూ మేం మా పనులు మేం చేసుకుంటూ పోయేవాళ్లం. పండిట్ అనుసాయాప్రసాద్ దగ్గర హిందీ నేర్చుకునేవాళ్లం. ఆయన 1931లో ఒరిస్సా వచ్చారు. ఇక్కడే స్వాతంత్ర్యోద్యమంలో చేరి జైలుకు వెళ్లారు. జైలు నుండి విడుదల-య్యాక, ఒరిస్సాలో హిందీ ప్రచారం కోసమే తనను తాను అంకితం చేసుకున్నారు. స్వామి విచిత్రానంద దాస్ అధ్యక్షతన రాష్ట్రభాషా ప్రచార సమితి ఏర్పాటయింది. రమాదేవి దానికి ప్రధాన సమన్వయకర్త; నిధులు సేకరించడమూ విద్యార్థుల్ని చేర్పించడమూ ఆమె ముఖ్య బాధ్యతలు. చేతిరాత అందంగా ఉంటే ఆ ఉత్తరం గాంధీజీ స్వయంగా చదువుతారని పండిట్జీ మాతో ఎప్పుడూ చెప్తుండేవారు. అందుకని చేతిరాత ప్రాక్టీసు చేస్తూండమని ఆయన మమ్మల్ని నిరంతరం ప్రోత్సహించేవారు. అందుకే మా దస్తూరీ ఎంత అందంగా వీలైతే అంత అందంగా తీర్చిదిద్దుకోడానికి మేం కష్టపడి సాధన చేసేవాళ్లం. గోకుల శ్రీచందన్ మాకు భజనలు పాడటం నేర్పిస్తే, గోపాల్ ఘోష్ వయొలిన్ నేర్పేవారు.

అనుగుల్ పర్యటన ముగించుకుని గాంధీజీ పూరీ చేరుకున్నారు. కానీ రైల్వే స్టేషన్ అంతా పోలీసుల్తో కిటకిటలాడుతూ కనిపించింది. పట్టణంలోకి అడుగుపెట్టేసరికి, గాంధీ ఎక్కడ హరిజనుల్ని గుళ్లోకి తీసుకువస్తారోనన్న భయంతో జగన్నాథ ఆలయ నిర్వాహకులు తలుపులు మూసేసారని తెలిసింది. 'అనుమానాలూ భయాలూ కమ్ముకున్న వాతావరణంలో హృదయ పరివర్తన తీసుకురావడం సాధ్యం కాదు. శంకరుడూ

చైతన్యుల మాదిరిగానే నేను కూడా ఒరిస్సా అంతటా కాలినడకనే పర్యటిస్తాను' అన్నారు గాంధీజీ. ఆయన ఒక్కసారి నిశ్చయించుకున్నారంటే ఇక ఎవరూ ఆపలేరు. ఆ చారిత్రాత్మక పాదయాత్రకు పూరీలో సన్నాహాలు మొదలయ్యాయి.

కటక్‌లో ఉన్న మాకు ఈ వార్త చేరగానే గుబులు పట్టుకుంది. అప్పటికే ఒరిలో, ఖండైతా గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చి సన్‌షైన్ మైదానాన్ని ముంచెత్తారు. స్వాగత సత్కారాల కోసమూ, గాంధీకి సమర్పించాల్సిన విరాళాల కోసమూ ఎవరి దగ్గరైతే డబ్బులు వసూలు చేశామో, వాళ్ళకిప్పుడెలా ముఖం చూపించడం! చివరి నిమిషంలో పర్యటన ప్రణాళిక మార్చేసినందుకు గాంధీజీమీదా నిర్వాహకులమీదా చాలా కోపం వచ్చింది. ఇది మాకు చాలా సమస్యగా మారింది; ఈ విషయం ప్రజలకేలా వివరించి చెప్పాలో పాలుపోలేదు.

పూరీ నుండి రమాదేవి ఒక ఉత్తరం రాశారు. 'మీరంతా గాంధీ విడిది చేయబోయే బాలకటికి వచ్చేయండి. అక్కడి నుంచి గాంధీ పాదయాత్రలో మీరు కూడా చేరండి' అని అందులో ఉంది. మేం మొత్తం ఏడుగురం హరిజనవాడల్లో పనిచేస్తున్నాం: సుశీల, మంగళ, శోభ, గోదావరి, మానిక, తులసి, అన్నపూర్ణ. వెంటనే పక్కబట్టలు మూటగట్టుకుని భువనేశ్వర్ బయలుదేరాం. కటక్‌కీ భువనేశ్వర్‌కీ మధ్య ప్రవహించే నదులమీద యాభై ఏళ్ల కిందట వంతెనలు ఉండేవి కావు; అందువల్ల ఇప్పటిలాగా భువనేశ్వర్‌కు బస్సులు నడిచేవి కావు. రైల్లో భువనేశ్వర్ చేరుకున్నాం. అక్కడి నుండి పాత యాత్రామార్గం గుండా నడుచుకుంటూ బాలకటి వెళ్లాం.

తీరా అక్కడికి వెళ్లి చూస్తే అప్పటికే సభ ముగిసిపోయింది, అందరూ విడిది కేంద్రానికి వెళ్లిపోయారు. ఆ 'విడిది' ఏ డాక్ బంగ్లానో బడి భవనమో కాదు— కేవలం ఒక తోటలో చెట్ల నీడ. అంతే! బ్రిటిష్ ప్రభుత్వానికి బద్ధ శత్రువైన గాంధీకి డాక్ బంగ్లాలోనో బడిలోనో ఆశ్రయం ఇచ్చే ధైర్యం ఎవరికుంటుంది?

పాదయాత్రికులు రాత్రి బస కోసం లాంతరు వెలుగులో ఏర్పాట్లు చేసు కుంటున్నారు. గాంధీ మాటలు వినడానికీ ఆయన్ను కళ్లారా చూడటానికీ సుదూర ప్రాంతాల నుండి వచ్చి, సమయానికి చేరుకోలేకపోయిన జనం గాంధీ దర్శనం కోసం ఎగబడి గుడారాల్లోకి చొచ్చుకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. వాలంటీర్లు తమ శాయశక్తులా వారిని నిలువరించడానికి తాపత్రయ పడుతున్నారు. మా బృందం అక్కడికి చేరుకునేసరికి పరిస్థితి ఇలా ఉంది. రమాదేవి మమ్మల్ని చూడగానే మాక్కూడా

జనాన్ని అదుపు చేసే పని అప్పగించారు. మేం హిందుస్తాన్ సేవాదళ్‌లో శిక్షణ పొందిన వాలంటీర్లం కదా!

జనాన్ని అదుపు చేయడానికి నేను ముందుకు దూసుకుపోతుండగా, వెనుక నుండి ఒక వృద్ధుని స్వరం హిందీలో ఎంతో ఆప్యాయంగా, 'ఏయ్ అమ్మాయ్! ఎక్కడి కలా పరిగెడుతున్నావు?' అని పిలవడం వినిపించింది. నాకు హిందీ వచ్చు. ఆ పిలుపు విని వెనక్కి తిరిగి చూస్తే చెట్టు కింద గాంధీ విశ్రాంతి తీసుకుంటూ కనిపించారు. ఆయన పక్కన ఒక లాంతరు మసకమసగ్గా వెలుగుతోంది. ఖద్దరు కట్టిన ఒక తెల్ల దొరసానీ, మరో వ్యక్తీ ఏదో పనిలో నిమగ్నమై ఉన్నారు. నేను కాస్త గర్వంగా, 'జనాన్ని అదుపు చేయడానికి!' అని బదులిచ్చాను. ఆయన నవ్వి, 'సరే, కానివ్వు' అన్నారు.

ఇంగ్లీషులో 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అనే మాటొకటుంది. అంటే తొలిచూపులోనే ప్రేమ అన్న మాట. సరిగ్గా ఆ క్షణంలో జరిగిందదే. రెండే రెండు మాటలు, ఒక చిరునవ్వు— మేమిద్దరం యుగయుగాలుగా ఒకరికొకరం తెలిసినట్టే అనిపించింది; గాంధీ మా ప్రియనేస్తమూ, మా అత్యంత ఆప్తుడూ, అమూల్య స్నేహితుడూ అయి పోయారు.

మేం రోజుకు రెండు పూటలా పాదయాత్ర సాగించేవాళ్లం. వేకువజామునే గాంధీజీ ఒక చెంచాతో తన ఇత్తడి గిన్నెమీద మోగిస్తూ అందర్నీ నిద్రలేపేవారు. ఆయన ఫైళ్లూ, కాగితాలూ, పళ్లపుల్లలూ, కాచి చల్లార్చిన నీళ్లూ, గ్లాసులూ అన్నీ రాత్రివేళ ఆయన పక్కనే ఉంచేవాళ్లం; దాంతో వాటి కోసం వెతుక్కుంటూ సమయం వృథా కాకుండా ఆయనకు ప్రతిదీ చేతికందే దూరంలో ఉండేది. ఆయన వాడే గ్లాసుకు సుశీలా పాయ్ 'మల్టీ-పర్పస్' అని పేరు పెట్టారు. పళ్లు తోముకునేటప్పుడూ, స్నానం చేసేటప్పుడూ, మరుగుదొడ్డిలోనూ, చివరకు మేక పాలు తాగేటప్పుడూ కూడా ఆయన ఆ ఒక్క గ్లాసునే వాడేవారు. అంతా బహుళ ప్రయోజనకారి అన్నమాట అది. గాంధీ ఆ గ్లాసును ఎలా ఉపయోగించారో వివరిస్తూ ఒక చీటీ మీద రాసిపెట్టి మరీ గాంధీ మరణానంతరం దాన్ని మ్యూజియంలో భద్రపరచాలని సుశీలా పాయ్ అంటూండేవారు.

ఆయన మేల్కొలుపు పిలుపు వినగానే మేం లేచి, హడావుడిగా పనులు ముగించు కుని ప్రభాత ప్రార్థనకు సిద్ధమయ్యేవాళ్లం. బాబా కాలేల్కర్ ప్రార్థనా సభ నిర్వహించేవారు.

ప్రార్థనలో మొదట 'ప్రాతః స్మరామి' శ్లోకాలూ, ఆ తర్వాత భక్తిగీతాల ఆలాపనా ఉండేది. ప్రార్థన ముగిశాక పాదయాత్రికులు గ్రామస్థులు సమర్పించిన అల్పాహారం తీసుకునేవారు. బరువైన సామగ్రిని శిబిరంలోనే వదిలిపెట్టి, అత్యవసరమైన తేలికపాటి వస్తువులు మాత్రమే భుజాన వేసుకుని వాలంటీర్లు నడకకు సిద్ధపడేవారు. అల్పాహారంగా మాకు అటుకులూ, బెల్లమూ, పెరుగూ, కొబ్బరీ, మామిడి పండ్లూ దొరికేవి. స్థానిక యాత్రికులకు మరో బాధ్యత ఉండేది: తిన్న ఎంగిలి విస్తళ్ళు గుంతలో పారేయడమూ, మరుగుదొడ్ల కోసం గుంతలు తవ్వడమూ, వంట పాత్రలు సరైన చోట భద్రపరిచారా లేదా అని చూసుకోవడమూ వారి పనే. పాదయాత్ర ప్రారంభమయ్యే సమయం దాకా గాంధీజీ ఉత్తరాలు రాయడంలోనో, ఇతరులతో చర్చలు జరపడంలోనో మునిగి పోయేవారు.

సమయం చెప్పడానికి ఆయనకేదో సిక్స్త్ సెన్స్ సాయపడుతున్నట్టుగా హఠాత్తుగా చేతి గడియారం చూసుకునేవారు; తన సంచీ ప్రథమ చికిత్స పెట్టె సిద్ధంగా ఉన్నాయో లేదో చూసుకుని, ఎవరినీ పిలవకుండానే నడవడం మొదలుపెట్టేవారు. భోజనసమయానికి ఆయన గడియారం చూస్తే, సరిగ్గా అదే సమయం అయ్యేది. ఏదేమైనా గాంధీజీ నడవడం మొదలుపెట్టగానే మేమంతా ఆయన వెంటే నడిచేవాళ్లం. పరధ్యానం వల్లనో ఏదో పనిమీదనో ఎవరైనా వెనకబడిపోతే, ఆ రోజు వాళ్లు రొప్పుతూ పరుగెత్తాల్సిందే; ఎందుకంటే గాంధీజీ చాలా వేగంగా నడిచేవారు, అవసరమనిపిస్తే ఒక్కోసారి పరుగెత్తేవారు కూడా! సాధారణంగా ఆయన ఇరుపక్కలా ఉన్న ఇద్దరి భుజాలమీద చేతులు వేసి, వారితో చర్చిస్తూ నడిచేవారు. నడక సాగుతుండగానే ప్రజల యోగక్షేమాలు తెలుసుకునేవారు. కానీ గాంధీ పరుగు లంఘించినప్పుడు మాత్రం, ఆయనకు చేతికర్రల్లా తోడ్పడే ఆ ఇద్దరి ప్రాణాలూ తోడేసినట్టయ్యేది!

పాదయాత్రికుల పక్కబట్టల మూటలూ, సేవక్ సంఘ్ తాత్కాలిక కార్యాలయ దస్త్రాలూ, టైప్‌రైటరూ— ఇవన్నీ ఒక బండిమీద తర్వాతి విడిది కేంద్రానికి చేరేవి. బొంబాయి నుంచి వచ్చిన ఒక యాత్రికుడు పాదయాత్ర సాగుతుండగా ఒకసారి అనారోగ్యం పాలయ్యారు. అతణ్ణి ఆ బండిమీద ఎక్కించ వలసింది గానూ, మిగిలిన వారంతా తమ పక్కబట్టల మూటల్ని తామే మోసి తెచ్చుకోవలసింది గానూ గాంధీజీ వెంటనే ఆజ్ఞాపించారు. మేం సేవాదళ్‌లో శిక్షణ పొందినవాళ్లం కాబట్టి, మా మూటలు మా భుజాలకెత్తుకుని మోసుకు వెళ్తూ స్వయంగా మహాత్ముని చేతే శభాష్ అనిపించు కున్నాం.

ప్రేమకున్న శక్తి గురుత్వాకర్షణ శక్తి అంతటిది. ఆ ప్రేమనే ప్రజల్ని— గాంధీ దగ్గరకి, ఎంతో దగ్గరి నుంచీ ఎంతో దూరం నుంచీ కూడా రప్పించేది. దారంతా జనం పోటెత్తేవారు. గాంధీ కనిపించగానే హరిబోల్ ధ్వనులతోనూ, హులాహులి (మహిళల మంగళనాదాలు) తోనూ ఆకాశం మార్మోగేది. దారిలో గాంధీతో కలిసి పాటలు పాడుతూ గ్రామస్థులు ముందుకు సాగేవారు. నడిచేటప్పుడు తమ పాదాల కిందనుంచి లేచే దుమ్ము గాంధీజీమీద పడకుండా వారు చాలా జాగ్రత్తపడేవారు.

మేం విడిది కేంద్రానికి చేరుకునేసరికి నలుదిక్కుల నుండీ జనం గుమిగూడేవారు. వెంటనే గాంధీజీ వారితో మాటలు మొదలుపెట్టేవారు. అస్పృశ్యత అనే పాపాన్ని కడిగేసుకోమనీ, బద్ధకం వదిలిపెట్టమనీ, మద్యపానం మానమనీ, పరిశుభ్రంగా ఉండమనీ ఆయన పదే పదే చెప్తుండేవారు. ఆభరణాలు త్యజించాలనీ, పరదా పద్ధతి విడిచి పెట్టి బయటకు రావాలనీ మహిళలకు నచ్చజెప్పేవారు. ఇతరుల శ్రమమీద బతికేవాడు దొంగతో సమానమన్న మాటను ఆయన ప్రతి సభలోనూ వల్లించేవారు. గాంధీజీ హిందీలో మాట్లాడితే, రాజకృష్ణ బోస్ దాన్ని ఒరియాలోకి అనువదించేవారు. ఆయన అందుబాటులో లేనప్పుడు గోపబంధు చౌధురి ఆ పని చేసేవారు. సభ ముగిశాక గాంధీజీ స్వయంగా విరాళాలు అడిగేవారు. వెదురు బుట్టల దగ్గర్నుండి బంగారు గొలుసులూ, గాజుల దాకా ప్రజలు ఏవేవో కానుకలిచ్చేవారు. గాంధీజీ స్వయంగా వాటిని వేలం వేసేవారు. మేం కూడా పైట చెంగులు పరుస్తూ జనం మధ్య తిరిగి విరాళాలు అడిగేవాళ్లం. ప్రజలు అర్ధణానో లేక పహులానో సమర్పించే వారు. వాటిని మా చేతుల్లో పెడుతున్నప్పుడు వారి ముఖాలు వెలిగిపోయేవి. ఎంతిచ్చారన్నది ముఖ్యం కాదు, ఎంత నిండు మనసుతో ఇచ్చారన్నదే ముఖ్యం.

సభ ముగియగానే కూరగాయలు తరగడంలోనూ చపాతీలు చేయడంలోనూ మేం సాయపడేవాళ్లం. ఆ తర్వాత స్థానిక జనసమాచారం సేకరించడానికి దగ్గర్లో ఉండే హరిజనవాడలకు బయలుదేరేవాళ్లం. హరిజనవాడల్ని శుభ్రం చేయడమూ, హరిజన పిల్లలకు స్నానాలు చేయించడమూ, వాళ్లకు రామధున్ నేర్పించడమూ మేం చేసే పనులు. ఒరిస్సాకి బయటి నుండి వచ్చిన ప్రొఫెసర్ లాలా అచింతరామ్, కృష్ణ మీనన్, బాబా కాలేల్కర్ లాంటి ఇతర నాయకులు కూడా మాతో పాటు హరిజన వాడలకు వచ్చేవారు. కార్యాలయ నిర్వహణ, టైపింగూ, లెక్కలు చూడటం, ఉత్తరాలకు సమాధానాలు రాయడంలో దామోదర్ దాస్ ముంజదా, దేవరాజ్,

పృథ్వీరాజ్ తదితరులు ఠక్కర్ బాపాకు చేదోడుగా ఉండేవారు. మీరాబెహెన్, సుశీలా పాయ్ గాంధీజీకి ఉత్తరాలు రాయడంలో సాయపడేవారు. జయప్రకాశ్ నారాయణ్ భార్య ప్రభావతీ దేవి గాంధీజీకి వంట చేయడమూ, మేక పాలు కాచడమూ లాంటి పనుల్ని చూసుకునేవారు. బాలాజీ గోవింద్‌జీ, దేశాయ్ వారపత్రిక 'హరిజన్' కోసం వ్యాసాలు రాయడమే కాకుండా, ఒరిస్సా చరిత్ర చదవడానికి మా దగ్గర ఒరియా నేర్చుకుని 'నీలాద్రి మహోదయ' గ్రంథం చదవడం మొదలుపెట్టారు. ఆయన ఎంతటి చదువరి అంటే, రోడ్డుమీద నడుస్తూ కూడా పుస్తకాలు చదివేవారు! జమ్నాలాల్ బజాజ్ కుమార్తె ఉమ— ఆ యాత్రికుల్లో అందరికంటే చిన్నదీ, బొద్దుగా ఉన్నదీ, చాలా అల్లరి పిల్ల కూడాను. ధనిక కుటుంబానికి చెందినదైనా సరే, హరిజన యాత్రలో కష్టాలన్నింటినీ ఎలాంటి ఫిర్యాదూ లేకుండా ఓర్చుకుంది. నిజానికి ఆమె ఆ యాత్రను ఎంతో ఆనందించింది.

పండిట్ నీలకంఠ దాస్, గోపబంధు చౌధురి ఒరిస్సా వరదల గురించీ ఇతర సమస్యల గురించీ బయటి నుండి వచ్చిన అతిథులకు ఉపన్యాసాలు ఇచ్చేవారు. ఉమా బజాజ్ ఆ వివరాలన్నీ రాసుకుని గాంధీకి ఇచ్చేది. ఆమె రాసిన నోట్సు ఆధారంగానూ, హరిజనవాడలను సందర్శించినప్పుడు మేం సేకరించిన వివరాల ఆధారంగానూ గాంధీజీ కొన్ని రోజులు ప్రసంగించేవారు. ఆయన అలా మాట్లాడి-నప్పుడల్లా మా గుండెలు గర్వంతో ఉప్పొంగేవి. ప్రాధాన్యత లేని సామాన్యులకు సైతం తాము ముఖ్యులమన్న భావనను కలిగించడం గాంధీజీ నైజం. పాదయాత్రికుల్లో జర్మనీకి చెందిన బట్ సాహెబ్ కూడా ఉన్నారు. ఆయన నాజీ. అందుకే రాజకృష్ణ బాబు పరిహాసంగా ఆయన్ను 'నాజీలు పాజీలు (దుష్టులు)' అనేవారు.

ఒరిస్సా కార్యకర్తలకు ఎన్నో బాధ్యతలు అప్పగించారు. గుణనిధి పట్నాయక్ గారూ, సురేంద్ర పట్నాయక్ గారూ ముందస్తు బృందంలో ఉండేవారు. వాళ్లు విడిది కేంద్రానికి ముందుగానే వెళ్లి సరైన ఏర్పాట్లు జరిగాయో లేదో చూసేవారు. హరిజన్ సేవక్ సంఘ్ కార్యదర్శిగా రమాదేవి పాదయాత్ర సమగ్ర పర్యవేక్షణ చూసుకునేవారు. రాజకృష్ణ బాబు అనువాదకుడిగా ('హిజ్ మాస్టర్స్ వాయిస్'లా) వ్యవహరించేవారు. గోపబంధు చౌధురి ఒరిస్సా పరిస్థితుల్ని అతిథులకు వివరిస్తూ పనులు సమన్వయం చేసుకుంటూ ఉండేవారు. మన్మోహన్ చౌధురీ, వినోద్ కానుంగో విలేకరి బాధ్యతలు నెరవేర్చారు. మన్మోహన్ చౌధురి ఛాయాగ్రాహకుడిగా కూడా పనిచేశారు.

కుజాంగ్‌కు చెందిన జగన్నాథ్ శతపథి వంటావార్పూ బాధ్యత చూసుకుంటూ, సమయానికి వంట పూర్తయ్యేలా చూసేవారు. ఈశ్వర్‌లాల్ వ్యాస్ గంట కొట్టే మనిషి. ఒక చెంచాతో కంచు పళ్ళెం మీద మోగిస్తూ ఆయన ఎప్పటికప్పుడు టైము గుర్తుచేసేవారు. అప్పుడప్పుడూ పండిట్ లింగరాజ్ మిశ్రా, పండిట్ నీలకంఠ దాస్, మాలతీ చౌధురి, రాధానాథ్ రథ్, సత్యనారాయణ్ సేన్‌గుప్త గాంధీజీని కలవడానికి వచ్చేవారు. ఇంగ్లాండ్ నుండి అగాథా హారిసన్, స్విట్జర్లాండ్ నుండి పియరీ సెరిసోల్ గాంధీజీతో ఉండటానికి వచ్చారు. మీనూ మసానీ, వియోగి హరి, సతీష్ చంద్ర దాస్‌గుప్త తదితరులు కూడా గాంధీజీని కలవడానికి ఒరిస్సా వచ్చినవారిలో ఉన్నారు.

మధ్యాహ్న భోజనం ముగిసి కాసేపు విశ్రాంతి తీసుకున్నాక, బయటి నుండి వచ్చిన విద్వాంసులు మమ్మల్ని ఉద్దేశించి మాట్లాడేవారు. వియోగి హరి హిందీ సాహిత్య చరిత్రమీద మాట్లాడితే, సతీష్ చంద్ర దాస్‌గుప్త హరిజనుల సమస్యలమీద ప్రసంగించేవారు. ఆ తర్వాత మేం ఆ తర్వాతి విడిది కేంద్రానికి బయలుదేరేవాళ్లం. సూర్యాస్తమయానికి ముందే భోజనం ముగించుకుని ప్రయాణమయ్యేవాళ్లం. దారిలో జనం పోగయ్యేవారు; శంఖాలు పూరించేవారు, భక్తిగీతాలు ఆలపించేవారు. విడిది కేంద్రానికి చేరుకున్నాక సాయంకాల ప్రార్థనలు చేసుకునేవాళ్లం, ఆ తర్వాత సభ మొదలయ్యేది. సభ ముగిశాక ప్రజల్ని విరాళాలు కోరేవారు. ఆ తర్వాత పాదయాత్రికులు ఆ రాత్రి బస కోసం ఏర్పాట్లు చేసుకునేవారు. చాలా సార్లు మేం నదీతీరాల్లోనో, ఊరి పొలిమేరల్లోని ఆరుబయట మైదానాల్లోనో గడిపేవాళ్లం. ఎవరి ఇళ్ళల్లోనైనా బస చేయడం చాలా అరుదు. ●

(**అన్నపూర్ణా మహారాణా** (జ. 1917) ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులూ, సంఘ సేవకులూను. ఆమె ఆత్మకథ 'అమృత అనుభవ' భువనేశ్వర్‌లోని శిక్షాసంధాన్ ద్వారా 2005లో వెలువడింది. దీన్ని ఇంగ్లిషులోకి అనువదించిన సుప్రియా కర్ 'రూపాంతర్ సెంటర్ ఫర్ ట్రాన్స్‌లేషన్'లో పనిచేస్తున్నారు.)

## కాశీనాథ్ నాయక్

# మహాత్ముని దర్శనం

**అది** 1934వ సంవత్సరం. జగన్నాథుని ఆలయ సింహద్వారం నుండి ఒరిస్సాలో భద్రక్ దాకా మహాత్ముడు తన చారిత్రక పాదయాత్రను ప్రారంభించారు. ఆయన్ను చూడాలని నాక్కూడా చాలా బలమైన కోరిక కలిగింది.

పూరీ నుంచి యాత్ర మొదలుపెట్టాక గాంధీజీ దండముకుందపూర్ సమీపంలో రామ్‌దాస్ మఠంలో బస చేయబోతున్నారని వినగానే నా ఒళ్లు పులకరించిపోయింది. అంతటి సువర్ణావకాశం చేజార్చుకోవడం మూర్ఖత్వమనిపించింది. నా ఆలోచన మా అమ్మకు చెప్పి, వెంటనే పాఠశాల వసతిగృహానికి బయలుదేరాను. హాస్టల్ విద్యార్థులంతా, ముఖ్యంగా చింతామణి పాణిగ్రాహి నన్ను చూడగానే ఎంతో సంతోషించారు. మేమంతా కలిసి భోజనం చేశాం.

పాదయాత్ర సాగిస్తున్న ఆ బృందం మా పాఠశాల దగ్గరున్న జగన్నాథ్ సందు గుండా కరణ్ సాహి వైపు కదులుతుండగా, నేనూ మరికొందరు విద్యార్థులం కలిసి వారితో నడిచాం.

మహాత్ముణ్ణి ఒక్కసారి దర్శించుకుందామని అపార జనసందోహం తరలివచ్చింది. కొద్దిసేపటికే సభ మొదలైంది. నాలాంటి పిల్లలు ముందు వరుసలో కూర్చున్నారు. మహాత్ముడు వేదిక దగ్గరకు రాగానే ఆ ప్రాంతమంతా నినాదాలతో ప్రతిధ్వనించింది. ఆ మహనీయుడికి గౌరవసూచకంగా అందరూ లేచి నిలబడ్డారు. మేమూ లేచి నిలబడ్డాం. వేదిక వైపు నడుస్తూ గాంధీజీ మా శిరసుల్ని ఆప్యాయంగా స్పృశిస్తూ వెళ్లారు. మహాత్ముని ఆ పవిత్ర స్పర్శతో నా హృదయం ఎలా ఉప్పొంగిపోయిందో

నేనిప్పటికీ మర్చిపోలేను. అయితే, వయసులో చిన్నవాణ్ణీ అమాయకుణ్ణీ కావడం వల్ల ఆ సభలో గాంధీజీ ఏం మాట్లాడారో నాకేమీ కొరుకుడుపడలేదు.

మహాత్మాజీ ఒక దేవదూత అనీ, బ్రిటిష్ వారి బానిస సంకెళ్ల నుండి భరతమాతను విముక్తం చేయడానికి ఆయన మానవ రూపంలో అవతరించారనీ వింటుండేవాణ్ణి. ఆ దివ్యపురుషుణ్ణి ఎప్పుడెప్పుడు చూస్తానా అని తపించేవాణ్ణి. తీరా ఆ కోరిక సాకారమైన ఆ దివ్యదివసాన ఆయన ముఖాన్నీ వేషధారణనూ గొప్ప ఆత్రుతతో అలాగే చూస్తూ ఉండిపోయాను.

మరుసటి రోజే గాంధీజీ ఆయన అనుచరులూ పిప్లి దగ్గర సదావ్రత మఠం వద్ద కాసేపు ఆగి, మా ఊరి దగ్గర్లో గుడియా పొఖరి దగ్గర బస చేయాల్సి ఉంది. బాలకటి, బాలిపట్న గ్రామాల నుండి వచ్చిన కొందరు కుర్రాళ్లతో కలిసి నేను కూడా గుడియా పొఖరి వైపు దారితీశాను. తెల్లవారకముందే అక్కడికి చేరుకున్నాం.

నాలో ఉన్న ఉత్సాహానికి నాకు ఆకలి తెలియలేదు. అలసట కలగలేదు. గాంధీజీకీ ఆయన సహచరులకూ బస కల్పించడానికి 'కఖరువాపద' అనే తోట శుభ్రం చేసి సిద్ధం చేశారు. మేము కూడా ఆ రాత్రి అక్కడే గడపాలని నిశ్చయించుకున్నాం. అక్కడికి వెళ్లేటప్పటికి ముకుందపూర్ వాసి సాధుబాబు కనిపించారు. మమ్మల్ని చూసి ఆయన ఎంతో సంతోషించారు.

సాధుబాబు నిబద్ధత గల ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు. ఆయన తరచూ మా బడికి వస్తూ, మహాత్ముని గురించీ, స్వాతంత్ర్య పోరాటం గురించీ, పరిశుభ్రత గురించీ, నూలు వడకడం ప్రాధాన్యత గురించీ వివరిస్తుండేవారు. తోటలో మేము ఎదురు పడగానే, ఆయన మాకు తినడానికి అటుకులూ, బెల్లమూ, కొబ్బరి తురుమూ ఇచ్చి, ఆ రాత్రికి తోటలోనే గడపమని చెప్పారు.

మరుసటి రోజు గాంధీజీ అక్కడికి చేరుకున్నప్పుడు, ఆయనకు స్వాగతం పలికేందుకు సాధుబాబు తక్కిన కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి రోడ్డుమీద నిలబడ్డారు. మరుక్షణమే, హృదయాన్ని హత్తుకునే చిరపరిచిత నినాదాలు—'మహాత్మా గాంధీకి జై', 'భరతమాతకు జై' అంటూ ఆకాశాన్ని తాకాయి. ఏమాత్రం ఓపిక పట్టలేకపోతున్న నా స్నేహితులతో కలిసి నేను కూడా ఆత్రుతగా రోడ్డు పక్కన నిలబడి చూస్తున్నాను. పోటెత్తిన ఆ అపార జనసంద్రం మధ్య గాంధీజీ ఒక దివ్య కాంతిలా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నారు.

మహాత్మాజీ కొద్దిరోజుల పాటు అక్కడే బస చేయాల్సి ఉన్నందున, ఆయన కోసం తాత్కాలికంగా ఒక చిన్న పాకనూ, మరుగుదొడ్డినీ అప్పటికే నిర్మించారు. కొద్ది నిమిషాల విశ్రాంతి తర్వాత నూలు వడికే కార్యక్రమం మొదలైంది. మహాత్మాజీ తన సహచరులతో పాటు అందులో పాల్గొన్నారు. నెమ్మదిగా జనం తోటలోకి పోటెత్తారు. మహాత్ముని చూడటానికి స్త్రీలు సైతం పరదాలు కట్టిన ఎడ్లబండ్లమీద వచ్చారు. వరుసగా రెండోసారి కూడా మహాత్ముని దివ్య దర్శనం లభించినందుకు నన్ను నేను ఎంతో అదృష్టవంతుడిగా లెక్కేసుకున్నాను.

ఆ తర్వాత వారు బస చేయవలసిన స్థావరం బాలకటిలోని అప్పర్ ప్రైమరీ పాఠశాల. మూడోసారి కూడా ఆయన్ను చూడాలన్న తీవ్రమైన తపన ఉన్నప్పటికీ, నేను బాలకటి దాకా వెళ్లలేకపోయాను. బరువెక్కిన హృదయంతో ఇంటి ముఖం పట్టాను.

విచిత్రమైన కాకతాళీయమేమిటంటే, ఆ తర్వాతి కాలంలో నేను ఉపాధ్యాయుడిగా చేరింది సరిగ్గా ఆ బాలకటి పాఠశాలలోనే! సుదీర్ఘంగా ముప్ఫై మూడు సంవత్సరాల పాటు, రోజు విడవకుండా ప్రతి రోజూ, గాంధీజీ కూర్చున్న ఆ పవిత్ర స్థలాన్ని దర్శించుకునే అరుదైన భాగ్యం నాకు దక్కింది. ●

(**కాశీనాథ్ నాయక్** (జ. 1919) ఉపాధ్యాయులు. పిల్లల కోసం ఎన్నో పుస్తకాలు రాశారు. ఆయన ఆత్మకథ ‘శిక్షకర జీవనస్మృతి’ శిక్షాసంధాన్ ద్వారా 2005లో ప్రచురితమైంది. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన దీపక్ చంపతీరాయ్ భువనేశ్వర్‌లో కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి.)

## నీలమణి రౌత్రాయి

# గాంధీజీ ఆశీస్సులు

**నేను** బళ్ళో చదువుకుంటున్న రోజుల్లో, అంటే 1934లో, గాంధీజీ భద్రక్ మీదుగా కటక్‌కు రైల్లో ప్రయాణించారు. గాంధీజీ ఎప్పుడూ మూడో తరగతి బోగీలోనే ప్రయాణించేవారు. ఆ రోజు ఆయన్ను చూడాలన్న ఉత్సాహంతో భద్రక్ స్టేషన్ అంతా జనంతో కిక్కిరిసిపోయింది. నేనూ అక్కడికి వెళ్లాను. మహాత్మా గాంధీ జయజయ ధ్వానాలతో ఆ పరిసరాలన్నీ మార్మోగిపోయాయి. అంతటి మహా జనసందోహంలో నేనసలు గాంధీజీని చూడగలనా అనిపించింది. జనం ప్లాట్‌ఫారమ్‌మీద ఎదురు చూస్తున్నారు. గాంధీజీ కూర్చున్న బోగీలోకి ఎవరూ బలవంతంగా చొచ్చుకువెళ్లవద్దని వాలంటీర్లు అందరినీ బతిమాలుతున్నారు. రైలు ఆగిన తర్వాత ప్రజలంతా చూడటానికి వీలుగా గాంధీజీ స్వయంగా తలుపు దగ్గరకు వస్తారని వారు చెప్పారు. నా అదృష్టం కొద్దీ, గాంధీజీ కూర్చున్న ఆ మూడో తరగతి బోగీ సరిగ్గా నా ముందే వచ్చి ఆగింది. ఒక్కసారిగా నా మనసు నా అదుపు తప్పింది. నేను కిటికీలోంచి లోపలికి దూకేశాను. గాంధీజీ నన్ను పట్టుకున్నారు. ఎంతో ఆప్యాయంగా నన్ను మందలించి, ఒక్కసారి నా తల నిమిరి, రైలు దింపేశారు.

ఆ రోజు భద్రక్‌లో 144 సెక్షన్ విధించారు. 'బట్' అనే ఒక తెల్లదొర గాంధీజీతో కలిసి నడిచారు. ఆయన నిజానికి నాజీయిజాన్ని విశ్వసించేవాడు, హిట్లర్ మద్దతు దారుడు. కానీ అహింసా పోరాట పద్ధతుల్ని అధ్యయనం చేయడం కోసం ఆయన గాంధీజీతో పాటే ఉన్నారు. అక్కడి ఎస్.డి.ఓ. అసభ్య ప్రవర్తన ఆయనకు విపరీతమైన కోపం తెప్పించింది. ఆ ఎస్.డి.ఓ. గనుక తనకు ఎదురుపడితే తుపాకీతో కాల్చి చంపేస్తానని ఆయన అన్నట్టు తెలిసింది.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకే మహాత్మా గాంధీ పూరీ నుండి భద్రక్ దాకా పాదయాత్ర చేపట్టారు. అస్పృశ్యతా నివారణ కోసమూ, హిందూ దేవాలయాల్లోకి హరిజనుల నిరాటంక ప్రవేశం కోసమూ చేపట్టిన చారిత్రక పాదయాత్ర అది. గాంధీజీ ఆ దారిపొడుగునా కాలినడకనే ముందుకు సాగారు. భారతదేశంలో రకరకాల ప్రాంతాల నుంచీ, విదేశాల నుంచీ కూడా ఎందరో ప్రముఖులు ఆయన వెంట నడిచారు.

భద్రక్‌లో పాత బజారు దగ్గర సాలిందీనది ఒడ్డున జీవరామ్‌జీ కల్యాణ్‌జీ ఏర్పాటు చేసిన ఆశ్రమంలో గాంధీజీ ఒక రోజు బస చేశారు. ఆ రోజు గాంధీకి తాటాకు విసనకర్రతో విసిరే అదృష్టం నాకు దక్కింది. నా జీవితంలో అదొక పుణ్య కార్యంగా, పవిత్ర ఘనకార్యంగా భావించి మరీ ఎంతో ఉత్సాహంతో గాంధీజీకి విసనకర్రతో విసిరాను. భద్రక్‌కు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, మౌలానా మహమ్మద్ హనీఫ్, గాంధీజీ సన్మాన కమిటీకి అధ్యక్షుడిగా ఉండేవారు. నన్నీ పని కోసం ఆయనే ఎంపిక చేశారు.

భద్రక్ ఎస్.డి.ఓ.గా ఉన్న బ్రిటిష్ అధికారి దుర్గాచరణ్ దాస్ అహంకార ప్రవర్తన నాకింకా గుర్తుంది. గాంధీ రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతుంటే, ఆయన ఒక మోటారు కారులో రోడ్డంతా దుమ్ము రేపుకుంటూ దూసుకుపోయాడు. ఆయన చేసిన పని అక్కడున్న వాళ్ళందర్నీ చాలా బాధపెట్టింది. ఆగ్రహం కూడా తెప్పించింది. మొత్తం భారతదేశంలో ఎక్కడా ఏ ప్రభుత్వ అధికారి గాంధీజీ పట్ల ఇంత అమర్యాద-కరంగా ప్రవర్తించలేదని ప్రజలు చెప్పుకోవడం నా చెవిన పడింది. ●

(**నీలమణి రౌత్రాయి** (1920-2004) విశిష్ట రాజకీయ నాయకుడు. ఒరిస్సా ముఖ్యమంత్రి గానూ (1977-80), కేంద్ర కేబినెట్ మంత్రిగానూ పనిచేశారు. ఆయన ఆత్మకథ 'స్మృతి ఓ అనుభూతి'ని (1986) కటక్‌లోని గ్రంథ మందిర్ వారు 2001లో ప్రచురించారు. ఈ వ్యాసాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన మేరీ మొహంతి పూరీలో ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు.)

## బంకా బిహారీ దాస్

# గాంధీ స్మృతులు

**గాంధీజీని** దర్శించుకుని, ఆయన మాటలు వినే అదృష్టం నాకు మూడు సందర్భాల్లో దక్కింది. ఆ అవకాశాలన్నీ నా బాల్యంలోనే వచ్చాయి. 1934లో ఆయన ఒరిస్సాలో పాదయాత్ర చేసినప్పుడు మొదటిసారి ఆయన్ను చూశాను. 1938లో దేలాంగ్ రైల్వే స్టేషన్ దగ్గర మైదానంలో జరిగిన సర్వసేవాసంఘ్ సమావేశాల సమయంలో రెండోసారి ఆయన్ను చూడటమూ, ఆయన ప్రసంగం వినడమూ జరిగింది. ఇక మూడో అవకాశం 1946లో వచ్చింది; పశ్చిమ బెంగాల్లో బోల్‌పూర్ నుంచి ప్రత్యేక రైల్లో ఒరిస్సా మీదుగా మద్రాస్ వెళుతున్నప్పుడు ఒరిస్సా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధిగా నవకృష్ణ చౌధురితో కలిసి సాయంత్రం నుంచి పొద్దున్న దాకా అదే రైల్లో ప్రయాణించాను. ఈ అనుభవాల్లో ప్రతి ఒక్కటీ నా మనసులో చెరగని ముద్ర వేసింది.

1934 మే నెలలో గాంధీజీ పూరీ నుంచి భద్రక్ దాకా హరిజన పాదయాత్ర చేపట్టారు. భారతీయ సమాజం నుంచి అస్పృశ్యతా వివక్షల్ని సమూలంగా తుడిచి పెట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశం. ఇదొక సాంఘిక సంస్కరణ ప్రయత్నమే అయినప్పటికీ, అన్ని మతాలవారినీ, అన్ని కులాలవారినీ జాతీయోద్యమ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే దీని పరమ లక్ష్యం. దీనితో పాటు పరదా పద్ధతి లాంటి అన్ని రకాల మూఢనమ్మకాలమీదా గాంధీజీ ఉద్యమించారు.

మే, జూన్ నెలల ఎండాకాలంలో ఆయన ఈ హరిజన పాదయాత్ర సాగించారు. కేంద్రపడ నుండి బిరూపా నది దాటి కాయిపడా, బారీ మీదుగా ఆయన పాదయాత్ర సాగింది. ప్రముఖ గాంధేయ నాయకుడు గోపబంధు చౌధురి, బాగా వెనకబడ్డ, తరచూ వరదలకు గురయ్యే బారీ ప్రాంతాన్నే తన కార్యక్షేత్రంగా ఎంచుకున్నారు.

అలాగే నాకు పొరుగింటాయనా, సోదరసమానుడూ అయిన లాల్ బిహారీ పట్నాయక్ మద్రాస్ ప్రభుత్వంలో విద్యాశాఖలో ఉద్యోగానికి రాజీనామా చేసి జైలు శిక్ష అనుభవించారు.

జైలు నుంచి విడుదలయ్యాక, ఆయన కళ్యాణ్‌పూర్ గ్రామాన్ని ఖద్దరు పనులకూ ఇతర సృజనాత్మక ప్రయోగాలకూ కేంద్రంగా మార్చారు. స్వాతంత్ర్య సమరంలో మా ఊరు ఒక ముఖ్య కేంద్రంగా ఉండేది. తమ గ్రామం మీదుగా వెళ్లవలసిందిగా కోరుతూ లాల్ బిహారీ బాబు గాంధీజీకొక లేఖ రాశారు. ఆ అభ్యర్థన గాంధీజీ హృదయాన్ని తాకింది. దాంతో మా గ్రామస్థుల్ని కలవడానికి వీలుగా కళ్యాణ్‌పూర్ దగ్గరలో ఉండే ఒక గ్రామం గుండా పాదయాత్ర దారిని మళ్ళించమంటూ ఆయన గోపబంధు చౌధురికి రాశారు.

గాంధీజీ సూచన మేరకు కలమతియా నుండి బారీ వెళ్లే మార్గంలో ఆయన అమ్యాస్‌పూర్ వద్ద కాసేపు ఆగి మా గ్రామ ప్రజలతో మాట్లాడాలని నిర్ణయించారు. ఈ సంగతి తెలియగానే మా ఊరి ప్రజలంతా— పిన్నలూ పెద్దలూ, స్త్రీలూ పురుషులూ, పిల్లలూ— దాదాపు అందరూ అమ్యాస్‌పూర్ వైపు నడిచారు. వరిచేల గుండా, ఖరస్రోతా నది దాటుకుంటూ ఆరేడు కిలోమీటర్లు నడిచి మా అమ్మానాన్నలతో కలిసి నేను కూడా వెళ్లాను. అప్పట్లో నాకు తొమ్మిదేళ్లు, నాలుగో తరగతి చదువుతున్నాను.

చేతిలో కర్ర పట్టుకుని, తన అనుచరులతో కలిసి గాంధీజీ గ్రామానికి చేరుకున్నారు. తెల్లటి దుప్పటి పరిచిన ఒక మంచంమీద కూర్చున్నారు. గ్రామస్థుల తరఫున లాల్ బిహారీ బాబు హరిజనుల సమస్యలమీద రాసిన ఒక వినతిపత్రాన్ని ఇంగ్లీషులో చదివి వినిపించారు. దానికి బదులుగా గాంధీజీ చెప్పిన మాటల సారాంశం ఎంతగా హృదయాన్ని హత్తుకుందంటే, అవి ఇప్పటికీ నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. గాంధీజీ సరళమైన హిందీలో చెప్పిన మాటల్ని యువ నాయకుడు రాజకృష్ణ బోస్ ఒరియాలోకి అనువదించారు. బోస్‌కి మంచి వక్తగా పేరుండేది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆయన ఒరిస్సా ప్రభుత్వంలో ఒక ప్రముఖ మంత్రి అయ్యారు.

తన సంక్షిప్త ప్రసంగంలో గాంధీజీ మాట్లాడుతూ, అస్పృశ్యతా వివక్షలు అత్యంత హేయమైనవని అన్నారు. వాటిని సమూలంగా తుడిచిపెట్టాలని ప్రజలకు హితవు పలుకుతూ, 'అస్పృశ్యత హిందూ సమాజానికొక మచ్చ. దానికి ఎలాంటి తార్కిక

ఆధారం లేదు. హరిజనుల్లో చాకళ్లు తక్కువ కులస్తులని భావిస్తారు. కానీ చివరకు బ్రాహ్మణులైనా సరే, చాకలి బట్టలు ఉతికితే తప్ప శుద్ధి పొందలేరు. చాకలి ఉతికిన బట్టలు కట్టుకుంటేనే వాళ్లు గుడిలోకి ప్రవేశించి పూజలు చేయగలరు' అన్నారు. ఒరిస్సా ప్రజల తీవ్ర దారిద్ర్యాన్ని ప్రస్తావిస్తూ, కష్టపడి పనిచేయడానికి ఏమాత్రం వెనుకాడవద్దని ఆయన సలహా ఇచ్చారు. కష్టపడే జాతి మాత్రమే అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు.

చాకళ్ల గురించి గాంధీజీ చెప్పిన దృష్టాంతం నా మనస్సుమీద ప్రగాఢ ముద్ర వేసింది. ఆ మాటల్ని నేనెప్పటికీ మర్చిపోలేను. మంచంమీద ఆయన పక్కనే కూర్చుని, రెప్పవాల్చకుండా ఆయన ముఖం వైపే చూస్తూ ఉండిపోయాను. అంతటి పసివయసులో ఆయన చెప్పినదాంట్లో నాకే మాత్రం అర్థమై ఉంటుంది! ఆ తర్వాత మా గ్రామం తరఫున నేను ఆయన దగ్గరకు వెళ్లాను. ఆ విషయానికి గాంధీజీ ఎంతగానో మురిసిపోయి, తన పత్రిక 'హరిజన్' లో దాన్ని ప్రచురించారు కూడా.

ఆయన్ను చూసే రెండో అవకాశం 1938లో దక్కింది. పూరీ జిల్లాలో దేలాంగ్ రైల్వే స్టేషన్ దగ్గర జరిగిన గాంధీ సేవా సంఘ్ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. మార్చి 28 నుండి 31 దాకా నాలుగు రోజుల పాటు ఆ సమావేశాలు సాగాయి. అప్పట్లో విశ్వనాథ్ దాస్ నాయకత్వంలో ఒరిస్సాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. నేను కొలీజియేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాను. ఒక సాయంత్రం ఆ పాఠశాల విద్యార్థులు కొందరం దేలాంగ్ వెళ్లి బహిరంగ సభకు హాజరయ్యాం. సాధారణంగా గాంధీజీ ప్రార్థనా సమావేశాలే ఆయన బహిరంగ సభలుగా మారేవి. భారతదేశంలోని గాంధేయ నాయకులూ కార్యకర్తలూ అందరూ ఈ వార్షిక సదస్సులో పాల్గొన్నారు. ఆ సభలో గాంధీజీ ఏం మాట్లాడారో ఇప్పుడు నాకు గుర్తులేదు. ●

(**బంకా బిహారీ దాస్** (1923-2001) ప్రసిద్ధ సోషలిస్ట్ నాయకుడు. ఒరిస్సా ప్రభుత్వంలో ఆర్థిక, రెవెన్యూ శాఖల మంత్రిగా పనిచేశారు. ఆయన ఆత్మకథ 'సంగ్రామర శేష నాహిఁ' భువనేశ్వర్‌లో రమేష్ చంద్ర స్వైన్ ద్వారా 1998లో ప్రచురితమైంది. ఈ వ్యాసాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన మేరీ మొహంతి పూరీలో ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలు.)

## సురేంద్ర మొహంతి

# గాంధీజీకి జై

**అది** బళ్ళో మాకు చివరి సంవత్సరం. పాఠాలు పూర్తి చేయడానికి మాస్టార్లు అదనపు తరగతులు తీసుకుంటున్నారు. మేం హాస్టల్లో ఉండేవాళ్ళం. మాలో బాగా చదివే కొందరి కోసం క్రమం తప్పకుండా ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. పాట్నా విశ్వవిద్యాలయ పరీక్షల్లో మా బడి మంచి ఉత్తీర్ణత సాధించాలని అటు ఉపాధ్యాయులూ, ఇటు విద్యార్థులూ అందరం కష్టపడి చదువుతున్నాం.

'ది సమాజ్' అనే ఒరియా దినపత్రిక రోజూ బస్టాండ్ నుంచి కొనుక్కోవడం నాకు అలవాటు. నిజం చెప్పాలంటే, దినపత్రిక చదవడం నా నిత్య అధ్యయనంలో ఒక భాగమైపోయింది. ఫలితంగా జనరల్ నాలెడ్జ్, వక్తృత్వ పోటీల్లో ఎప్పుడూ నాకే మొదటి మార్కులు వచ్చేవి. ఒకరోజు దేలాంగ్ బెర్బోయిలో సర్వసేవాసంఘ్ మహాసభలు జరగనున్నాయనీ, వాటికి మహాత్మా గాంధీతో పాటు ఇతర ముఖ్య కాంగ్రెస్ నాయకులు హాజరవుతున్నారనీ 'ది సమాజ్' పత్రిక ద్వారా తెలిసింది. కొద్ది క్షణాల్లోనే 'మహాత్ముడు ఒరిస్సా వస్తున్నారు, మహాత్ముడు ఒరిస్సా వస్తున్నారు' అన్న వార్త నలుదిక్కులా దావానలంలా వ్యాపించింది.

నేను మా వార్డెన్ మన్మోహన్ బాబు దగ్గరకు వెళ్ళి, 'నేను మహాత్మా గాంధీని చూడాలి, దయచేసి నాకు సెలవు ఇవ్వండి' అని అడిగాను. ఆయన కుదరదన్నారు. ఒకరోజు వేకువజామునే, తర్వాత రాబోయే పరిణామాల గురించి ఏమాత్రం ఆలోచించకుండా సాలీపూర్ బస్టాండ్‌లో బస్సెక్కి జగత్‌పూర్ వచ్చేశాను. నా జేబులో ఉన్నది రెండే రెండు రూపాయలు. జగత్‌పూర్ రైల్వే స్టేషన్‌లో మా బడికి చెందిన మరో ఇద్దరు విద్యార్థులు ఎదురుపడ్డారు. నేను దేలాంగ్ వెళుతున్నానా అని వాళ్ళు

ఆరా తీశారు. అవునన్నాను. మధ్యాహ్నం వేళ కటక్ నుండి దేలాంగ్ వైపు ఒక ప్రత్యేక రైలు బయలుదేరబోతోందని వారు చెప్పారు. మేమంతా కలిసి మహానది ఇసుక తిన్నెల గుండా నడిచి, జోబ్రా ఘాట్ దగ్గర పడవ ఎక్కి కటక్ రైల్వే స్టేషన్ చేరుకున్నాం.

ఆ ప్రత్యేక రైల్లో ప్రయాణించడానికి మేము టికెట్లు కొనలేదు. ఏ టికెట్ కలెక్టరూ కూడా తనిఖీ చేయడానికి బోగీల్లోకి రాలేదు— బహుశా మహాత్ముని మీద ఉన్న గౌరవంతో వాళ్లు అటువైపు రాలేదేమో! రైలు కదలగానే 'మహాత్మా గాంధీకి జై' అన్న నినాదాలతో పరిసరాలన్నీ మార్మోగిపోయాయి. రైలు ఆగిన ప్రతి స్టేషన్ లోనూ మేం బోగీల్లోంచి 'మహాత్మా గాంధీకి జై' అని గట్టిగా అరిచాం. ప్లాట్‌ఫారమ్‌మీద వేచి ఉన్న ప్రయాణికులు కూడా 'మహాత్మా గాంధీకి జై' అంటూ బదులిచ్చారు.

నాటి భారతదేశంలో మహాత్మా గాంధీ అనే ఒక్క పేరు సామాన్య ప్రజానీకాన్ని ఎంతగా ఉత్తేజపరిచిందో, ఎంతటి అనురక్తిని నింపిందో చెప్పడానికి ఈ సంఘటనే ఒక నిదర్శనం.

మధ్యాహ్నానికి రైలు దేలాంగ్ చేరుకుంది. స్టేషన్ వెలుపల కొబ్బరి మట్టలతో అల్లిన వందలాది గుడిసెలు కనిపించాయి. వాటి నేలమీద ఎండుగడ్డి పరచి ఉంది. ఆ గడ్డిమీదే దుప్పట్లు పరుచుకుని ప్రతినిధులు బస చేశారు. మహాత్మా గాంధీ మరికొద్దిసేపట్లోనే ప్రజలకు దర్శనమిస్తారని తెలిసింది. తిండీ తిప్పల ధ్యాస మర్చి పోయాం. మహాత్మా గాంధీ ప్రసంగించబోయే స్థలానికి పరుగుతీశాం. విడిది కేంద్రానికి కాస్త దూరంలో చుట్టూ మొగలి పొదలుండే ఒక మైదానం ఒకటుంది. చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన పిన్నల్తో, పెద్దల్తో, మహిళల్తో ఆ మైదానమంతా అప్పటికే కిక్కిరిసిపోయింది. సభికుల్లో మగవాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారు. చీర చెంగులు ముఖాలమీదికి లాక్కుని ఆ స్త్రీలు నీడల మాదిరిగా నిశ్శబ్దంగా మహాత్ముని కోసం ఎదురుచూస్తున్నారు.

స్త్రీల గుంపులోకి వెళ్లకుండా వాలంటీర్లు మమ్మల్ని అడ్డుకున్నారు. దాంతో మేం మొగలి పొదల పక్కనే నిలబడి మహాత్ముని రాక కోసం నిరీక్షించాం.

మహాత్ముని కోసం ఒక మంచంమీద కుర్చీ వేసి ప్రత్యేకంగా ఒక వేదిక నిర్మించారు. ఆయన రాగానే పురుషులు 'మహాత్మా గాంధీకి జై', 'హరిబోల్' అంటూ నినదించారు.

మహిళలు మంగళ ధ్వనులు (హులహులి) చేశారు. ఆ కోలాహలం సద్దుమణగడానికి చాలా సమయమే పట్టింది. ఆ తర్వాత గాంధీజీ ఆశీర్వదిస్తున్నట్టుగా తన కుడిచేతిని కాస్త పైకెత్తి ప్రసంగించారు. ఆయన ఏం మాట్లాడారో ఎవరికీ బోధపడలేదు.

అసలు ఆయన ఉపన్యాసం వినడానికి ఎవరొచ్చారు గనుక? ఒకరి పైట చెంగును మరొకరు ముడేసుకుని వచ్చిన పల్లెటూరి మహిళలకూ, ఒక రోజు కూలీ వదులుకుని వచ్చిన దినసరికూలీకీ, పంటచేలు గాలికొదిలేసి పరుగులుతీసిన కర్షకులకూ గాంధీ ఉపన్యాసంలో అర్థమయ్యేదేముంది? వాళ్లంతా వచ్చింది కేవలం మహాత్ముని దర్శనం కోసమే. అన్నింటి కన్నా వాళ్లకు ముఖ్యం ఒక్కసారైనా ఆయనమీద తమ చూపులు వాలడమే . మహాత్ముని ప్రసంగమంటే వారికి తెలిసిన అర్థం అంతవరకే!

అక్కడ నిలబడి ఉన్నప్పుడు నాకో పాత సంఘటన గుర్తొచ్చింది. అదే సంవత్సరమో సరిగ్గా గుర్తులేదు. అప్పట్లో నేను కాన్‌పూర్‌లోని మెట్‌కాఫ్ మిడిల్ స్కూల్లో చదువుతున్నాను. సాలీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే జిగినీపటాపూర్ గ్రామానికి గాంధీజీ వచ్చారు. రాయ్‌సుంగుడా నుండి జిగినీపటాపూర్ ఆరేడు మైళ్ల దూరంలో ఉంటుంది. గాంధీజీ వస్తున్నారని తెలియగానే ఎలాగైనా వెళ్లి ఆయన్ను చూడాల్సిందేనని మా అమ్మ పట్టుబట్టింది. నాన్న ఆ రోజుకు తన డిస్పెన్సరీ మూసేశారు.

నా గుర్తున్నంతవరకు అది ఒక వేసవి ఉదయం. బాడుక్కి మాట్లాడుకున్న ఎడ్లబండిలో మా అమ్మా మరికొందరు మహిళలూ జిగినీపటాపూర్ బయలుదేరారు. చేతిలో గొడుగు పట్టుకుని నాన్న బండి ముందే నడిచారు. నేను దుమ్ము రేపుకుంటూ పక్కనే పరిగెత్తాను.

కానీ ఆ రోజు నేను గాంధీని చూడలేకపోయాను. మా అమ్మా ఇతర స్త్రీలూ మాత్రమే దర్శనం చేసుకోగలిగారు. తిరుగు ప్రయాణంలో నేను అమ్మతో, 'గాంధీ నీతో ఏం చెప్పారు?' అని అడిగాను. నాలాగే నాన్న కూడా గాంధీని చూడలేకపోయారు. దాంతో మా కుటుంబం మొత్తంలోనూ గాంధీని దర్శించుకునే సుకృతం తనకు ఒక్కరికే దక్కిందన్న గర్వం అమ్మ ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపించింది.

ఆమె ఎంతో గంభీరంగా, 'ఆయనేం చెబుతాడు? నూలు వడకండి, మీ నగలన్నీ నా చేతుల్లో పెట్టండి అనడం తప్ప ఆయన చెప్పడానికి ఇంకేముంది? ఆయన చెప్పేది అంతే. ఒంటి తీరు మాత్రం సన్నటి బంగారు కడ్డీలా మెరిసిపోతోంది' అంది.

ఆమె ఇంకా అలాగే ఏకరువు పెడుతూనే ఉండేదేమో, కానీ నేను మధ్యలోనే అడ్డుపడుతూ, 'మరి నువ్వేం నగలిచ్చావు ఆయనకి?' అని అడిగాను. ఆమె ముఖం చిట్లించి, 'ఆయనకి నా నగలెందుకివ్వాలి? ఒక వెండి రూపాయి కానుగ్గా సమర్పించి నమస్కారం చేసుకున్నాను' అంది. ●

(**సురేంద్ర మొహంతి** (1920-1992) ప్రముఖ రచయిత, విశిష్ట పార్లమెంటేరియన్. ఆయన ఆత్మకథ 'పథ ఓ పృథివీ' భువనేశ్వర్‌లోని ఈస్టర్న్ మీడియా ద్వారా 1986లో వెలువడింది. ఈ భాగాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన జతీంద్ర కె. నాయక్ భువనేశ్వర్‌లో ఉత్కళ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల ఆచార్యులు. ఈ పుస్తకం సంపాదకులు.)

---

**మహాత్మా గాంధీ** ఒరిస్సా ఏడుసార్లు సందర్శించారు. ఆయన చేపట్టిన సుప్రసిద్ధ హరిజన పాదయాత్ర ఒరిస్సాలోనే మొదలయ్యింది. ఈ ప్రావిన్సులో ఆయన పర్యటించినప్పుడు విస్తృత జనసమూహాల్ని ఆకట్టుకోవడమే కాక, ఇక్కడి ప్రజలతోనూ, ఈ నేలతోనూ ప్రత్యక్ష అనుబంధం పెంచుకున్నారు. కొన్ని క్షణాలపాటైనా ఆయన దర్శనం లభిస్తుందని సుదీర్ఘమైన దూరాలు ప్రయాణించి వచ్చిన సామాన్య ప్రజల హృదయాల్లో ఆయన చెరగని ముద్రవేసారు.

గాంధీ ఒరిస్సా పర్యటనల్లో ఆయన్ను దగ్గరగా చూసినవారు రాసుకున్న వ్యక్తిగత జ్ఞాపకాల్ని ఈ పుస్తకం ఒక్కచోటకు తీసుకొచ్చింది. బీదల పట్లా నిర్భాగ్యులపట్లా ఆయనకున్న అపారమైన సహానుభూతితో పాటు, ఆయనలోని పసిపిల్లవాడి సంతోషం, నిర్దిష్ట వివరాల పట్ల ఆయనకుండే జాగరూకతా ఈ కథనాల్లో తేట తెల్లమవుతున్నాయి.

**జతీంద్ర కె నాయక్** ఉత్కళ విశ్వవిద్యాలయంలో ఇంగ్లిషు బోధిస్తున్నారు. 2024 లో ఆయన హచ్ క్రాస్ వర్డ్ ఇండియన్ లాంగ్వేజ్ ఫిక్షన్ ట్రాన్స్లేషన్ అవార్డు అందుకున్నారు.

**వాడ్రేవు చినవీరభద్రుడు** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఐ.ఏ.ఎస్ అధికారిగా పనిచేసారు. ఇప్పటిదాకా 80 పుస్తకాలు వెలువరించారు. డా.కలాం రాసిన 'ఇగ్నైటెడ్ మైండ్స్'కి చేసిన అనువాదానికి సాహిత్య అకాడెమీ పురస్కారం అందుకున్నారు.